అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

శనివారం 20-07-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 201 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50





త్వరలో సెమీ రెసిడెన్షియల్
స్కూళ్లు

ఒకట్రెండు మండలాల్లో పైలట్ ప్రాజెక్టు కింద అమలు

విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు

దశలవారీగా సర్కారు బడుల బలోపేతం

విద్యావేత్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోండి

ఆ తర్వాతే ప్రతిపాదనలు సిద్ధం చేయండి :

విద్యాశాఖ అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

త్వరలో విద్యా, వ్యవసాయ కమిషన్ల ఏర్పాటు

అంగన్‌వాడీల్లో 3వ తరగతి వరకు ప్లేస్కూల్ తరహా బోధన

ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుని నియామకం

విద్యావేత్తలు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారులతో ముఖ్యమంత్రి భేటీ

ఇంటిగ్రేటెడ్ గురుకులాలకు సమాంతరంగా ఏర్పాటు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో సెమీ రెసిడెన్షియల్ స్కూళ్లను త్వరలో ఏర్పాటు చేయనున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఇంటిగ్రేటెడ్ గురుకులాలకు సమాంతరంగా అన్ని చోట్లా వాటిని ఏర్పాటు చేయాలని చెప్పారు. ఒకట్రెండు మండలాల్లో పైలట్ ప్రాజెక్టు కింద అమలు చేయాలని నిర్ణయించామన్నారు. విద్యావేత్తలతో చర్చించిన తర్వాతే అందుకు సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని విద్యాశాఖ అధికారులను ఆయన ఆదేశించారు. మూడో తరగతి వరకు అంగన్‌వాడీల్లోనే ప్లేస్కూళ్ల తరహాలో విద్యాబోధన అందించే అంశాన్ని పరిశీలిస్తున్నామని వివరించారు. నాలుగో తరగతి నుంచి సెమీ రెసిడెన్షియల్ స్కూళ్లలో విద్యార్థులకు రవాణా సదుపాయం కల్పించాలని అన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి రేవంత్‌రెడ్డి విద్యాశాఖ అధికారులతో శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ప్రముఖ విద్యావేత్తలు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారులతో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ విద్యా వ్యవస్థను పటిష్టం చేసే దిశగా సరికొత్త విధానంతో ముందుకెళ్లాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. వచ్చే మూడేండ్లలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని విద్యాశాఖ ముఖ్య కారదర్శి బుర్రా వెంకటేశం, ఇతర అధికారులను ఆదేశించారు. విద్యావ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులను తీసుకురాబోతున్నామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యత స్వయం సహాయక బృందాలు (ఎస్‌హెచ్‌జీ) మహిళలకు అప్పగించామన్నారు. చిన్న పిల్లలకు సొంత గ్రామాల్లోనే సౌకర్యవంతంగా ఉండేలా ప్లే స్కూల్ తరహాలో మూడో తరగతి వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే విద్యాబోధనకు ప్రతిపాదనలు ...13లో

ప్రయివేటు భాగస్వామ్యంతో
స్కిల్ యూనివర్సిటీ



17 కోర్సులు, ఏటా 20 వేల మందికి శిక్షణ

హైదరాబాద్‌లోనే ప్రధాన కార్యాలయం..

మెయిన్ క్యాంపస్

బడ్జెట్ సమావేశాల్లోనే బిల్లు...:ముసాయిదాకు పలు మార్పులు

సూచించిన సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో తెలంగాణ స్కిల్స్ యూనివర్సిటీని ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యం (పీపీపీ)తో ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. దీనికి సంబంధించిన బిల్లును ఈ బడ్జెట్ సమావేశాల్లోనే అసెంబ్లీలో ప్రవేశపెట్టాలనీ, దానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారుల్ని ఆదేశించారు. యూనివర్సిటీ ...5లో

టైమ్ స్క్వేర్ తరహాలో
టీ స్క్వేర్

హుస్సేన్ సాగర్ చుట్టూ ఆకాశహర్మ్యాలు

ప్రతిపాదనలు సిద్ధం చేసిన రాష్ట్ర సర్కారు

ఆగస్టు 3న అమెరికాకు

సీఎం రేవంత్‌రెడ్డి బృందం 5లో..

టైమ్‌స్క్వేర్ నిర్మాణం, డిజైన్ల పరిశీలన



ఫలించిన అంగన్‌వాడీల
పోరాటం..

ఐసీడీఎస్ కమిషనర్ ఆఫీస్ ఎదుట భారీ ధర్నా

ఆటంకాలన్నీ అధిగమించి భారీగా తరలొచ్చిన టీచర్స్, హెల్పర్స్

డిమాండ్లకు అంగీకరించిన ఐసీడీఎస్ డైరెక్టర్

జులై 1 నుంచి రిటైర్మెంట్ బెనిఫిట్స్

వీఆర్ఎస్, పెన్షన్ పెంపుతో కొత్త జీవోకు అంగీకారం

హెల్పర్లకు పాత పద్ధతిలోనే ప్రమోషన్లు కల్పించాలన్న డిమాండ్‌కు సుముఖత

ప్రభుత్వానికి అన్ని అంశాలపై సానుకూలంగా ఫైల్ పెడతానన్న డైరెక్టర్ కాంతివెస్లీ

అంగన్‌వాడీల జీతాలు రూ.18వేలకు పెంచుతూ అసెంబ్లీలో ప్రకటన చేయాలి : తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి



ఐసీడీఎస్ డైరెక్టర్

అంగన్‌వాడీ ఉద్యోగుల పోరాటం విజయవంతమైంది. ఐసీడీఎస్ కమిషనర్ ఆఫీస్ ఎదుట శుక్రవారం అంగన్వాడీలు చేపట్టిన ధర్నా వద్దకు డైరెక్టర్ కాంతి వెస్లీ వచ్చి డిమాండ్లకు సానుకూలంగా స్పందించారు. జులై ఒకటి నుంచి రిటైరయ్యే టీచర్స్‌కు రూ.2లక్షలు, ఆయాలకు రూ.లక్ష బెనిఫిట్స్ ఇచ్చేందుకు అంగీకరించారు. త్వరలో కొత్త జీవో విడుదల చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఇది మనం సమిష్టిగా పోరాడి సాధించిన విజయమని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి అన్నారు.

నవతెలంగాణ-సిటీబ్యూరో

జీవో నెం.10ని రద్దు చేసి.. రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ పెంచుతూ, వీఆర్ఎస్ సౌకర్యం కల్పిస్తూ కొత్త జీవో వెంటనే ఇవ్వాలని, ఇతర డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో ఐసీడీఎస్ కమిషనర్ ఆఫీస్ ఎదుట అంగన్వాడీలు ధర్నా చేపట్టారు. అన్ని జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు. దాంతో అంగన్‌వాడీలతో ఐసీడీఎస్ కార్యాలయం చుట్టుపక్కల ప్రాంతమంతా కిక్కిరిసిపోయింది. ఐసీడీఎస్ డైరెక్టర్ రావాలి.. తమ న్యాయమైన డిమాండ్లపై స్పష్టతనివ్వాలనే నినాదాలు మార్మోగాయి. ఐసీడీఎస్ డైరెక్టర్ ...13లో

ప్రాజెక్టులకు జలకళ

రాష్ట్రవ్యాప్తంగా జోరువాన..వరదలు

వరి రైతుల్లో చిగురిస్తున్న ఆశలు

పొంగుతున్న వాగులు.. నిలిచిన రాకపోకలు

భద్రాద్రి వద్ద 27 అడుగులకు గోదావరి

ఆనవాళ్లు కోల్పోయిన పెద్దవాగు

ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో లోతట్టు ప్రాంతాల్లోకి నీరు



ఓపెన్‌కాస్ట్ గనుల్లో స్తంభించిన బొగ్గు ఉత్పత్తి.. హైదరాబాద్ హుస్సేన్‌సాగర్‌లోకి భారీగా వరద

నవతెలంగాణ-విలేకరులు

రాష్ట్రవ్యాప్తంగా మూడ్రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న జోరువానతో పాటు ఎగువన కురుస్తున్న వర్షాలతో వరద నీరు చేరి ప్రాజెక్టులు కళకళలాడుతున్నాయి. జిల్లాల్లోని పలు గ్రామాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లి మండలాలు, గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ప్రాజెక్టుల జలకళతో రైతుల్లో ముఖ్యంగా వరి సాగుదారుల్లో ఆశలు చిగురించాయి. దీంతో వారు నారుమళ్లకు సిద్ధమవుతున్నారు. భద్రాద్రి జిల్లా అశ్వారావుపేటలోని పెద్దవాగు ప్రాజెక్టు కట్ట తెగి నీరు ఉప్పొంగి ప్రవహించడంతో ప్రాజెక్టు ఆనవాళ్లు కోల్పోయింది. లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరడంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. ఓపెన్‌కాస్ట్ గనుల్లోకి వర్షపు నీరు చేరి బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్‌కూ భారీగా వరద నీరొచ్చి చేరుతోంది.భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండటంతో గోదావరి పరివాహకంలోని వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. ముఖ్యంగా ఏజెన్సీ వ్యాప్తంగా వాగులు, వంకలు పొంగిపొర్లుతుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. విలీన మండలాలైన కూనవరం, వీఆర్ పురం, ...13లో

11జిల్లాలకు ఆరెంజ్ ఎలర్ట్

వాతావరణ శాఖ హెచ్చరికలు

జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి : సీఎస్ 5లో..

పాలస్తీనాకు సంఘీభావం తెలిపితే
కేసులా?

తక్షణమే ఎత్తేయండి :

సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో డిమాండ్

న్యూఢిల్లీ : మొహర్రం ప్రదర్శనల సందర్భంగా పాలస్తీనా పతాకాలను చేబూని ప్రదర్శించిన వారిపై నమోదు చేసిన క్రిమినల్ కేసులను తక్షణమే ఉపసంహరించాలని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది. జమ్మూ కాశ్మీర్, బీహార్, మధ్యప్రదేశ్, జార్ఖండ్ తదితర రాష్ట్రాల్లో ఉపా, భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)ల్లోని కఠినమైన సెక్షన్ల కింద ఈ కేసులు నమోదు చేశారు. బీజేపీ, వీహెచ్‌పీ నేతలు ఇచ్చిన ఫిర్యాదుల మేరకే ఈ కేసులను నమోదు ...13లో

బిల్కిస్ బానో
కేసులో..

దోషుల పిటిషన్‌ను తిరస్కరించిన సుప్రీంకోర్టు



వివరాలు 13లో

ఇంటర్నెట్ ప్రపంచంలో
పెద్ద కుదుపు

మైక్రోసాఫ్ట్ విండోస్‌లో సాంకేతిక సమస్య

విమాన, ఆర్థిక, కమ్యూనికేషన్ సహా పలు రంగాలపై తీవ్ర ప్రభావం 3లో..

గ్రూప్-2 వాయిదా

డిసెంబర్‌లో నిర్వహణ.. టీజీపీఎస్సీ ప్రకటన



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వచ్చేనెల ఏడు, ఎనిమిది తేదీల్లో నిర్వహించే గ్రూప్-2 రాతపరీక్షలను వాయిదా వేస్తున్నట్టు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ప్రకటించింది. డిసెంబర్‌లో నిర్వహిస్తామని తెలిపింది. ఈ మేరకు టీజీపీఎస్సీ కార్యదర్శి ఈ నవీన్ నికోలస్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రూప్-2 రాతపరీక్షలను వాయిదా వేయాలనీ, పోస్టులను పెంచాలని అభ్యర్థులు ప్రభుత్వాన్ని కోరుతున్న విషయం తెలిసిందే. వివిధ పోటీ పరీక్షల మధ్య ఎక్కువ సమయం లేనందున వచ్చేనెల ఏడు, ఎనిమిది తేదీల్లో జరగాల్సిన గ్రూప్-2 రాతపరీక్షలను డిసెంబర్‌కు రీషెడ్యూల్ చేశామని వివరించారు. డిసెంబర్‌లో రాతపరీక్షల తేదీల వివరాలను తర్వాత ప్రకటిస్తామని తెలిపారు. రాష్ట్రంలో 18 శాఖల్లో 783 పోస్టుల భర్తీకి 2022, డిసెంబర్ 29న గ్రూప్-2 నోటిఫికేషన్‌ను టీజీపీఎస్సీ విడుదల చేసిన విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా 5,51,943 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు.

జాబ్‌క్యాలెండర్‌ను ప్రకటిస్తాం : భట్టి

నిరుద్యోగుల కోరిక మేరకు గ్రూప్-2 వాయిదా అంశాన్ని పరిశీలిం ...5లో

పార్లమెంటు ముందుకు
ఆరు కీలక బిల్లులు

లోక్‌సభ సెక్రటేరియట్ బులెటిన్ విడుదల

22 నుంచి ఆగస్టు 12 వరకు సమావేశాలు



ఢిల్లీ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జులై 22 నుంచి ప్రారంభం కానున్నాయి. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ జులై 23న కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఆరు కొత్త బిల్లులను సభలో ప్రవేశపెట్టనుంది. ఈ బిల్లుల జాబితాను గురువారం సాయంత్రం లోక్‌సభ సెక్రటేరియట్ విడుదల చేసిన బులెటిన్‌లో పేర్కొంది. ఇందులో ప్రశ్నోత్తరాలు, జీరో అవర్ ఉండవని తెలిపింది. అయితే ఈ సమావేశాల్లో 90 ఏండ్ల నాటి ఎయిర్‌క్రాఫ్ట్ చట్టాన్ని సవరించి, దాని స్థానంలో విమానయాన రంగంలో వ్యాపారాన్ని సులభతరం చేయడానికి వీలు కల్పించే నిబంధనలతో కొత్త చట్టాన్ని తీసుకురానున్నారు. ఈ బిల్లుతో సహా ఆరు కొత్త బిల్లులను ప్రవేశపెట్టడానికి కేంద్రం జాబితా చేసింది. సోమవారం నుంచి ప్రారంభమయ్యే పార్లమెంటు సమావేశంలో ఆర్థిక బిల్లుతో పాటు 'ది డిజాస్టర్ మేనేజ్‌మెంట్ (సవరణ) బిల్లు' ను కూడా జాబితా ...13లో

గనుల్లో ప్రమాదాలు..

చోద్యం చూస్తున్న అధికారులు

రక్షణ చర్యల్లేకుండానే పనులు

• కార్మికులపై ఒత్తిడి • ప్రాణాలు పోతున్నా పాఠాలు నేర్వని యాజమాన్యం

కార్మికుల ప్రాణాలు పోతున్నా సింగరేణి అధికారులు మాత్రం నిర్లక్ష్యాన్ని వీడటం లేదు. 'ఒకే కుటుంబం.. ఒకే దృష్టి.. ఒకే లక్ష్యం' .. అనే సింగరేణి స్ఫూర్తికి అధికారులు తూట్లు పొడుస్తున్నారు. ఐక్యంగా అందరూ ఒకే లక్ష్యం కోసం కృషి చేయాల్సి ఉన్నా అధికారులు కార్మికులను చిన్నచూపు చూస్తున్నారు. వారిపై ఒత్తిడి పెంచి రక్షణ చర్యలు లేకుండానే ప్రమాదకర స్థలాల్లో పనులు చేయిస్తున్నారు. ఫలితంగా కార్మికులు ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. అయితే కొంతమంది అధికారుల తీరు వల్లే సింగరేణి సంస్థ స్ఫూర్తి దెబ్బతింటోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



నవతెలంగాణ - కోల్‌సిటీ

సింగరేణిలో కార్మికులకు కల్పించే సౌకర్యాలు.. క్వార్టర్లు.. వాటి నిర్వహణ, రీఫ్రెష్‌మెంట్ క్లబ్‌ల నిర్వహణ, వారికి రావాల్సిన హక్కులు, ఇతర సౌకర్యాలు అన్నింట్లో అధికారులు వివక్ష చూపిస్తున్నారన్న విమర్శలున్నాయి. ప్రమాదాలు జరిగి కార్మికుల ప్రాణాలు పోతున్నా సంస్థ యాజమాన్యం ఎలాంటి గుణపాఠాలూ నేర్వడం లేదు. బుధవారం ఆర్‌జీ -3 డివిజన్ పరిధిలోని ఓసీ2 గనిలో జరిగిన ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మట్టిపెళ్లల కింద ఇరుక్కుపోయి మృతి చెందిన విషయం తెలిసిందే.

ప్రమాదానికి కారకులెవరూ..

ఓసీపీ-2 గని క్వారీలో ఊరిన నీటిని పైకి తరలించేందుకు ఏర్పాటు చేసిన పైప్‌లైను లీకేజీ కాగా.. మరమ్మతులు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. బుధవారం మొహర్రం సెలవైనప్పటికీ ఆ పనిని పూర్తి చేయాలన్న ఉన్నతాధికారుల ఒత్తిడితో నలుగురు కార్మికులు పనిలోకి దిగారు. ఈ క్రమంలో జరిగిన ప్రమాదంలో ఫిట్టర్ ఉప్పు వెంకటేశ్వర్లు(58), కార్మికుడు గాదం విద్యాసాగర్ (16) మృతి చెందారు. మరో కార్మికుడు శ్రీనివాసరాజ్, సమ్మయ్య తీవ్రంగా గాయపడ్డారు. నాలుగు మీటర్ల లోతు గుంతలోకి వెంకటేశ్వర్లు, విద్యాసాగర్, శ్రీనివాస్ రాజ్, సమ్మయ్య దిగి మరమ్మతులు చేస్తుండగా కందకం పక్కన ఉన్న మట్టి ఒక్కసారిగా వారిపై కూలింది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో మట్టి బురదమయంగా మారడంతో వెంకటేశ్వర్లు, విద్యాసాగర్ ఆ బురదలో కూరుకుపోయి ఊపిరాడక మృతిచెందారు. వారికి కొద్దిగా పై భాగంలో ఉన్న శ్రీనివాస రాజ్, సమ్మయ్య ఛాతి వరకు మట్టిలో మునిగిపోగా.. ప్రమాదాన్ని గుర్తించిన తోటి కార్మికులు వారిని అతికష్టంగా బయటకు తీశారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పనిస్థలంలో తగిన చర్యలు చేపట్టకపోవడంతో ప్రమాదం జరిగిందని కార్మికులు చెబుతున్నారు. కార్మికులు చిన్న తప్పులు చేస్తేనే క్రమశిక్షణ చర్యలు తీసుకునే అధికారులు.. వారి తప్పిదం కారణంగా ఇద్దరు కార్మికుల ప్రాణాలు గాలిలో కలిసిపోవడంపై ఏమి సమాధానం చెబుతారని కార్మిక సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.

కలవరపెడుతున్న ప్రమాదాలు..

సింగరేణి గనుల్లో తరచూ జరుగుతున్న ప్రమాదాలు కార్మికులను కలవరపెడుతున్నాయి. గతేడాది జరిగిన ఐదు ప్రమాదాల్లో ఐదుగురు కార్మికులు చనిపోయారు. ఈ ఏడాది ఆరు నెలల్లోనే నాలుగు ప్రమాదాలు జరిగి ఐదుగురు మృతి చెందారు. అండర్ గ్రౌండ్ గనులు, ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టుల్లో రక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని చెబుతున్న మేనేజ్‌మెంట్ మాటలు ఆచరణకు నోచుకోవడం ...13లో

రైతు బంధుకు స్వస్తి పలికే కుట్ర : రాజీవ్‌సాగర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రైతు రుణమాఫీ పేరుతో రైతు బంధు పథకానికి స్వస్తి పలికేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని తెలంగాణ ఫుడ్స్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ మేడే రాజీవ్ సాగర్ విమర్శించారు. బీఆర్ఎస్ హయంలో రైతాంగ సంక్షేమానికి రూ. లక్ష 20 వేల కోట్లు కేటాయించిందని గుర్తుచేశారు.

ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దాదాపు 40 లక్షల పైచిలుకు రైతులు లక్ష లోపు పంట రుణాలు తీసుకుంటే కేవలం 11 లక్షల మందికే మాఫీ చేయడమేంటని కాంగ్రెస్ సర్కార్‌ను ప్రశ్నించారు. బీఆర్ఎస్ మాఫీ చేసిన దానిలో కేవలం పావు శాతం మాత్రమే రేవంత్ సర్కారు చేసిందని తెలిపారు. లక్ష లోపు రుణమాఫీకి రూ. 19 వేల కోట్లు అవసరం కాగా నేడు కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 6098 కోట్ల మాత్రమే మాఫీ చేసిందని పేర్కొన్నారు. జులై నెల సగం అయిపోయినా రైతు బంధు ఇంకా ఎందుకివ్వడం లేదని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా ఒక్క హామీ కూడా సంపూర్ణంగా అమలు చేయలేదని విమర్శించారు. రూ. 31 వేల కోట్ల రుణ మాఫీలో కేవలం రూ. 6 వేల కోట్లు మాత్రమే చేశారని తెలిపారు. ఆగష్టు 15 లోపు 6 గ్యారంటీలు అమలు చేసి, మిగతా రూ. 25 వేల కోట్ల రుణ మాఫీ చేసి అప్పుడు రాజీనామా గురించి మాట్లాడాలని సూచించారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు

- డెంగ్యూ కేసుల గుర్తింపు ప్రక్రియ వేగవంతం
- పాట్ హెూల్స్ అన్నింటినీ పూడ్చాలి : జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట



నవతెలంగాణ-సిటీబ్యూరో

వర్షాల నేపథ్యంలో నగరంలో వ్యాధులు ప్రబలకుండా అన్ని చర్యలూ తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట అన్నారు. డెంగ్యూ కేసుల ట్రేస్ ఔట్ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ముఖ్యంగా పారిశుధ్య నిర్వహణ సజావుగా జరగాలని, దీనిపై ఆయా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జీహెచ్ఎంసీ అధికారులను కమిషనర్ ఆదేశించారు. శుక్రవారం ఆమె జోనల్ కమిషనర్లు, అడిషనల్ కమిషనర్లు, సంబంధిత అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి పలు అంశాలపై సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాల కారణంగా రోడ్లపై ఏర్పడిన పాట్ హెూల్స్‌ను ఎప్పటికప్పుడూ పూడ్చేయాలని, శానిటేషన్ నిర్వహణతోపాటు, శానిటేషన్ వర్కర్ల హాజరు మరింత మెరుగు పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. డెంగ్యూ కేసులను ఎప్పటికప్పుడూ గుర్తించి, సంబంధిత సమాచారాన్ని సకాలంలో అందించాలన్నారు. డెంగ్యూ కేసులు పెరగ కుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకో వాలని సూచించారు. చెరు వులు, నాళాల వద్ద భవన నిర్మాణాల వ్యర్థాలు, సాలిడ్ వేస్ట్ ఉండకూడదని స్పష్టం చేశారు. ఈ విషయమై సంబంధిత అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

డీఎస్సీకి రెండోరోజు 94.69 శాతం హాజరు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి జిల్లా నియామక కమిటీ (డీఎస్సీ) రాతపరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డి తెలిపారు. శుక్రవారం రెండోరోజు 27,061 మంది దరఖాస్తు చేయగా, వారిలో 25,625 (94.69 శాతం) మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారని వివరించారు. 1,436 (5.31 శాతం) మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. శుక్రవారం సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీ) తెలుగు మాధ్యమం అభ్యర్థులకు పరీక్ష నిర్వహించామని తెలిపారు. డీఎస్సీకి 2,79,957 దరఖాస్తులొచ్చిన విషయం తెలిసిందే. 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 29న రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది.

భారీ వర్షాల నేపథ్యంలో
అధికారులు అప్రమత్తం కావాలి

- విపత్తు నిర్వహణ బృందాలతో సమన్వయం చేసుకోండి
- ప్రజలను అప్రమత్తం చేయాలి
- సాగునీటిపారుదల అధికారులకు : ఈఎన్సీ అనిల్ కుమార్ ఆదేశం


నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రంలో రానున్న 48 గంటలలో భారీ, అతి భారీ వర్షాలు కురవనున్నాయంటూ హైదరాబాద్ వాతావరణ శాఖ(రెడ్-టెక్-యాక్షన్) చేసిన సూచనలతో తెలంగాణా రాష్ట్ర నీటి పారుదల శాఖా అప్రమత్తమైంది. ఈ మేరకు రాష్ట్ర నీటి పారుదల ఇంజినీర్ ఇన్‌చీఫ్ జనరల్ బి అనిల్‌కుమార్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నీటిపారుదల శాఖాధికారులతో ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి పరిస్థితులను తెలుసుకుంటున్నారు. అలాగే ఫోన్లద్వారా శుక్రవారం ఈఎన్సీలు, సీఈ, యస్ఈ, ఈఈలతో మాట్లాడుతూ ముందస్తు జాగ్రత్తలపై తీసుకోవాల్సిన చర్యలపై తగు సూచనలు చేశారు. రిజర్వాయర్లు,కాలువలు, నదులలో నీటి మట్టాలను ఎప్పటికప్పుడు క్షుణ్ణంగా పరిశీలించాలనీ, ఆ సమాచారాన్ని వేగంగా రాష్ట్ర కార్యాలయానికి పంపాలని సూచించారు. స్పిల్ వేలు, వరదగేట్లు సక్రమంగా పనిచేస్తున్నాయా లేదో గమనించాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితులు అధిగమించేందుకు ప్రణాళికలు రూపొందించుకోవాలని చెప్పారు. ఎప్పటికప్పుడు విపత్తు నిర్వహణ బందాలతో సమన్వయం చేసుకుంటూనే భద్రతా చర్యల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు.

అసంఘటిత రంగం అల్లకల్లోలం

వాస్తవాలను దాచిపెడుతున్న కేంద్ర ప్రభుత్వం





మోడీ పాలనలో 63 లక్షల సంస్థలు క్లోజ్

న్యూఢిల్లీ : మోడీ పాలన అసంఘటిత రంగానికి నరకాన్ని చూపిస్తున్నది. ఈ రంగంపై ఆధారపడే లక్షలాది మంది ప్రజలు తమ ఉద్యోగాలను కోల్పోయి దిక్కుతోచని పరిస్థితుల్లో పడుతున్నారు. అలాగే, లక్షలాది సంస్థలు సైతం మూతపడ్డాయి. మోడీ సర్కారు అనాలోచిత, అస్తవ్యస్థ ఆర్థిక విధానాల కారణంగానే ఇలాంటి పరిస్థితులు నెలకొన్నాయని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. క్రెడిట్ మార్కెట్ రేటింగ్ ఏజెన్సీ ఇండియా రేటింగ్స్ ఈనెల 9న విడుదల చేసిన ఒక నివేదిక ప్రకారం.. భారత్‌లో 2015-16 నుంచి 2022-23 ఆర్థిక సంవత్సరాల మధ్య దేశంలో 63 లక్షల అసంఘటిత రంగ సంస్థలు మూతపడ్డాయి. ఫలితంగా 1.6 కోట్ల ఉద్యోగాలు పోయాయి. నోట్ల రద్దు, వస్తు సేవల పన్ను(జీఎస్టీ), కోవిడ్-19 మహమ్మారి కారణంగా భారతదేశ ఆర్థిక వ్యవస్థకు ఎదురైన షాక్‌ల కారణంగా ఇలాంటి తిరోగమన పరిస్థితులు ఏర్పడ్డాయి. నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ చేసిన అన్‌ఇన్‌కార్పొరేటెడ్ సెక్టార్ ఎంటర్‌ప్రైజెస్ వార్షిక సర్వే ఫలితాల ఆధారంగా ఈ నివేదికను రూపొందించారు. ఇండియా రేటింగ్స్ నివేదిక 2022-23 ఫలితాలను ప్రభుత్వ సర్వే చివరి రౌండ్‌లో నిర్వహించిన 2015-16తో పోల్చింది. ఇది ఏడేండ్ల వ్యవధిలో ఉద్యోగాల క్షీణతను చెప్పింది. అనధికారిక రంగంలో లక్షలాది మంది భారతీయులను స్వయం ఉపాధి, గిగ్ సెక్టార్‌లో ఉద్యోగాల వైపు నెట్టివేసే అవకాశం ఉన్నదనీ, వారు వ్యవసాయం వైపు తిరిగి వెళ్ళవలసి వచ్చిందనీ, దీని కారణంగా వేతనాల విషయంలో నాణ్యత క్షీణిస్తున్నట్టు నిపుణులు చెప్పారు.

2021-22లో 5.97 కోట్లుగా ఉన్న అసంఘటిత రంగంలోని సంస్థల సంఖ్య 2022-23 నాటికి 5.88 శాతం సమ్మిళిత వార్షిక వృద్ధి రేటుతో 6.50 కోట్లకు పెరిగిందని తాజా ప్రభుత్వ సర్వేలోని ఫ్యాక్ట్ షీట్ చూపిస్తుంది. అదే సమయంలో, ఈ సంస్థల్లో కార్మికుల సంఖ్య 7.84 శాతం చొప్పున 9.78 కోట్ల నుంచి 10.96 కోట్లకు పెరిగింది. అయితే, విశ్లేషకులు, నిపుణుల ప్రకారం.. 2022-23 సంఖ్యలను 2015-16తో పోల్చినప్పుడు ఈ ఏడేండ్ల కాలంలో ఎంటర్‌ప్రైజెస్‌ల సంఖ్య 2.68 శాతం పెరిగి 6.33 కోట్ల నుంచి 6.50 కోట్లకు చేరుకోగా, కార్మికుల సంఖ్య 11.13 కోట్ల నుంచి 1.5 శాతం తగ్గి 10.96 కోట్లకు పడిపోయింది.

ఈ ఉద్యోగ నష్టాల ఫలితం ఏమిటి?

పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే 2017-18 నుంచి 2022-23 మధ్య సమాచారం ప్రకారం.. జీతభత్యాల ఉద్యోగాలలో ఉపాధి పొందుతున్న భారతీయుల వాటాలో క్షీణత కనిపించింది. ఉద్యోగాలు కోల్పోవటంతో కార్మికులు వ్యవసాయం, గృహోపకరణాల రూపంలో స్వయం ఉపాధికి వెళ్ళవలసి వచ్చిందని బెంగళూరులోని అజీమ్ ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్, స్టేట్ ఆఫ్ వర్కింగ్ ఇండియా సహ రచయితలలో ఒకరైన రోసా అబ్రహం అన్నారు.

"ఈ రెండు సందర్భాల్లోనూ, చాలా మందికి జీతం లభించకపోవచ్చు. అసంఘటిత రంగంలో ఉద్యోగాలు తగ్గటానికి మరో కారణం ఏమిటంటే.. కార్మికులను నియమించుకునే సంస్థల వాటా 2015-16లో 15.8 శాతం నుంచి 2022-23 నాటికి 15 శాతానికి తగ్గింది. గత ఏడేండ్లలో ఏర్పాటైన అనేక కొత్త సంస్థల్లో ఉద్యోగాలు కల్పించటం లేదని ఇది తెలియజేస్తున్నదని రోసా అబ్రహం అన్నారు. 2022-23లో తయారీ రంగంలో కార్మికుల సంఖ్య 3.06 కోట్లుగా ఉండగా.. ఇది 2015-16లో 3.6 కోట్ల కంటే తక్కువగా ఉన్నదని ఇండియా రేటింగ్స్ నివేదిక పేర్కొన్నది.

ఇటీవలి సంవత్సరాలలో ఉద్యోగాలు కోల్పోయిన వారికి గిగ్ వర్క్ చాలా సులభమైన ఎంపికగా మారిందని అబ్రహం అన్నారు.

ముఖ్యంగా నగరాల్లో నివసించే వారికి, ఇది గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయానికి తిరిగి వెళ్లడానికి సమానమనీ, ఎందుకంటే డెలివరీ వ్యక్తిగా ఉద్యోగం పొందడం చాలా సులభం, అలాంటి ఉద్యోగాలకు ఎక్కువ నైపుణ్యం లేదా శిక్షణ అవసరం లేదని చెప్పారు. తయారీ రంగంలో ఉపాధి తగ్గిపోవడం చాలా ఆందోళన కలిగించే విషయమని ఆర్థిక నిపుణులు చెప్పారు. కేవలం బడాపారిశ్రామికవేత్తలు, కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలే లక్ష్యంగా మోడీ సర్కారు వ్యవహరించటంతో అసంఘటిత రంగం నిర్లక్ష్యానికి గురై, కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో మోడీ సర్కారు ఈ రంగానికి మరింత ప్రాధాన్యతను ఇవ్వాల్సినవసరం ఉన్నదని వారు నొక్కి చెప్తున్నారు.



ఇంటర్నెట్ ప్రపంచంలో పెద్ద కుదుపు !

మైక్రోసాఫ్ట్ విండోస్‌లో సాంకేతిక సమస్య

విమాన, ఆర్థిక, కమ్యూనికేషన్ సహా పలు రంగాలపై తీవ్ర ప్రభావం

న్యూయార్క్, ముంబయి : ఇంటర్నెట్ ప్రపంచంలో పెద్ద కుదుపు. మైక్రోసాఫ్ట్ విండోస్‌లో తలెత్తిన సాంకేతిక సమస్య కారణంగా ప్రపంచవ్యాప్తంగా పలు చోట్ల వైమానిక, ఆర్థిక, కమ్యూనికేషన్‌లతో సహా పలు రంగాల సేవలకు తీవ్రంగా అంతరాయం కలిగింది. బ్లూ స్క్రీన్‌పై ఎర్రర్ అని చూపిస్తూ షట్‌డౌన్ అవడమో లేదా రీ స్టార్ట్ అవడమో జరిగింది. దీంతో విమానాల రాకపోకలు, ఆర్థిక లావాదేవీలు, వార్తా ప్రసారాలు వంటి అనేక సేవలు స్తంభించిపోయాయి. క్రౌడ్‌స్ట్రైక్ నుండి వచ్చిన అప్‌డేట్ కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందని మైక్రోసాఫ్ట్ వెల్లడించింది. మైక్రోసాఫ్ట్‌లోని అజూర్ ప్లాట్‌ఫామ్‌కి సంబంధించిన పలు అంశాలపై దర్యాప్తు చేస్తున్నామని పేర్కొంది. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని తెలిపింది. అయితే భారత్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లోని ఇంటర్నెట్ వినియోగదారుల నుండి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఇండియన్ కంప్యూటర్ ఎమర్జన్సీ రెస్పాన్స్ టీమ్, సిఇఆర్‌టి-ఇన్ ఈ సంఘటనకు 'క్రిటికల్' అని రేటింగ్‌ను జారీ చేసింది. అయితే భారత్‌లో స్టాక్ మార్కెట్లయిన ఎన్‌ఎస్‌ఇ, బిఎస్‌ఇల కార్యకలాపాలకు ఎలాంటి అంతరాయం కలగలేదు. మైక్రోసాఫ్ట్‌తో ప్రభుత్వం మాట్లాడుతోందని, సమస్యను గుర్తించారని, త్వరలోనే పరిష్కారమవుతుందని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఈ సాంకేతిక సమస్య కారణంగా వందలు, వేల సంఖ్యలో కంపెనీలు, సంస్థలు ప్రభావితమయ్యాయి. భారత్‌లో 10 బ్యాంకులు, ఎన్‌బిఎఫ్‌సిలు స్వల్పంగా అంతరాయాలను ఎదుర్కొన్నాయని ఆర్‌బిఐ ప్రకటించింది. ఇండిగో, స్పైస్ జెట్, ఆకాష్ ఎయిర్ వంటి సంస్థలు మాన్యువల్‌గా చెక్‌ఇన్‌లు చేపట్టాయి. విమానాల రాకపోకల్లో జాప్యం జరుగుతుందని ప్రయాణికులు సహకరించాలంటూ పౌర విమానయాన శాఖ మంత్రి ప్రకటన జారీ చేశారు. అంతర్జాతీయ సైబర్ సెక్యూరిటీ కంపెనీ అయిన కాస్పర్‌స్కై ఒక ప్రకటన చేస్తూ దీన్ని సీరియస్ సమస్యగా పేర్కొంది. దీన్ని పరిష్కరించడానికి పట్టే సమయాన్ని అంచనా వేయడం కష్టమని వ్యాఖ్యానించింది.

కాగా ఇదేమీ సైబర్‌దాడి లేదా భద్రతా వైఫల్యం కాదని క్రౌడ్ స్ట్రైక్ ప్రకటించింది. సమస్యను గుర్తించామని, దాన్ని పరిష్కరించేందుకు తమ బృందాలు పనిచేస్తున్నాయని ఒక ప్రకటనలో తెలిపింది.

పేదరిక నిర్మూలనలో దేశంలోనే రెండో స్థానం

- నిటి అయోగ్ సుస్థిరాభివృద్ధి లక్ష్యాల(ఎస్‌డీజీ)లో ప్రగతి లెక్కలు
- ఇదంతా కేసీఆర్ పాలనతోనే సాధ్యం : కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పేదరిక నిర్మూలనలో దేశంలోనే తెలంగాణ రెండో స్థానంలో నిలిచినట్టు నిటి అయోగ్ ప్రకటించడం పట్ల బీఆర్‌ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు కె.తారకరామారావు హర్షం వ్యక్తం చేశారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరుకోవడంలోనూ రాష్ట్రం ముందువరసలో ఉందని తెలిపారు. పదేండ్ల కేసీఆర్ ప్రభుత్వ పనితీరు వల్లనే ఇదంతా సాధ్యమైందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2020-21తో పోలిస్తే 2023-24 నాటికి (ఎస్‌డీజీ) లో 74 స్కోర్‌తో తెలంగాణ ముందుందని పేర్కొన్నారు. గతంతో పోలిస్తే ఐదు పాయింట్లు మెరుగైందని తెలిపారు. చాలా రంగాల్లో తెలంగాణ సాధించిన మార్కులు జాతీయ సగటును మించి ఉండటం పదేండ్ల అభివృద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. తక్కువ ధరలో క్లీన్ ఎనర్జీని అందించటంలో తెలంగాణ వంద మార్కులు సాధించిన విషయాన్ని ప్రస్తావించారు. స్వచ్ఛమైన తాగునీటిని అందించడంలో 90 మార్కులు, అభివృద్ధిలో 84 మార్కులు సాధించటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

కేసీఆర్ విజన్, సాహొసోపేత నిర్ణయాలతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమైందని తెలిపారు. ప్రతీకారాలు, రాజకీయ కక్షలు, పార్టీ ఫిరాయింపులపై దృష్టి పెట్టడం ఆపి రాష్ట్రాభివృద్ధిపై రేవంత్‌రెడ్డి సర్కారు ఫోకస్ పెడితే ప్రజలకు మేలు కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

'వికలాంగులకు చేయూత' పేరుతో గ్రివెన్స్ సెల్

- కార్పొరేషన్ చైర్మెన్ ముత్తినేని వీరయ్య

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వికలాంగులకు చేయూత పేరుతో గ్రివెన్స్ సెల్ ఏర్పాటు చేయనున్నట్టు వికలాంగుల సహకార సంస్థ కార్పొరేషన్ చైర్మెన్ ముత్తినేనీ వీరయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వంద శాతం వైకల్యమున్నవారికి ఆగస్టు ఒకటి నుంచి డయల్ యువర్ చైర్మెన్ పేరుతో గ్రివెన్స్ సెల్ ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. రాష్ట్ర వికలాంగుల సంక్షేమ, సహకార కార్యాలయం సీతక్క ప్రారంభిస్తున్నట్టు తెలిపారు.



ఇంటర్నెట్ అంతరాయాలు

న్యూఢిల్లీ : శుక్రవారం మైక్రోసాఫ్ట్ అజూర్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో అనేక సంస్థల్లో సేవలకు అంతరాయం కలిగింది. ఇలా విధంగా జరగడం ఇదే మొదటిసారి కాదు. ఉదాహరణకు 2012లో ఒక బగ్ కారణంగా క్లౌడ్ సర్వీస్ ప్రొవైడర్ ఫాస్టీ కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది. అలాగే ట్విట్టర్ (ఇప్పుడు ఎక్స్), ట్విటెక్, రెడ్డిట్, అమజాన్ వంటి ప్రముఖ సోషల్ మీడియా సంస్థలు, గురాడియన్, బిబిసి, న్యూయార్క్ టైమ్స్.. వంటి మీడియా సంస్థలు కూడా తమ వెబ్‌సైట్లతో సమస్యలు ఎదుర్కొన్నాయి. అదేవిధంగా గూగుల్, మేటా (ఫేస్‌బుక్) భారీ సంస్థలు కూడా ఇటీవల కాలంలో సేవల్లో అంతరాయలను ఎదుర్కొన్నాయి. ఇటువంటి సంఘటనల గురించి సంక్షిప్త కాలక్రమ వివరణ

డివైఎన్‌పై సైబర్‌ఎటాక్ (2016)

డివైఎన్‌కు వ్యతిరేకంగా జరిగిన సైబర్‌ఎటాక్ కారణంగా అమెరికా, యూరప్‌ల్లో ఇంటర్నెట్ సేవలకు అంతరాయం కలిగింది. ఒక మాల్‌వేర్ ఉపయోగించి జరిపిన దాడితో డివైఎన్ సర్వర్ ఒత్తిడికి గురయింది.

బ్రిటీష్ ఎయిర్‌వేస్ ఐటి వైఫల్యం (2017)

ఊహించిన రీతిలో జరిగిన బ్రిటీష్ ఎయిర్‌వేస్ ఐటి వైఫల్యం కారణంగా ఈ సంస్థ స్వర్వర్లకు విద్యుత్ సరఫరా నిలిచింది. దీంతో విమాన సర్వీసులు నిలిచిపోయి దాదాపు 75 వేల మంది ప్రయాణీకులపై ప్రభావం పడింది.

ఫేస్‌బుక్ (2019)

ఫేస్‌బుక్, ఈ సంస్థకు చెందిన ఇన్‌స్టాగ్రామ్ వంటి యాప్‌లు 2019లో స్థంభించిపోయాయి. తమ ఖాతాల్లోకి లాగిన్ చేయలేకపోతున్నామని యూజర్‌లు ఆరోపించారు. ఈ అంతరాయాలకు 'సర్వర్ కాన్ఫిగరేషన్ మార్పు'ను సంస్థ కారణంగా పేర్కొంది.

గూగూల్ (2020)

స్టోరేజ్ కోటా సమస్యతో జిమెయిల్, డ్రైవ్, యూట్యూబ్ వంటి గూగూల్ అప్లికేషన్స్ క్రాష్‌ను ఎదుర్కొన్నాయి. అప్పటికే ఉన్న స్టోరేజ్ స్పేస్ నిండిపోయినప్పుడు సిస్టమ్‌లు ఈ అప్లికేషన్స్ కోసం అదనపు స్థలాన్ని సృష్టించనప్పుడు ఇలాంటి సమస్య ఏర్పడుతుంది.

ఫాస్టీ (2021)

క్లౌడ్ కంప్యూటింగ్ సర్వీస్ ప్రొవైడర్ ఫాస్టీ కార్యకలాపాలకు బగ్ కారణంగా అంతరాయం ఏర్పండింది. దీంతో అంతర్జాతీయ మీడియా సంస్థలు, ప్రభుత్వాలు, స్పూటిఫీ, అమజాన్ వంటి ఇంటర్నెట్ సర్వీసుల వైబ్‌సెట్లలో సమస్యలు ఏర్పడ్డాయి.

అకామై (2021)

మరొక క్లౌడ్ కంప్యూటింగ్ సర్వీస్ ప్రొవైడర్ అకామై ఒక సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేస్తున్న సమయంలో ఒక బగ్ కారణంగా అంతరాయాలకు గురయింది. దీంతో ప్రముఖ విమానయాన సంస్థల వైబ్‌సైట్లు, అమెజాన్, ఎయిర్‌బంబ్, హోమ్ డిపార్ట్‌మెంట్ వంటి సంస్థలు సమస్యలు ఎదుర్కొన్నాయి. ఈ సమస్య దాదాపు గంట పాటు కొనసాగింది.

జూమ్ (2022)

బ్యాక్‌ఎండ్ సిస్టమ్‌ల్లో, ట్రాఫిక్ నిర్వహణల్లో సమస్యలు కారణంగా జూమ్ మీటింగ్స్‌ల్లోకి యూజర్లు ప్రవేశించలేకపోయేవారు. దాదాపు గంట పాటు సమస్య కొనసాగింది.

అమెజాన్ వెబ్ సర్వీసెస్ (2022)

అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఎడబ్ల్యూఎస్) 2022లో రెండు భారీ అంతరాయలను ఎదుర్కొంది. దీనికారణంగా అమెరికా-ఈస్ట్ 2 ప్రాంతంలో సంబంధాలను ఎడబ్ల్యూఎస్ కోల్పోయింది. ఎడబ్ల్యూఎస్ అనేది కూడా క్లౌడ్ సర్వీస్ ప్లాట్‌ఫారం.

మైక్రోసాఫ్ట్ అజూర్ (2024)

మైక్రోసాఫ్ట్ అజూర్‌లో ఏర్పడిన సాంకేతిక లోపం కారణంగా ఈ సర్వీస్‌ను వినియోగించే ప్రపంచవ్యాప్తంగా విమానయాన సంస్థలు, హోటళ్లు, కార్యాలయాలు ప్రభావానికి గురయ్యాయి. ఇటీవల అమెరికా సైబర్ సెక్యూరిటీ సంస్థ క్రౌడ్‌స్ట్రయిక్‌లో ఏర్పడిన 'ఫాల్కన్ సెన్సార్' సమస్య తరువాత ఈ అంతరాయం ఏర్పడింది.

క్లౌడ్‌ఫేర్ (2023)

విద్యుత్ వైఫల్యం కారణంగా క్లౌడ్‌ఫేర్ రెండు రోజుల పాటు పని చేయడం నిలిచిపోయింది. మూడు డేటా సెంటర్ల సర్వీసులకు ఈ క్లౌడ్‌ఫేర్ ప్లాట్‌ఫారంను ఉపయోగిస్తారు. ఇందులో ఒక డేటా సెంటర్‌లో విద్యుత్ వైఫల్యం ఎదురుకావడం క్లౌడ్‌ఫేర్‌పై ప్రభావం చూపింది.

గాజాలో ఒక్కరోజే 54మంది మృతి

పాలస్తీనాను వ్యతిరేకిస్తూ ఇజ్రాయిల్ పార్లమెంట్ ఓటు | పలు దేశాల ఖండన, యూఎన్ చీఫ్ దిగ్భ్రాంతి



గాజా : ఇటీవలి రోజుల్లో ఇజ్రాయిల్ తన దాడులను ఉధృతం చేసింది. వరుసగా నాలుగు స్కూళ్ళపై బాంబు దాడులు జరిపి 90మంది ప్రాణాలను బలిగొని వారం రోజులు కూడా గడవకముందే గురువారం మరో 54మంది ఈ దాడుల్లో చనిపోయారని పాలస్తీనా ఆరోగ్య శాఖ తెలిపింది. విరామం లేకుండా మృతదేహాలు, క్షతగాత్రులు ఆస్పత్రులకు వస్తూనే వుండడంతో దక్షిణ గాజాలోని ఆరోగ్య కేంద్రాలన్నీ కూడా కిక్కిరిసి పోయి వున్నాయని అంతర్జాతీయ రెడ్ క్రాస్ కమిటీ తెలిపింది. డేర్ ఎలా బాలాహ్ పట్టణంలో అల్ అక్సా ఆస్పత్రిలో నేలపై తెల్ల దుప్పట్లలో చుట్టిన మృత దేహాలు పడి వుండడం టెలివిజన్ దృశ్యాల్లో కనిపిస్తున్నాయి.

పాలస్తీనా దేశాన్ని వ్యతిరేకిస్తూ గురువారం ఇజ్రాయిల్ పార్లమెంట్ ఓటు వేసింది. దాన్నొక ముప్పుగా పేర్కొంది. దీనివల్ల ఈ ప్రాంతం మొత్తం అస్థిరంగా మారుతుందని పేర్కొంది. 120మంది సభ్యులు గల పార్లమెంట్‌లో 68-9 ఓట్లతో తీర్మానం ఆమోదం పొందింది. ఈ ఓటింగ్‌ను పాలస్తీనా నాయకత్వం, అంతర్జాతీయ సమాజం తీవ్రంగా విమర్శించింది. వచ్చే బుధవారం అమెరికన్ కాంగ్రెస్‌లో ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు ప్రసంగించనున్న నేపథ్యంలో ఈ ఓటును ఇజ్రాయిల్ వైఖరికి చిహ్నంగా చూస్తున్నారు.

పాలస్తీనా అథారిటీ, జోర్డాన్‌లు తీర్మానాన్ని ఖండించాయి. ఇజ్రాయిల్ పాలక సంకీర్ణం మొత్తంగా ఈ ప్రాంతాన్ని సంక్షోభంలోకి నెడుతోందని పాలస్తీనా అథారిటీ విమర్శించింది. ఈ ఓటు అంతర్జాతీయ చట్టాలను తీవ్రంగా ఉల్లంఘిస్తోందని జోర్డాన్ విమర్శించింది. అంతర్జాతీయ సమాజానికి ఒక సవాలును విసురుతోందని వ్యాఖ్యానించింది. ఫ్రాన్స్ దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. ఐక్యరాజ్య సమితి తీర్మానాలకు పూర్తి విరుద్ధంగా వుందని వ్యాఖ్యానించింది.


గుటెరస్ దిగ్భ్రాంతి



1967 ముందునాటి సరిహద్దులతో పాలస్తీనా దేశం ఏర్పాటే ఈ సమస్యకు పరిష్కారమార్గమని పేర్కొంటూ దశాబ్దాలుగా సమస్యను పరిష్కరించడానికి ఐక్యరాజ్య సమితి కృషి చేస్తోంది. కానీ ఈ తరుణంలో ఇజ్రాయిల్ పార్లమెంట్ ఈ రీతిన ఓటింగ్ చేయడం పట్ల యుఎన్ చీఫ్ గుటెరస్ చాలా నిరాశ చెందారని ఆయన ప్రతినిధి స్టీఫెన్ దుజారిక్ తెలిపారు. ఇటువంటి చర్యలు తీసుకోవడం ద్వారా రెండు దేశాల ఏర్పాటు పరిష్కారాన్ని కొట్టివేయలేరని అన్నారు. గురువారం యురోపియన్ పార్లమెంట్‌ను ఉద్దేశించి ఇయు చీఫ్ ఉర్సులా వాన్ డెర్ లేయన్ ప్రసంగిస్తూ, గాజా ప్రజలు, మొత్తంగా మానవాళి ఇంక ఈ దారుణాలను సహించలేరని అన్నారు.

పాలస్తీనా శరణార్థులకు బ్రిటన్ సాయం పునరుద్ధరణ

లండన్ : పాలస్తీనా శరణార్థుల కోసం పనిచేస్తున్న ఐక్యరాజ్య సమితి సంస్థ (యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ)కు నిధులను అందించడాన్ని పునరుద్ధరించనున్నట్లు బ్రిటన్ కొత్త లేబర్ ప్రభుత్వం ప్రకటించింది. యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ నిధుల సస్పెన్షన్‌ను ఎత్తివేస్తున్నామని బ్రిటన్ విదేశాంగ శాఖ మంత్రి డేవిడ్ లామీ శుక్రవారం పార్లమెంట్‌కు చెప్పారు. గాజాకు మానవతా సాయం అందచేయడంలో ఐక్యరాజ్య సమితి సంస్థ చాలా కీలకమైనదని చెప్పారు. కొత్త నిధుల నుండి 2.70కోట్ల డాలర్లను అందచేస్తున్నట్లు తెలిపారు. గత కన్జర్వేటివ్ ప్రభుత్వం తీసుకువచ్చిన సస్పెన్షన్‌ను ఎత్తివేస్తున్నట్లుల ప్రకటించారు. ఇజ్రాయిల్‌పై గతేడాది అక్టోబరు 7నాటి దాడిలలో యుఎన్ సిబ్బంది కూడా కొంతమంది వున్నారని ఇజ్రాయిల్ ఆరోపణలు చేసిన నేపథ్యంలో యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎకు పలు దేశాల నిధులను అందచేయడాన్ని జనవరిలో నిలిపివేశాయి. అందులో బ్రిటన్ ఒకటి. అయితే ఇందుకు ఇజ్రాయిల్ ఎలాంటి సాక్ష్యాధారాలను చూపలేదని ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో జరిగిన స్వతంత్ర సమీక్ష పేర్కొంది. తటస్థంగా వ్యవహరించడంలో అత్యున్నత ప్రమాణాలను పాటిస్తామని సంస్థ తమకు హామీనిచ్చిందని లామీ తెలిపారు. గాజా ప్రజలు ఇటువంటి విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో మానవతా సాయం అందించడం నైతిక అవసరం, బాధ్యత అని లామీ వ్యాఖ్యానించారు. బ్రిటన్ అందచేసే సాయం కిందిస్థాయిలోని ప్రజలకు అందేలా చూసేది సహాయక సంస్థలేని అన్నారు. యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ ఒక్కటే ఇంత పెద్ద స్థాయిలో సహాయక చర్యలు చేపట్టగలదని, మరే సంస్థ ఇంతలా సేవలు అందించలేదని లామీ పేర్కొన్నారు. జపాన్, జర్మనీ, ఇటలీ, ఆస్ట్రేలియా, కెనడా సహా పలు దేశాలు ఐక్యరాజ్య సమితి సంస్థకు సాయాన్ని పునరుద్ధరించాయి. కానీ అతిపెద్ద మొత్తంలో సాయమందించే అమెరికా మాత్రం ఇంతవరకు పునరుద్ధరించలేదు.



వియత్నాం కమ్యూనిస్టు పార్టీ చీఫ్

ట్రాంగ్ కన్నుమూత



హనోయ్ : వియత్నాం కమ్యూనిస్టు పార్టీ చీఫ్, దేశంలోనే అత్యంత శక్తివంతమైన నేత గుయెన్ ఫూ ట్రాంగ్ (80) కన్ను మూశారని అధికార మీడియా శుక్రవారం ప్రకటించింది. ఆయన గత కొద్ది మాసాలుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. వృద్యాప్య సమస్యలతో బాధపడుతూ సెంట్రల్ మిలటరీ ఆస్పత్రిలో కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి ట్రాంగ్ మధ్యాహ్నం కన్నుమూశారని హాన్ డాన్ వార్తాపత్రిక పేర్కొంది. 2011లో పార్టీ చీఫ్‌గా ఎన్నికైనప్పటి నుండి వియత్నాం రాజకీయాల్లో క్రియాశీలంగా పనిచేశారు. వియత్నాం ఏక పార్టీ రాజకీయ వ్యవస్థలో కమ్యూనిస్టు పార్టీ అధికారాన్ని సంఘటితం చేయడానికి ఆయన కృషి చేశారు. మేలో కొత్త అధ్యక్షుడు నియమితులవడంతో దేశంలో రాజకీయ పరివర్తన చోటు చేసుకుంటున్న నేపథ్యంలో ట్రాంగ్ మృతి సంభవించింది. ప్రస్తుతానికి ట్రాంగ్ బాధ్యతలన్నీ దేశాధ్యక్షుడికి అప్పగించారు. ఈ పరిస్థితుల్లో పార్టీ నాయకత్వం, ప్రభుత్వ నిర్వహణ పట్ల సంపూర్ణ విశ్వాసాన్ని వుంచాల్సిందిగా పార్టీకి, ప్రజలకు, సైన్యానికి పొలిట్‌బ్యూరో పిలుపిచ్చింది. 2026లో పార్టీ మహాసభ జరిగేవరకు ట్రాంగ్ అనారోగ్యం దృష్ట్యా అధికారంలో కొనసాగలేరని ఇటీవల కాలంలో ఊహాగానాలు వెలువడ్డాయి. సాంకేతిక నిపుణుడైన ట్రాంగ్‌కు చైనాతో సత్సంబంధాలున్నాయి. దీనివల్ల దేశ ఆర్థికాభివృద్ధికి ప్రయోజనం చేకూరింది. ఫలితంగా ఆయన అధికారం, చట్టబద్ధత మరింత బలోపేతమైంది. అవినీతే అన్నింటికంటే అతిపెద్ద ముప్పు అని ఆయన అభిప్రాయపడేవారు. క్రమశిక్షణ లేని దేశం అస్థిరంగా, గందరగోళంగా తయారవుతుందని ఆయన వ్యాఖ్యానించేవారు.

సంపాదకీయం

"పకోడీలు... పంక్చర్ షాపులు"

కొన్ని సందర్భాలు విషయాన్ని కుండబద్దలు కొడతాయి. మరుగుపరచబడ్డ నిజాలను వెలుగులోకి తెస్తాయి. మంగళవారం ముంబై ఎయిర్‌పోర్టులో జరిగిన తొక్కిసలాట సరిగ్గా అలాంటి సందర్భమే. "ఎయిర్ ఇండియా ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్ లిమిటెడ్" చేపట్టిన లోడర్ ఉద్యోగాల భర్తీ కార్యక్రమం ఈ తొక్కిసలాటకు దారితీసింది. రెండువేల ఉద్యోగాల కోసం ఇరవై అయిదు వేలమంది రావడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఇలాంటి ఘటనలు ఈ దేశానికి కొత్తేమీకాదుగానీ, ఈ సందర్భంగా ఇంటర్వ్యూ కేంద్రం వద్దకు వేలాదిమంది ప్రాణాలకు తెగించి పరుగులు తీస్తున్న దృశ్యాలు.. సినిమా స్టంట్స్‌ను తలపిస్తూ వాహనాలపై నుంచి, చెట్లపై నుంచి అక్కడికి చేరుకోవడానికి ప్రయత్నిస్తున్న దృశ్యాలు.. ఈ దేశం ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్య తీవ్రతకు అద్దం పడుతున్నాయి.

ఈ ఘటనకు కేవలం కొద్దిరోజుల ముందు.. "మా ప్రభుత్వం దేశవ్యాప్తంగా గత మూడేండ్లలో ఎనిమిది కోట్ల ఉద్యోగాలు కల్పించి రికార్డు సృష్టించింది" అని ఇదే ముంబై వేదికగా ఈ దేశ ప్రధాని ప్రకటించారు. ఇది ఎంత పచ్చి అబద్ధమో ఈ ఘటన తేల్చి చెబుతోంది. ఏడాదికి రెండుకోట్ల ఉద్యోగాలిస్తామని అధికారంలో కొచ్చిందీ ప్రభుత్వం. ఆ లెక్కన ఈ పదేండ్లలో ఇరవైకోట్ల ఉద్యోగాలివ్వాలి. కానీ మన దేశంలో ప్రస్తుత నిరుద్యోగిత రేటు 9.2. గత నాలుగున్నర దశాబ్దాల కాలంలో ఏనాడూ ఈ స్థాయిలో నమోదు కాలేదు. 1991నాటి ఆర్థిక సంక్షోభం సమయంలో కూడా ఈ దుస్థితి లేదు. అందువల్ల, ఏలినవారి మాటల్లో నిజాలూ నీతీ నిజాయితీలూ వెతకడమంటే.. గొంగట్లో అన్నం తింటూ వెంట్రుకలేరుకోవడమేనని ఈ ఘటన మరోసారి రుజువు చేస్తోంది.



> కారల్ మార్క్స్ చెప్పినట్టు... "పెట్టుబడిదారీ వ్యవస్థలో ఆ వ్యవస్థ మనుగడ కోసమే నిరుద్యోగం నిరంతరం పెంచి పోషించబడుతుంది. నిరుద్యోగ సైన్యం సదా సిద్ధంగా ఉంటేనే శ్రమదోపిడీ యథేచ్ఛగా సాగుతుంది. అందుకే పెట్టుబడిదారీ విధానం ఉన్నంత కాలం నిరుద్యోగం ఉంటుంది." కాబట్టే తీరికలేని కార్పొరేట్ల సేవలో తరిస్తూ, యువతకు ఉద్యోగాలూ ఉపాధి కల్పన తమ బాధ్యత అనే సంగతే ఈ ప్రభుత్వాలు విస్మరించాయి.

నిజానికి ఈ లోడర్ ఉద్యోగాలకు కనీస విద్యార్హతలుంటే చాలు. కానీ దరఖాస్తు చేసుకున్న వారిలో అనేకులు పోస్ట్ గ్రాడ్యుయేట్లు, ఇంజనీర్లు, ఎంబీఏ చదువుకున్నవారు. అంత ఉన్నత చదువులు చదివి కూడా ఇంత చిన్న ఉద్యోగానికి పోటీపడుతున్నారంటే సమస్య తీవ్రత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రపంచంలోనే అధ్యధిక యువసంపత్తి కలిగిన దేశం మనది. ఏ దేశానికైనా ఇంతకు మించిన అద్భుత వనరేముంటుంది. కానీ ఇది నాణానికి ఒకవైపే. రెండోవైపున ఈ అపారమైన యువ సంపత్తి నిర్వీర్యమవుతోంది. పని చేయగలిగిన శక్తి ఉండి, చేయాలన్న కోరిక ఉండికూడా పని దొరకని దౌర్భాగ్యస్థితిని ఎదుర్కొంటోంది. చిత్రమేమి టంటే సమస్య తీవ్రత తెలిసి కూడా మన ప్రభుత్వాలు ఉద్యోగాల కల్పనకు పూనుకోవు. ఖాళీగా ఉన్న పోస్టులూ భర్తీ చేయవు. కనీసం రిటైరవుతున్న వారి స్థానంలోనైనా నియామకాలు చేపట్టవు. ఎందుకంటే... కారల్ మార్క్స్ చెప్పినట్టు... "పెట్టుబడిదారీ వ్యవస్థలో ఆ వ్యవస్థ మనుగడ కోసమే నిరుద్యోగం నిరంతరం పెంచి పోషించబడుతుంది. నిరుద్యోగ సైన్యం సదా సిద్ధంగా ఉంటేనే శ్రమదోపిడీ యథేచ్ఛగా సాగుతుంది. అందుకే పెట్టుబడిదారీ విధానం ఉన్నంత కాలం నిరుద్యోగం ఉంటుంది." కాబట్టే తీరికలేని కార్పొరేట్ల సేవలో తరిస్తూ, యువతకు ఉద్యోగాలూ ఉపాధి కల్పన తమ బాధ్యత అనే సంగతే ఈ ప్రభుత్వాలు విస్మరించాయి.

పార్టీ ఏదైనా, ప్రభుత్వమెవరిదైనా గత నలభై ఏండ్లుగా ఇదే తంతు. ఈ తంతులో ఘనత వహించిన ప్రస్తుత సర్కారు తీరేవేరు. దేశాన్ని దశాబ్దాలుగా పీడిస్తున్న సమస్యను పరిష్కరించకపోగా పరిహాసం చేయడం ఈ ప్రభుత్వ పెద్దలకు పరిపాటిగా మారింది. ఆదివారంనాడు మధ్యప్రదేశ్‌లో బీజేపీ ఎమ్మెల్యే పన్నాలాల్ షాక్యా చేసిన వ్యాఖ్యలు ఇందుకు తాజా ఉదాహరణ. "నేను అందరికీ విజ్ఞప్తి చేస్తున్నా... ఈ కాలేజీ డిగ్రీలతో ప్రయోజనమేమీ లేదు. వీటికి బదులు మోటార్ సైకిల్ పంక్చర్ షాపులు తెరవండి" అంటూ సాక్షాత్తూ అమిత్ షా గారి సమక్షంలో ఓ అధికారిక కార్యక్రమంలోనే సెలవిచ్చారాయన. ప్రతిష్టాత్మక "పీఎం కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్" ప్రారంభసభలో ఈ వ్యాఖ్యలు చోటుచేసుకోవడం గమనార్హం. అయినా పకోడీలు వేసుకోండని స్వయంగా ప్రధానితో సహా మంత్రులంతా చెపుతుంటే ఈయన పంక్చర్లు వేసుకోమనడంలో ఆశ్చర్యమేముంది!

ఇలాంటి సందర్భాల్లోనే.. "ఏలికలే ఈ తీరున ఉంటే ఇక దేశమేరీతిన బాగుపడుతుంది?" అన్న ప్రశ్న సమాజాన్ని కలవరపెడుతుంది. ఏడున్నర దశాబ్దాల స్వాతంత్ర్యం తరువాత కూడా ఏయే వర్గాలవారిని ఎలా బుదగిరిచ్చాలనే కుటిల పన్నాగాలతో పొద్దు పుచ్చడమే వీరి విధానంగా కొనసాగుతుండటం ఓ విషాదం. తాయిలాలు ప్రకటిస్తే ఓట్లు రాలతాయని భావనే తప్ప ప్రజల ఆకాంక్షలూ అవసరాల పట్టింపే వీరికుండదు. సంక్షేమం అన్నది తాత్కాలిక ఉపశమనమేగానీ అదే శాశ్వత పరిష్కారం కాదు. కుల, మత, జాతి భేదాలు లేకుండా అందరికీ చేతినిండా పని, పనికి తగ్గ ఫలితం లభించాలి. ప్రజలంతా ఆత్మగౌరవంతో జీవించే పరిస్థితులు నెలకొనాలి. ఇందుకు ఏ ప్రభుత్వానికైనా ఉద్యోగాల కల్పన ఓ కీలకమైన కర్తవ్యం. ఇందుకోసం దీర్ఘకాలిక వ్యూహంతో కూడిన సమగ్రాభివృద్ధి విధానం అవసరం. దీన్ని మన ప్రభుత్వాలూ పౌరసమాజమూ గుర్తించనంతకాలం నిరుద్యోగం ఓ జవాబులేని ప్రశ్నగానే మిగిలిపోతుంది.

'రానున్నది ఏది నిజం? అది ఒకటే! సోషలిజం' : దాశరథి


మోతుకూరు నరహరి
8464980540

దాశరథి (కృష్ణమాచార్యులు 1927-1987) పేరు వినగానే మనకు అందరికీ జ్ఞాపకం వచ్చేవి "ఓ నిజాము పిశాచమా!" అనే ఆయన ధిక్కార స్వరం, "నా తెలంగాణ కోటి రత్నాల వీణ!" అనే తెలంగాణా గౌరవాన్ని, ఘనతను గూర్చి ఎత్తిన ఆయన గళంలోంచి వచ్చిన కవితా పంక్తులు.దాశరథి గారు అంతటితోనే ఆగిపోలేదు."ఆస్మాన్ గిర్ నా- మై మర్ నా (ఆకాశం పడిపోతేనే నేను చనిపోతాను /గద్దె దిగుతాను" అని నిజాం నవాబు ఏనుగులా ఘీంకరిస్తే

దాశరథి
"దిగిపొమ్మని దిగిపొమ్మని"
ఇదే మాట అనేస్తాను...
ఇదే మాట ఇదే మాట
పదేపదే అనేస్తాను...
దగాకోరు బటాచోరు
రజాకారు పోషకుడవు

ఊళ్ళకూళ్ళకగ్గిపెట్టి/ఇళ్ళన్నీ కొల్లగొట్టి/తల్లి పిల్ల కడుపు కొట్టి/నిక్కిన దుర్మార్గమంత/నీ బాధ్యత నీ బాధ్యత...

'దిగిపొమ్మని జగత్తంత/నగారాలు కొడుతున్నది/దిగిపోవోయ్ .. దిగిపోవోయ్.." అని సింహంలా గర్జించి, నిజాముకు చెమటలు పట్టించాడు.

మహబూబాబాద్‌కు దగ్గరలో ఉన్న చిన్నగూడురులో అత్యంత సాంప్రదాయ కుటుంబంలో జన్మించిన దాశరథి తిరుగుబాటుకవిగా విప్లవ గొంతును వినిపించారు. ఉర్దూ, సంస్కృతం, ఆంగ్లం, పార్సీ, హిందీ,తెలుగు భాషలలో ప్రావీణ్యం పొంది జాతీయ స్థాయికి ఎదిగారు. ఆనాడు కుటుంబంతో పాటుగా ఖమ్మం జిల్లాలోని గార్లకు చేరుకున్నాక, ఆంధ్ర మహాసభ సమావేశాలకు హాజరయ్యారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం సాగిస్తున్న కమ్యూనిస్టు సమావేశాల్లోనూ పాల్గొని చైతన్యాన్ని నింపుకున్నారు. నిర్బంధాలు, జైళ్లు, లాఠీదెబ్బలు ఎదురైనా జడవక స్వేచ్ఛకోసం కలాన్ని గళాన్ని ఎక్కుపెట్టారు. తెలంగాణ వీరత్వాన్ని చాటిచెప్పారు.

నిజాం నవాబు, ఆయన తాబేదారుల దుర్మార్గాలను ఎదుర్కొని-
"తెలగాణమ్మున గడ్డిపోచయును సం-ధించెన్ కృపాణమ్ము రా
జలలాముండను వాని
పీచమడచన్ సాగించె యుద్ధమ్ము ..",
"పోరు సల్పిరి వీరాధి వీరులట్లు
భరత వైజయంతి కల స్థాపనమొనర్ప
నెత్తురులు ధారవోసిరి నీళ్ల వోలె
మానితులు నీ సుతుల్ తెలంగాణ తల్లి" -అని పోరాట యోధులను ప్రస్తుతించాడు.

నిజామును ధిక్కరించినందుకు నిజామాబాదు జైలు జీవితాన్ని గడిపిన దాశరథి అక్కడి తన అనుభవాలను 'ఇందుపుర దుర్గము', 'జైల్లో' కవితలలో వివరించారు. 'జైల్లో' నే "నిరుపేదవాని నెత్తురు చుక్కలోనెన్ని-విప్లవాలో!యని వెదకినాను" అన్నారు.

స్వతంత్ర భారతదేశంలో హైదరాబాద్ సంస్థానం విలీనం కావలసిన అవసరాన్ని ఉద్ఘాటిస్తూ
"చుట్టూ సముద్రం పొంగి/నట్ట నడిగడ్డను మ్రింగి/ అంతా ఏకం చేస్తుందంతా ఒకటౌతుంది. ./నడిగడ్డను సముద్రాన
పడకుండా కాపాడే/ బడాయి నీకెందుకు రాజా?
లడాయి నీకెందుకు?" అని నిజామును గద్దించాడు

పాలకుల దుర్మార్గాల వల్ల కలిగిన కోపంతో "నా గీతావళి ఎంత దూరము ప్రయా-ణంబౌనో అందాక ఈ భూగోళమ్మునకగ్గి వెట్టెదను..", అనడంతోనే సరి పెట్టుకోక, పేదల పక్షం వహించి:"వీణియతీగపై పదను-పెట్టిన నా కరవాల ధారతోగానము నాలపించెద../
పీడిత ప్రజా-వాణికి మైక్ అమర్చి అభ-వాదులకున్ వినిపింపజేసెదన్" అని ప్రతిజ్ఞ చేశారు దాశరథి

క్రూర నిరంకు శత్వానికి వ్యతిరేకంగా తన కలాన్ని ఝళిపించి, నడిపించడంతో ప్రజా కవితా ఉద్యమానికి శ్రీకారం చుట్టిన దాశరథి అగ్నిధార, రుద్రవీణ కవితల సంపుటాల మొదటి ముద్రణలు 1949, 1951లో జరిగాయి. ఆ క్రమంలో వారు పుంఖానుపుంఖంగా రచించిన ఛందోబద్ధమైన పద్యాలు, గేయాలు,లలిత గీతాలతో కూడిన సంపుటాలు మహాంధ్రోదయం,పునర్నవం, అమృతాభిషేకం,కవితా పుష్పకం,నవమి,నవ మంజరి,దాశరథీ శతకం,గాలిబ్ గీతాలు(అనువాదం), జ్వాలా లేఖిని,ఆలోచనాలోచనాలు, తిమిరంతో సమరం-వంటివి వెలువడి తెలుగు పాఠకులను ఉత్తేజితులను,ఉద్యమోన్ముఖులను చేశాయి.ఈ అన్ని సంపుటాలలోను ఉన్న అంతస్సూత్రం పేదల పట్ల పక్షపాతం,వారి పక్షాన పాలకులతో పోరాడడమే.అందుకే ఆయన 'నా పేరు ప్రజా కోటి' అన్నారు.

"అనాదిగా సాగుతోంది సంగ్రామం అనాథుడికీ ఆగర్భ శ్రీమంతుడికీ మధ్య"
అనే చారిత్రక వాస్తవాన్ని చెప్పి 'దీన పరాధీన జాతి' ని మేలుకొలిపాడు
"మనం వెనక్కి నడవం/జనం వెనక్కి నడవదు/మనం,జనం-జనం మనం/జనం లేంది మనం లేము"అని
'నవభారత యువకులారా!'
అని యువత కర్తవ్యాన్ని నిర్దేశించాడు
"ఒక రాజును గెలిపించుటలో ఒరిగిన నర కంఠాలెన్నో?" అని ఆవేదన పడడమే కాక,
"కరువంటూ కాటకమంటూ కానరాని కాలాలెపుడో?
అన్నార్తులు అనాథలుండని
ఆ నవయుగమదెంత దూరమో?"-
అంటూ దోపిడీ లేని, సమాజాన్ని కోరుకున్నాడు.

తెలంగాణ పౌరుషాన్ని చాటడంతోపాటు ఈ గడ్డ ఆత్మీయతను,లాలిత్యాన్ని మాతృత్వాన్ని వర్ణిస్తూ-
'నా తెలంగాణ తల్లి
కంజాత వల్లి,
నా తెలంగాణ కోటి
అందాల జాణ
నా తెలంగాణ లేమ
సౌందర్య సీమ.."
అన్నారు.

మహాంధ్రోదయం కవితా సంపుటిని దాశరథి సుప్రసిద్ధ 'గోలకొండ పత్రిక', 'గోలకొండ కవుల సంచిక' ల సంపాదకులు, 'రామాయణ విశేషములు', 'ఆంధ్రుల సంస్కృతి-'చరిత్ర' వంటి అనేక పరిశోధనాత్మక గ్రంథాలను రచించిన సురవరం ప్రతాపరెడ్డికి అంకితం చేశారు. హైదరాబాదు రాష్ట్రపు మొదటి,చివరి ముఖ్యమంత్రి అయిన డాక్టర్ బూర్గుల రామకృష్ణారావు ఈ సంపుటికి పీఠికను రాయడం విశేషం.

దాశరథి 'జయ భారతీ' కవితలో తన దేశభక్తిని పారవశ్యంతో వర్ణించారు.
"జండా ఒక్కటె మూడు వన్నెలది దే-శంబొక్కటే భారతా-ఖండా సేతు హిమాచ లోర్వర కవీ-కాండమ్ము లోనన్ రవీంద్రుండొక్కండె కవీంద్రు-దూర్జిత జగత్ యుద్ధాలలో /శాంతికో-దండోద్యద్విజ యుండు గాంధి ఒకడే-తల్లీ మహా భారతీ"
"దున్నే వాడిదే భూమి"అన్న నినాదంతో దిక్కులు పిక్కటిల్లుతున్నప్పుడు
"ఈ భూమి మీది-/ఈ సీమ మీది-కథల కండి వదలకండి.."అని రైతులకు 'సుప్రభాతం' పాడారు .మనకు తిండి పెట్టే రైతు గురించి కూడా కవిత రాశారు. "అమృత మొలికించినావు నీ హలములోన హాలికా! వేనవేల దండాలు నీకు"

"వేదను వేదను
దేవుళ్లను దయ్యాలను"



> క్రూర నిరంకుశత్వానికి వ్యతిరేకంగా తన కలాన్ని ఝళిపించి, నడిపించడంతో ప్రజా కవితా ఉద్యమానికి శ్రీకారం చుట్టిన దాశరథి అగ్నిధార, రుద్రవీణ కవితల సంపుటాల మొదటి ముద్రణలు 1949,1951లో జరిగాయి.ఆ క్రమంలో వారు పుంఖానుపుంఖంగా రచించిన ఛందోబద్ధమైన పద్యాలు, గేయాలు,లలిత గీతాలతో కూడిన సంపుటాలు మహాంధ్రోదయం,పునర్నవం, అమృతాభిషేకం,కవితా పుష్పకం,నవమి,నవ మంజరి,దాశరథీ శతకం,గాలిబ్ గీతాలు(అనువాదం), జ్వాలా లేఖిని,ఆలోచనాలోచనాలు, తిమిరంతో సమరం-వంటివి వెలువడి తెలుగు పాఠకులను ఉత్తేజితులను, ఉద్యమోన్ముఖులను చేశాయి. ఈ అన్ని సంపుటాలలోను ఉన్న అంతస్సూత్రం పేదల పట్ల పక్షపాతం,వారి పక్షాన పాలకులతో పోరాడడమే.అందుకే ఆయన 'నా పేరు ప్రజా కోటి' అన్నారు.

అనడంతో పాటు,
'నిరుపేదా!' కవితలో
"బ్రహ్మరాతయని
భ్రమ పొందిన,
ధోకా చెందిన నిరుపేదా!"
అని అదఅష్టం, దేవుళ్ళ పేరుతో జరిగే మోసాలను ఎండగట్టారు.
"మతములబద్ధముల్ కులము-మాటలు వట్టివి.."
అని తన హేతువాద దృక్పథాన్ని ఎలుగెత్తి చాటారు.వేల ఎకరాల భూమిని సస్యశ్యామలం చేసిన నిజాంసాగర్ జలాశయానికి ఆధారమైన 'మంజీర' ను ప్రస్తుతిస్తూ కవిత రాశారు.
"ఎవరి గజ్జెల నాట్య రవళివే
మంజీర?
ఎవరి కజ్జల భాష్ప ధారవే
మంజీర?."
దాశరథికి శత్రువులపై గర్జించడమే కాదు- పసిపిల్లలను గారాబం చేయడమూ తెలుసు.

అందుకే ఆయన 'బాల్యం' కవితను రాశారు
"పసిపాపల నిదుర కనులలో- ముసిరిన భవితవ్యం ఎంతో?" అని ఆవేదనపడ్డారు
'ఆ చల్లని సముద్ర గర్భం దాచిన బడబానలమెంతో, ఆ నల్లని ఆకాశంలో కానరాని భాస్కరులెందరో..' అనే గీతం ఇప్పటికీ శాస్త్రీయ ఆలోచన గల, ప్రజాఉద్యమ కార్యకర్తలందరికీ ప్రార్థనా గీతంలా నిత్యం మారుమోగుతూనే ఉన్నది.

30జనవరి1948 గాంధీజీ హత్య జరిగిన నాడు నిజామాబాద్ జైలులో ఉన్న దాశరథి గాంధీజీకి శ్రద్ధాంజలి ఘటిస్తూ 'క్షమామూర్తి' కవితను రాశారు.
"మతముల గుద్దులాటలను-
మాన్పు ప్రతిజ్ఞలతో ప్రజా సమే
కతకయి ప్రాణమొడ్డిన
మహాత్ముడ వీవు.." అని ప్రస్తుతించారు.

మహాకవి రవీంద్రనాథ్ ఠాగూర్, మొగల్ సామ్రాజ్యపు చివరి చక్రవర్తి,1857లో జరిగిన భారత ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామానికి లాంఛనంగా నైనా నాయకత్వం వహించిన బహదూర్ షా ఫర్, ప్రసిద్ధ కవి మీర్ కవితలను, అనువదించారు. దాశరథి గారి సినిమా గీతాలు కూడా లలిత లలితంగా సాగి శ్రోతలను ఆకట్టుకుంటున్నాయి. ప్రళయాన్ని-ప్రణయాన్ని, అంగారాన్ని-సింగారాన్ని తమ కవితలలో పలికించిన మగ్దుం మొహియుద్దీన్,కైఫీ ఆజ్మీ,ఫైజ్ అహమద్ ఫైజ్ వంటి వారి సరసన దాశరథి కూడా చేరారు.

"రమ్మంటే చాలు కానీ-రాజ్యాలు విడిచి రానా?", "మేటి విలుకాండ్రు చచ్చిరి బోటి చూపు-తూపు ముక్కున గల విషలేపమునకు", ఆమె చెంతకేగు హక్కెవ్వ డిచ్చెనో? గాలి ఆమె పరిమళములు పీల్చె" అనడమే కాక,'వాణి నా రాణి' అని పిల్లలమర్రి పిన వీరభద్రుడు అన్నట్టుగా

'నేను స్వయముగా కవితన్ వరింపలేదు-తానె వరియించె కైతల రాణి నన్ను" అని గాలిబ్‌ను అనువదించారు.ఇవన్నీ ఒక ఎత్తు. దోపిడీ, పీడన,అసమానతల నుండి ప్రజలను విముక్తి చేసే సోషలిజాన్ని సాధించడం మరొక ఎత్తు.

అది మాత్రమే ప్రజల సర్వాంగీణ వికాసానికి, సుఖ సంతోషాలకు రాచబాటను వేస్తుంది.'కుల మతాల సుడిగుండాల..' నుంచి వారిని బయటికి తీసి,ఆప్యాయతలను, అనురాగాలను పెంచుతుంది, పంచుతుంది.

అందుకే దాశరథి -
"రానున్నది ఏది నిజం?
అది ఒకటే సోషలిజం.
కలపండోయ్ భుజం భుజం
కదలండోయ్ గజం గజం...
అడుగడుగున యెడద నెత్రు
మడుగులుగా విడవండోయ్ ఉదయాకాశ పతాకం
యెదలో కదలాడె నేడు
హృదయావేశ తటాకం
నదిలా పొరలాడె నేడు
రానున్నది ఏది నిజం?
అది ఒకటే సోషలిజం"

అని నిర్ద్వంద్వంగా ప్రకటించిన,ప్రగాఢంగా విశ్వసించిన, కోరుకున్న మహాకవి దాశరథికి కైమోడ్పు?? వారి శతాబ్ది ఉత్సవాలను జరుపుకోబోతున్న మనం ఆయన ఆశయాలను,ఆకాంక్షలను నిరంతరం మననం చేసుకుంటూ, ప్రచారం చేస్తూ, ఆయన కన్న కలలను సాకారం చేయడానికి కంకణబద్ధులం అవుదాం.

(జులై 22 నుంచి దాశరథి శత జయంతి ఆరంభం)


లాకర్ లేదు...

అమ్మ ఓర్పు నాన్న కరుణ
రాలి పద్దాను లోకంలోకీ
మద్దతు ధర లేకుండానే
పంట పండింది పేద ఇంటిలో

బాగుపడాలి అని
బడికి పంపారు పస్తులుండి
మాష్టారు కన్నా
మానేరు నేర్పింది ఎక్కువ
ఎండిన నాడు ఎవరూ రారని

శాఖ గ్రంథాలయమే
దేవాలయం నాకు ఎప్పటికీ
ఎర్ర పుస్తకాలే
గుండె నిండా విశ్వాసం నింపి
చచ్చేంత ధైర్యం దట్టించేవి
కాలేజ్ మాత్రం
ఒక కాగితం చేతిలో
పెట్టింది జాలిగా

సంపాదించడం సమస్య కాదు
బానిస బతుక్కు
అలవాటు కావాలి అంతే
తోటి వారిని తోసేయడం



తెలియనట్లు తొక్కడం
అలవాటు కాక
వెనకబడిపోతూనే ఉన్నా ఇప్పటికీ

స్వేచ్ఛగా సావనీయరు కదా
తోడని నీడని కొంగుముడి వేసారు
మూన్ స్టార్స్ కనబడ్డాయి
కానీ హనీ ఎప్పుడూ దొరకలే....
సంసారం సాకటం కన్నా
సముద్రము తోడటం మిన్నా

కొడుకుకు పంచింది ఎంతో
మనుమనుకి దాచినది లేదా
ముసలితనానికి మిగిలింది ఉందా
పిండం పెట్టడానికి కూడా
పక్కకు పెట్టాలనే కొత్త షరతు

జీవితం ఎక్కువే ఇచ్చింది
దాచుకునేందుకు సొంతంగా
లాకర్ లేకుండా పోయింది
అనుభవాలన్నీ నాతోనే గోతిలోకి....

- దాసరి మోహన్
9985309080

యువత 'మత్తు' వదలాలి...


ఆనగంటి వెంకటేష్
9705030888

దేశ భవిష్యత్, అభివృద్ధి యువతపై ఆధారపడి ఉంది. దేశం వివిధ రంగాల్లో రాణించాలంటే యువత మేధస్సు,నైపుణ్యం అవసరం. దేశం ఔన్నత్యాన్ని నిలబెట్టగల శక్తి సామర్థ్యాలు యువత సొంతం. మార్పు రావాల్సింది యువతలో, మార్పు తేవాల్సింది కూడా యువతే. కానీ నేటి యువత తమ కర్తవ్యాన్ని విస్మరించి మత్తులో తేలియాడి జ్ఞానాన్ని, విచక్షణను,శక్తిసామర్థ్యాలను కోల్పోయి నిర్వీర్యమై, నిస్తేజంగా మారుతున్నారు గంజాయి,డ్రగ్స్ లాంటి మాదక ద్రవ్యాల వినియోగం వలన యువశక్తి పెడదారి పడుతున్నది. యువతను మత్తులో ముంచి చిత్తు చేసే గంజాయి, డ్రగ్స్ అక్రమ వినియోగానికి అడ్డుకట్టవేసేందు చేస్తున్న కృషి ఫలించడం లేదు. ఇంకా పకడ్బందీగా చర్యలకు తెగబడాల్సిన అవసరం కనిపిస్తున్నది. ఎందుకంటే సకల అనర్థాలకు అరాచకాలకు హత్యలకు ప్రేరణగా నిలిచే గంజాయి డ్రగ్స్ వాడకం వంటి మత్తు వ్యసనాలను దూరం చేయకుండా సమాజం బాగుపడదు. ఇది నగరాలు, పట్టణాలే కాదు మారుమూల గ్రామాలకు వ్యాప్తి చెందడం అత్యంత ఆందోళన కలిగించే విషయం. మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వలన కలిగే విపరీత పరిణామాలను అవగతం చేసుకున్న అంతర్జాతీయ సమాజం డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాడాలని నిర్ణయించుకున్నప్పటికీ, డ్రగ్స్ మహమ్మారి ఇంకా విస్తృతంగా వ్యాప్తి చెందుతున్నదే తప్ప, సమిసిపోవడం లేదు. 1987వ సంవత్సరంలో వియన్నాలో అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక సదస్సు నిర్వహించారు. ప్రపంచంలోని అన్నిదేశాలు డ్రగ్స్ మహమ్మారిని అరికట్టడానికి తమ వంతు ప్రయత్నాలు చేస్తూ చట్టాలకు పదును పెడుతున్నాయి. 1987లో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ డ్రగ్స్ లేని అంతర్జాతీయ సమాజానికై పిలుపునిచ్చింది.

తాగుడు వ్యసనంతో పాటు డ్రగ్స్ వ్యసనం కూడా సమాంతరంగా అభివృద్ధి చెందుతున్నది. మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే దుష్పరిణామాల వలన వివిధ దేశాల ప్రభుత్వాలు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా సుమారు 200 మిలియన్ల మందికి పైగా డ్రగ్స్‌కు బానిసలని కొకైన్, మార్జువానా, మార్ఫిన్, చరస్, హెరాయిన్ వంటి మాదకద్రవ్యాలు విచ్చలవిడిగా వినియోగించడం జరుగుతున్నదని గణాంకాలు తెలియచేస్తున్నాయి. ఇతర దేశాల విషయం పక్కన బెడితే భారత ప్రభుత్వం 1985లోనే మాదక ద్రవ్యాల వ్యతిరేక చట్టం "ఎన్.డి.పి.ఎస్" తీసుకురావడం, తర్వాత పలు సవరణలతో ఈ చట్టాన్ని పటిష్టం చేసింది.ఈ డ్రగ్స్‌కు అలవాటు పడిన వారికి మానవ ప్రపంచంతో సంబంధాలుండవు. మంచి-చెడు విచక్షణ కనిపించదు. స్వప్నలోకాల్లో విహరిస్తూ, మత్తు వదలిన తర్వాత అనేక శారీరక, మానసిక బలహీనతలకు గురై, మళ్లీ అదే మత్తుకోసం చేయకూడని ఆకృత్యాలన్నీ చేస్తారు. డ్రగ్స్ మాఫియా వలలో చిక్కి, డ్రగ్స్ అక్రమ వినియోగానికి, చట్టవిరుద్ధమైన డ్రగ్స్ రవాణాకు పాల్పడతారు.

తెలుగు రాష్ట్రాల్లో లక్షల కోట్ల విలువైన 25 వేల కిలోల మాదక ద్రవ్యాలు విశాఖ పోర్టుకు దిగుమతయ్యాయి. కాకినాడకు ఆక్వా ఎక్స్‌పోర్టు సంస్థకు సరఫరా అవుతున్నట్లు



సిబిఐ గుర్తించింది. హైదరాబాద్ శివార్లలో రసాయనాల తయారీ ముసుగులో మాదక ద్రవ్యాల తయారీ గుట్టుగా సాగుతుంది. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పోర్టులను, ఎయిర్‌పోర్టులను ప్రయివేట్ పరం చేసిన తర్వాత డ్రగ్స్ అక్రమ రవాణాకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఆదానీకి చెందిన ముంద్రా పోర్టులో రూ.3వేల కోట్ల డ్రగ్స్ పట్టుబడింది. కేవలం సంఘటనలు జరిగినపుడు ప్రభుత్వాలు అధికార యంత్రాంగం హడావిడి చేస్తున్నారే తప్పా నిరంతర నిఘా కొరవడింది. యాంటి నార్కోటిక్స్ బ్యూరోని బలోపేతం చేసి మాదక ద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రచారం జరుగుతున్నా, డ్రగ్స్ వినియోగం తగ్గడం లేదు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం కఠిన చట్టాలను అమలు చేయాలి. అదేవిధంగా అక్రమ రవాణాను అడ్డుకోవాలి.

రాష్ట్రంలోనూ గంజాయి,డ్రగ్స్ దందా విస్తరిస్తున్నది. బడిపిల్లల నుండి వర్సిటీ స్టూడెంట్స్ దాకా రోజు కూలీ నుంచి సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల వరకు ముఖ్యంగా సినీ ప్రముఖలు, వ్యాపారవేత్తలు ఈ మత్తు మహమ్మారికి బానిసలౌతున్నారు. సామాజిక న్యాయం, సాధికారతపై ఏర్పాటయిన పార్లమెంటరీ స్థాయి నివేదిక ప్రకారం రాష్ట్రంలో 29 లక్షల మంది మత్తుపదార్థాలు సేవిస్తున్నారని తెలిపింది. గంజాయి కొనడానికి డబ్బుల్విలేదని కన్నవారినే కడతేర్చిన ఉదంతాలు ఎన్నో ఉన్నాయి. గంజాయి దొరకడం లేదని, గంజాయికి, డ్రగ్స్ కి బానిసలై మత్తు నుంచి బయటపడలేక ప్రాణాలు తీసుకుంటున్నారు. మధ్యతరగతి ప్రజానీకమే లక్ష్యంగా పోలీసుల కన్నుగప్పి అంతరపంటగా గంజాయిని సాగుచేయడం దాన్ని యువతరానికి అలవాటు చేసి, ఆ తర్వాత మత్తు పదార్థాలకు బానిసలను చేస్తున్నారు.ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కౌన్సిలింగ్ నిర్వహించాలి. విద్యా సంస్థల్లో అవగాహనా సదస్సులు పెట్టాలి. విద్యా సంస్థల దగ్గర ఉండే చిన్న చిన్న దుకాణదారులకు సైతం డ్రగ్, గంజాయి అమ్మితే కఠిన చర్యలు

> కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పోర్టులను, ఎయిర్‌పోర్టులను ప్రయివేట్ పరం చేసిన తర్వాత డ్రగ్స్ అక్రమ రవాణాకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఆదానీకి చెందిన ముంద్రా పోర్టులో రూ.3వేల కోట్ల డ్రగ్స్ పట్టుబడింది. కేవలం సంఘటనలు జరిగినపుడు ప్రభుత్వాలు అధికార యంత్రాంగం హడావిడి చేస్తున్నారే తప్పా నిరంతర నిఘా కొరవడింది. యాంటి నార్కోటిక్స్ బ్యూరోని బలోపేతం చేసి మాదక ద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రచారం జరుగుతున్నా, డ్రగ్స్ వినియోగం తగ్గడం లేదు.

ఉంటాయని హెచ్చరించాలి. బస్తీలల్లో, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. యాంటీ డ్రగ్స్ కమిటీలు ఏర్పాటు చేయాలి. ఈ పరిస్థితులు మారాలి, ప్రజల్లో మార్పు రావాలి. మత్తులో తూలుతున్న యువతను ఆ మత్తు నుండి బయటకు తీసుకురావాలి. అనేక అనర్థాలకు, సమాజంలో చోటుచేసుకుంటున్న అరాచకాలకు, అమానుషత్వ ధోరణులకు "మత్తు" ప్రధాన కారణంగా అనేక సర్వేలు సూచిస్తున్నాయి. ఆధునిక ప్రపంచంలో మాదక ద్రవ్యాల ప్రభావం గురించి ప్రత్యేకంగా విశ్లేషించనక్కరలేదు. మానసిక ప్రవర్తనలో విపరీతమైన ధోరణులను ప్రేరేపించి, అరాచకత్వానికి నాంది పలుకుతున్న డ్రగ్స్‌ను యువత నుండి దూరం చేయాలి. డ్రగ్స్ లేని సమాజాన్ని రూపొందించడానికి అంతర్జాతీయ సమాజం మరింత కృషి చేయాలి. డ్రగ్స్ మహమ్మారిని పారదోలి వివేకవంతమైన సమాజ స్థాపనకు ప్రతీ ఒక్కరూ నడుం బిగించాలి. ఖండాంతరాలకు విస్తరించిన డ్రగ్స్ దందాను అరికట్టాలి. నగరాలను దాటి, పల్లెల్లోకి ప్రవేశించిన డ్రగ్స్,గంజాయి మహమ్మారిని కూకటివేళ్లతో పెకిలించాలి. ■

ఇంటిగ్రేటెడ్ గురుకులాలకు భూములను గుర్తించండి

సీఎస్ శాంతి కుమారి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ పాఠశాలల ఏర్పాటు కోసం భూముల గుర్తించాలని సీఎస్ శాంతికుమారి ఉన్నతాధికారులను ఆదేశించారు. భూములతో పాటు మౌలిక సదుపాయాల కోసం తీసుకోవాల్సిన చర్యలపై హైదరాబాద్‌లోని సచివాలయంలో వివిధ సంక్షేమ శాఖల ఉన్నతాధికారులతో ఆమె సమీక్షించారు. సీఎం దార్శనికత మేరకు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలనీ, వాటిలో విశాలమైన తరగతి గదులు, ఆట స్థలాలు, తల్లిదండ్రులు తమ పిల్లలను కలవడానికి ప్రత్యేక గది మొదలైనవి ఉండాలని సూచించారు. ఈ భవనాలన్నింటికీ ఏకరీతి డిజైన్‌ను వారంలోగా సిద్ధం చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. పనుల పురోగతిని పర్యవేక్షించేందుకు ప్రభుత్వ సలహాదారుతో కూడిన కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రిన్సిపల్ సెక్రటరీ సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఈ ప్రాజెక్ట్‌కి నోడల్ ఆఫీసర్‌గా, ఇతర సంక్షేమ శాఖల కార్యదర్శులు సభ్యులుగా ఉంటారని తెలిపారు. 49 రెసిడెన్షియల్ వెల్ఫేర్ పాఠశాలలకు ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయనీ, అందులో ఎనిమిది పాఠశాలలు ఈ ఏడాది గ్రౌండింగ్‌కు సిద్ధంగా ఉన్నాయని అధికారులు ఈ సందర్భంగా సీఎస్‌కు తెలిపారు. 31 రెసిడెన్షియల్ వెల్ఫేర్ పాఠశాలలకు ఇప్పటికే జిల్లా కలెక్టర్లు భూమిని గుర్తించగా, మిగిలిన 10 పాఠశాలలకు గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు వివరించారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు శ్రీనివాస రాజు, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, ఎస్సీ అభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి శ్రీధర్, టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ కార్యదర్శి అలుగు వర్షిణి, మైనార్టీ సంక్షేమ శాఖ కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్ ఇతర అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

వీఆర్ఎస్ బాటలో జయేశ్ రంజన్?

ఏపీ ప్రభుత్వంలో కీలక పదవి కోసమేనా!

- పదేండ్లుగా పరిశ్రమలు, ఐటీ శాఖలో కీలక బాధ్యతలు
- కేటీఆర్ అవినీతిపై విచారణంటూ ప్రచారంతోనేనా?

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణలో పదేండ్ల నుంచి పరిశ్రమలు, ఐటీ శాఖ ముఖ్య, ప్రత్యేక కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్న సీనియర్ ఐఏఎస్ అధికారి జయేశ్ రంజన్ త్వరలో స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకోబోతున్నట్టు ప్రచారం ఊపందుకున్నది. 1992 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయనకు వాస్తవానికి మరో మూడేండ్ల పాటు (2027 సెప్టెంబర్ వరకు) సర్వీసు ఉంది. 2014-23 కాలంలో తెలంగాణకు అనేక బహుళ జాతి సంస్థలను ఆకర్షించటంలో రంజన్ కీలక పాత్ర పోషించారు. గత కేసీఆర్ సర్కార్ హయాంలో పరిశ్రమల శాఖలో జరిగిన అవకతవకలపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం విచారణ జరుపబోతున్నదనీ, అందులో మాజీ మంత్రి కేటీఆర్‌తో పాటు జయేశ్ రంజన్ పాత్ర కూడా ఉందని నిరూపణయ్యే అవకాశముందని ప్రచారం జరుగుతున్నది. ఈ నేపథ్యంలోనే ఆయన వీఆర్ఎస్ వైపు మొగ్గు చూపుతున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. దీనికి తోడు ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పడిన ఎన్డీఏ ప్రభుత్వం ఆయన్ను పరిశ్రమల అధిపతిగా నియమించుకోవాలని భావించింది. అయితే, సర్వీసు నిబంధనల ప్రకారం ఆయన పొరుగు రాష్ట్రానికి డిప్యుటేషన్‌పై వెళ్లే అవకాశం లేదు. దీంతో రంజన్ స్వచ్ఛంద పదవీ విరమణ చేయాలని సిద్ధపడుతున్నట్టు తెలిసింది. జయేశ్ రంజన్ పదేండ్ల అనుభవాన్ని వాడుకోవాలని ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ దృఢ సంకల్పంతో ఉన్నారు. ఇదే విషయాన్ని ఏపీ ఐఏఎస్ అధికారుల వద్ద బాబు ప్రస్తావించగా..రంజన్ కింద పనిచేసేందుకు వారు విముఖత వ్యక్తం చేస్తున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో ఆయన నియామకం కాస్త సందిగ్ధంలో పడింది. అయినా, ఆయన సేవలను ఎలాగైనా వినియోగించుకోవాలని మంత్రి లోకేశ్ పట్టుదలగా ఉన్నారనీ, హైదరాబాద్ కేంద్రంగానే ఆయనతో పనిచేయంచుకోవాలనే ఆలోచనతో ఉన్నారని తెలిసింది. అయితే, ఆయన్ను ఏ హోదాలో నియమిస్తారనే దానిపై ఇంకా స్పష్టత లేదు. రంజన్ స్వచ్ఛంద పదవీ విరమణ ప్రక్రియ పూర్తికాగానే ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం కీలక బాధ్యతలు కట్టబెట్టే అవకాశముంది.

చిరంజీవి, పవన్‌కు రైతుల కష్టాలు పట్టవా?

- రైతు వ్యతిరేక బీజేపీకి ఎలా మద్దతు ఇస్తారు?: టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు జగ్గారెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రైతులకు నష్టం జరుగుతుంటూ సినిమా తీసిన చిరంజీవి...నల్ల చట్టాలకు వ్యతిరేకంగా అన్నదాతలు ఢిల్లీలో ధర్నా చేసే వారికి మద్దతు ఎందుకివ్వలేదని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు జగ్గారెడ్డి సినీ నటులు చిరంజీవి, పవన్ కళ్యాణ్‌ను ప్రశ్నించారు. పవన్, చిరంజీవి ఇద్దరూ బీజేపీకి ఎందుకు మద్దతిస్తున్నారని నిలదీశారు. రైతుల కష్టాలపై సినిమాలు తీసి కోట్లు సంపాదిస్తున్నారే తప్ప రైతుల కష్టాలను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. రైతుల పేరుతో సినిమా తీసి డబ్బులు సంపాదించి, మోడీకి మద్దతివ్వడం ఎంతవరకు సబబు? అని నిలదీశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి రైతు రుణమాఫీ చేయడంతో బీజేపీ, బీఆర్ఎస్ నేతలకు రాత్రి నిద్ర పట్టకపోవచ్చునన్నారు. ఆగస్టు15లోపు రూ.2 లక్షల మాఫీ అయిపోతుందని తెలిపారు. పదేండ్లలో మాజీ సీఎం కేసీఆర్ రూ.7 లక్షల కోట్ల అప్పులు చేసి రైతులకు ఇచ్చింది రూ.26 వేల కోట్లేనని తేల్చి చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు నెలల్లో రైతులకు ఇచ్చింది మాత్రం రూ.31వేల కోట్లు అని వివరించారు. ఇంకా నాలుగున్నర ఏండ్ల సమయం ఉన్నా ఆరు నెలల్లోనే ఇచ్చిన హామీలను నెరవేర్చామని పునరుద్ఘాటించారు.

ప్రయివేటు భాగస్వామ్యంతో స్కిల్ యూనివర్సిటీ

(మొదటిపేజీ తరువాయి)



ఏర్పాటు, నిర్వహణకు నిధుల కొరత లేకుండా చూస్తామన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుపై శుక్రవారంనాడాయన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఢిల్లీ, హర్యానాల్లోని స్కిల్ యూనివర్సిటీలను పరిశీలించి, తెలంగాణలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు రాష్ట్ర పరిశ్రమల విభాగం నమూనా ముసాయిదాను తయారు చేసింది. ఈ యూనివర్సిటీలో నిర్వహించే కోర్సులు, వాటి వ్యవధి, నిర్వహణకు అవసరమయ్యే మౌలిక వసతులు, నిర్వహణకు అవసరమయ్యే నిధులు, వివిధ కంపెనీల భాగస్వామ్యంపై పరిశ్రమల శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కొత్త యూనివర్సిటీకి 'తెలంగాణ స్కిల్స్ యూనివర్సిటీ' అని పేరు పెట్టాలని నిర్ణయం తీసుకున్నారు. పీపీపీ మోడల్‌లో నెలకొల్పే ఈ యూనివర్సిటీని లాభాపేక్ష లేకుండా స్వయంప్రతిపత్తి ఉండేలా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మూడు, నాలుగేండ్ల కాల వ్యవధి ఉండే డిగ్రీ కోర్సులతో పాటు ఏడాది డిప్లొమా, మూడు నుంచి నాలుగు నెలల వ్యవధి ఉండే సర్టిఫికెట్ కోర్సులు ఇందులో నిర్వహిస్తారు. రాష్ట్రంలో అభివృద్ధి చెందుతున్న వివిధ రంగాలు, పరిశ్రమల భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా కొత్త కోర్సులను ఎంపిక చేస్తారు. మొత్తం 17 ప్రాధాన్య రంగాలను గుర్తించారు. ఫార్మా, కన్‌స్ట్రక్షన్, బ్యాంకింగ్ ఫైనాన్స్ సర్వీసెస్, ఈ-కామర్స్ అండ్ లాజిస్టిక్స్, రిటైల్, యానిమేషన్ విజువల్ ఎఫెక్ట్స్ గేమింగ్ అండ్ కామిక్స్ వంటి ఆరు రంగాల్లో తొలుత ఉపాధి అవకాశాలున్న కోర్సులను ప్రవేశ పెడుతారు. ప్రతి కోర్సును సంబంధిత రంగంలో ఒక కంపెనీ భాగస్వామ్యం ఉండేలా అనుసంధానం చేస్తారు. దీనికోసం ప్రభుత్వం ఆయా కంపెనీలతో ఎంవోయూ (పరస్పర ఒప్పందం) చేసుకుంటుంది. తొలి ఏడాది రెండు వేల మందితో ప్రారంభించి, క్రమంగా ఏడాదికి 20 వేల మందికి ఈ కోర్సుల్లో అడ్మిషన్లు కల్పిస్తారు. హైదరాబాద్ ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ క్యాంపస్‌తో పాటు జిల్లా కేంద్రాల్లో ప్రాంతీయ ప్రాంగణాలు (శాటిలైట్ క్యాంపస్‌లు) ఏర్పాటు చేయాలనే చర్చ ఈ సమావేశంలో జరిగింది. జిల్లా కేంద్రాల్లో శాటిలైట్ క్యాంపస్లు ఏర్పాటు చేస్తే చేరే వారి సంఖ్య తక్కువగా ఉంటుందని, అందరూ హైదరాబాద్ క్యాంపస్‌లోనే చేరేందుకు పోటీ పడుతారని ముఖ్యమంత్రి అన్నారు. అందువల్ల హైదరాబాద్‌లోనే అందరికీ శిక్షణను అందించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈఎస్సీతో పాటు న్యాక్ క్యాంపస్ ఉపయోగించుకోవాలనీ, అవసరమైన మౌలిక వసతి సదుపాయాలుండే వివిధ ప్రాంగణాలను గుర్తించాలని చెప్పారు. భూదాన్ పోచంపల్లిలోని స్వామి రామానంద తీర్థ రూరల్ ఇన్‌స్టిట్యూట్‌లోని కోర్సులు, అక్కడి సదుపాయాలను అధికారులు స్వయంగా వెళ్లి పరిశీలించాలని ఆదేశించారు. డిమాండ్ ఎక్కువగా ఉన్న రంగాలపైనే ఎక్కువ దృష్టి పెట్టాలని, రాష్ట్రంలో ఫార్మా కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉన్నందున, అటువంటి కోర్సుల్లో ఎక్కువ సీట్లు ఉండాలని చెప్పారు. ఈ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్రణాళికలు ఉండాలని, ఇందుకు సంబంధించి ముందుగానే వివిధ కంపెనీలతో చర్చించాలని సీఎం అధికారులను ఆదేశించారు. మిగతా యూనివర్సిటీలు అనుసరించిన విధానాలను పరిశీలించి కొత్త యూనివర్సిటీ సంస్థాగత నిర్మాణాన్ని తయారు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా పలు మార్పులు చేర్పులు చేసి ముసాయిదాను సిద్ధం చేయాలని ఈ సందర్భంగా ఆయన అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

టైమ్ స్క్వేర్ తరహాలో టీ స్క్వేర్

హుస్సేన్ సాగర్ చుట్టూ ఆకాశహర్మ్యాలు

- ప్రతిపాదనలు సిద్ధం చేసిన రాష్ట్ర సర్కారు
- ఆగస్టు 3న అమెరికాకు సీఎం రేవంత్‌రెడ్డి బృందం
- టైమ్‌స్క్వేర్ నిర్మాణం, డిజైన్ల పరిశీలన
- పలు కంపెనీల సీఈఓలు, పారిశ్రామికవేత్తలతో సీఎం భేటీ అయ్యే అవకాశం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

న్యూయార్క్ నగరం తరహాలో హైదరాబాద్ అభివృద్ధి ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. న్యూయార్క్ టైమ్ స్క్వేర్ తరహాలో టీ స్క్వేర్ నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. రాష్ట్ర పరిశ్రమలు మౌలిక సదుపాయాల సంస్థ (టీజీఐఐసీ) దానికి సంబంధించి ప్రణాళికలు రూపొందించింది. ఈ మేరకు టెండర్లు ఆహ్వానించిన టీజీఐఐసీ మధ్య దిగువ మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉండటంతో పాటు, స్థానిక ప్రజలకు ఆహ్లాదాన్ని కలిగించేలా టి స్క్వేర్ నిర్మాణం ఉండేలా ముందడుగు వేస్తున్నది. ప్రతిష్టాత్మక టీ-స్క్వేర్ ప్రాజెక్ట్ కోసం ఆర్కిటెక్చరల్, లావాదేవీల సలహా సేవల కోసం టెండర్లు జారీ చేయడం ద్వారా ఈ ప్రక్రియను మొదలుపెట్టింది. ఈ స్ఫూర్తిని ప్రతిబింబించేలా ఒక అద్భుతమైన కట్టడం, మల్టీఫంక్షనల్ ప్లాజా అవసరం ఉందంటూ తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కార్పొరేషన్ హైలైట్ చేసింది. ఇక్కడి కమ్యూనిటీకి సౌకర్యవంతమైన, ఆకర్షణీయమైన వాతావరణాన్ని అందించడమే లక్ష్యంగా ఈ కట్టడం ఉండాలని రాష్ట్ర సర్కార్ ఆకాంక్షిస్తున్నది. హైదరాబాద్ ఐటీకి ప్రాచుర్యం పొందినట్టు టీ-స్క్వేర్‌నూ ఫేమస్ చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. రోజువారి పనులతో క్షణం తీరిక లేకుండా ఉండే వారికి టీస్క్వేర్‌లో జరిగే ఈవెంట్లతో ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు కసరత్తు ముమ్మరం చేసింది. దీంతో టీ స్క్వేర్ నగరంలో ప్రధాన పర్యాటక కేంద్రంగా మారనుంది.

వచ్చే నెల 3న డల్లాస్‌కు సీఎం బృందం

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటన షెడ్యూల్ ఖరారైంది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలంటూ అమెరికాలోని పారిశ్రామికవేత్తలను ఆహ్వానించేందుకు సీఎం రేవంత్ రెడ్డితో పాటు అధికారుల బృందం అమెరికాలో పర్యటించనుంది. వచ్చే నెల 3న రాత్రి హైదరాబాద్ నుంచి ఈ బృందం అమెరికా వెళ్లనున్నది. డల్లాస్ సహా వివిధ రాష్ట్రాలలో పర్యటించి, తెలంగాణకు పెట్టుబడులను ఆహ్వానించేందుకు ప్రయత్నిస్తుంది. అమెరికా పారిశ్రామికవేత్తలను, పలు కంపెనీల సీఈఓలను కలిసి తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను, ప్రభుత్వ విధానాలను వివరించనుంది. సీఎం రేవంత్ రెడ్డి బృందం వారం పాటు పర్యటించనుంది. న్యూయార్క్‌లోని టైమ్ స్క్వేర్ నిర్మాణం, డిజైన్లను పరిశీలించనున్నది. సీఎం తన పర్యటన ముగించుకుని ఆగస్టు 11న హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు.

గ్రూప్-2 వాయిదా

(మొదటిపేజీ తరువాయి)

చాలంటూ టీజీపీఎస్సీ చైర్మెన్ మహేందర్‌రెడ్డిని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. దాన్ని పరిశీలించి వాయిదా వేయడం గమనార్హం. మూడు నెలల కాలంలోనే 54 వేల ఉద్యోగాలకు మోక్షం కల్పించామని భట్టి చెప్పారు. ఉద్యోగ ఖాళీలను వెతికి జాబ్‌క్యాలెండర్‌ను ప్రకటిస్తామని అన్నారు. ఓవర్ ల్యాపింగ్ లేకుండా పోటీ పరీక్షలను నిర్వహిస్తామన్నారు. రాష్ట్రాన్ని తెచ్చుకున్నదే ఉద్యోగాల కోసమని చెప్పారు. ఉద్యోగ నోటిఫికేషన్లను ఆలస్యం చేస్తే ప్రభుత్వానికి జీతాల భారం తగ్గుతుందనీ, తాము అలా ఆలోచించడం లేదని అన్నారు. తమ బిడ్డలు స్థిరపడాలనీ, వారి కుటుంబాలు ఆర్థికంగా ఎదగాలని కోరుకుంటున్నామని వివరించారు. బెదిరించి బ్లాక్ మెయిల్ చేసి కేసుల పాలైతే నిరుద్యోగులే నష్టపోతారని చెప్పారు. కొందరి లాభాల కోసం చేసే ప్రయత్నాల్లో ఇబ్బందులు పడొద్దని సూచించారు.

త్వరలో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ల ప్రారంభం

కొద్ది రోజుల్లోనే ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారి కోసం అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లను ప్రారంభిస్తామని భట్టి అన్నారు. అధునాతన టెక్నాలజీతో వాటిని నిర్మిస్తున్నామని వివరించారు. ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పోటీ పరీక్షలకు ఉచితంగా ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తామన్నారు. దేశంలోనే ఉన్నతమైన సబ్జెక్టు నిపుణులను అందుబాటులోకి తెస్తామని చెప్పారు. హైదరాబాద్ కేంద్రంగా ఆన్‌లైన్‌లో పాఠాలను బోధిస్తారని వివరించారు. సన్నద్ధమయ్యే వారు ఆన్‌లైన్‌లోనే ప్రశ్నలు వేయొచ్చునీ, అనుమానాలను నివృత్తి చేసుకోవచ్చుని సూచించారు. పోటీపరీక్షలకు సన్నద్ధమయ్యే వారు ఇక నుంచి అశోక్‌నగర్‌లో ఐదు రూపాయల భోజనంతో ఇబ్బంది పడాల్సిన పనిలేదని అన్నారు. నిరుద్యోగులు చెప్పిన ప్రతి అంశాన్ని సీరియస్‌గా పరిశీలిస్తామని భట్టి చెప్పారు. వారు తమ బిడ్డలనీ, రాష్ట్ర సంపద, వారి మేధస్సు నిరుపయోగం కావొద్దనేదే ప్రభుత్వ ఆలోచన అని చెప్పారు. ఇందిరమ్మ ప్రభుత్వం నూటికి నూరు శాతం సమస్యలను వింటుందనీ, వాటిని పరిష్కరిస్తుందని అన్నారు. గ్రూప్-2 అభ్యర్థులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలంటూ సీఎం రేవంత్‌రెడ్డి సూచించారని చెప్పారు. అందులో భాగంగానే శుక్రవారం సచివాలయంలో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామని వివరించారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగులు మఠం శివానందస్వామి, మహేష్, స్రవంతి, అభినవ్, ఇంద్రప్రసాద్ నాయక్, చంద్రశేఖర్, మిత్ర, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు. గ్రూప్-2 వాయిదా వేయడం పట్ల ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

11జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

వాతావరణ శాఖ హెచ్చరికలు

- జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి : సీఎస్ శాంతి కుమారి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఉత్తర తెలంగాణాలోని 11 జిల్లాల్లో శని, ఆదివారాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ఆయాజిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సూచించారు. ఈ రెండు రోజులు 11 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్‌ను ప్రకటించిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్లతో శుక్రవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. దీంతోపాటు 8 జిల్లాల్లో కొత్తగా ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీలకు పక్కా భవనాల గుర్తింపు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనా, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది నియామకం తదితర అంశాలపై కూడా ఈ టెలికాన్ఫరెన్స్ లో సమీక్షించారు. నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ, పెద్దపల్లి, కరీంనగర్, ములుగు, కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, హన్మకొండ, జగిత్యాల, ఖమ్మం,కొత్తగూడెం, నిర్మల్ జిల్లాల్లో రేపు, ఎల్లుండి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీచేసిందని తెలిపారు. ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా కలెక్టర్లు సంబంధిత ప్రభుత్వ విభాగాలతో కలసి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. వాగుల వద్ద తగు బందోబస్తును ఏర్పాటు చేసి, ప్రమాదకరంగా ప్రవహించే వాగులను ప్రజలు దాటకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఈ 11 జిల్లాల్లో కలెక్టరేట్లలో కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేయాలనీ, పోలీస్ తదితర శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఏ విధమైన సహాయం కావాలన్నా రాష్ట్ర రాజధానికి సంప్రదించవచ్చునని ఆమె అన్నారు. గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పెద్ద వాగుకు వచ్చిన ఆకస్మిక వరదల వల్ల చిక్కుకుపోయిన దాదాపు 40 మందికి అపాయం జరుగకుండా వివిధ శాఖల సమన్వయంతో కాపాడినందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్‌ను సీఎస్ అభినందించారు.

మెడికల్ కాలేజీలకు పక్కా భవనాలు గుర్తించండి

ప్రభుత్వం కొత్తగా ఎనిమిది జిల్లాలో ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీలకు తాత్కాలిక ప్రాతిపదికన పక్కా భవనాలను గుర్తించడంతోపాటు, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌ను నియమించడంలో ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆయా జిల్లాలు కలెక్టర్లకు సూచించారు. గద్వాల్, నర్సంపేట, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, ములుగు, యాదాద్రి భువనగిరి, నర్సంపేట, మెదక్ జిల్లాలో, ఇప్పటికే భువనగిరి, మెదక్ జిల్లాల్లో కాలేజి భవనాలను గుర్తించారని తెలిపారు. ఈ రెండు జిల్లాలు ఆయా భవనాలను 40 ఏండ్ల లీజ్ అగ్రిమెంట్ చేసుకోవాలని కలెక్టర్లకు తెలిపారు. మిగతా ఎనిమిది జిల్లాల్లో మెడికల్ కాలేజీలకు అనుబంధంగా 220 పడకల ఆస్పత్రులను అనుసంధానం చేయాలన్నారు. అదేవిధంగా, ఈ కళాశాలలల్లో టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది నియామకానికి ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించాలని తెలిపారు. టీచింగ్ స్టాఫ్ నియామకంపై వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి తగు చర్యలు చేపట్టనున్నారనీ, సీటీ స్కాన్ మిషన్లు, బయో మెట్రిక్ అటెండెన్స్ మెషిన్లను హైదరాబాద్‌లోని మెడికల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ సంస్థ సరఫరా చేస్తుందని తెలిపారు.

సింగరేణి గనుల్లో భద్రత పెంపు

కార్మిక సంఘాల సూచనలు తీసుకుంటాం

- సీఎండీ ఎన్ బలరామ్ వెల్లడి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

గనుల్లో భద్రత పెంపుదలకు కార్మిక సంఘాలు చేసే సూచనలను పరిగణలోకి తీసుకొని, అవసరమైన చర్యలను తక్షణం అమలు చేస్తామని సింగరేణి సంస్థ సీఎమ్‌డీ ఎన్ బలరామ్ తెలిపారు. హైదరాబాద్ సింగరేణిభవన్‌లో శుక్రవారం 48వ రక్షణ త్రైపాక్షిక సమీక్షా సమావేశం గుర్తింపు కార్మిక సంఘం జనరల్ సెక్రటరీ వీ సీతారామయ్య అధ్యక్షత జరిగింది. దీనిలో గుర్తింపు, ప్రాతినిధ్య కార్మికసంఘాల ప్రతినిధులు, డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ అధికారులు, సింగరేణి అధికారులు పాల్గొన్నారు. వీరిని ఉద్దేశించి సీఎమ్‌డీ మాట్లాడారు. సింగరేణి సంస్థ ఉత్పత్తిలో ఆదర్శప్రాయంగా ఉందనీ, రక్షణలోనూ ప్రమాద రహిత కంపెనీగా రూపుదిద్దాల్సిన బాధ్యత అందరి పైనా ఉందన్నారు. కార్మికుల ప్రాణాలు ఎంతో విలువైనవనీ, ప్రాణనష్టం జరక్కుండా, ప్రమాదాలను నివారించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. రక్షణ లేని పని ప్రదేశాల్లో విధులు నిర్వహించాలని యాజమాన్యం ఎప్పుడూ ఒత్తిడి చేయబోదనీ, అదే సమయంలో కార్మికులు తప్పనిసరిగా స్వీయ రక్షణ పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు పలు సూచనలు చేశారు. నాణ్యమైన హెల్మెట్లు, బూట్లు సరఫరా చేయాలని, వైద్య సేవల పెంపు, క్యాంటీన్లలో మెరుగైన సౌకర్యాలు, కొత్త యంత్రాల కొనుగోలు, ఆధునీకరణ, అవసరమైన సిబ్బంది నియామకం వంటి పలు అంశాలను ప్రస్తావించారు. కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్, డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ రీజియన్-2 ఎన్ నాగేశ్వరరావు, సింగరేణి డైరెక్టర్లు డీ సత్యనారాయణ (ఈఅండ్‌ఎం) ఎన్వీకే శ్రీనివాస్ (ఆపరేషన్స్ అండ్ పర్సనల్), జీ వెంకటేశ్వరరెడ్డి (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇటీవల పలు ప్రమాదాల్లో మృతి చెందిన కార్మికులకు సంతాపం తెలిపారు.

సీతక్కకు బీఆర్‌టీయూ నేతల కృతజ్ఞతలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రిటైర్డ్ అవుతున్న అంగన్‌వాడీ టీచర్లకు రూ.2 లక్షలు, ఆయాలకు లక్ష రూపాయల బెనిఫిట్స్ ప్రకటించినందుకు మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కకు తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(బీఆర్‌టీయూ అనుబంధం) నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. వెంటనే జీవో విడుదల చేయాలని కోరారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో ఆమెను కలిశారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి, వాలంటరీ రిటైర్మెంట్ కోరుతున్న వారికి కూడా బెనిఫిట్స్ వర్తింపజేసే అంశాన్ని పరిశీలించాలని వినతి పత్రం సమర్పించారు. అర్హులైన ఆయాలకు ప్రమోషన్ ఇవ్వాలని, స్థానికత లేని అంగన్వాడీ టీచర్లకు బదిలీలు చేయాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నల్ల భారతి, వి.నిర్మల, కోశాధికారి ఎం.వేదవతి, బి.శిరీష, అనిత ఉన్నారు.

వాయుగుండంతో భారీ వర్షసూచన

నదుల్లోకి నీరు చేరే అవకాశం

- రిజర్వాయర్లల్లోకి ఇప్పటికే రాక

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్





బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం మూలంగా తెలంగాణపై తీవ్ర ప్రభావం పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఖమ్మం, భద్రాద్రి జిల్లాలో భారీ వర్షాలు పడుతున్న సంగతి తెలిసిందే. శుక్రవారం రాష్ట్రమంతా మేఘావృతమైంది. ఈ మేరకు నీటిపారుదలశాఖను హైదరాబాద్ వాతావరణ కేంద్రం రెడ్ టేక్ యాక్షన్ అప్రమత్తం చేసింది. దీంతో సంబంధిత అధికారులు నీటిపారుదల యంత్రాంగంతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో ప్రాజెక్టులు, వరదలు, ముంపు పరిస్థితులపై కన్నేసి ఉంచాలని ఇరిగేషన్ ఈఎన్సీ బి. అనిల్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శని, ఆదివారాలు విస్తారమైన వర్షాలతోపాటు అతి నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈశాన్య, తూర్పు జిల్లాలైన కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాల్లో శుక్రవారం రాత్రి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనాగా ఉంది. కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, ఖమ్మం, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వానలు పడే అవకాశమున్నట్టు ప్రకటించింది. శనివారం ఉత్తర, ఈశాన్య తెలంగాణ జిల్లాలైన ఆదిలాబాద్, కొమురంబీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి జిల్లాల్లో అత్యంత భారీగా వానలు పడొచ్చని సమాచారం. నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, జయశంకర్-భూపాలపల్లి జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే పరిస్థితులు ఉన్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరికలు జారీ చేసింది. ఇదిలావుండగా ఈ వర్షాల కారణంగా నదుల వరద పోటెత్తే అవకాశం ఉందని తెలిసింది. ఇప్పటికే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టుకు భారీగా వరద నీరువచ్చి చేరింది. ఈ నేపథ్యంలో శుక్రవారం 24 గేట్లు ఎత్తాల్సి వచ్చింది. దీంతో 49 వేల క్యూసెక్కుల వరద నీటిని దిగువన గోదావరికి వదలాల్సి వచ్చింది. ప్రాజెక్టుకు ఎగువ నుంచి 60,297 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నది. కర్నాటక, తెలంగాణలో కురుస్తున్న వర్షాలకు నదులు, వాగుల్లో భారీగా ప్రవాహం పెరుగుతున్నదని నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. జూరాలకు ఎగువ నుంచి వస్తున్న వరదను దృష్టిలో పెట్టుకుని దిగువకు వదులుతున్నారు. మరో ఒకటి, రెండు రోజుల్లో కృష్ణానదిలో మరింత ప్రవాహం పెరగనుందని అంచనా వేస్తున్నారు. కరీంనగర్ జిల్లాల్లో కరుస్తున్న వానల మూలంగా మానేరు తదితర గోదావరి ఉపనదుల్లోకి వరదనీరు వచ్చి చేరుతున్నది. దీంతో కాళేశ్వరం బ్యారేజీలు అన్నారం, సుందిళ్ల, మేడిగడ్డ వద్ద ప్రవాహం అధికమవుతున్నది. మేడిగడ్డ వద్ద ప్రాణహిత, గోదావరి వరద 53 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నది. బ్యారేజీ 85 గేట్ల ద్వారా వరద దిగువకు వెళుతున్నది.

కృష్ణా బేసిన్ రిజర్వాయర్లల్లో నీటి నిల్వలు

ప్రాజెక్టు	నీటి నిల్వ సామర్థ్యం (టీఎంసీ)	ప్రస్తుత నీటి నిల్వ (టీఎంసీ)	వస్తున్న వరద (క్యూసెక్కులు)	వదులుతున్న నీరు (క్యూసెక్కులు)
ఆలమట్టి	129.72	101.33	43478	65480
నారాయణపూర్	37.64	34.93	65801	70780
జూరాల	9.66	5.53	55000	34135
తుంగభద్ర	105.79	58.32	5939	233
శ్రీశైలం	215.81	33.11	32673	7063
నాగార్జునసాగర్	312.05	123.50	0	8165
పులిచింతల	45.77	0.74	154	50

గోదావరి బేసిన్

ప్రాజెక్టు	నీటి నిల్వ సామర్థ్యం (టీఎంసీ)	ప్రస్తుత నీటి నిల్వ (టీఎంసీ)	వస్తున్న వరద (క్యూసెక్కులు)	వదులుతున్న నీరు (క్యూసెక్కులు)
సింగూరు	29.917	13.60	391	191
నిజాంసాగర్	17.800	3.10	0	0
శ్రీరాంసాగర్	90.300	16.82	17,283	475
కడెం	7.600	5.02	4123	77
శ్రీపాద ఎల్లంపల్లి	20.170	5.28	331	331
మేడిగడ్డ	16.170	-	310080	310080
సమ్మక్కసాగర్	6.570	-	393700	393700
సీతమ్మసాగర్	36.570	51.55(ఎం)	326814	326814
భద్రాచలం లెవెల్	40.20 (ఎం)			

రైతుల సమస్యలపై రాజ్యసభలో ప్రస్తావించండి

- ఎంపీ ఆర్ కృష్ణయ్యకు ఎస్‌కేఎం వినతి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రైతుల కష్టాలను, వారు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై రాజ్యసభలో ప్రస్తావించాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) రాష్ట్ర బృందం ఎంపీ ఆర్. కృష్ణయ్యను కోరింది. శుక్రవారం హైదరాబాద్, విద్యానగర్‌లోని ఆయనకు ఎస్‌కేఎం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్లు తీగల సాగర్, జక్కుల వెంకటయ్య, రాష్ట్ర నాయకులు బుర్రి ప్రసాద్, మూడ్ శోభన్, రాంబాబు తదితరులు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అన్ని పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) సీ2 ప్లస్ 50 శాతం ప్రాతిపదికన ఇచ్చేందుకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు.అన్ని పంటలను గ్యారంటీగా సేకరించాలని పేర్కొన్నారు. దేశంలో సమగ్ర రైతురుణ మాఫీ చేయాలని కోరారు. విద్యుత్ ప్రయివేటీకరణను ఆపాలనీ, ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను బిగించొద్దన్నారు. అన్ని పంటలకు, పశుపోషణకు సమగ్ర బీమా కవరేజీ ఇవ్వాలన్నారు. రైతులు, వ్యవసాయ కార్మికులందరికీ నెలకు రూ.10 వేలు చొప్పున పెన్షన్ ఇవ్వాలనీ, భూసేకరణ, పునరావాస చట్టం-2013ను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

గ్రూప్-2 వాయిదా నిరుద్యోగుల విజయం

- రాణీ రుద్రమ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్-2 వాయిదా వేయాలని నిర్ణయం తీసుకోవడం నిరుద్యోగుల విజయం అని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణీ రుద్రమ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. కొత్త తేదీల ప్రకటనతో పాటు పోస్టుల పెంపుపై కూడా ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జాబ్‌క్యాలెండర్ విడుదల చేయాలని కోరారు. యువతకు ఉపాధి కల్పించే యువ పాలసీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పేపర్ల లీకేజీకి కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకట్ట వేయాలని సూచించారు.

కాంగ్రెస్‌వి గోబెల్స్‌ను మించిన అబద్ధాలు..

- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గోబెల్స్ బతికుంటే కాంగ్రెసోళ్ల అబద్దాలు చూసి ఆత్మహత్య చేసుకునే వారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి ,కె పి వివేకానంద ,కోవా లక్ష్మి , బీఆర్‌ఎస్ నేతలు రాకేష్ రెడ్డి , రాంబాబు యాదవ్ ,తుంగ బాలు విమర్శించారు. రైతులకంతా మేమే చేశామనీ, కేసీఆర్ హయంలో ఏం జరగలేదన్నట్టుగా వారు మాట్లాడుతున్నారని తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల రుణమాఫీ కోసం విడుదల చేసింది రూ. 6 వేల కోట్లు మాత్రమేననీ, ఇది రుణాలున్న రైతుల్లో 30 శాతం మందికే సరిపోతుందని పేర్కొన్నారు. డబ్బుల పరంగా చూస్తే ఇది 20 శాతం మాత్రమేనన్నారు.కాంగ్రెస్ నేతలు గోరంత చేసి, కొండంతలుగా గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ హయంలో మొదటి విడతలో 35 లక్షల మంది రైతులకు రూ.17 వేల కోట్లు రుణ మాఫీ కింద చెల్లించామని గుర్తు చేశారు. రైతుల అకౌంట్లలోకి పదేండ్లలో రూ. లక్ష కోట్ల వేశామన్నారు.రూ. 70 వేల కోట్లు రైతు బంధు, రూ. 30 వేల కోట్ల రుణ మాఫీతో పాటు లక్షా 20 వేల మంది రైతుల కుటుంబాలకు రూ. 7వేల కోట్లను బీమా కింద చెల్లించారని గుర్తు చేశారు.

సీడీపీవో ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ (ఈవో) పరీక్ష రద్దు : టీజీపీఎస్సీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలో చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ (సీడీపీవో ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్) పరీక్షను రద్దు చేస్తున్నట్టు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ప్రకటించింది. ఈ మేరకు టీజీపీఎస్సీ కార్యదర్శి ఈ నవీన్ నికోలస్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సీడీపీవో పోస్టుల భర్తీకి గతేడాది జనవరి మూడు నుంచి ఎనిమిదో తేదీ వరకు నిర్వహించిన రాతపరీక్షలను రద్దు చేస్తున్నట్టు తెలిపారు. సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబోరేటరీ (సీఎఫ్‌ఎస్‌ఎల్) నివేదిక ఆధారంగా ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) చర్చించి ఈ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. పరీక్ష నిర్వహించే తేదీలను త్వరలో ప్రకటిస్తామని వివరించారు.

1104 ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (1104) ఆధ్వర్యంలో స్టార్ హాస్పిటల్స్ నానక్ రామ్ గూడ, బంజారా హిల్స్ హైదరాబాద్ సహకారంతో మింట్ కాంపౌండ్ లోని విద్యుత్ కార్మిక భవన్‌లో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. యూనియన్ అదనపు కార్యదర్శి జి వరప్రసాద్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్టార్ హాస్పిటల్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ భాస్కర్ రెడ్డి వైద్య శిబిరం ప్రాముఖ్యత, ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. డాక్టర్ నిశాంత్ రెడ్డి విద్యుత్ ఉద్యోగులు, కార్మికులకు మధుమేహం, రక్తపోటు పరీక్షల ప్రాధాన్యత తెలిపారు. చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ నందన్ ఈసీజీ మరియు 2డి ఈకో పరీక్షలు నిర్వహించారు. ఆర్థోపెడిషియన్ డాక్టర్ అభిషేక్ ఆధ్వర్యంలో ఎముకల పటిష్టత కోసం పలు సూచనలు చేశారు. దాదాపు 350 మంది ఉద్యోగులు ఈ ఆరోగ్య శిబిరంలో పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు బి వెంకటేశ్వర్లు, కార్యనిర్వాహక అధ్యక్షులు సుధీర్, సలహాదారులు జనార్దన్ రెడ్డి, అతిథులుగా ఎస్పీడీసీఎల్ అధ్యక్షులు ఏ. వేణు, అదనపు కార్యదర్శి భాస్కర్ రెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

కరెంటోళ్లపై చెయ్యేస్తే కఠిన చర్యలు

- టీజీఎస్పీడీసీఎల్ సీఎమ్‌డీ ముషారఫ్ హెచ్చరిక



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

విధి నిర్వహణలో ఉన్న విద్యుత్ అధికారులు, సిబ్బందిపై దాడులు చేస్తే చట్టపరంగా వారిపై కఠిన చర్యలు తప్పవని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) సీఎమ్‌డీ ముషారఫ్ ఫరూఖీ హెచ్చరించారు. ఈనెల 18న బంజారాహిల్స్ సర్కిల్ పరిధిలోని మోతీనగర్‌లో విద్యుత్ సిబ్బంది గణేష్, శ్రీకాంత్, భాస్కర్‌లపై దాడి జరిగిన విషయం తెలిసిందే. శుక్రవారంనాడాయన వారిని తన కార్యాలయానికి పిలిపించి, దాడికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారికి మెరుగైన వైద్యానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ చంద్ర శేఖర్, గ్రీన్ ల్యాండ్స్ డివిజనల్ ఇంజినీర్ సుధీర్‌లను ఆదేశించారు. ఎర్రగడ్డ సెక్షన్ పరిధిలోని మోతినగర్‌లో టీ.రాములు (సర్వీస్ కనెక్షన్ నెంబర్: ఎస్‌జెడ్ 104823/యూఎస్‌సీ నెంబర్ 100124620) ఇంటి కరెంటు బిల్లు రూ.6,858 పెండింగ్ ఉంది. వీరు ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి విద్యుత్ బిల్లులు చెల్లించట్లేదు. ప్రతినెలా బిల్లు చెల్లించాలని విద్యుత్ సిబ్బంది అడుగుతున్నా దాటవేస్తున్నారు. దీనితో ఈనెల 18న విద్యుత్ సిబ్బంది మీటర్ పక్కన ఉన్న ఎమ్‌సీబీని నిలిపివేశారు. దీనితో అక్కడ నివాసం ఉంటున్న మురళీధర్ అనే వ్యక్తి విద్యుత్ సిబ్బందిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. బాధిత విద్యుత్ ఉద్యోగి హెచ్ శ్రీకాంత్ పోలీసులకు ఫిర్యాదు చేసారు. దీనితో పోలీసులు మురళీధర్‌ను అదుపులోకి తీసుకుని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసారు.

సీఎస్ఈకే జై

- మొదటి విడతలోనే 99.31 శాతం సీట్లు భర్తీ
- 24 కోర్సులు, 89 కాలేజీల్లో వంద శాతం ప్రవేశాలు
- తక్కువ ఆప్షన్లతో సీట్లు రాని అభ్యర్థులు 20,535 మంది
- ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌లో 75,200 మందికి సీట్ల కేటాయింపు
- సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు 23



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరానికిగాను 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎప్‌సెట్ కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా సాంకేతిక విద్యాశాఖ శుక్రవారం సీట్లు కేటాయించింది. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ)కే అభ్యర్థులు జై కొట్టారు. ఎప్‌సెట్ ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌కు హాజరైన వారిలో ఎక్కువ మంది ఆ కోర్సులోనే చేరేందుకు ఆసక్తి కనబరిచారు. సీఎస్ఈ అనుబంధ కోర్సుల్లో 53,890 సీట్లుంటే, 53,517 (99.31 శాతం) మందికి సీట్లు కేటాయించారు. కేవలం 373 సీట్లు మిగిలాయి. ఈ మేరకు ఎప్‌సెట్ ప్రవేశాల కమిటీ కన్వీనర్, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంజినీరింగ్ విద్యలో 47 కోర్సులు అందుబాటులో ఉన్నాయి. మొదటి విడత కౌన్సెలింగ్‌లోనే 24 కోర్సుల్లో వంద శాతం సీట్లు భర్తీ అయ్యాయని వివరించారు. రాష్ట్రంలో ఏడు యూనివర్సిటీ, 82 ప్రయివేటు ఇంజినీరింగ్ కాలేజీలు కలిపి మొత్తం 89 కాలేజీల్లో వంద శాతం ప్రవేశాలను కల్పించామని తెలిపారు. రాష్ట్రంలో 175 ఇంజినీరింగ్ కాలేజీల్లో 78,694 సీట్లున్నాయని పేర్కొన్నారు. ఎప్‌సెట్ మొదటి విడత కౌన్సెలింగ్‌లో 75,200 (95.6 శాతం) మంది అభ్యర్థులకు సీట్లు కేటాయించామని వివరించారు. 3,494 (4.4 శాతం) సీట్లు మిగిలాయని తెలిపారు. కోస్గిలో ఉన్న ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీలో 195 సీట్లుంటే 187 (95.9 శాతం) మందికి సీట్లు కేటాయించామని పేర్కొన్నారు. ఎనిమిది సీట్లు మిగిలాయని తెలిపారు. 18 యూనివర్సిటీ కాలేజీల్లో 5,854 సీట్లుంటే, 5,213 (89.1 శాతం) మందికి సీట్లు కేటాయించామని వివరించారు. 641 సీట్లు మిగిలాయని పేర్కొన్నారు. రెండు ప్రయివేటు యూనివర్సిటీల్లో 1,368 సీట్లుంటే, 1,362 (99.6 శాతం) మందికి సీట్లు కేటాయించామని తెలిపారు. ఇంకా ఆరు సీట్లు మిగిలాయని వివరించారు. 154 ప్రయివేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో 71,277 సీట్లున్నాయని పేర్కొన్నారు. వాటిలో 68,438 (96 శాతం) మందికి సీట్లు కేటాయించామని తెలిపారు. ఇంకా 2,839 సీట్లు మిగిలాయని పేర్కొన్నారు. తక్కువ వెబ్‌ఆప్షన్లను నమోదు చేయడం వల్ల ఏకంగా 20,535 మంది అభ్యర్థులకు సీట్లు కేటాయించలేదని వివరించారు. ఆర్థికంగా వెనుకబడిన తరగతులు (ఈడబ్ల్యూఎస్) కోటా కింద 6,038 మందికి సీట్లు కేటాయించామని తెలిపారు. సీట్లు పొందిన అభ్యర్థులు ఈనెల 23 వరకు ఆన్‌లైన్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని సూచించారు. సెల్ఫ్ రిపోర్టింగ్ చేయకుంటే ఆ సీట్లు రద్దవుతాయని స్పష్టం చేశారు. రెండో విడత ఇంజినీరింగ్ ప్రవేశాల కౌన్సెలింగ్ తర్వాత వచ్చేనెల ఒకటి, రెండు తేదీల్లో అభ్యర్థుల ధ్రువపత్రాలను కేటాయించిన కాలేజీల్లో సమర్పించామని కోరారు. ఇతర వివరాల కోసం www.:// tgeapcet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

సివిల్, మెకానికల్‌కు ఆదరణ కరువు

కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ) అనుబంధ కోర్సుల్లో 99.31 సీట్లు భర్తీ అయ్యాయి. ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ అనుబంధ కోర్సుల్లో 16,344 సీట్లుంటే, 15,127 (92.55 శాతం) మందికి సీట్లు కేటాయించారు. ఇంకా 1,217 సీట్లు మిగిలాయి. సివిల్, మెకానికల్ అనుబంధ కోర్సుల్లో 7,339 సీట్లుండగా, 5,689 (77.52 శాతం) సీట్లు భర్తీ అయ్యాయి. ఇంకా 1,650 సీట్లు మిగిలాయి. ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌లో సివిల్, మెకానికల్ కోర్సులకు ఆదరణ కరువైంది. ఎక్కువ మంది అభ్యర్థులు సీఎస్ఈ, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ కోర్సుల్లో చేరేందుకే మొగ్గు చూపుతుండడం గమనార్హం. ఇతర ఇంజినీరిగ్ కోర్సుల్లో 1,121 సీట్లుంటే, 867 (77.34 శాతం) మందికి సీట్లు కేటాయించారు. ఇంకా 254 సీట్లు మిగిలాయి.

ఆసక్తి చూపని టాప్ ర్యాంకర్లు

ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు టాప్ ర్యాంకర్లు ఆసక్తి చూపలేదు. ఒకటి నుంచి వందో ర్యాంకు వరకు ఒక్కరే కౌన్సెలింగ్ సీటు పొందడం గమనార్హం. 200వ ర్యాంకు వరకు కూడా ఇంకో విద్యార్థికి సీటు దక్కింది. 500వ ర్యాంకు వరకు పది మంది విద్యార్థులు మాత్రమే సీట్లు పొందారు. వెయ్యి ర్యాంకు వరకు 74 మంది, ఐదు వేల ర్యాంకు వరకు 1,822 మంది, పది వేల ర్యాంకు వరకు 2,945 మంది, 20 వేల ర్యాంకు వరకు 5,809 మంది, 30 వేల ర్యాంకు వరకు 5,878 మంది, 40 వేల ర్యాంకు వరకు 5,878 మంది, 50 వేల ర్యాంకు వరకు 5,623 మంది, లక్ష ర్యాంకు వరకు 22,964 మంది, లక్షన్నర ర్యాంకు వరకు 15,045 మంది, చివరి ర్యాంకు వరకు 9,150 మంది సీట్లు సాధించారు. 75,200 మంది సీట్లు పొందిన వారిలో అబ్బాయిలు 41,308 (55 శాతం) మంది, అమ్మాయిలు 33,892 (45 శాతం) మంది ఉన్నారు. ఓసీలు 15,350 (20.4 శాతం) మంది, బీసీలు 39,548 (52.6 శాతం) మంది, ఎస్సీలు 12,671 (16.8 శాతం) మంది, ఎస్టీలు 7,631 (10.2 శాతం) మంది ఉన్నారు.

పాలకుల నిర్లక్ష్యంతోనే ప్రాజెక్టుకు గండి

- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్
- గిరిజన ప్రాంతం పట్ల అధికారుల వివక్ష: సీపీఐ(ఎం) భద్రాద్రి జిల్లా కార్యదర్శి కనకయ్య



నవతెలంగాణ-అశ్వారావుపేట

పాలకుల నిర్లక్ష్యం.. అధికారుల అలసత్వం వల్లే పెద్ద వాగు ప్రాజెక్టుకు గండి పడిందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్‌రావు అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి పెద్దవాగు ప్రాజెక్ట్.. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో వరద ఉధృతికి తెగిన నేపథ్యంలో.. శుక్రవారం సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పుల్లయ్య స్థానిక పార్టీ, సంఘం నాయకులతో పోతినేని కలిసి సందర్శించారు. అనంతరం పోతినేని విలేకర్లతో మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నిర్మించిన ఈ ప్రాజెక్ట్‌ను ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు కావడంతో ఒక కాలువ తెలంగాణ, రెండో కాలువ ఆంధ్రా భూభాగాల్లోకి వెళ్లిందన్నారు. దాంతో రెండు రాష్ట్రాల పాలకులు నిర్లక్ష్యం వహించి నిధులు సక్రమంగా కేటాయించకపోవడంతో నిర్వహణ లేక కాలువల పూడికతీతలు, గేట్ల మరమ్మతులు లేక ప్రాజెక్టుకు ప్రమాదం ఏర్పడిందని తెలిపారు. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, రాష్ట్ర స్థాయి అధికారులు ఉమ్మడి సమావేశం ఏర్పాటు చేసుకొని ఈ ప్రాజెక్టును పునరుద్ధరించాలని ఇరు ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అన్నవరపు కనకయ్య మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్ట్ కాలువలు ఆదివాసీ ప్రాంతంలో ఉండటంతో అధికారులు వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా మరమ్మతులు నిర్వహించి పంటలకు సాగు నీరందించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. పుల్లయ్య మాట్లాడుతూ.. ప్రాజెక్ట్ పూర్తిగా నిర్వహణ వైఫల్యానికి గురైందని, వార్షిక మరమ్మతులు సైతం అధికారులు సరిగ్గా నిర్వహించకపోవడంతోనే గేట్లు సైతం మొరాయించాయని తెలిపారు. అందువల్లే వరద కట్టను తెంచుకుని దిగువ ప్రాంతానికి వరద వెళ్లి నష్టం వాటిల్లిందని అన్నారు.

ఈ వరదలతో పరివాహక పొలాల్లో ఇసుక పేరుకుపోయిందని, దాన్ని తొలగించి రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పరిశీలించిన వారిలో.. తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు అన్నవరపు సత్యనారాయణ, అశ్వారావుపేట, ములకలపల్లి మండలాల సీపీఐ(ఎం) కార్యదర్శులు బుడితి చిరంజీవి, ముదిగొండ రాంబాబు, రైతు నాయకులు ఆళ్ళ నాగేశ్వరరావు ఉన్నారు.

స్టాఫ్ నర్సుల ధర్నా

- కౌన్సెలింగ్‌లో అవకతవకలపై ఆందోళన
- అర్థాంతరంగా వాయిదా వేసిన డీహెచ్
- కోఠి ఉస్మానియా మెడికల్ కళాశాల రోడ్డును దిగ్బంధించిన నర్సులు



నవతెలంగాణ-అంబర్‌పేట

వైద్యారోగ్యశాఖ నిర్వహిస్తున్న హెడ్‌నర్సు, స్టాఫ్ నర్సుల కౌన్సెలింగ్‌లో అవకతవకలు జరగడంతోపాటు.. అర్థాంతరంగా కౌన్సెలింగ్‌ను వాయిదా వేయడంతో నర్సులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని కోఠి ఉస్మానియా మెడికల్ కళాశాల వద్ద పెద్దఎత్తున ధర్నా చేశారు. దాంతో కళాశాల పరిసరాల్లో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. రాష్ట్రంలోని 7 జోన్లకు ఒకేసారి కౌన్సెలింగ్ చేపట్టడంతో హైదరాబాద్ కోఠిలోని ఉస్మానియా మెడికల్ కళాశాల ఆడిటోరియంలో తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ రవీంద్రనాయక్ నేతృత్వంలో జరిగిన ఈ కౌన్సెలింగ్‌లో గ్రేడ్-1 అధికారి సుజాత రాథోడ్ వేదిక పైకి వచ్చి బదిలీల లిస్టును మార్పు చేయించారని తెలియడంతో నర్సులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బదిలీల కౌన్సెలింగ్‌ను పారదర్శకంగా నిర్వహించాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. దాంతో డీహెచ్ రవీంద్రనాయక్ ఈ కౌన్సెలింగ్‌ను తాత్కాలికంగా వాయిదా వేయడంతో వివిధ జిల్లాల నుంచి వచ్చిన వేలాది మంది స్టాఫ్ నర్సులు అసహనం వ్యక్తం చేశారు.కౌన్సెలింగ్‌ను అర్థాంతరంగా నిలిపివేయడంతో ఆగ్రహానికి గురైన దాదాపు 3 వేల మంది స్టాఫ్ నర్సులు ఉస్మానియా మెడికల్ కళాశాల ఎదురుగా ఉన్న రోడ్డును దిగ్బంధనం చేశారు. సుమారు రెండున్నర గంటల పాటు కోఠి పరిసర ప్రాంతాల్లో తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఉదయం నుంచి నర్సుల బదిలీల కౌన్సెలింగ్ కార్యక్రమంలో రసాభాస జరుగుతుంటే పోలీసులు భద్రతా చర్యలను చేపట్టడంలో పూర్తిగా విఫలమైనట్టు విమర్శలు వస్తున్నాయి. చివరకు నారాయణగూడ, అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్ల నుంచి సిబ్బంది రావడంతో తాళ్ల సహాయంతో పోలీసులు స్టాఫ్ నర్సుల ఆందోళనను కొంత మేరకు అదుపు చేశారు.

డీహెచ్ డౌన్‌డౌన్ నినాదాలు

స్టాఫ్ నర్సుల బదిలీల కౌన్సెలింగ్‌ను డీహెచ్ రవీంద్రనాయక్ అర్థాంతరంగా నిలిపివేయడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన నర్సులు ఆగ్రహంతో రోడ్డుపై బైటాయించారు. డీహెచ్ డౌన్ డౌన్ అని నినాదాలు చేశారు. తమకు ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్‌లైన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల అసమర్థత వల్లే కౌన్సెలింగ్ నిలిపి వేశారని విమర్శించారు.

ఇంజినీరింగ్ విద్యార్థులకు దీటుగా కామర్స్ విద్యార్థులు

- మెండుగా ఉపాధి అవకాశాలు : ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి
- ఘనంగా ఓయూ వాణిజ్య విభాగం - 2024



నవతెలంగాణ-ఓయూ

ఇంజినీరింగ్ విద్యార్థులకు ధీటుగా నేడు కామర్స్ విద్యార్థులు ఉపాధి అవకాశాలు పొందుతున్నారని ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి అన్నారు. శుక్రవారం ఓయూలో కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల కామర్స్ విభాగం ఆధ్వర్యంలో కళాశాలలో వాణిజ్య -2024 కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా రాష్ట్రంలోని యూనివర్సిటీ అండ్ పీజీ ఇంటర్ యూనివర్సిటీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా దూరవిద్య, ఒకేషనల్ విద్య ద్వారా కంప్యూటర్ అనుసంధానంతో విద్యా విధానాన్ని బోధనగా మార్చుకోవాలని సూచించారు. కామర్స్ విభాగం ప్రతి సంవత్సరమూ వినూత్న పద్ధతిలో ప్రేరణ పేరుతో డిగ్రీ విద్యార్థులకు, వాణిజ్య పేరుతో పీజీ విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించి నైపుణ్యాలను వెలికితీయడం సంతోషకరమన్నారు. రాష్ట్ర గ్రంథాలయాల పరిషత్ చైర్మెన్ డాక్టర్ రియాజ్ మాట్లాడుతూ.. మన వ్యాపార వాణిజ్యాలు ప్రపంచ నలుమూలలకు వ్యాపించాయని, ఒక్కసారి చరిత్ర గమనిస్తే కరీంనగర్, నిజామాబాద్ ప్రాంతాల నుంచి అరబ్ దేశాల్లో వ్యాపారాలు నిర్వహించారని తెలిపారు. దేశంలో, ఆసియాలో ట్రేడింగ్ సెంటర్ పాయింట్ సెంటర్‌గా తెలంగాణ మారిందన్నారు. అలాగే ఎలక్ట్రానిక్స్ వస్తువుల ఉత్పత్తిలో తెలంగాణ నెంబర్‌వన్‌గా మారి ఆసియా మొత్తానికి మహారాజులా వెలుగొందుతోందన్నారు. దానికి కారణం నిపుణులైన విద్యార్థులు ఈ విభాగం నుంచి రావడమేనన్నారు. కామర్స్ విభాగం హెడ్ వాణిజ్య మాట్లాడుతూ.. ఈ ప్రోగ్రాం కొన్ని సంవత్సరాలుగా సంప్రదాయబద్ధంగా కొనసాగిస్తూ పిల్లల్ని ఉత్తేజపరుస్తూ, సాంకేతిక నైపుణ్యం పెంపొందిస్తున్నదన్నారు. సీనియర్ ప్రొఫెసర్ చిన్నప్ప మాట్లాడుతూ.. విద్యార్థులు పోటీ ప్రపంచంలో నైపుణ్యాన్ని పెంపొందించుకుంటూ ఉద్యోగాలకు అర్హత సంపాదించడానికి వాణిజ్యం-2024 ప్రోగ్రాం ఎంతో ఉపయోగ పడుతుందని తెలిపారు. క్రమశిక్షణతో ఇలాంటి పోటీల్లో పాల్గొనాలని, దురాలవాట్లకు ప్రధానంగా ర్యాగింగ్, డ్రగ్స్, ధూమపానం, మద్యపానాలకు దూరంగా ఉండాలని సూచించారు. భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడమే కార్యక్రమ ప్రధాన ఉద్దేశం అని చెప్పారు.

ఆరు యూనివర్సిటీ నుంచి 8 మంది ఎంకామ్ విద్యార్థులు, ఆరుగురు పీజీ కళాశాలల విద్యార్థులు, ఇతర 312 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులే ప్రత్యేక చొరవతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడాన్ని విభాగం అధ్యాపకులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో వీఎస్‌ఎక్స్ ఎంఎన్‌సి జనరల్ మేనేజర్ డా.సూర్య ప్రవీణ్, ఫౌండర్ చైర్మెన్ అండ్ సీఈవో ఎంవీ నర్సింగ్ రావు ఓయూ విద్యార్థులకు ఇంటర్న్ షిప్‌తోపాటు ఉద్యోగావకాశాలు ఇవ్వడానికి ముందుకు రావడం విశేషం. ఈ కార్యక్రమంలో కామర్స్ డీన్ ప్రొఫెసర్ ఎం. గంగాధర్, కామర్స్ బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మెన్ ప్రొఫెసర్ కె.కృష్ణచైతన్య, కన్వీనర్ ఇంద్రకంటి శేఖర్, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి.శ్రీరాములు, విభాగం అధ్యాపకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

త్వరలో కొత్త రేషన్ కార్డులు

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేండ్లలో రూ.25 వేల కోట్ల రైతు రుణమాఫీ మాత్రమే చేస్తే. తమ ప్రభుత్వం కేవలం ఎనిమిది నెలల్లోనే రూ.31 వేల కోట్ల రైతు రుణాలను మాఫీ చేయబోతోందని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చెప్పారు. శుక్రవారం రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెల్ల రేషన్ కార్డుతో సంబంధం లేకుండా ఇక నుంచి ఆరోగ్యశ్రీ పథకాన్ని అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. ఆరోగ్యశ్రీ, రేషన్ కార్డులను వేర్వేరుగా ఇస్తున్నట్టు చెప్పారు. కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని సైతం ప్రభుత్వం నిర్ణయించిందనీ, అందుకు సంబంధించిన విధివిధానాలను త్వరలో వెల్లడిస్తామన్నారు.

ప్రజావాణికి 545 దరఖాస్తుదారులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 545 దరఖాస్తులు అందాయి. రెవెన్యూ పరమైన సమస్యలపై 95 , పౌరసరఫరాల శాఖకు 84, విద్యుత్ శాఖకు 82, హౌజింగ్‌కు 79 దరఖాస్తులు, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు 47, ఇతర శాఖలకు సంబంధించి 158 దరఖాస్తులు అందినట్టు నోడల్ అధికారి దివ్య తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్ని దరఖాస్తులు స్వీకరించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

సీఎం చైర్మెన్‌గా 'హైడ్రా'

- విపత్తుల నిర్వహణ, ఆస్తుల పరిరక్షణే లక్ష్యం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రకృతి వైపరీత్యాల నియంత్రణ, ఆస్తుల పరిరక్షణ కోసం ముఖ్యమంత్రి చైర్మెన్‌గా హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా)ని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఔటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్‌ఆర్) వరకు హైడ్రాను విస్తరించారు. ఓఆర్‌ఆర్‌కు అవతల ఉండే ప్రాంతాన్ని తెలంగాణ కోర్ అర్బర్ రీజియన్ (టీసీయూఆర్)గా ఏర్పాటు చేస్తూ, దానికి పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శిని చైర్మెన్‌గా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు ఇచ్చారు. రెండు విభాగాలకు సంబంధించిన విధివిధానాలను ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. హైదరాబాద్ మహా నగరంలో ఏటా 3.2 శాతం జనాభా పెరుగుతున్నదనీ, దీనివల్ల శివారు ప్రాంతాల్లో వేగవంతమైన అభివృద్ధి జరుగుతున్నదని తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ)తో పరిధితోపాటు ఔటర్ రింగ్ రోడ్డు వరకు విస్తరించి ఉన్న హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, సంగారెడ్డి ప్రాంతాలకు హైడ్రా వర్తిస్తుందని వివరించారు. పార్కులు, లే అవుట్ ఖాళీ స్థలాలు, ఆటస్థలాలు, చెరువులు, నాలాలు, రోడ్లు, ఫుట్‌పాత్‌లు వంటివి ఆక్రమణలకు గురికాకుండా, హైడ్రా పరిరక్షించాల్సి ఉంటుందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పై ప్రాంతాల్లోని ఆక్రమణలను సంబంధిత విభాగాల అనుమతితో తొలగిస్తారు. అలాగే భవన నిర్మాణాలు నిర్దేశిత ప్లాన్ ప్రకారం జరిగేట్టు చూడటం కూడా ఈ విభాగం విధుల్లో ఒకటి. హైడ్రాలో సీఎం చైర్మెన్‌గా పలు విభాగాల ఉన్నతాధికారులతో కలిపి 12 మందితో బోర్డును ఏర్పాటు చేశారు. టీసీయూఆర్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సబ్‌కమిటీలో పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి చైర్మెన్‌గా వ్యవహరిస్తారు. దీనిలోనూ పలు ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు సభ్యులుగా ఉంటారు. హైడ్రా ద్వారా ట్రాఫిక్ నిర్వహణ, నీరు నిలిచిన ప్రాంతాల గుర్తింపు, రోడ్ల మరమ్మతులు, విపత్తుల నియంత్రణ వంటి విధులు నిర్వహిస్తారు.ఈ రెండు విభాగాలకు ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయిస్తుంది. దానితో పాటు హైడ్రాలో భాగస్వామ్యమైన వివిధ ప్రభుత్వ శాఖలు వసూలు చేసే పన్నుల్లో కొంత వాటాను దీనికి కేటాయిస్తారు.

జర్నలిస్టు కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి ఎన్నికలు జరపండి

- కో ఆపరేటివ్ కమిషనర్‌కు జర్నలిస్టుల వినతి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

జర్నలిస్టు కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి హైకోర్టు ఉత్తర్వుల మేరకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని (జెసీహెచ్‌ఎస్‌ఎల్) కోర్ కమిటీ కో ఆపరేటివ్ కమిషనర్ మరియు రిజిస్ట్రార్ కో ఆపరేటివ్ సొసైటీస్ పి.ఉదయ్‌కుమార్‌ను కోరింది. ఈమేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో కోర్ కమిటీ సభ్యులు బ్రహ్మాండబేరి గోపరాజు, భీమగాని మహేష్ గౌడ్, సునీత, గయాస్ పాషా, గుడిగ రఘు, పి.సాగర్, పర్వీన్, ఎం.శ్రీనివాస్, రామకృష్ణ, కె.రాజు, విఘ్నేశ్వర్ రావు, మునిరాజు తదితరులు కలిసి కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. గత నాలుగేండ్లుగా ఎన్నికలు జరపకపోవడంతో సభ్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. నాన్ అలాటీ సభ్యులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం సొసైటీలో సభ్యత్వం ఉన్న ప్రతి ఒక్కరికీ ఎన్నికలలో ఓటు హక్కు కల్పించాలని కోరారు. నాలుగు నెలల లోపు ఎన్నికలు పూర్తి చేయాలని కోరగా కమిషనర్ సానుకూలంగా స్పందించారు. అధికారులతో మాట్లాడి సాధ్యమైనంత త్వరగా తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నిత్యం అనేక ఇబ్బందులు పడుతూ జర్నలిస్టు వృత్తిలో కొనసాగుతూ ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉంటున్న జర్నలిస్టులకు వెంటనే ఇండ్ల స్థలాలు ఇవ్వాలని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బండ్లగూడ ఆర్టీసీ డిపో మేనేజర్ బదిలీ

నవతెలంగాణ- నాగోల్

నాగోలు డివిజన్‌లోని టీజీఎస్ఆర్టీసీ డిపో మేనేజర్ ఎన్. రమేష్ బండ్లగూడ డిపో నుండి ఫలక్‌నూమ డిపోకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం బండ్లగూడ ఆర్టీసీ డిపోలో ఉద్యోగులు పెద్ద ఎత్తున హాజరై డిపో మేనేజర్ రమేష్‌ను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. అనంతరం నూతన డిపో మేనేజర్‌గా వెంకటేశం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిపో అధికారులు పావని, వెంకటేశ్వర్లు, వికే రెడ్డి, నాగార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రైతులకు రుణమాఫీ చేయడం పట్ల హర్షం

సహకార బ్యాంక్ చైర్మెన్ మర్రి నర్సింహారెడ్డి

నవతెలంగాణ-బడంగ్‌పేట్

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు ది భాగ్యనగర్ రైతు సేవ సహకార సంఘం బ్యాంకు చైర్మెన్ మర్రి నర్సింహారెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్‌గుల్ గ్రామంలోని ది భాగ్యనగర్ రైతు సేవ సహకార సంఘంలోని 361 రైతలకు రూ.2 కోట్ల12 లక్షలకు గాను 99 మంది రైతలకు రూ.42లక్షల76 వేల రూపాయల రుణమాఫీ కావడం జరిగిందన్నారు. ఈ డబ్బులను రైతుల రుణ ఖాతాల్లోకి జమచేయడం జరిగిందని తెలిపారు.



నేటి బాలలే రేపటి భావి భారత పౌరులు

• మేయర్ పారిజాత నర్సింహారెడ్డి





నవతెలంగాణ-బడంగ్‌పేట్

నేటి బాలలే రేపటి భావి భారత పౌరులు అని మేయర్ పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న బాలాపూర్‌లోని అమ్మ మాట- అంగన్‌వాడీ బాట అనే కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి శుక్రవారం ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డితో కలిసి అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. ఇంకా పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతును రాజు చేయడమే కాంగ్రెస్ లక్ష్యం





నవతెలంగాణ-హయత్ నగర్

రైతులకు రుణమాఫీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఎల్బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి శుక్రవారం పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ఆదివాసి గిరిజన వైస్ చైర్మెన్ గాంధీ నాయక్, రామావత్ చందు నాయక్, కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ కార్యదర్శి శ్రీనివాస్ నాయక్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, రాజు, నాయక్, భూక్య రమావత్ కుమార్ నాయక్, సురేష్ నాయక్, సంతోష్ నాయక్, నాగయ్య, సిద్దు పాల్గొన్నారు.

నవతెలంగాణ - చైతన్యపురి

రైతును రాజు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, రుణమాఫీ చేస్తే హరీశ్ రావు తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ప్రగల్భాలు పలికాడని వెంటనే రాజీనామా చేయాలని మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కేఎల్ఆర్ అన్నారు. ఆర్కేపురంలోని ఎన్టీఆర్‌నగర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేఎల్ఆర్, టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేఎల్ఆర్ మాట్లాడుతూ రైతుల రుణమాఫీపై మాట ఇచ్చి నిలబెట్టుకున్నామని హర్షం వ్యక్తం చేశారు. ఏక కాలంలో ఆగస్టు 15 లోపు రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని, ప్రకటించిన తేదీలోపే సంపూర్ణంగా రుణమాఫీ చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పున్న గణేష్, బండి మధుసూదన్, జ్ఞానేశ్వర్ యాదవ్, కిరణ్, రమేష్ నేత, అక్బర్, లింగ స్వామి, దుబ్బాక శేఖర్, రాజు నాయక్, శేఖర్ ముదిరాజ్, కళ్యాణ్, పెదపూర సైదులు, మహేం దర్, నబీ, శ్రీశైలం, శ్రీకాంత్ రెడ్డి, సలీం, పాషా, షఫీ, పటేల్, ప్రేమ్, భాస్కర్, రవి,నాను, నగేష్, పాండు, అనిల్, శశి, విప్లవ్, అంజిరెడ్డి, లక్ష్మీ, రేణుక, మాధవి, సంతోష, రమ, కవిత, జయశ్రీ, జయమ్మ, శ్వేత, స్వరూప, శైలజ, శానజ్ బేగం, మంగ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-బడంగ్‌పేట్

గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్ రెడ్డి రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేశాడని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి, మేయర్ పారిజాత నర్సింహారెడ్డిలు అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్‌గుల్ గ్రామంలో కార్పొరేషన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సుభాన్ యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 11 లక్షల మంది రైతుల అకౌంట్లో రూ.6098 కోట్ల రుణమాఫీ నిధులు విడుదల చేశామని పేర్కొన్నారు. వ్యవసాయానికి పునర్వైభవం తీసుకువచ్చి, రైతుల కళ్ళల్లో ఆనందం చూడాలన్నదే సీఎం రేవంత్ రెడ్డి తపన అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్ రెడ్డి, పెద్దబావి సుదర్శన్ రెడ్డి, రాళ్ల గూడెం శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బోయపల్లి గోవర్ధన్ రెడ్డి, కొలన్ తిరుపతిరెడ్డి, పుట్టగల జగన్, కందాడి శ్రీరామ్ రెడ్డి, బాల్ లింగని జంగయ్య, గట్టు బాలకృష్ణ, విజయకుమార్, అమృత నాయుడు, అరుణ్ రెడ్డి, నరహరి తదితరులు పాల్గొన్నారు.



మీర్‌పేట్ డిప్యూటీ మేయర్‌పై వీగిన అవిశ్వాసం



నవతెలంగాణ - మీర్ పేట్

మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయిన ఘటన మరువక ముందే మళ్లీ బీజేపీ, కాంగ్రెస్ పార్టీల కార్పొరేటర్లు మరోసారి డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డిపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. సరైన కోరం లేకపోవడంతో మరోసారి భంగపడ్డారు బీజేపీ, కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు. మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ అవినీతికి పాల్పతూ అభివృద్ధికి ఆటంకంగా మారారని ఆరోపణలు చేస్తూ గత నెలలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన కార్పొరేటర్లు కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మానం నోటీస్ అందజేశారు. కలెక్టర్ జూలై 19వ తేదీన సమావేశ నిర్వహణకు ఆదేశించారు. దీంతో ప్రిసైడింగ్ అధికారిగా కందుకూర్ ఆర్డీవో సూరజ్ కుమార్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బీజేపీ కార్పొరేటర్లు 21మందికి 19మంది, కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు 11మందికి 7మంది హాజరయ్యారు. మొత్తం 46మంది కార్పొరేటర్లు ఉండగా అవిశ్వాసం నెగ్గడానికి కోరం 31మంది కార్పొరేటర్లు అవసరం. కానీ సమావేశానికి 26మంది రావడంతో కోరం సభ్యులు లేక అవిశ్వాసం తీర్మానం వీగిపోయినట్లు ప్రిసైడింగ్ అధికారి సూరజ్ కుమార్ ప్రకటించారు. ఈసారైనా అవిశ్వాసం నెగ్గాలని ఆశతో ఉన్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు అవిశ్వాసం వీగిపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. అనంతరం బీజేపీ నాయకులు, కార్పొరేటర్లు మీడి యాతో మాట్లాడుతూ...అవిశ్వాసం ఓడిపోయిన ప్రజల సమస్యలపై నిరంతరం పని చేస్తామన్నారు.కార్పొరేషన్ అభివృద్ధి కోసం కృషి చేస్తామని బీజేపీ అధ్యక్షుడు పెండ్యాల నర్సింహా అన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

• కార్పొరేటర్ సుజాతా నాయక్



నవతెలంగాణ - హస్తినాపురం

వర్షాకాలం దృష్ట్యా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, రోగాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోత్ సుజాతా నాయక్ అన్నారు. హనుమాన్ నగర్ కాలనీలో శుక్రవారం ఎంటమాలజి సిబ్బంది బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్రైడే-డ్రై డే కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. వర్షాకాల నేపథ్యంలో దోమల నియంత్రణకు తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తల గురించి కాలనీ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించినట్టు తెలిపారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంలో ప్రతి ఒక్కరూ స్వీయ బాధ్యత వహించాలన్నారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని డివిజన్ ప్రజలకు తెలియజేసేలా సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, సతీష్ గౌడ్, నరసింహ, గంధం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'22న చలో కలెక్టరేట్ ముట్టడి'



నవతెలంగాణ-చైతన్యపురి

ఈ నెల 22న నిర్వహించనున్న ఛలో కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ ఎల్బీనగర్ డివిజన్ అధ్యక్షులు, కార్యదర్శులు అరుణ్, స్టాలిన్‌లు పిలుపునిచ్చారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఎల్బీనగర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను వెంటనే విడుదల చేయాలని కోరుతూ సరూర్‌నగర్ గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో శుక్రవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 8214 కోట్ల రూపాయల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని అన్నారు. రంగారెడ్డి జిల్లాకు 730 కోట్ల రూపాయలు బకాయిలు ఉన్నాయని చెప్పారు.రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేరికల మీద పెట్టిన అంత శ్రద్ధ.. విద్యార్థుల భవిష్యత్ మీద పెడితే విద్యార్థుల జీవితాలు మెరుగుపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ సభ్యులు పవన్ యాదవ్, శ్రీకాంత్, నవీన్, ఉదయ్, సురేష్, సాయి, శివ వెంకటేష్ తదరులు పాల్గొన్నారు.

మోకాళ్లపై మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన

నవతెలంగాణ-హయత్‌నగర్

అక్షయ పాత్ర స్వచ్ఛంద సంస్థకు మధ్యాహ్న భోజన పథకాన్ని అప్పగించకుండా చూడాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం హయత్ నగర్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద భోజన కార్మికులు మోకాళ్లపై నిలబడి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు గుండె శివకుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అక్షయ పాత్రకు మధ్యాహ్న భోజనం అప్పచెప్పడం సరికాదన్నారు. విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించడం కోసం ప్రభుత్వం కృషి చేయాలని, కార్మికుల పొట్ట కొట్టడం సరికాదని, పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు ఉమా, రమాదేవి, కవిత, రాధిక, సుశీల తదితరులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యలు పట్టించుకోండి

సీపీఐ(ఎం) గ్రామ శాఖ అధ్యక్షుడు శివకుమార్



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్

గ్రామ పంచాయతీ పరిధిలోని వివిధ కాలనీలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోవాలని సీపీఐ(ఎం) గ్రామ శాఖ అధ్యక్షుడు జి. శివకుమార్ అన్నారు. ఈ మేరకు అబ్దుల్లాపూర్ మెట్‌లో శుక్రవారం మీడియాతో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీ పరిధిలో డ్రెయినేజీ, రోడ్లు, మొదలగు మౌలిక సదుపాయాలు, సమస్యలను గుర్తించి పరిష్కరించాలని కోరారు. ప్రస్తుత వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పారిశుద్ధ సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను కోరారు. సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవరిస్తే గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు యాదయ్య, జమీల్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

అవిశ్వాసం వీగేందుకు
సహకరించిన అందరికీ ధన్యవాదాలు

డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి



నవతెలంగాణ - మీర్‌పేట్

మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ తనపై పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. తన ఆలోచన చతురతతో అన్ని విధాలా అనునిత్యం నా వెంట ఉండి కార్పొరేషన్ అభివృద్ధిలో మెరుగైన పనితీరు కనబరిచేవిధంగా కృషి చేసిన ఎమ్మెల్యే పట్లోల్ల సబితా ఇంద్రారెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తనతో ఉన్న మీర్‌పేట్ కార్పొరేషన్ మేయర్ యం దుర్గా, ఫ్లోర్ లీడర్, నాతోటి కార్పొరేటర్లకు, నా శక్తి సామర్థ్యాలు నా పని తీరు మెచ్చి డిప్యూటీ మేయర్ గా నేను ఉంటే ఇంకా అభివృద్ధి జరుగుతుందని నన్ను నమ్మి నాపై బాధ్యతలను ఉంచి మరింత సమర్థవంతంగా నెరవేర్చాలని అభివృద్ధికి తోడ్పాటును అందించేందుకు అవకాశం ఇచ్చిన ప్రతి ఒక్కరీ ధన్యవాదాలు చెప్పారు. అధికార దాహంతో ఎలాగైన కుయుక్తులు పన్ని అధికారాన్ని చేజిక్కించుకుందామని కొందరు కార్పొరేటర్లు చేశారని తెలిపారు. సమర్థత కల్గిన నాయకుడు ఉంటేనే మాకు అభివృద్ధి జరుగుతుందని భావించి సరైన నాయకత్వానికి నిలబెట్టినందుకు మరింత బాధ్యత పెరిగిందని పేర్కొన్నారు.

'నేడు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన'



నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.38 కోట్లతో పలు అభివృద్ధి పనులకు నేడు (శనివారం) శంకుస్థాపనలు చేస్తున్నట్టు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కిచ్చేన్నగారి లక్ష్మారెడ్డి తెలిపారు. బడంగ్‌పేట్ మున్సిపల్ పరిధిలో జరిగే నిర్మాణ పనులను మేయర్ పారిజాత నర్సింహారెడ్డితో కలిసి శుక్రవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం ఉదయం 9 గంటలకు వివిధ అభివృద్ధి పనుకు రాష్ట్ర ఐటీ శాఖ, భారీ పరిశ్రమల శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, చేవెళ్ళ పార్లమెంట్ సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మేయర్ పారిజాత నర్సింహారెడ్డిలు శంకుస్థాపనలు చేస్తారని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి అధికారులు, బడంగ్ పేట్ కార్పొరేషన్ కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ కంటెస్టెంట్ కార్పొరేటర్లు, యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్‌యుఐ నాయకులు తదితరులు హాజరుకావాలని కోరారు.

ఎల్బీనగర్‌లో కుక్కల నివారణకు చర్యలేవి..?



నవతెలంగాణ - ఎల్బీనగర్

జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ జోన్ పరిధిలో కుక్కల నివారణ కోసం తీసుకుంటున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. రోజురోజుకూ వీధి కుక్కలు పెరుగుతున్నాయి. కుక్కల సంతాన ఉత్పత్తి నివారణ కోసం జీహెచ్ఎంసీ వెటర్నరీ విభాగం అధికారులు స్టెరిలైజేషన్(కుక్కల కుటుంబ నియంత్రణ ఆపరేషన్) చేస్తున్నారు. కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా కుక్కల సంఖ్య నగరంలో తగ్గడం లేదు. కుక్కల నివారణ కోసం అందరు ఒక్కటే ఆలోచన చేయాలని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. స్టెరిలైజేషన్ చేసినా నగరంలో కుక్కల సంఖ్య తగ్గడం లేదు. గత పది సంవత్సరాల నుంచి జీహెచ్ఎంసీ కోట్ల రూపాయలు ఖర్చు చేసినా కుక్కల ఉత్పత్తి నివారణ తగ్గలేదు. ఉన్నతాధికారులు దీనిపైన ఆలోచన చేయకపోవడంతో క్షేత్రస్థాయిలో జరుగుతున్న వ్యవహారం, అధికారులు తీసుకుంటున్న చర్యలు కుక్కల ఉత్పత్తిని తగ్గించలేకపోతున్నాయి. కుక్కలు చిన్నారులపై చేస్తున్న దాడులను అధికారులు నివారించలేకపోతున్నారు. అనేకమంది కుక్కల దాడుల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. దీనిపైన ఇటీవల హైకోర్టు సీరియస్ అయింది. జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ జోనల్ పరిధిలోని ఐదు సర్కిల్లో కుక్కల ఆపరేషన్ కోసం, వాటి ఆహారం కోసం కోట్లు ఖర్చు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో కుక్కల నివారణ తగ్గడం లేదు. పూర్తిగా వెటర్నరీ విభాగం పైనే ఉన్నతాధికారులు ఆధారపడుతున్నారు. వెటర్నరీ విభాగం పని పైన పరిశీలన చేయడం లేదు. క్షేత్రస్థాయిలో పరిశీలించక పోవడంతోనే నగరంలో కుక్కల బెడద తీవ్రంగా నెలకొంది. వాటి నివారణ కోసం సరైన చర్యలు తీసుకోకపోవడంతో రోజురోజుకూ నగరంలో కుక్కల ఉత్పత్తి పెరుగుతున్నది. 3. 79 లక్షల కుక్కలకు స్టెరిలైజేషన్ చేసినట్లు అధికారులు తెలుపుతున్నారు. ఇన్ని లక్షల కుక్కలకు సంతాన ఉత్పత్తి కాకుండా ఆపరేషన్ చేస్తుంటే.. ఎందుకు గత పది సంవత్సరాల నుండి కుక్కల ఉత్పత్తి పెరిగింది అనే ఆలోచన చేయడం లేదు. ఆపరేషన్లన్నీ కాగితాలకే పరిమితమైనవి అని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కుక్కలకు ఆపరేషన్ చేయకుండానే ఆపరేషన్ చేసినట్లు కాగితాలపై చూపిస్తున్నట్టు పలువురు ఆరోపణలు చేస్తున్నారు. ఉన్నతాధికారులు విచారణ జరిపిస్తే అసలు విషయం వెలుగులోనికి వచ్చే అవకాశం ఉన్నది.

కాలనీలో కుక్కలను ఎల్బీనగర్‌లోని పతుల్లాగూడలోని కుక్కల నివారణ కేంద్రానికి తరలించి ఆపరేషన్ చేస్తున్నారు. కాలనీలోని కుక్కలను బంధించి తీసుకెళ్లినట్లు కుక్కలకు ఆపరేషన్ చేసినట్లు, వారం రోజులు ఆహారం పెట్టినట్లు అన్ని కాగితాల మీదనే ఉంటాయి అనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో తిరిగి కుక్కల నివారణ కోసం రోజు చర్యలు తీసుకోకపోవడంతోనే ఎల్బీనగర్ జోన్ పరిధిలో కుక్కల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుంది. కుక్కలు ఉన్నాయని ఫిర్యాదు వస్తేనే అధికారులు స్పందిస్తు న్నారు. రోజూ క్షేత్రస్థాయిలో తిరిగి కాలనీలో పర్యటిస్తూ కుక్కలకు స్టెరిలైజేషన్ అయ్యిందా లేదా అని తెలుసుకోవడంలో అధికారుల విఫలం అవుతున్నారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు కుక్కల నివారణపైన దృష్టి సారించి, కుక్కల నుండి ప్రజల ప్రాణాలు రక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు కోరుతున్నారు.

కబ్జాలకు పాల్పడితే చర్యలు తప్పవు

• జీహెచ్ఎంసీ ఈవీడీఎం కమిషనర్ ఏవి రంగనాథ్



నవతెలంగాణ- నాగోల్

చెరువుల కబ్జాలకు పాల్పడితే చర్యలు తప్పవని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జీహెచ్ఎంసీ ఎన్ఫోర్స్మెంట్, విజిలెన్స్, డిజాస్టర్ మేనేజ్మెంట్(ఈవీడీఎం) కమిషనర్ ఏవీ రంగనాథ్ హెచ్చరించారు. నాగోలు డివిజన్ పరిధిలోని బండ్లగూడ ఫతుల్లాగూడ చెరువు కబ్జాకు గురవుతుందని స్థానికుల ఫిర్యాదు మేరకు శుక్రవారం ఈవీడీఎం కమిషనర్ ఏవీ రంగనాథ్ చెరువు ప్రాంతాన్ని మేడ్చల్, రంగారెడ్డి జిల్లా రెవిన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫతుల్లాగూడ గ్రామ చెరువు ఎఫ్‌టీఎల్ లో కొంతమంది అక్రమ లే అవుట్ చేసి ఇండ్లు కట్టి అమాయక ప్రజలకు విక్రయిస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేయడంతో స్వయంగా వచ్చి పరిశీలించినట్టు తెలిపారు. తర్వాత చెరువు కబ్జాపై ఆరోపణలు ఎదుర్కుంటున్న వ్యక్తి డాక్యుమెంట్స్‌ను పరిశీలించినట్టు తెలిపారు. గతంలో ఇక్కడ చెరువు రక్షణ కోసం పెన్సింగ్ ఉన్నప్పటికీ ఆ పెన్సింగ్ కూడా తొలగించారని, తప్పుడు సర్వే నెంబర్లతో ప్రభుత్వ స్థలం కబ్జా చేస్తున్నారని స్థానికులు వివరించినట్టు తెలిపారు. మరో మూడు రోజుల్లో తాను వచ్చి డాక్యుమెంట్స్ పరిశీలించి లీగల్ యాక్షన్ తీసుకుంటానని తెలిపారు. వీఆర్ఏ కొడుకు కబ్జాకు సహకరిస్తున్నట్లు స్థానికులు తన దృష్టికి తీసుకొచ్చారని పేర్కొన్నారు. చెరువు స్థలంలో ఎవరైనా కబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం అక్కడికి వచ్చిన అబ్దుల్లాపూర్‌మెట్ రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను ప్రభుత్వ స్థలం కబ్జాకు గురవుతుంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. తర్వాత ఫతుల్లాగూడలోని డీఆర్ఎఫ్ కేంద్రాని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అసిస్టెంట్ ప్లానర్ కే. శ్రీనివాస్, రీజినల్ ఫైర్ అధికారి పాపయ్య, ఇతర రెవెన్యూ, జీహెచ్ఎంసీ, డీఆర్ఎఫ్ సిబ్బంది, పతుల్లాగూడ గ్రామస్తులు కాటేపాక జంగయ్య, కటేపాక రవి, యాదయ్య, కిషన్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

'కాలనీ సమస్యలు పరిష్కరిస్తా'



నవతెలంగాణ - వనస్థలిపురం

హయత్‌నగర్ డివిజన్ పరిధిలో ఉన్న కాలనీల సమస్యలను పరిష్కరిస్తానని కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అన్నారు. హయత్‌నగర్ డివిజన్ ఆటో సాయినగర్‌లో మార్నింగ్ వాక్‌లో భాగంగా శుక్రవారం కార్పొరేటర్ పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కార్పొరేటర్ మాట్లాడుతూ సంబంధిత జలమండలి మేనేజర్‌తో మాట్లాడి తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. భూగర్భ డ్రయినేజీ పైప్ లైన్లు ఒకవైపు ఉండడంతో తరచూ కాలనీలో వాటర్ పొల్యూషన్ ఏర్పడడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని స్థానికులకు భరోసా ఇచ్చారు. ఈ పర్యటనలో కాలనీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, సత్యనారాయణ, శంకర్ గౌడ్, రాములు, లక్ష్మణ్ బాబు, శివా రెడ్డి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

జలమండలి ఎండీకి ఎమ్మెల్యే వినతిపత్రం



నవతెలంగాణ-మల్కాజిగిరి

మల్కాజిగిరి నియోజక వర్గంలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న భూగర్భ డ్రయినేజీ పనులు, మంచినీటి పైపులైన్‌లు, రిజర్వాయర్ ‹ర్మించాలని ప్రతిపాదనలతో కూడిన వినతి పత్రాన్ని జలమండలి ఎండీ అశోక్ రెడ్డికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలోఅనిల్ కిషోర్ గౌడ్, రాము యాదవ్, డోలి రమేష్ అమీనుద్దిన్, డిల్లి పరమేష్, శరణగిరి, వెంకటేష్ యాదవ్, సందీప్ రెడ్డి, సతీష్,హనుమాన్ చారి,రమేష్ చారి, రాజన్న తదితరులున్నారు.

సీపీని కలిసిన బోడుప్పల్ మేయర్



నవతెలంగాణ-బోడుప్పల్

బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ శుక్రవారం రాచకొండ పోలీస్ కమీషనర్ సుధీర్ బాబును ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అజయ్ మాట్లాడుతూ శాంతి భద్రతల అంశంలో పోలీసుల కృషి అమోఘమైందని అన్నారు. సీపీని కలిసిన వారిలో కార్పొరేటర్లు కె.కిరణ్ కుమార్ రెడ్డి, సుమన్ నాయక్ పాల్గొన్నారు.

కాలనీలలో కార్పొరేటర్ పాదయాత్ర



నవతెలంగాణ-అల్వాల్

133 డివిజన్ కార్పొరేటర్ జితేంద్రనాథ్ కాలనీలలో అధికారులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. కాలనీ రెసిడెంట్స్ సంక్షేమ సంఘం సభ్యులతో చిన్నన్న తోట, పాత అల్వాల్ వద్ద అంతర్గత రోడ్లు, పారిశుధ్యం, భూగర్భ డ్రయినేజీ వ్యవస్థ గురించి నివాసితులు తమకు అవసరమైన చోట మరమ్మతులు చేపట్టాలని అభ్యర్థించారు.

అత్యవసర ప్రాంతాలలో ప్రాతిపదికన పనులు చేపట్టాలని ఇందుకు సంబంధిత శాఖలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 133 డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ బృందం శ్రీశైలం యాదవ్, సురేందర్‌రెడ్డి, శ్రీశైలం, కొండయ్య, సంతోష్‌రెడ్డి, సంపత్ యాదవ్, విష్ణు, వెంకటేష్, నవీన్, శకుంతల, విజయ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు. ఆర్‌డబ్ల్యూఏ పూర్వ చందర్, యాదగిరి, శ్రవణ్, దుర్గా రెడ్డి, వెంకట్ రావు, బలరాం, నర్సింగ్, రాము తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర ఓబీసీ
కార్యవర్గ సభ్యులు విరోభకు సన్మానం

నవతెలంగాణ-మల్కాజిగిరి

నూతన రాష్ట్ర ఓబీసీ కార్యవర్గ సభ్యులుగా నియమితులైన విరోభను గౌతమ్ నగర్ 141 డివిజన్ సభ్యులు నాయకులు ఘనంగా సత్కరించారు. అంతకుముందు జ్యోతి రావు పూలే విగ్రహాలకు పూల మాల వేసి వారి సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. విరోభ మాట్లాడుతూ బీజేపీ కార్యవర్గ అభివృద్ధి విస్తరణలో తనకి ఇచ్చిన బాధ్యతను నిర్వహిస్తానని, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వాసం శెట్టి శ్రీనివాస్, జి.ఆనంద్ ,కార్పొరేటర్ శ్రావణ్, ఎస్సీ మోర్చ నాయకులు బండారి రవి, జిల్లా నాయకులు బాల సుబ్రహ్మణ్యం, డివిజన్ ప్రెసిడెంట్ లక్ష్మణ్ రావు, అమర్నాథ్ , జై శ్రీ రామ్ కిరణ్, నరసింహ చారి తదితరులు పాల్గొన్నారు.

జవహర్ నగర్‌లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్..

- టోల్ ఫ్రీ నెంబర్లు 9963996908, 8074064746
- మున్సిపల్ కమిషనర్ తాజ్ మోహన్ రెడ్డి



నవతెలంగాణ - జవహర్ నగర్

జవహర్ నగర్‌లో ప్రజల సౌకర్యార్థం శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ చేపట్టామని అందులో భాగంగా టోల్ ఫ్రీ నెంబర్లను ఏర్పాటు చేశామని, ప్రజలు వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ తాజ్ మోహన్ రెడ్డి కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల కుక్కల దాడిలో బాబు చనిపోవడం రాష్ట్ర వ్యాప్తంగా అందరిని కలచివేసిందని, అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలన్న సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు అందుకు చర్యలు తీసుకున్నామన్నారు. జవహర్ నగర్ పరిధిలో వర్షా కాలం దృష్ట్యా, కుక్కల బెడద ఎక్కువ ఉన్నందున స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. పట్టణంలో కుక్కలను యాంటీ డాగ్ బృందాల సహాయంతో వార్డుల వారీగా పట్టుకుంటున్నామని చెప్పారు. కుక్కల విషయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజల సహాయం కోసం మున్సిపల్ కార్యాలయంలో సందీప్ ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ నెంబర్ 9963996908, కృష్ణప్ప శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ 8074064746 టోల్ ఫ్రీ నెంబర్లకు ప్రజలు ఫిర్యాదులు చేయవచ్చన్నారు.

విద్యార్థులకు ఉచిత నోట్‌బుక్‌ల పంపిణీ



నవతెలంగాణ-అల్వాల్

అల్వాల్ ప్రభుత్వ పాఠశాలలో ప్రైమరీ విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్‌ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం సమాజసేవకుడు ప్రదీప్ అరుణోదయ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య అందరికీ అందుబాటులో ఉండాలని, నోట్‌బుక్‌ల పంపిణీ ద్వారా విద్యార్థులకు చిన్న సహాయం చేయాలనుకున్నానని తెలిపారు. ప్రతి విద్యార్థి బాగా చదువుకోవాలని, మంచి స్థానాని చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ ప్రదీప్ అరుణోదయ్ కార్యక్రమం అభినందనీయమని చెప్పారు.

'రైతు రుణమాఫీ చారిత్రాత్మకం'



నవతెలంగాణ-హైదరాబాద్ డెస్క్

రైతు రుణమాఫీ చారిత్రాత్మకమని కాంగ్రెస్ మూడు చింతలపల్లి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బండి జగన్నాథం హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం మూడు చింతలపల్లి మండలం లక్ష్మాపూర్‌లో కాంగ్రెస్ నాయకులు, ఉద్దేమర్రి గ్రామంలో రైతు సంఘం ఆధ్వర్యంలో రైతు రుణమాఫీ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, రైతులు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు కటికల గోపి, సీ‹యర్ నాయకులు వీరేశం గుప్తా, కొమ్ము లక్ష్మణ్, సంతోష్ గౌడ్, కటికల వెంకటస్వామి, జయాల పాండు, కమ్మరి అశోక్, రైతు సంఘం అధ్యక్షులు ఎస్.మల్లారెడ్డి మాజీ అధ్యక్షులు పి.బాల నరసింహ డి.వెంకటేష్ ఎన్. విష్ణు పి.బలరాం రెడ్డి పి.వెంకట్రెడ్డి ఎన్.ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీపీ ఎలక్ట్రీషియన్‌ను ఆదుకోవాలి

- సీఐటీయూ మండల కార్యదర్శి ఎన్ సబిత



నవతెలంగాణ-ఘట్కేసర్

విధి నిర్వహణలో ప్రజలకు ప్రత్యక్ష సేవలందిస్తూ విద్యుత్ స్తంభంపై నుంచి ప్రమాదవశాత్తు కింద పడి గాయాలపాలైన ఎలక్ట్రీషియన్ అల్లం సుధాకర్‌ను ప్రభుత్వం ఆదుకోవాలని, వైద్య ఖర్చులు భరించి ఆర్థిక సహాయం అందజేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఎన్ సబిత డిమాండ్ చేశారు. ఘట్ కేసర్ మండలం ఎదులాబాద్ గ్రామంలో విధి నిర్వహణలో భాగంగా విద్యుత్ స్తంభం ఎక్కి లైట్లు ఫిట్ చేస్తున్న సమయంలో అల్లం సుధాకర్ కింద పడి గాయాల పాలైనాడని ఆవేదన వ్యక్తం చేశారు. సూరారం మల్లారెడ్డి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఎలక్ట్రీషియన్‌ను ఐద్వా మండల అధ్యక్షురాలు జి నాగమణితో కలిసి వారు పరామర్శించారు ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సబిత మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో పుట్టిన అల్లం సుధాకర్ కుటుంబం ప్రస్తుతం పోషణ భారంగా జీవిస్తున్నారని, పంచాయతీ కార్మికులకు చాలీచాలని వేతనాలు అందుతున్నాయని, అవి కూడా గత 8నెలలుగా పెండింగ్ లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు గతంలో అనేకమంది పంచాయతీ కార్మికులు ప్రమాదవశాత్తు మరణించినా నయా పైసా ఆ కుటుంబాలకు అందలేదన్నారు. దీనితో ఆ కుటుంబాలు రోడ్డున పడ్డప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు ప్రజలక‹ ప్రత్యక్ష సేవలందిస్తున్న క్రమంలో జరిగిన ప్రమాదాలకు ప్రభుత్వమే బాధ్యత వహించి, ఆ క‹టుంబాలక‹ ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనం ఇచ్చి, పీఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు ప్రమాదంలో మరణించిన వారికి పది లక్షల రూపాయలు ఎక్స్ గ్రేషియో క్షతగాత్రులైన వారికి రూ. ఐదు లక్షల నష్ట పరిహారం చొప్పున ప్రమాద బీమా కల్పించాలని కోరారు.

3న సాయి సేవా సంఘ్
ఆర్గనైజేషన్ 35వ వార్షికోత్సవ వేడుకలు



- ముఖ్య అతిథిగా రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

నవతెలంగాణ-సిటీబ్యూరో

నిరుపేద పిల్లలు, మహిళల సాధికారత, చదువు కోసం కృషి చేస్తున్న సాయి సేవా సంఘ్ సామాజిక సేవా సంస్థ 35వ వార్షిక వేడుకలను ఆగస్టు 3వ తేదీన మాదాపూర్‌లోని శిల్పకళా వేదికలో సాయంత్రం 6 గంటలకు టచింగ్ హార్ట్స్ పేరుతో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ప్రముఖ నేపథ్య గాయిని మంగ్లీతో ప్రత్యక్ష సంగీత కార్యక్రమం, సాయి సేవా సంఘ్‌లోని అనాథ విద్యార్థులతో నవ దుర్గా నృత్య వేడుకను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క ముఖ్య అతిథిగా విచ్చేయడంతోపాటు అతిథులుగా జబర్దస్త్ ఫేం ఆటో రామ్ ప్రసాద్, బుల్లెట్ భాస్కర్, నాటీ నరేష్ విచ్చేయనున్నారు. ఈ మేరకు శుక్రవారం జూబ్లీ హిల్స్‌లోని రామ నాయుడు స్టూడియోలో సాయి సేవా సంఘ్ ఆర్గనైజేషన్, సింగర్ మంగ్లీ ప్రత్యక్ష సంగీత వేడుకల పోస్టర్‌ను సింగర్ మంగ్లీ, బుల్లెట్ భాస్కర్, సాయి సేవా సంఘ్ ఆర్గనైజేషన్ నిర్వాహకులు విజయలక్ష్మి, వైస్ ప్రెసిడెంట్ అరుణ ప్రదీప్, సెక్రెటరీ సాయి గౌరీ, ఎగ్జిక్యూటివ్ మెంబర్, శ్రీవల్లి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాయి సేవా సంఘ్ నిర్వాహకులు మాట్లాడుతూ ఆడపిల్లలకు సమృద్ధిగా అవకాశాలను అందించడం, వారి అభిరుచులను గుర్తించి అందుకు అనుగుణంగా వారిని ముందుకు కొనసాగించడం తమ లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఆడపిల్లల విజయగాథలను వివరించే ఆడియో-విజువల్ ప్రెజెంటేషన్‌లను ప్రదర్శించడం ద్వారా రాబోయే రోజుల్లో తమ విజన్‌ను పంచుకోవడం ద్వారా జంట నగరాల్లో తమ సంస్థ గురించి అవగాహన పెంచడం లక్ష్యంగా పెట్టుక‹న్నామన్నారు.

చేపలు పట్టడానికి వెళ్లి యువకుడు గల్లంతు



నవతెలంగాణ-మేడ్చల్

చేపలు పట్టడానికి వెళ్లిన యువకుడు గల్లంతైన ఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని పూడూరు గ్రామానికి చెందిన ఎర్రోళ్ల మల్లేష్ ముదిరాజ్ కుమారుడు ఎర్రోళ్ల సంతోష్, మేకల నరేష్ అనే ఇద్దరు యువకులు కలసి శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో గ్రామ పరిధిలోని చెరువులోకి చేపలు పట్టడానికి వెళ్లారు. ఈ క్రమంలో ఎర్రోళ్ల సంతోష్ గల్లంతయ్యాడు. కాగా సమాచారం అందుకున్న గ్రామస్తులు, కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఫలితం లభించలేదు.

ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి



- తెలంగాణ ముదిరాజ్ మహాసభ ప్రముఖులు

నవతెలంగాణ-మల్కాజిగిరి

ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ముదిరాజ్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మేడ్చల్ జిల్లా ముదిరాజ్ మహాసభ పిలుపు మేరకు మల్కాజిగిరి మండల ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు చెరుకుసాంబరాజ్ ముదిరాజ్, కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మల్కాజిగిరి మండల తహసీల్దార్ కె.వి.వి సీతారాంకు వినతి పత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం "అభయ హస్తంలో " ముదిరాజ్ బంధువులకు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలని కోరుతూ ఈ వినతి పత్రాన్ని సీఎం రేవంత్‌రెడ్డికి పంపించాలని ఎమ్మార్వోను కోరారు. ఈ మేరకు మేడ్చల్ జిల్లా కలెక్టర్ ద్వారా సీఎంకు వినతి పత్రాన్ని అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం ముందు హాజరైన ముదిరాజ్ బంధువుల సమావేశంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న మేడ్చల్ జిల్లా ముదిరాజ్ మహాసభ ప్రచార కార్యదర్శి రొయ్యల కృష్ణమూర్తి ముదిరాజ్, మల్కాజిగిరి మండల ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు చెరుకు సాంబరాజ్ ముదిరాజ్‌లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ముదిరాజ్ కులస్తులను బీసీ (డి) నుండి బీసీ (ఎ) లోకి మార్చాలని కోరారు. "తెలంగాణ మత్స్య అభివృద్ధి బోర్డు" ఏర్పాటు చేయాలని, ముదిరాజ్ ల కోసం ప్రతేక గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయాలని, ఉచిత చేప పిల్లల పంపిణీ పథకం మత్స్య కారులకు చేరే విధంగా పంపిణీ చేపట్టాలని డిమాండ్ చేశారు. మంత్రి వర్గంలో ముదిరాజులక‹ స్థానం కల్పించాలని, శాసన మండలిలో 3 ఎమ్మెల్యే స్థానాలు, రాజ్య సభలో 1 స్థానం కల్పించాలని కోరారు. మల్కాజిగిరి మండల ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షులు గద్వాల వంశీ, ప్రధాన కార్యదర్శి బొల్లు సంపత్, కోశాధికారి దండు ప్రసాద్, ఉపాధ్యక్ష‹లు కటికల బిక్షపతి, ఊదారి కృష్ణ మూర్తి, ప్రచార కార్యదర్శి శివంది ఆంజనేయులు, జోడు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం ధరల ఖరారు కమిటీలో రెడ్డమ్మ గారి నవీన్ రెడ్డి

నవతెలంగాణ- మేడ్చల్

రాష్ట్ర ప్రభుత్వం బేవరేజెస్ కార్పొరేషన్ ద్వారా మద్యం కొనుగోలు ధరలను ఖరారు చేసేందుకు రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి,మరో ఇద్దరు సభ్యుల నేతృత్వంలో ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది.కాగా మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని కిష్టాపూర్ కు చెందిన ప్రముఖ ప్రాక్టీసింగ్ చార్టర్డ్ అకౌంటెంట్ సీఏ రెడ్డమ్మగారి నవీన్ రెడ్డిని కమిటీలో సభ్యుడిగా నియమించింది.ఇందులో కమిటీ చైర్మెన్ గా రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.సునీల్ కిషోర్ జైస్వాల్,రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కె.ఎస్. శ్రీనివాస రాజు తో కలపి తీసభ్య కమిటీని ఏర్పాటు చేసింది.

అల్వాల్ ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్ ప్రసన్న లక్ష్మి ఆమనగల్ ఆస్పత్రికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సిబ్బంది, స్థా‹క నాయకులు ఆమెను ఘనంగా శాలువలతో సత్కరించారు. అల్వాల్ ప్రభుత్వ ఆస్పత్రిలో పదేండ్లుగా ఆమె డాక్టర్‌గా కొనసాగారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆమె మృదస్వభావి అని, సిబ్బందితో కలిసిమెలిసి ఉన్నారని తెలిపారు. ఆమె బదిలీపై వెళుతుండడంతో సిబ్బంది విచారం వ్యక్తం చేశారు. డాక్టర్ అనగ్, రేడియాలిస్ట్ డాక్టర్ సంధ్య, వీరయ్య, అరుణ , మరియరాణి, అబ్రహం ,జగన్ శ్రీకాంత్, మనోహర్, రాహుల్ ,సురేందర్ రెడ్డి , చెట్ల లక్ష్మణ్ ,కన్నా గౌడ్ ,ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు. నవతెలంగాణ-ఆల్వాల్





దుండిగల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- కెమికల్ టాంకర్ ను అతి వేగంతో ఢీ కొట్టిన కారు
- అక్కడికక్కడే ముగ్గురు విద్యార్థులు మృతి
- మరో ఇద్దరిని ఆస్పత్రికి తరలింపు

నవతెలంగాణ-దుండిగల్

దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. అతి వేగంగా స్కోడాకారు అదేదారిలో ఎదురుగా వస్తున్న కెమికల్ టాంకర్ వాహనాన్ని బలంగా డీకొట్టడంతో ముగ్గురు విద్యార్థులు మృతి చెందారు. ఈ ఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసు కుంది. వివరాల్లోకి వెళ్తితే దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని ఏ ఔటర్ రింగ్ రోడ్ పరిధి ఎగ్జిట్5 సమీపంలో శుక్రవారం రాత్రి సుమారు 8గంటల సమయంలో బౌరంపేట్ సర్వీస్ రోడ్డుపై అతివేగంగా స్కోడా రాపిడ్ కారు (నెం. టీఎస్ 08జీఈ 0763) వెళ్తున్నది. అందులో ఐదుగురు బీటెక్ విద్యార్థులు అక్షయ్, హరి, అస్మిత్, నవనీత్, జెవంత్ ఉన్నారు. అటు వైపు వాసవి కెమికల్ ట్యాంకర్ దుండిగల్ చౌరస్తాకు వస్తున్నది. ఈ క్రమంలో కారు వేగంగా ఎదురుగా టాంకర్ వాహనాన్ని ఢీ కొట్టడంతో కారులోని ముగ్గురు విద్యార్థులు అక్షయ్, హరి, అస్మిత్ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని మరో ఇద్దరు విద్యార్థులు నవనీత్, జేవంత్ లను ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నారు. నలుగురు విద్యార్థులు ఒకే వీఎన్ఆర్‌లో చదువుతున్నారని, హరి అనే విద్యార్థి వేరే కళాశాల అని తెలిసింది. కేవలం కారులో జల్సాగా తిరగడం కోసమే ఆ సమయంలో వారు వచ్చినట్టు తెలుస్తున్నది.

డివిజన్ పర్యటనల్లో మేయర్ బిజీబిజీ



నవతెలంగాణ-బోడుప్పల్

బోడుప్పల్ కార్పొరేషన్ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని మేయర్ తోటకూర అజయ్ యాదవ్ అన్నారు. శుక్రవారం బోడుప్పల్ నగరంలోని పలు డివిజన్లలో డిప్యూటి మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్‌తో కలిసి పలు డివిజన్లలో పర్యాటించారు. కార్పొరేషన్ పరిధిలోని 6 వ డివిజన్ అశోక్ నగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ప్రారంభించిన అనంతరం 8వ డివిజన్ పరిధిలోని ద్వారాక నగర్ ఫేజ్ -2 వద్ద డ్రయినేజీ కాలువ పనులతో పాటు సుద్దకుంట నాలా పనులను పర్యావేక్షించారు .గాయత్రి నగర్ నుండి ద్వారాక నగర్ లింకు రోడ్డు పనులను త్వరగా పూర్తి చెయ్యాలని అధికారులకు అదేశాలు జారీ చేశారు. ఆనంతరం మేయర్ అజయ్ యాదవ్ మాట్లాడుతూ బోడుప్పల్ కార్పొరేషన్ అందరి సహకారంతో పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందకు పక్క ప్రణాళికలతో ముందుకు సాగుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రామలింగం, కార్పొరేటర్లు సీస వెంకటేష్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజల సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా, అభివృద్ధే లక్ష్యంగా తాను పనిచేస్తానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నేత కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌ని వివిధ సంక్షేమ సంఘాల నాయకులు, ప్రజలు, పలువురు కార్యకర్తలు తన నివాసం కార్యాలయం వద్ద కలిశారు. పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకురాగా, సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. పలువురు మాజీ ఎమ్మెల్యేకి పలు ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించకూడదని, ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకువచ్చే విధంగా అధికారులు వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

ఆలయ నిర్వాహకులకు చెక్కులు అందజేత



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ఆషాడ మాస బోనాలు పండుగ సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గం బేగంపేట డివిజన్‌లోని ప్రకాష్ నగర్ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుతో పాటు స్థానిక కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరిలు పాల్గొన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆషాడ మాస అమ్మవారి బోనాలు వైభవంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సురేష్ యాదవ్, నరేష్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

భూకబ్జాదారుల ఆగడాలకు హద్దే లేదా..!

- పేదల భూములు గుంజుకుంటే ఊరుకునేది లేదు
- సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజులరామరం లాలసాహెబ్ గూడకు చెందిన దారా పద్మావతితో కలిసి శుక్రవారం షాపూర్ నగర్ కార్యాలయంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా దారం పద్మావతీ మాట్లాడుతూ.. సర్వే నెంబర్ 344/1,345/1 లో మా సొంత భూమిలోకి వెళుతుంటే కెఎల్ యూనివర్సిటీ సెక్యూరిటి సూపర్‌వైజర్, సిబ్బంది రానివ్వలేదు. ఈ విషయమై పోలీస్ స్టేషన్‌లో చెప్పగ ఎందుకు చెప్పారని వాళ్ళ సిబ్బంది, కుమారుడు దారం నర్సింగ్ రావు పై భౌతిక దాడి చేస్తూ.. మా యాజమాన్యం మిమ్మల్ని చంపి పేగులు వేసుకుంటామన్నారు. మళ్లీ వస్తే చంపేస్తామని అన్నారని అన్నారు. ఈ విషయం కేస్‌లో యాజమాన్యం పై కాకుండా సిబ్బంది పై వేశారని ఇప్పటి కైనా న్యాయం చెయ్యాలని అన్నారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్ మాట్లా డుతూ.. గతంలో కూడా గాజులరామరంలో విలేకరులపై, రెవెన్యూ అధికారులపై దాడులు జరిగినా కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్ల నేటి కి ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతున్నాయని తెలిపారు. కావున కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని లేకపోతే బాధితులతో కలిసి కమిషనర్ దగ్గరికి వెళతామని అన్నారు. అదే విధంగా దాడులు చేసిన సిబ్బంది పై, చేయించిన యాజమాన్యం పై హత్యా యత్నం కేసు వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాధితులు దారం పద్మావతి, దారం నర్సింగరావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు స్వామి, హరినాథ్, కోశాధికారి సదానంద, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇండ్ల అక్రమ కేటాయింపులపై చర్యలేవీ..?



- అసలైన లబ్దిదారులకు ఇండ్లు కేటాయించాలి
- సీపీఐ(ఎం) నాయకులు ఎం.చంద్రశేఖర్, బాలపీర్

నవతెలంగాణ-దుండిగల్

నిజాంపేట్ రాజీవ్ గృహకల్పలో కేటాయించకుండా మిగిలిన గృహాలకు సంబంధించి కొంత మంది తాళాలు పగులగొట్టి కబ్జా చేసుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) నాయకులు ఎం.చంద్రశేఖర్, బాలపీర్ డిమాండ్ చేశారు. గత కొంత కాలంగా పేర్లు, ఫోటో మార్ఫింగ్‌లు సాక్షాత్తు కలెక్టర్ కార్యాలయం ద్వారా పైరవిలు కొనసాగించు కొని విక్రయించే స్థాయిలో కొనసాగుతున్న గత పాలక వర్గం పట్టించు కోలేదని తెలిపారు. ఇప్పడకైనా ఈ ప్రభుత్వం విచారణ చేపట్టినచో ఎన్ని దూరక్రమణకు గురి అయ్యాయో మొత్తం బండారం బయట పడుతుందని చెప్పారు. నిజమైన లబ్ది దారులకు న్యాయం చేకూర్చాలని కోరారు. ఈ మేరకు శుక్రవారం బాచుపల్లి రెవిన్యూ కార్యాలయంలో వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ రాజీవ్ గృహకల్పలో కొన్ని బ్లాక్ లలో వివిధ కారణాలు లబ్దిదారుల ఎంపికతోగాని, అప్పటి వరకు ఇచ్చిన లబిదారులు అడ్రస్ లేకపోవడం కావచ్చు ఇలాంటి గృహాలు సుమారుగా 50కి పైగాన్నే ఉన్నాయని తెలిపారు. రెండున్నర సంవత్సరాల క్రితమే రెవిన్యూ అధికారులు అన్ని బ్లాక్ లలో వివరాలు సేకరించగా బయట పడినవని.. అవి కొంత మందికి బంగారు బాతు గుడ్డుగా తయారయ్యిందని తెలిపారు.

2005లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇండ్లు లేని పేదలకు నిర్మించి ఇవ్వాలని జి ఓ 1908, విడుదల చేసిందన్నారు. తదనంతరం ప్రభుత్వం ఇండ్లు లేని పేదలందరితో వెయ్యి రూపాయలు ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని చెప్పిందని, దరఖాస్తు చేసుకున్న వారిలో లబ్దిదారులను ఎంపిక చేసి వారికి ఇండ్లు కేటాయించారన్నారు. నిజాంపేట ప్రాంతంలో 103 బ్లాకులు నిర్మాణం చేశారని.. బ్లాకునకు 32 ఇండ్లు (ఫ్లాట్స్) చొప్పున మొత్తం 3296 మంది లబ్దిదారులను ఎంపిక చేసి ఇండ్లు కేటాయించారన్నారు. మొత్తం లబ్దిదారులలో 45 మందికి వివిధ కారణాలవల్ల కేటాయింపు జరగలేదని చెప్పారు. అయితే ఖాళీగా ఉన్న ఇండ్లలో అధికారపార్టీ నాయకులు అధికారుల అండదండలతో అర్హత లేని వారికి అక్రమ పద్దతుల్లో కేటాయించి నివాసం ఉంచుతున్నారన్నారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. అధికార పార్టీకి చెందిన దళారులు బ్యాంకుల నుండి ఎన్వోసీలు అక్రమంగా తీసుకుని ఇండ్లు వచ్చాయని కరెంటు మీటర్లు, ఇంటి పన్ను చేయించి ఇండ్ల తాళాలు పగలగొట్టి అక్రమంగా ఇండ్లను దురాక్రమణ చేసుకుంటు సొమ్ము చేసుకుంటున్నారన్నారు. ప్రజల అమాయకత్వాన్ని పేదరికాన్ని ఆసరా చేసుకుని అక్రమంగా ఇండ్లు కేటాయించి చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతు, అక్రమార్జనకు తెగబడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. నిజాంపేట రాజీవ్ గృహకల్ప ఇండ్లలో జరుగుతున్న ప్రభుత్వ వ్యతిరేక చట్ట విరుద్ధమైన కార్యకలాపాలు ఇండ్ల అక్రమ కేటాయింపులపై ప్రభుత్వం సమగ్రమైన సర్వే చేయించి నిజమైన లబ్దిదారులకు ఇండ్లను కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలను సమీకరించి పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎల్లమ్మ పెంటమ్మ కిషన్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆల్విన్ కాలని సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సంబంధిత పనుల నిమిత్తం 11కేవి ఫీడర్‌లలో, ఈ రోజు పవర్ షట్ డౌన్ చేయబడుతుందని, ఈ విద్యుత్ అంతరాయనికి చింతిస్తున్నామని అందుకు సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని పత్రిక ప్రకటనలో ఏఈ శరత్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ,33/11కే వి షంషీగూడ సబ్ స్టేషన్ నుంచి వెలువడే 11కే వి ఆల్విన్ కాలని లాస్ట్ బస్ స్టాప్ ఫీడర్ లో మధ్యాహ్నం 12:30ని॥ నుంచి 1 గంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని అన్నారు. దాని ప్రభావం ధరణి నగర్, ఆదిత్య నగర్, జలకన్య ప్రాంతంలో అంతరాయం కలుగుతుందని, ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని ఆల్విన్ కాలని సబ్ స్టేషన్ ఏ ఈ శరత్ బాబు తెలిపారు.

దుండిగల్: డీపీ పల్లి సబ్‌స్టేషన్ నుంచి వెలువడే 33/11 కె.వి ఫీడర్‌లో మరమ్మతుల కొత్త సర్వీస్ కనెక్షన్ల, నిర్వహణ పనుల కారణంగా, నేడు ఉదయం 11.00 గంటల నుండి 11.30 గం వరకు గాగిల్లాపూర్ ఎక్స్ రోడ్, గాగిల్లాపూర్ చర్చి, చైతన్య కాలనీ,214 కాలనీ, మేరీ మాతే కాలనీ, పోతారం ఇండ్ ఏరియా, రాజీవ్ గృహకల్పలో ఫీడర్లో మధ్యాహ్నం 12.00 నుంచి 12.30 వరకు ప్రభావిత ప్రాంతాలు... ఆర్‌జికే బ్లాక్స్,తులసాయి కన్స్ట్రక్షన్స్, గ్రీన్ హిల్స్ కాలనీ, అలాగే సూరారం గ్రామ ఫీడర్ 11.30 గంటల నుంచి 12.00 గంటల వరకు ప్రభావిత ప్రాంతాలు మరాఠీ బస్తీ, రెగ్, తెలుగు తల్లి నగర్, మైత్రి నగర్, సూరారం కాలనీ,60గజాలు, అలాగే సుందర్ ఆశ్రమం ఫీడర్ నుంచి మధ్యాహ్నం 01.00 నుంచి 01.30 గం॥ వరకు దుండిగల్ గ్రామం, నాగులూర్ సత్యం ఫీడర్ మధ్యాహ్నం 12.30 నుంచి 01.00 గంటల వరకు, గండిమైసమ్మ ఎక్స్ రోడ్, పోచా రెడ్డి కాలనీ,బౌరంపేట్ ఫీడర్ మధ్యాహ్నం 01.30 గం॥ నుంచి 02.00 వరకు డీపీపల్లి గ్రామం, సారెగూడెం మొదలైన ప్రాంతాలలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందిని, ఈ అంతరాయానికి ప్రజలు సహకరించాలని డీపీ పల్లి విద్యుత్ శాఖ ఏఈ ఎస్.సురేందర్ రెడ్డి తెలిపారు.

దుండిగల్: బౌరంపేట్ 33/11 కేవీ ఫీడర్ సర్వీస్ కనెక్షన్ నిర్వహణ పనుల కారణంగా కింది ప్రాంతాలలో 11:00 గం॥ నుంచి 11:30 వరకు ప్రణీత్ నేచర్ బౌంటీ, కేవీర్ కాలనీ, స్ప్రింగ్ వుడ్, జెఎస్ఎస్ విల్లాస్, స్టెర్లింగ్ హెూమ్స్, శంభీపూర్ విలేజ్ అలాగే మల్లంపేట్ ఫీడర్ ఎన్రిచ్ బొల్లారం 11.30 గం॥ నుంచి 12.00 గం॥ వరకు డ్రీమ్ వ్యాలీ కాలనీ, గ్రీన్ పార్క్ కాలనీ, ఆకాష్ లేఅవుట్, మల్లంపేట్ విలేజ్, ఏపి ఆర్ విల్లాలు, జీఆల్‌సీ భవన్ విల్లాలు, బౌరంపేట్ గ్రామం, ఆర్ కే లేఅవుట్, సారెగుడ్డం రోడ్డు, సింహపురి కాలనీ, ఎస్‌బిఐ కాలనీ, డాలర్ డ్రీమ్స్, కేఎల్ యూనివర్సిటీ ...ఆర్ఎన్ ఇన్‌ఫ్రా విల్లాలు, శ్రీచైతన్య కళాశాల, సతీష్ లేఅవుట్, జి 9 గల్లి, గండిమైసమ్మ ఫంక్షన్ హాల్ అలానే మధ్యాహ్నం 1.30 ని॥ నుంచి 3.00 గం॥ వరకు **ప్రభావిత ప్రాంతాలు:** సూరారం గ్రామం, అయ్యప్ప సంఘం, విశ్వకర్మ కాలనీ మొదలైన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడుతుందని ఈ అంతరాయానికి ప్రజలు సహకరించాలని బౌరంపేట విద్యుత్ శాఖ ఏఈ సాయి కిరణ్ తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి..



- జీహెచ్ఎంసీ ఎంటమాలజీ సూపర్ వైజర్ డి.నరసింహులు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జీహెచ్ఎంసీ ఎంటమాలజీ సూపర్ వైజర్ డి.నరసింహులు అన్నారు. వర్షాకాలం నేపథ్యంలో దోమల నివారణలో భాగంగా శుక్రవారం హైదర్ నగర్ డివిజన్ పరిధిలో హైదర్ నగర్ కాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో కూకట్‌పల్లి డిప్యూటీ కమిషనర్ ఆదేశాలతో జీహెచ్ఎంసీ ఎంటమాలజీ సూపర్ వైజర్ డి.నరసింహులు దోమ కాటు ద్వారా వచ్చే వ్యాధులపై విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లపై నీరు నిలువ ఉండకుండ ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కేపీహెచ్ బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాస్ రావు అన్నారు. శుక్రవారం కేపీహెచ్‌బీ డివిజన్ పరిధిలోని ఎస్ఆర్ఎస్ ఎ కాలనీలలోని తాగునీటి పైపులైన్ పనులను, 5వ ఫేజ్, ఎస్ఎస్ కాలనీలో సేవరేజ్ పైపులైన్ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పనులలో నాణ్యత లోపిస్తే ఉరుకునేది లేదన్నారు. పనులను సత్వరమే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో హనుమంతరావు, ఎఈ సాయి ప్రసాద్, వాటర్ వర్క్స్ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణ పట్ల అవగాహన ర్యాలీ



- కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆల్విన్ కాలని డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా, దోమల నివారణ పట్ల ప్రజలలో అవగాహన పెంచేందుకు ర్యాలీ నిర్వహించారు. జీహెచ్ఎంసీ ఎంటమాలజీ పిఓ ఇంద్రసేన, సిఓ ముస్తఫా, ఎంటమాలజీ సూపర్‌వైజర్ డి.నరసింహులు సిబ్బందితో కలిసి, డివిజన్ పరిధిలోని పీజేఆర్ నగర్ కాలనీలో ప్లకార్డులు పట్టుకుని పాద యాత్ర చేస్తూ పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నిల్వ ఉన్న నీటిలోనే లార్వా పెరిగి దోమల వ్యాప్తి జరిగి, విషజ్వరాలు, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాపించే అవకాశం ఉంది, కావున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. మన ఇంటి పరిసరాలలో అనగా నల్లగుంతలు, కూలర్స్, పూల కుండీలు, డ్రమ్ములు, టైర్లు, పగిలిపోయిన ప్లాస్టిక్ బకెట్లు, మట్టి కుండలు, బిల్డింగ్ పైన ఉండే సింటెక్సు, సిమెంటు గోళాలు మొదలగు వాటిలో నిల్వఉన్న నీటిని వారానికి ఒకసారైనా తొలగించాలని అన్నారు. కాబట్టి ఈ వారం రోజుల లోపల ఆ దోమ యొక్క కాల చక్రాన్ని మనం బ్రేక్ చేసి, దోమల ఉత్పత్తిని అరికట్టాలని అన్నారు. అదేవిధంగా ఉదయం ప్రతి ఇంటికి వెళ్లి నీటి నిల్వలను తనిఖీ చేసే ఎంటామాలజీ సిబ్బందికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కార్పొరేటర్ తెలియజేశారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు, మహిళా సంఘాల ప్రెసిడెంట్లు, మహిళా సంఘాల సభ్యులు, ఆర్‌పిలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఎంటమాలాజీ సిబ్బంది, కాలనీ వాసులు పాల్గొన్నారు.

పైప్ లైన్ నిర్మాణ పనులను పరిశీలించిన కార్పొరేటర్

ఆల్విన్ కాలని డివిజన్ పరిధిలోని, ఇండియన్ బ్యాంక్ నుంచి ఎల్లమ్మ చెరువు సర్ఫస్ నాలా వద్దకు, రెండు కోట్ల రూపాయల నిధులతో జరుగుతున్న భూగ ర్భ పైప్ లైన్ నిర్మాణ పనులను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పరిశీలించారు. ఆయనతో పాటు అధికారులు డి.ఈ రమేష్, ఈ.ఈ గోవర్ధన్, ఎస్.ఈ చెన్నారెడ్డి, ఏ.ఈ శ్రావణిలు ఉన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఉషముళ్ళపూడి ప్రధాన రహ దారిలోని శుభోదయ కాలనీ పరిసర ప్రాంతాలలో రోడ్డు మీద నిలిచిపోతున్న వరద నీటిని, ప్రస్తుతం నిర్మిస్తున్న పైప్ లైన్ల ద్వారా నేరుగా ఎల్లమ్మచెరువు సర్ ప్లస్ నాల లో కలిసేట ట్లుగా ఏర్పాటు చేసి, పైప్ లైన్ నిర్మాణం జరుగుతుందని అన్నారు. చిన్న వర్షానికి కూడా గతంలో చాలాసార్లు ఇండియన్ బ్యాంక్ వద్ద నీరు నిలిచిపోయి, పక్కన ఉన్న ఇండ్లలోకి, అపార్టుమెంట్ సెల్లార్‌లలోకి నీరు చేరి ప్రజలు చాలా ఇబ్బంది పడేవారని గుర్తు చేశారు. ఇప్పుడు ఈ భూగర్భ పైప్ లైన్ నిర్మాణంతో వరద నీటి సమస్య తొలగిపోతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, షౌకత్ అలీ మున్నా, సయ్యద్, యాదగిరి, మహేష్, ఫారూఖ్, ఖలీమ్, షకీల్ మున్నా తదితరులు పాల్గొన్నారు.



రైతు,కార్మిక రాజ్యం కాంగ్రెస్‌తోనే సాధ్యం

- ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్య గౌడ్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

రైతు, కార్మిక ప్రభుత్వం కార్మిక రాజ్యం కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్య గౌడ్ అన్నారు. శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి జగద్గిరిగుట్ట ప్రాంతంలో మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ఐఎన్‌టీయూసీ నాయకులు మునిపల్లి జనార్ధన్ ఆధ్వర్యంలో... మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయనతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల,రైతు, కార్మిక కర్షకుల ప్రభుత్వమన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మున్సిపల్ కార్మికులు సమ్మెలు చేసి అనేకమైన ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో మున్సిపల్ కార్మికులు సకలజనుల సమ్మెలో ప్రధాన పాత్ర పోషించారని గుర్తు చేశారు. రైతులకు ఏ విధంగా రు.2 లక్షల రుణమాఫీ చేశారో అదేవిధంగా మున్సిపల్ కార్మికులకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో కనీస వేతనం, పర్మనెంట్ ఉద్యోగాలు వస్తాయని వారికి భరోసా నిచ్చారు. తెలంగాణ వ్యాప్తంగా రైతులు సంబరాలు జరుపుకుంటున్నారని దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి మంత్రివర్గం పనిచేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్మిక నాయకుడు మాజీ ముఖ్యమంత్రి అంజయ్యను మంత్రిగా చేసి కార్మిక రాజ్యం కాంగ్రెస్తోనే సాధ్యమని నిరూపించారన్నారు. సుస్థిర పాలన తోపాటు అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం పాటుపడేది కాంగ్రెస్సే అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గూడ వరమ్మ, నాయకులు యాదగిరి పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో అవినీతిపై చర్యలు తీసుకోవాలి



- మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ దర్మారపు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

జేఎన్‌టీయూహెచ్ లో జరుగుతున్న అవినీతి పైన చర్యలు తీసుకోవాలని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ దర్మారపు అన్నారు. జేఎన్‌టీయూహెచ్ హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఎంఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ ధర్మారపు, జేఎన్‌టీయూహెచ్ ఎంఎస్ఎఫ్ యూనివర్సిటీ అధ్యక్షులు బల్లర్ సందీప్, జేఏసీ నాయకులు బొట్ల బిక్షపతిలు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం నిధులని కేటాయిస్తే వాటిని పక్కదారి పట్టించి సొమ్ము చేసుకున్న ఘనత రెక్టర్ ప్రొఫెసర్ విజయ్ కుమార్ రెడ్డిదన్నారు. 2006 జేఎన్‌టీయూహెచ్ హైదరాబాద్‌కి రాగానే ఆయన అనుకూలంగా ఉన్న ప్రొఫెసర్స్‌ని కాకినాడ, అనంతపురం నుండి అప్పటి పాలనాధికారులతో కుమ్మక్కై తెలంగాణలో అసలు సీనియర్ ప్రొఫెసర్ లను కాదన్నారు. డీన్ కుమార్ అనే ఆయనకి కంట్రోలర్‌గా ఆయనకి అనుకూలనమైన వారిని విజయ్ కుమార్ డీఈగా ఉన్నప్పుడు నియమించుకున్నారన్నారు. అప్పటి ఉన్నత విద్యా మండలి చైర్మెన్ ప్రొఫెసర్ కేసీ రెడ్డి తో ఏపీ ప్రభుత్వం ఒక కమీటీ ఏర్పాటు చేసిందన్నారు. ప్రిన్సిపాల్ గా ఉన్నప్పుడు విద్యార్థినిలతో అసభ్యంగా దురుసుగా మాట్లాడని రోడ్డుకెక్కి ధర్నా నిర్వహించిన చరిత్ర ప్రొఫెసర్ విజయ కుమార్ రెడ్డి పైన ఉందన్నారు. సినియార్ ప్రొఫెసర్ లను కాదని జ్యోతుల సురేష్ కుమార్‌కి కాపీ పీహెచ్‌డి అయినా కూడా సీనియర్ ప్రొఫెసర్ లిస్ట్‌లో మొదటి పేరు ఉండడం వెనుక మతలాబ్ ఏంటని ప్రశ్నించారు. కనీసం పీహెచ్‌డీ అర్హత లేని అతనికి కంట్రోలర్‌గా బాధ్యతలు ఎవరి స్వలాభం కోసం ఇచ్చారన్నారు. ఇన్‌చార్జి వీసి తక్షణమే ఒక క్లీన్ యూనివర్సిటీనీ వచ్చే కొత్త వీసికి బహుమతిగా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వంను, ప్రస్తుత ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్, ప్రిన్సిపల్ సెక్రటరీ విద్యా శాఖ బుర్ర వెంకటేశంని విన్నపించుకుంటున్నామన్నారు. విజయ్ కుమార్ రెడ్డి ఆయన కోటరీ పైన చర్యలు తీసుకోవాలన్నారు.

డాక్టర్ చిల్లా రాజశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ప్రముఖ పారిశ్రామికవేత్త, సంఘ సేవకులు, రాజ్యలక్ష్మి ఇండస్ట్రీస్ అధినేత, లయన్స్ క్లబ్ ఆఫ్ గాంధీనగర్ (ఆర్య) అధ్యక్షులు రంగారెడ్డినగర్ డివిజన్, పంచశీల కాలనీకి చెందిన డాక్టర్.లయన్ చిల్లా రాజశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. శుక్రవారం కూకట్‌పల్లిలోని శ్రీ అష్టలక్ష్మి సహిత గాయత్రి మహపీఠం లో కుటుంబ సభ్యులు, పారిశ్రా మిక వేత్తలు, సన్నిహితుల మధ్య ఆలయ పీఠాధిపతి వివివి. రామాచా ర్యులు స్వర్ణార్చనతో ఆశీర్వచనం అందించి గాయత్రి దేవి దీవెనలతో నిండు నూరేండ్లు వర్ధిల్లాలని వేదమంత్రాలతో నిర్వహించిన అర్చనలో ఘనంగా జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా లయన్ డాక్టర్ చిల్ల రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ తన జన్మదిన వేడుకలు ప్రతి సంవత్సరం నిరాధారణకు గురైన వికలాంగులు, వృద్దుల మధ్య జరుపుకొని తోచినంతలో వారికి చేయూత నందిస్తూమనోధైర్యం నింపేవాడినన్నారు. భవిష్యత్తులో సామాజిక సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తానన్నారు. ప్రముఖ అభినవకవి, ఆత్మీయభారతి సా హిత్య సేవ సంస్థ అధ్యక్షులు, పుడమిరత్న అవార్డుగ్రహీత, మానసటూల్ టెక్ అధినేత, వాకిటి రామ్ రెడ్డి మాట్లాడుతూ లయన్ చిల్లా రాజశేఖర్ రెడ్డి సాహిత్య పోషకులుగా వందలాది సభలు నిర్వహించి.. సంఘ సేవకులుగా విశేషమైన అనుభవాలతో ఎందరికో ఆదర్శముగా నిలుస్తున్నామన్నారు. గొప్ప పారిశ్రామికవేత్తగా రాణిస్తూ, మంచిమనసుతో నేటి యువతకు స్ఫూర్తిని స్తూ, సమాజ పెద్దలచేత సాహితీ మూర్తులు బహుకరించిన వెయ్యి అవార్డుల గ్రహీతగా గొప్ప వ్యక్తి అని కొనియాడారు. అమ్మానాన్నల ఆశీస్సులతో గాయత్రి దేవి కరుణ కటాక్షంతో నిండు నూరేండ్లు చల్లగా వర్ధిల్లాలని పుష్పగుచ్ఛం అందించి, మెమెంటోతో బహుకరిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంతో ఆత్మీయ పారిశ్రామికవేత్తలు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు లయన్ గోపాల కృష్ణ రెడ్డి, ఎఆర్కేఫ్యాబ్ టెక్ అదినేత లయన్ విష్ణువర్ధన్ రెడ్డి, వెంగలాస్ క్యాటరర్స్ అదినేత లయన్ ఎల్లా సుబ్బారెడ్డి, విఆర్.ఎలక్ట్రికల్స్ అధినేత లయన్ వెంకటేశ్వర్ రెడ్డి, బిల్డర్ హేమాద్రి నాయుడు పాల్గొన్నారు.

శాఖాంబారి దేవి అలంకరణలో అమ్మవారు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి ఆల్విన్ కాలనీ పేజ్ 2లోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో ఆషాడ మాసం సందర్భంగా... శాఖాంబరి దేవి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శ్రీ భ్రమరాంబ మాతకు వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలతో శాకంబరీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త శ్యామల భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో... ఆలయ ప్రధాన అర్చకులు అఖిలేశ్వర శర్మ వేదమంత్రాల సాక్షిగా, మంగళ వాయిద్యాలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు, గణపతి పూజ, చండీ హెూమం, సామూహిక కుంకుమార్చనలు కన్నుల పండుగ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. శాఖాంబరీ దేవిని దర్శించుకోవడం ద్వారా, ధన, ధాన్య సిరిసంపదలను పొంది ఎటువంటి కరువు కాటకాలు లేకుండా సుఖంగా జీవించగలుగుతామని, ఆలయ ప్రధాన అర్చకులు అఖిలేశ్వర శర్మ తెలిపారు. అమ్మవారికి అలంకరించిన కూరగాయలతో మహా ప్రసాదం తయారుచేసి, శనివారం మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త శ్యామల భాస్కర్ రెడ్డి తెలిపారు. కావున భక్తులు ఈ రోజు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు.

అమ్మమాట - అంగన్వాడీ బాట



నవతెలంగాణ-దుండిగల్

అంగన్వాడీ కేంద్రంలో రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖా అమ్మమాట - అంగన్వాడీ బాట కార్యక్రమంలో భాగంగా 19వ డివిజన్ పరిధిలో శుక్రవారం చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలను నీలాగోపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... రెండున్నరేండ్ల వయసు నుంచి ఐదేళ్ల పిల్లల వరకు ఆకర్షితులయ్యేలా అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వం తీర్చిదిద్దుతోందని అన్నారు. చదువు, ఆరోగ్యంతో పాటు పిల్లల మానసిక ఉల్లాసానికి ఆటలు..నూతన బోధన పద్ధతులతో అంగన్‌వాడీ కేంద్రాలు ప్రతి అంశంలోనూ మెరుగుపడుతున్నాయని పేర్కొన్నారు. ఓ వైపు అంగన్‌వాడీ కేంద్రాలను కొత్త విధానంలోకి తీసుకురావడంతో పాటు, మరోవైపు అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం 'అమ్మ మాట-అంగన్‌వాడీ బాట' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. అదే విధంగా గర్భిణీలు, బాలింతలు, చంటి పిల్లలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే సేవలు గురించి తెలియజేసి, చిన్నారులకు, వారి తల్లులకు ఆపిల్ పండ్లు, అరటి పండ్లు, బిస్కెట్లు అందించారు.ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్ కాసాని సుధాకర్ ముదిరాజ్, సీనియర్ నాయకులు చంద్రగిరి సతీష్, సీనియర్ మహిళా నాయకురాలు సబిత జలంధర్ రెడ్డి, ఐసీడీఎస్ ఆఫీసర్, సీడీపీవో డా.శారద, సూపర్వైజర్ రేణుక, అంగన్వాడీ టీచర్లు, వైద్య, ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

నవతెలంగాణ-ధూల్‌పేట్



గుడిమల్కాపూర్ డివిజన్‌లోని ప్రజా సమస్యల పరిష్కారానికి అన్ని వేళాల కృషి చేస్తానని గుడి మల్కాపూర్ డివిజన్ దివంగత కార్పొరేటర్ దేవర కరుణాకర్ కుమారుడు యువమోర్చ నగర కార్యదర్శి దేవర వంశీ అన్నారు. శుక్రవారం మార్కండేయ నగర్‌లో 26 లక్షల వ్యయంతో నూతనంగా మంచి నీటి పైప్ లైన్ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ పైప్ లైన్ పనులను ఆయన స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానికుల మంచి నీటి సౌకర్యార్థం పైప్ లైన్ పనులు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో అనిల్, నామ యాదిగిరి, గంగాధర్, సుధాకర్ యాదవ్, సందేశ్ యాదవ్, దావత్ నారాయణ, కర్లి శ్రీదర్, వనంశంకర్, కందగట్ల సత్యనారాయణ, వెంకటేష్, గంగాలపాండు రాజు, రఘు దావత్, నరసింహ, బస్తీ వసూలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ మాతేశ్వరి ఘట ప్రతిష్టాపన

నవతెలంగాణ-చాంద్రాయణగుట్ట



మీరాల మండి మహాకాళేశ్వర దేవాలయంలో వేద పండితుల మంత్రోచ్చారణలతో మాతేశ్వరి ఘట ప్రతిష్టాపన కార్యక్రమం శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. అలీజాకోట్లలోని కోట మైసమ్మ దేవాలయంలో ఆలయ కమిటీ చైర్మెన్ గాజుల అంజయ్య అమ్మవారి ఘటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మిరాల మండి మహా కాళేశ్వర అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా పోతురాజుల వీరంగాలతో భాజభజంత్రీలతో డప్పు వాయిద్యాలతో జానపద నృత్యాలతో ఆలయానికి చేరుకుంది. అత్యంత వైభవంగా జరిగిన ఈ వేడుకలో బస్తీవాసులు భక్తులు పరిసర వ్యాపారవేత్తలు అమ్మవారి ఘటానికి స్వాగతం పలికారు.

సైబర్ కేటుగాళ్ల నుంచి జాగ్రత్తగా ఉండాలి

- చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సీతయ్య

నవతెలంగాణ-ముషీరాబాద్



సైబర్ కేటుగాళ్ల నుంచి ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఏదైనా సైబర్ బారిన పడితే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1930లో ఫిర్యాదు చేయాలని చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సీతయ్య శుక్రవారం పత్రిక ప్రకటన ద్వారా ప్రజలకు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులకు లక్ష రూపాయల లోపు రుణమాఫీ ఆయన సందర్భంగా రైతులు ఆనందంలో మునిగి తేలుతున్నారు. ఇదే అదునుగా భావించి సైబర్ కేటుగాళ్లు రైతుల అకౌంట్లను హ్యాక్ చేసే ప్రమాదం ఉందని ప్రతి రైతు కూడా జాగ్రత్తగా వ్యవహరించాలని తెలంగాణ పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు. కాబట్టి మీకు ఏదైనా వాట్సప్ ద్వారా గుర్తు తెలియని మెసేజ్‌లు వచ్చిన, ఓటీపీలు వచ్చిన ఎవరు పట్టించుకోవద్దన్నారు. ఏదైనా సైబర్ బారిన పడితే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1930 లో ఫిర్యాదు చేయాలని కోరారు. సైబర్ కేటుగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

లాల్ దర్వాజా బోనాల ఏర్పాట్లను పరిశీలించిన సీపీ

- మహంకాళి, అక్కన్న మాదన్న దేవాలయాలను సందర్శించిన సీపీ

నవతెలంగాణ-సిటీబ్యూరో/చాంద్రాయణగుట్ట

హైదరాబాద్ లాల్ దర్వాజా సింహ వాహిని మహంకాళి దేవాలయంతో పాటు అక్కన్న మాదన్న దేవాలయాలను నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం సందర్శించారు. బోనాల పండుగ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న బందోబస్తు, ట్రాఫిక్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ భక్తులందరికి బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. లాల్ దర్వాజా సింహ వాహిని మహంకాళి దేవాలయంలో బోనాల పండుగ ఆనవాయితీగా వస్తోందని గుర్తు చేశారు. ఆలయ శిఖర పూజాతోపాటు ధ్వజారోహణ చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. లాల్ దర్వాజా అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని, రాష్ట్రం చాలా వేగంగా అభివృద్ధి చెంది, ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్టు తెలిపారు.





అంబారి ఊరేగింపునకు భారీ బందోబస్తు

బోనాల పండుగ సందర్భంగా అంబారి ఊరేగింపు నిర్వహించనున్న సందర్భంగా భారీ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. హైదరాబాదు సిటీ పోలీసు తరపున 1000 మంది పోలీసు అధికారులతో కట్టు దిట్టమైన భద్రత ఏర్పాట్లను పూర్తి చేశారు. ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయంతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూస్తామని కమిషనర్ హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో సౌత్‌జోన్ డీసీపీలు స్నేహ మెహ్రా, ఆర్ వెంకటేశ్వర్లుతో పాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-చాంద్రాయణగుట్ట

లాల్ దర్వాజా పాతబస్తీలో నిర్వహించే బోనాల పండుగ కార్యక్ర మంలో భాగంగా ప్రభు త్వం ద్వారా ఆలయాలకు అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం ద్వారా అందజేసే ఆర్థిక సహాయం ఆల య చైర్మెన్‌లకు చెక్కుల పంపిణీ నిర్వహించారు. మీరాల మండి మహాకాళేశ్వర స్వామి దేవాలయం లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శుక్రవారం దేవాదా యశాఖ డిప్యూటీ కమిషనర్ రామకృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ బాలాజీ, చార్మినార్ తహసీల్దార్ నిహారిక, లా చేతుల మీదుగా దేవాలయాల ప్రతినిధులకు చెక్కుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి దేవాలయాల ఉత్సవ కమిటీ చైర్మెన్ గాజుల అంజ య్య, మాజీ చైర్మెన్ రాకేష్ తివారి, మధుసూదన్ యాదవ్, హంసరాజ్. కే.సనంద్, కైలాష్ తదితరులు పాల్గొన్నారు.



మంజూరైనా ట్రైకార్ రుణాల నిధులను వెంటనే విడుదల చేయాలి

- డీవైఎఫ్ఐ సౌత్ జిల్లా కార్యదర్శి కృష్ణ నాయక్

నవతెలంగాణ-ధూల్‌పేట్



మంజూరైనా ట్రైకార్ రుణాల నిధులను వెంటనే విడుదల చేయాలని డీవైఎఫ్ఐ సౌత్ జిల్లా కార్యదర్శి కృష్ణ నాయక్ అన్నారు. డీవైఎఫ్ఐ సౌత్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ట్రైకార్ మేనేజర్ శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గిరిజనులకు 2020-21 సంవత్సరం సబ్సిడీ రుణాలు మంజూరైన ఇప్పటివరకు నిధులు విడుదల చేయలేదన్నారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన నేటికీ ఇవ్వలేదన్నారు. ఎంతో ఆశ పెట్టుకున్న రుణాలు రాలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. గిరిజన చదువుకునే యువకులు ఉపాధి అవకాశాలు లేక రోజు వారిగా కూలీలుగా, ఆటో డ్రైవర్, ఓలా, ఉబెర్, షాపింగ్ సెంటర్స్‌లో పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నారన్నారు. అలాంటి వారికి వెంటనే రుణాలు మంజూరు చేసి గిరిజన యువతకు ఆదుకోవాలన్నారు. సబ్సిడీ రుణాలు ఏలాంటి షరతు లేకుండా ఇవ్వాలన్నారు. 2021-24 సంవత్సరం వరకు సబ్సిడీ రుణాలు కూడా వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు మహేష్, దేవేందర్, డీవైఎఫ్ఐ నాయకులు శ్రీను, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరిస్తాం



- కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్

నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గంలోని గాంధీనగర్ డివిజన్‌లో పారిశుధ్య కార్మికులకు ఏవైనా సమస్యలు ఉంటే వాటిని వెంటనే పరిష్కరిస్తామని కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ తెలిపారు. గాంధీనగర్ డివిజన్ పరిధిలోని పలు చోట్ల పారిశుధ్య పనులపై అందిన ఫిర్యాదుల మేరకు బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్ తో కలిసి ఫిర్యాదు వున్న ప్రాంతాల్లో పారిశుధ్య కార్మికుల పనితీరును పరిశీలించి వారితో మాట్లాడారు. ఎక్కడ తమకు ఫిర్యాదులు రాకుండా ప్రతి ఒక్కరు తమ విధులు నిర్వర్తించాలని, అలాగే పారిశుధ్య కార్మికులకు విధినిర్వహణలో ఏవైనా అసౌకర్యాలు, సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని కార్పొరేటర్ తెలిపారు. కష్టపడి పనిచేసే వారికి తమ తరపున ప్రోత్సాహం లభిస్తుందని పారిశుధ్య కార్మికులతో అన్నారు.

వికలాంగులకు పండ్లు పంపిణీ..

నవతెలంగాణ-ధూల్ పేట్



జమాఅతె ఇస్లామీహింద్ ఉమెన్స్ వింగ్ నాయకురాలు నసీమ్ సుల్తానా వృద్ధులు, అనాథలు, వికలాంగులకు పండ్లను పంపిణీ చేశారు. టోలీ చోకీలోని అనురాగ్ హ్యూమన్ సర్వీస్ ఓల్డేజ్ హోమ్‌ను ఆమె సందర్శించారు. వృద్ధులు, అనాథ పిల్లలు, వికలాంగులను ఆప్యాయంగా పలకరించారు. మేమున్నామనే ధైర్యాన్నిచ్చారు. కుటుంబాల్లో వృద్ధుల ఆరోగ్యానికి ఆదరణ కరువవుతోందని ఆమె ఆదోళన వ్యక్తం చేశారు. అనాథ దివ్యాంగ పిల్లలకు ప్రేమను పంచేవారిని దేవుడు కరుణిస్తాడన్నారు.



ఆషాడ మాసం బోనాల కార్యక్రమంలో భాగంగా లాల్ దర్వాజాశ్రీ సింహవాహినీ అమ్మవారికి ప్రతి సంవత్సరం మొదటి బోనం సమర్పించడం జరుగుతుంది. ఈ సంవత్సరం కూడా శుక్రవారం అమ్మవారి కి కుటుంబ సమేతంగా మాజీ చైర్మెన్ మాణిక్ ప్రభు బోనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-చాంద్రాయణగుట్ట



శ్రీ అక్కన్న మాదన్న మహంకాళి 76వ వార్షిక బోనాల ఉత్సవాలను శుక్రవారం ధ్వజారోహణ కార్యక్రమాన్ని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పాల్గొని ప్రారంభించారు. ఆయన ఆలయంలో మహా అభిషేకం, ప్రత్యేక అలంకరణ, అర్చన, కలశ స్థాపన, మహా హారతి పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. **నవతెలంగాణ-ధూల్‌పేట్**

శ్రీశైలం దేవస్థానంలో ఏర్పాటుచేసిన కూచిపూడి కార్యక్రమంలో పాల్గొన్న నల్లకుంట ప్రాంతానికి చెందిన నారాయణి

నవతెలంగాణ-అంబర్‌పేట



కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై ఉదాసీన వైఖరి

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల, కార్మిక సమాఖ్య వైస్ ప్రెసిడెంట్ పి.సురేష్, కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఏ.శ్రవణ్



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం ఉదాసీన వైఖరి అవలంబిస్తుందని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల, కార్మిక సమాఖ్య వైస్ ప్రెసిడెంట్ పి.సురేష్, కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఏ.శ్రవణ్ కుమార్ అన్నారు. శుక్రవారం దేశవ్యాప్తంగా అన్ని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లో భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శనలు చేయాలని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కార్మికుల సమైక్య పిలుపుమేరకు ఆబిడ్స్ చౌరస్తాలో నిరసన చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల, కార్మిక సమాఖ్య వైస్ ప్రెసిడెంట్ పి.సురేష్, కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఏ.శ్రవణ్ కుమార్‌లు హాజరై మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పట్ల కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ఉదాసీన వైఖరికి నిరసన తెలియజేస్తూ, న్యాయమైన డిమాండ్లను అమలు చేయాలని పిలుపునిచ్చారు. ఎనిమిదో వేతన సవరణ సంఘాన్ని వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలన్నారు. 18 నెలల కరువు భత్యం వెంటనే చెల్లించాలి. పూర్తి పెన్షన్ 15 సంవత్సరాలకు బదులుగా 12 సంవత్సరాలకు పునరుద్ధరించాలన్నారు.

కారుణ్య నియామకాల్లో ఐదు శాతం పరిమితి తొలగించి ప్రభుత్వ విభాగాల్లోని అన్ని ఖాళీలను భర్తీ చేయాలన్నారు. ఎన్.ఎఫ్.పి, ఇస్రో సంఘాల రద్దు ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలి. (ఆ) 15(1)సీ నిబంధనలు ఉద్యోగ సంఘాలకు వర్తింప చేయరాదు. ఒప్పంద/తాత్కాలిక ఉద్యోగుల నియామకాలను వెంటనే క్రమబద్ధీకరించాలి. గ్రామీణ తపాలా /స్వతంత్ర ప్రతిపత్తి సంస్థల ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం ఉద్యోగుల హెూదా కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐపీఈయూ పోస్టుమాన్ అండ్ ఎమ్‌టీఎస్ సర్కిల్ సెక్రటరీ ఎమ్. మధుసూదన్ రావు, ఆర్ 3 సర్కిల్ సెక్రటరీ ముత్తేష్, సర్కిల్ అడ్మిన్ సర్కిల్ సెక్రటరీ శ్రీకాంత్, డైరెక్టర్ అఫ్ పోస్టల్ అకౌంట్స్ (డీఏపీ) సర్కిల్ సెక్రటరీ సోమేశ్ పాల్గొన్నారు.

'బాలికల వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి'

- ఏఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి

నవతెలంగాణ-హిమాయత్‌నగర్




ప్రభుత్వ బాలికల వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. అఖిల భారత విద్యార్థి సమైక్య (ఏఐఎస్ఎఫ్) హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం నారాయణగూడ, విఠల్ వాడీలోని బాలికల బీసీ హాస్టల్‌లో సర్వే నిర్వహించి, హాస్టల్ వార్డెన్ షరీఫ్ బేగం సమక్షంలో విద్యార్థినులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్, జిల్లా అధ్యక్షులు చైతన్య యాదవ్ మాట్లాడుతూ విద్యార్థినులకు పౌష్టిక ఆహారం అందించడంలో నాణ్యత లోపించిందని, ప్రోటీన్స్ తో కూడిన బ్రేక్ ఫాస్ట్ అందించాలని, మహిళాల ఆరోగ్య సమస్యలు దృష్టిలో పెట్టుకుని పోషక ఆహారం అందించాలని కోరారు. విద్యార్థులందరూ గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన నిరుపేద విద్యార్థినులే కనుక ప్రభుత్వం వెంటనే వసతి గృహాలపై అధిక నిధులు కేటాయించి, పూర్తి స్థాయిలో వారి అవసరాలకు అనుగుణంగా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేలా సొంత భవనాలతో కూడిన వసతి గృహాలను ఏర్పాటు చేయాలని, వసతి గృహానికి అవసరమైన ఉద్యోగులను నియమించాలని డిమాండ్ చేశారు. హాస్టల్స్‌లో నెలకొన్న సమస్యలపై పూర్తి స్థాయి నివేదికతో త్వరలో జిల్లా కలెక్టర్, రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించి విద్యార్థినుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఏఐఎస్ఎఫ్ పోరాటాలు నిర్వహిస్తుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి పెరుమాళ్ల అనిల్ కుమార్, విద్యార్థినులు పాల్గొన్నారు.

'ఆస్తి కోసం కన్న కొడుకు దాడి'

- కొడుకు, కోడలు, సాదా నర్సింహా రెడ్డి నుంచి ప్రాణహాని ఉంది
- రక్షణ కల్పించాలని డీజీపీకి బాధితుడు కల్లెం నర్సింహా రెడ్డి విజ్ఞప్తి

నవతెలంగాణ-హిమాయత్ నగర్



ఆస్తి కోసం కన్న కొడుకే ఓ వృద్ధ తండ్రిపై దాడి చేయించాడు. తన కొడుకు కోడలు, వారి బంధువుల నుండి ప్రాణ హాని ఉందని, రక్షణ కల్పించాలని బాధిత తండ్రి కల్లెం నర్సింహా రెడ్డి తెలంగాణ రాష్ట్ర డీజీపీని కలిసి వేడుకున్నాడు. దోమలగూడకు చెందిన కల్లెం నర్సింహా రెడ్డి కొడుకు చంద్రశేఖర్ రెడ్డి, కోడలు పద్మలతలు ఆస్తి కోసం పద్మలత తన బావ అయిన కొంపల్లికి చెందిన ఎస్.వి.ఆర్ గార్డెన్స్ యజమాని సాదా నర్సింహారెడ్డితో తనపై దాడి చేయించాడని బాధిత తండ్రి పిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు శుక్రవారం బషీర్ బాగ్‌లో ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి మల్లారెడ్డి ప్రొద్భలంతో, అండతో ఆదివారం సాదా నర్సింహా రెడ్డి కుటుంబం గెట్ టూ గెదర్ ఉందని తనను పిలిపించి, మల్లారెడ్డితో పాటు మరో పది మంది పెద్దల సమక్షంలో తనపై తీవ్ర పదజాలంతో దుర్భాషలాడుతూ తలపై దాడి చేసి చితక బాదారని తెలిపాడు. దీంతో తాను రెండు రోజులు అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందానని చెప్పారు. ఆస్తులు ఇస్తానని చెప్పినా కూడా వినకుండా తన కొడుకు, కోడలు ఆకారణంగా దాడి చేసి బెదిరించాడని చెప్పారు. తనకు తన కొడుకు, కోడలు, సాదా నర్సింహారెడ్డిల నుండి ప్రాణహాని ఉందని తనకు రక్షణ కల్పించేలా పోలీసులు, ప్రభుత్వం చర్యలు తీసుకుని న్యాయం చేయాలని ఆయన వేడుకున్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సీనియర్ ఎంటమాలజిస్ట్ రజిని అన్నారు. అబిడ్స్‌లోని జీహెచ్ఎంసీ ఎంటమాలజిస్ట్ కార్యాలయంలో మాట్లాడుతూ.. ఇంటి పరిసరాల్లో రబ్బర్ టైర్లు, పాడైపోయిన వస్తువులు, ప్లాస్టిక్, పాలితిని వస్తువుల్లో నీటి నిలువ లేకుండా చూసుకోవాలని సూచించారు. నిలువ ఉన్న నీటిలో దోమలు ఆవాసాలు చేసుకుంటాయని తెలిపారు. పిచ్చి మొక్కలు ఎక్కువగా ఉంటే దోమల సంతాన ఉత్పత్తి కేంద్రాలుగా ఉపయోగపడతాయని మొక్కలు పెరగకుండా చూసుకోవాలన్నారు. ఇండ్లలో ఉండే కుండీల్లో తులసి, పుదీనా, సిట్రో నల్లా గ్రాస్, లెమన్ గ్రాస్ వంటి మొక్కలను కుండీలో పెంచుకోవడం వల్ల దోమలు చాలా వరకు కంట్రోల్ అవుతాయన్నారు. ఇంటి పరిసరాల్లో మురికినీటి నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు.

'కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు పెంచాలి'




- ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 7 నెలలు గడుస్తున్న ప్రభుత్వ, ప్రభుత్వేర సంస్థల్లో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికుల కనీస వేతనాలు సవరించి పెంచకుండా గత ప్రభుత్వం లాగానే దాట వేస్తుందని, వెంటనే కార్మికులకు కనీస వేతనాలు పెంచాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు ఎం.డి.యూసుఫ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.బాలరాజు మాట్లాడుతూ అనేక పోరాటాల వల్ల సాధించుకున్న 29 కార్మిక చట్టాలను ఎన్డీయే ప్రభుత్వం పూర్తిగా రద్దు చేసి, కార్మిక హక్కులను కాలరాసే 4 లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్పొరేట్, పెట్టుబడిదారులకు మేలు చేస్తున్న కోడ్‌లను రాష్ట్ర ప్రభుత్వం 4 లేబర్ కోడ్‌లను అమలు చేస్తామని ప్రకటించటం ఎన్డీయే ప్రభుత్వ విధానాలను తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తామనడం హాస్యాస్పదంగా ఉందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న వంట కార్మికులకు చెల్లిస్తున్న రూ. 3 వేల వేతనాన్ని రూ. 10 వేలకు పెంచి అమలు చేస్తామన్న సీఎం ఎ.రేవంత్ రెడ్డి మాట మార్చడాన్ని ఆయన నిశితంగా విమర్శించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేస్తున్న ఎన్‌హెచ్‌ఎం, 2వ ఎఎన్ఎంలు వేలాది మంది శ్రమ దోపిడికి గురవుతూ పేద ప్రజల ఆరోగ్యమే పరమావధిగా భావించి పని చేస్తుంటే వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా నియమించకుండా కాలయాపన చేయటాన్ని ఆయన విమర్శించారు. భవన నిర్మాణ కార్మికుల అడ్డాలలో పనులకు నిలబడితే వారికి చట్టం ప్రకారం కనీసం మూత్రశాలలు, విశ్రాంతి గదులు నిర్మించాలన్న చట్టాన్ని తుంగలో తొక్కారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జూలై 24 నుండి జరగనున్న అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ప్రతి రోజు ఒక యూనియన్ వారి సమస్యల పరిష్కారానికై ఇందిరాపార్కు వద్ద ధర్నాలు నిర్వహించి మంత్రులకు, అధికారులకు మెమోరాండాలు ఇవ్వాలని నిర్ణయించటం జరిగిందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మా, ఉపాధ్యక్షులు పి.ప్రేంపావని, కె.ఏసురత్నం, రాష్ట్ర కార్యదర్శులు ఎస్.కరుణ కుమారి, వై.ఓమయ్య, నరాటి ప్రసాద్, బి.వెంకటేశం, ఎం.డి.ఇమ్రాన్, ఎస్. విలాస్, ఓరుగంటి యాదయ్య కడారి రాములు, గన్నారపు రమేష్, జి.రాములు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మికులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలి

- అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటాచారి
- ఆపరేషన్ ముస్కాన్-10 పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా బాల కార్మికులను, భిక్షటన చేస్తున్న వీధి బాలలను గుర్తించి, వారిని భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని హైదరాబాద్ అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటాచారి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో ఆపరేషన్ ముస్కాన్-10 సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆపరేషన్ ముస్కాన్ -10 పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆశ్రయం లేని, నిరాధారణకు లోనైనా పిల్లలను, వృద్ధులను గుర్తించి వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు అన్ని శాఖలు సమిష్టితో పని చేయాలన్నారు. రెవెన్యూ సిబ్బంది వృత్తిపరమైన, వ్యక్తిగతమైన బాధ్యతగా శ్రద్ధతో పనిచేసి పిల్లల జీవితాల్లో వెలుగులు నింపాలన్నారు. నగరంలో వీధి బాలలు, భిక్షటన చేస్తున్న వారు లేకుండా కృషిచేసి మంచి సమాజాన్ని నిర్మించేందుకు కంకణ బద్ధులం కావాలన్నారు. జిల్లా సంక్షేమాధికారి అక్కేశ్వరరావు మాట్లాడుతూ ఈ సంవత్సరం చేపడుతున్న ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా ఇప్పటికీ 89 మంది బాల కార్మికులను, వీధి బాలలను, భిక్షటన చేస్తున్నవారిని సంరక్షించి ఆశ్రయం కల్పించామన్నారు. జిల్లాలో బాల కార్మికులు, భిక్షటన చేస్తున్న 18 ఏండ్లలోపు పిల్లల సంరక్షణ కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1098 సంప్రదించగలరని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య అధికారి డాక్టర్ వెంకట్, డీఈవో ఆర్.రోహిణి, ఏసీపీ ఆంజనేయులు, కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ జాసన్, డీసీపీవో శ్రీనివాస్, ఆర్డీవో మహిపాల్, ఎస్‌హెచ్‌వోలు, కార్మికశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఫిన్వేస్కో క్యాపిటల్ రీజనల్ ఆఫీస్ ప్రారంభం



నవతెలంగాణ-సిటీబ్యూరో

మహిళా వ్యాపారులకు సులభంగా రుణ సదుపాయాన్ని కల్పించి, వారి ఆర్థిక అభివృద్ధికి ఫిన్వేస్కో క్యాపిటల్ ఇండియా సంస్థ కృషి చేస్తుందని కాన్ఫిడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంట్రప్రెన్యూర్స్ న్యూయర్ ఆఫ్ ఇండియా నేషనల్ ప్రెసిడెంట్ లలిత అలూరి తెలిపారు. శుక్రవారం ఫిన్వేస్కో క్యాపిటల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ అయ్యప్ప సొసైటీలో ఏర్పాటు చేసిన తెలంగాణ రీజనల్ కార్యాలయాన్ని ఇండియన్ పారా బ్యాడ్మింటన్ ప్లేయర్ మానషి జోషితో కలసి లలిత ముఖ్య అతిథిగా హాజరై ప్రారభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా వ్యాపారులకు సులభంగా రుణాలిచ్చి ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారని పేర్కొన్నారు. ఫిన్వేస్కో దేశ అభివృద్ధి కోసం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫిన్వేస్కో హెూల్డింగ్స్ ఎండీ రవీంద్ర, డైరెక్టర్లు రాకేష్, రమణ. వెంకట రంగయ్య, కంపెనీ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

PASSPORT MISSNIG

I, **IYANALA ANJI BABU, S/o. RAGAVAIAH,** aged about 55 years, Occupation: Business, R/o H.No.3-657, Siddartha Nagar, Suraram, Quthbulapur Mandal Medchal-Malkajgir District, Telangana State, I submit that I lost my Original Passport No. **A7169295,** Issued Date:25-01-1999.
NOTE: That my original Indian valid Passport has been lost, while I am shifting my Room .if any body found Please
Contact: 9848622901

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE ATI : JADCHERLA
I.A.No.657 of 2023
in
O.S No. 38 of 2018

BETWEEN :-
Pathlavath Deepla
...Petitioner/Plaintiff
AND
M.Surender Reddy and Others
... Respondents/Impleading as Defendants 4 to 7

NOTICE

To,
R1.M.Surender Reddy S/o.Chandra Reddy aged 46 years,Occ: Agriculture,R/o.H.No.22-122,Rallaguda village of Shamshabad Mandal,Ranga Reddy District.
R2. Gummadi Srinivas Reddy S/o Late Krishna Reddy aged 55 years Occ:Agriculture,R/o.H.No.6-2-65,Shivarampally,Rajendranagar Mandal,Ranga Reddy District.
R3. Vishnu Kumar S/o.Gyasilal Gupta aged 60 years,Occ:Business,R/o.H.No.21-6-742,Chelapur, Hyderabad.
WHEREAS the above named Petitioner had instituted a petition for Cancellation of Regd.Sale Deed of the suit schedule properties against you as Respondent No.1 to 3/ Defendants No.1 to 3 and the same is coming for your appearance on 26-07-2024 and same is pending before the above said court. Therefore you are hereby directed to appear before the above said Hon'ble Court on 26-07-2024 at 10.30 A.M.in person or through Pleader.Other wise the matter will be decided as ex-parte in absence of you.
(BY ORDER OF THE COURT)
DHANALA THIRUPATHI
Advocate-Notary.
Jadcherla,Mahabubnagar Dist.
Cell:9440296189

IN THE COURT OF THE HON'BLE III rd ADDL. JUNIOR CIVIL JUDGE AT:SANGAREDDY
OS.No. 454 OF 2023
Between:
Pothuraju. Yadaiah & others
...Plaintiffs
And
Smt. Seyda Farhat Sultana & others ...Defendants
To,
3.Shabana begum W/o Syed Rouf, Aged about: 42 years, Occ: House hold, R/o H.No. 4-42-525, Papireddy Nagar, Asbestos Colony, Kukatpally, Rangareddy District., ...Defendant No.3
Where as the above named Petitioners/Plaintiffs has made an application before the Hon'ble III rd ADDL.JUNIOR CIVIL JUDGE AT SANGAREDDY vide O.S No. 454 of 2023, you are hereby directed to appear in the court in person or through advocate on 13th day of August 2024 at 10:30 A.M. to show cause against the application. Take notice that in default of appearance on the above date the matter will be heard and determined Exparte.
(By order the Court)
M/S C. VINOD REDDY
G.BALAKRISHNA
P.CHANDU
Advocates,
Off: D.No.101,
C.G.R. Manjeera Hotel,
P.R.Pally X Road,Sangareddy.

IN THE COURT OF THE HON'BLE III rd ADDL. JUNIOR CIVIL JUDGE AT:SANGAREDDY
IA.No. 327 OF 2023
IN
OS.No. 454 OF 2023
Between:
Pothuraju. Yadaiah & others
..... Petitioner/Plaintiffs
And
Smt.Seyda Farhat Sultana & others
...Respondent/Defendants
To,
3. Shabana begum W/o Syed Rouf, Aged about: 42 years, Occ: House hold, R/o H.No.4-42-525, Papireddy Nagar, Asbestos Colony, Kukatpally, Rangareddy District.,
...Respondent/Defendant No.3
Where as the above named Petitioners/Plaintiffs has made an application before the Hon'ble III rd ADDL JUNIOR CIVIL JUDGE AT SANGAREDDY vide IA. No.327 OF 2023 IN O.S. No. 454 of 2023, you are here by directed to appear in the court in person or through advocate on 13th day of August 2024 at 10:30 A.M. to show cause against the application. Take notice that in default of appearance on the above date the matter will be heard and determined Exparte.
(By order the Court)
M/S C. VINOD REDDY
G. BALAKRISHNA
P.CHANDU
Advocates,
Off: D.No.101,C.G.R. Manjeera Hotel,P.R.Pally X Road, Sangareddy.

IN THE COURT OF THE HON'BLE ADDL. JUNIOR CIVIL JUDGE AT: VIKARABAD : VIKARABAD DISTRICT.
O.S NO. 40 OF 2023
Between :-
Cheeme Anjaiah & Anr,
...Petitioner/Plaintiffs No. 1&2
AND
Thormamidi Basanth Ramu @ Basantha Raj & Ors.
...Defendant No.1 to 3/ Respondent No.7
To,
1. (D-7),
YSAR Infra & Developers, Rep.by Yenugu Sailaja, Aged : 39 Yrs, Occ: Business, R/o. H.No. 1-98/B/85/4, Ground Floor, DSR Reganti Apartments, Vittal Rao Nagar, Madhapur, Serilingampally, Rangareddy District - 500 081.
Notice to Defendants
Please take notice that the Petitioners/Plaintiffs No:1&2, herein filed **O.S.NO.40 OF 2023,** before the Hon'ble Addl.Junior Civil Judge: At Vikarabad, Vikarabad District and the Hon'ble court was pleased to post to above matter for your appearance on **01.08.2024,** and you are being the **Proposed Party/ Respondent/ Proposed Defendant No.7,** are hereby called upon to appear before the Hon'ble Court in person or through Counsel by 10:30 AM. otherwise the matter will be heard ex-parte.
This is for your information
//BY ORDER OF THE COURT//
Dr. PATLOLLA VARUN REDDY
Adovcate
Plot No.64, Karthikeya Nagar,
Yennepally 'X' Road
Vikarabad District - 501101
Contact No. 8978909373

గౌరవనీయమైన III-అడిషినల్‌జూనియర్ సివిల్ జడ్జ్ సంగారెడ్డి న్యాయస్థానం సమక్షంలో
ఓ.ఎస్. నం. 454 ఆఫ్ 2023
దిగువ వారి మధ్య:
పోతురాజు యాదయ్య & మరియు ఇతరులు
... వాదులు
మరియు
శ్రీమతి సెయ్యదా ఫరహత్ సుల్తానా మరియు ఇతరులు ...ప్రతివాదులు
To
3. షబానా బేగం భర్త సయ్యద్ రవూఫ్, వయస్సు: 42 సం॥లు, వృత్తి: గృహిణి, R/o. ఇం.నం. 4-42- 525, పాపిరెడ్డి నగర్, ఆస్‌బెటోస్ కాలనీ, కూకట్ పల్లి, రంగారెడ్డి జిల్లా.
(ప్రతివాది / ప్రతివాది **No.3**)
పై పేరుగల పిటీషనర్లు / వాదులు **O.S.** నం. **454** ఆఫ్ **2023** ప్రకారం గౌరవనీయ **III** అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ ఎట్ సంగా రెడ్డి సమక్షంలో దరఖాస్తు చేశారు. దరఖాస్తుపై కారణం తెలుపుటకు 13 ఆగస్టు 2024న ఉ. 10.30 గం॥లకు స్వయంగా లేదా అడ్వకేట్ ద్వారా న్యాయస్థనంలో మీరు హాజరు కావలసిందిగా ఆదేశించబడుతున్నారు. పై తేదీన హాజరగుటలో విఫలమైనచో విషయం మీ పరోక్షంలో విచారించబడుతుందని మరియు నిర్ణయించబడుతుందని గమనించగలరు.
(న్యాయస్థానం ఉత్తర్వు మేరకు)
M/s. సి. వినోద్ రెడ్డి,
జి. బాలక్రిష్ణ,
పి. చందు
అడ్వకేట్స్
ఆఫీస్: డోర్ నం. 101, సి.జి.ఆర్. మంజీర హోటల్, పి.ఆర్.పల్లి X రోడ్, సంగారెడ్డి.
సెల్ : 9848088122

గౌరవనీయమైన III-అడిషినల్‌జూనియర్ సివిల్ జడ్జ్ సంగారెడ్డి న్యాయస్థానం సమక్షంలో
ఐ.ఎ. నం. 327 ఆఫ్ 2023
IN
ఓ.ఎస్. నం. 454 ఆఫ్ 2023
దిగువ వారి మధ్య:
పోతురాజు యాదయ్య & మరియు ఇతరులు
...పిటిషనర్ / వాది
మరియు
శ్రీమతి సెయ్యదా ఫరహత్ సుల్తానా మరియు ఇతరులు ...ప్రతివాది / ప్రతివాదులు
To
3. షబానా బేగం భర్త సయ్యద్ రవూఫ్, వయస్సు: 42 సం॥లు, వృత్తి: గృహిణి, R/o. ఇం.నం. 4-42- 525, పాపిరెడ్డి నగర్, ఆస్‌బెటోస్ కాలనీ, కూకట్ పల్లి, రంగారెడ్డి జిల్లా.
(ప్రతివాది / ప్రతివాది **No.3**)
పై పేరుగల పిటీషనర్లు / వాదులు **O.S.**నం. **454** ఆఫ్ **2023**లో **I.A** నం. **327** ఆఫ్ **2023** ప్రకారం గౌరవనీయ **III** అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ ఎ ట్ సంగారెడ్డి సమ క్షంలో ద రఖాస్తు చేశారు. దరఖాస్తుపై కారణం తెలుపుటకు 13 ఆగస్టు 2024న ఉ. 10.30 గం॥లకు స్వయంగా లేదా అడ్వకేట్ ద్వారా న్యాయస్థనంలో మీరు హాజరు కావలసిందిగా ఆదేశం చబడుతున్నారు. పై తేదీన హాజరగుటలో విఫలమైనచో విషయం మీ పరోక్షంలో విచారించబడుతుందని మరియు నిర్ణయించబడుతుందని గమనించగలరు.
(న్యాయస్థానం ఉత్తర్వు మేరకు)
M/s. సి. వినోద్ రెడ్డి,
జి. బాలక్రిష్ణ,
పి. చందు
అడ్వకేట్స్
ఆఫీస్: డోర్ నం. 101, సి.జి.ఆర్. మంజీర హోటల్, పి.ఆర్.పల్లి X రోడ్, సంగారెడ్డి.
సెల్ : 9848088122

IN THE COURT OF THE HON'BLE ADDL..JUNIOR CIVIL JUDGE AT : VIKARABAD : VIKARABAD DISTRICT
O.S.NO. 39 OF 2023
Between :-
Cheeme Anjaiah & Anr,
...Petitioner/Plaintiff
AND
Chouta Chinna Mallaiah & 6 Ors
...Defendants No:1 to 7/ Respondents No.8,9 & 10
To,
1. **(D-8),**
Palavi Vidya Sagar Reddy, S/o. Palavi Mohan Reddy, Aged : 61 Yrs, Occ: Agriculture, R/o. H.No. 1-8-1/B8-F13, Near Water Tank, Bagh Lingampally, Musheerabad, Hyderabad - 500 044.
2. **(D-9),**
Malugu Bhanuchander Reddy, S/o. Makugu Sanjeeva Reddy, Aged: 32 Yrs, Occ: Agriculture, R/o. H.No : 14-23, Teachers Colony, Chevella Town & Mandal, Rangareddy District - 501 503.
3. **(D-10), YSAR Infra & Developers, Rep.by Yenugu Sailaja** Aged : 39 Yrs, Occ: Business, R/o. H.No.1-98/B/85/4, Ground Floor, DSR Reganti Apartments, Vittal Rao Nagar, Madhapur, Serilingampally, Rangareddy District - 500 081.
Notice to Defendants
Please take notice that the petitioners/ Plaintiffs No: 1 & 2, herein filed O.S.No.39 of 2023, before the Hon'ble Addl.Junior Civil Judge : At Vikarabad, Vikarabad District and the Hon'ble Court in Person or through Counsel by 10:30 AM. otherwise the matter will be heard ex-parte.
This is for your information
//BY ORDER OF THE COURT//
Dr. PATLOLLA VARUN REDDY
Adovcate
Plot No.64, Karthikeya Nagar,
Yennepally 'X' Road
Vikarabad District - 501101
Contact No. 8978909373

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT, AT: HAYATHNAGAR
O.S.NO.654 OF 2022
Between:
Karne Lalitha and another
...Plaintiffs
AND
Gurram Buchi Reddy and another
...Defendants
NOTICE
To
1.Gurram Buchi Reddy, s/o.Sathi Reddy R/o.4-260, Kuntloor village, Abdullapurmet mandal Ranga Reddy District-501505
2.Garlapaty Srinivasulu, s/o. Chandraiah R/o.Plot No.27, Sri Nagar Colony, Tirumalagiri Secunderabad-500015
WHEREAS the above named plaintiffs filed the above suit against you for declaration of sale deed Dt. 19.07.2015 bearing document No. 3823/2015 as null and void in respect of the suit B-schedule property and for Perpetual Injunction against you in respect of suit A and B Schedule properties;
PLEASE take notice that the above suit stands posted to 28.08.2024 for your appearance. You are required to appear before the Hon'ble Court at **10-30a.m. on 28.08.2024** in person or through an advocate; failing which, the matter will be heard and decided in your absence.
//BY ORDER OF THE COURT//
Sd/-
K.VENKATESWARLU,
Advocate,
2-43/A/2, Sai Nagar,
Chaitanyapuri, Hyderabad-500060.

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE AT SANGAREDDY
I.A.No. 964 of 2022
in
O.S.No. 262 of 2022
Between:-
Garela Ramulu
...Petitioner/Plaintiff
AND
Smt.G.Jayamma and others
...Respondents/Defendants
To
1.Sarikonda Ramulu S/o. Chennaiah, aged about 70 years, Occ: Nil.
2. Sarikonda Satyanarayana S/o. Ramulu, aged about 50 years, Occ: Agriculture.
The defendants No.2 and 3 are R/o. H.No.18-8-531/1, Kumarlwadi, Joharabi Darga, Edi Bazar, Hyderabad.
...Respondents/Defendants No.2 and 3
Whereas, the plaintiff herein filed suit vide O.S.No.262 of 2022 for partition and separate possession against you and others in respect of the suit schedule property on the file of Hon'ble Senior Civil Judge at Sangareddy along with I.A.No.964 of 2022 for interim injunction and the said I.A. now stands posted on 13-08-2024 for your appearance.
Hence, you are hereby informed to appear before the Hon'ble Senior Civil Judge at Sangareddy on 13-08-2024 at 10.30 a.m., either in person or though counsel, failing which, the matter will be decided ex-parte as per law.
(By order of the Court)
(R. VENKATESHAM)
Advocate
SANGAREDDY

LOST OF DOCUMENT

I, SRI. BHASKAR, S/o. LATE. A.S. MURTHY, aged about 74 Years, Occupation:Business, No. R/o. H.No.3-6-66/A, Basheer Bagh, Hyderabad-500029. That submit that I am the owner of the Open Plot No.1, in Survey No.764, admeasuring 398 Sq. Yds., or 332.73 Sq. Mtrs., Situated at Korremula Village, Chowdariguda Gram Panchayath, Ghatkesar Mandal, Medchal-Malkajgiri District by vide Regd. Sale Deed Doct. **No.3015/2005,** at S.R.O. Ghatkesar and Related Link Sale Deed Doct. **No.3914/1987,** at S.R.O. Uppal.
That the above Related Link Sale Deed Doct. **No.3914/1987,** at S.R.O. Uppal, this was lost by me while travelling by Auto from Narapally to Ghatkesar, on Dated: 13-07-2024, and inspite of my best efforts I am unable to trace it and it is beyond recovery.

IN THE HON'BLE COURT OF THE II ADDL JUNIOR CIVIL JUDGE, AT: MALKAJGIRI
O.S.No.456 OF 2020
Between:
State Bank of India, SME Cherlapally, Udai Square, Plot 3A/3B, EC Nagar X Road, Hyderabad. Rep. by its Manager Sri V.L.N.Srinivasa Murthy S/oV.V.Nagabhushana Rao
...Plaintiff
And
Mr.Shaik Khalidbaba
...Defendant
To,
Mr.Shaik Khalidbaba S/o. Khajamiya Shaik Aged about 37yrs Occ:Pvt.Employee Plot No.80, Yadireddy Thota, Kamalanagar, Vansthalipuram, Hyd-500 070.
Please take notice that as you are evading taking notices sent by the Hon'ble Court, notice to you in this daily has been ordered by the Hon'ble Court and you are hereby directed to appear either in person or through duly instructed Advocate **at 10-30 AM on 05-08-2024** in the above mentioned Court or else the matter will be determined on the basis of the available material without any further notice to you as ordered by the Court.
SMT. RAPAKA ARUNA,
Advocate
11-78, Flat No.203, Sri Sai Manssion, Pragathinagar, Gaddiannaram, Hyd-500060.

IN THE HON'BLE COURT OF THE II ADDL JUNIOR CIVIL JUDGE, AT: MALKAJGIRI
O.S.No.455 OF 2020
Between:
State Bank of India, SME Cherlapally, Udai Square, Plot 3A/3B, EC Nagar X Road, Hyderabad.Rep.by its Manager Sri V.L.N.Srinivasa Murthy S/o V.V.NagabhushanaRao
...Plaintiff
And
Mrs.Anitha Manupati
...Defendant
To,
Mrs.Anitha Manupati W/o M.Uday Kumar Aged about 39yrs, Occ:Pvt. Employee H.No.8-77/1, Mythripuram Colony, Karmanghat, Ranga Reddy District.
Please take notice that as you are evading taking notices sent by the Hon'ble Court, notice to you in this daily has been ordered by the Hon'ble Court and you are hereby directed to appear either in person or through duly instructed Advocate at 10-30 AM on 05-08-2024 in the above mentioned Court or else the matter will be determined on the basis of the available material without any further notice to you as ordered by the Court.
SMT.RAPAKA ARUNA,
Advocate
11-78, Flat No.203, Sri Sai Manssion, Pragathinagar, Gaddiannaram, Hyd-500 060.

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE AT SANGAREDDY
I.A.No. 965 of 2022
in
O.S.No. 262 of 2022
Between:
Garela Ramulu
...Petitioner/Plaintiff
AND
Smt. G. Jayamma and others
...Respondents/Defendants
To
1. Sarikonda Ramulu S/o. Chennaiah, aged about 70 years, Occ: Nil.
2. Sarikonda Satyanarayana S/o. Ramulu, aged about 50 years, Occ: Agriculture.
The defendants No.2 and 3 are R/o. H.No.18-8-531/1, Kumariwadi, Joharabi Darga, Edi Bazar, Hyderabad.
...Respondents/Defendants No.2 and 3
Whereas, the petitioner/plaintiff herein filed suit vide O.S.No.262 of 2022 for partition and separate possession against you and others in respect of the suit schedule property on the file of Hon'ble Senior Civil Judge at Sangareddy along with I.A.No.965 of 2022 for interim injunction and the said I.A. now stands posted on 13-08-2024 for your appearance.
Hence, you are hereby informed to appear before the Hon'ble Senior Civil Judge at Sangareddy on 13-08-2024 at 10.30 a.m., either in person or though counsel, failing which, the matter will be decided ex-parte as per law.
(By order of the Court)
(R. VENKATESHAM)
Advocate
SANGAREDDY

మహారాజశ్రీ మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ గారి కోర్టు, హన్మకొండ
O.S.NO. 1405 OF 2022
(OLD O.S.NO. 1114 OF 2019)
సూడమళ్ళ జగదీశ్వర రావు ...వాది
మరియు
సూడమళ్ళ మల్లేషం ...ప్రతివాది
నోటీసు
To,
సూడమళ్ళ మల్లేషం, S/o. లేటు ఐలయ్య, వయస్సు : 71 సం॥లు, వృత్తి : రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి, R/o. ఇంటి నెం.20-25P/26P/A, స్ట్రీట్ నెం.4, వికాస్‌నగర్, దమ్మాయిగూడ చేర్యాల గ్రామము, కీసర మండలము, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా.
పైన తెలిపిన వాది తనకు రావలసిన రూ. 7,05,343/- రాబట్టుకొనుటకు పైన తెలిపిన దావాను పైన తెలిపిన కోర్టు నందు వేసియున్నారు. సదరు దావా మీ హాజరుకై దివి.01-08-2024 తేదికి వాయిదా పడినది. కావున మీరు సదరు తేదీన ఉ॥10-30 గం॥లకు పైన తెలిపిన కోర్టు నందు వ్యక్తిగతముగా కాని, న్యాయవాది ద్వారా గాని హాజరు కావలసియున్నది. లేనిచో సదరు దావా మీ పరోక్షమున విచారించబడి నిర్ధారించబడును.
// కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారముగా//
లడె రమేష్
కిష్టోజు శివ
బైకాని రాకేష్, కుసుంబ శశిధర్
న్యాయవాదులు
ఇ.నెం. 2-6-919/2, సర్క్యూట్‌హౌజ్ రోడ్డు, కె.ఎల్.ఎన్ రెడ్డికాలనీ, హనుమకొండ జిల్లా
తేది. 2.7.2024 సెల్ :**98497 50190**
78932 13214

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE AT SANGAREDDY
O.S.No. 262 of 2022
Between:
Garela Ramulu
...Plaintiff
AND
Smt. G. Jayamma and others
...Defendants
To
1. Sarikonda Ramulu S/o. Chennaiah, aged about 70 years, Occ: Nil.
2. Sarikonda Satyanarayana S/o. Ramulu, aged about 50 years, Occ: Agriculture.
The defendants No.2 and 3 are R/o. H.No.18-8-531/1, Kumariwadi, Joharabi Darga, Edi Bazar, Hyderabad.
...Defendants No.2 and 3
Whereas, the plaintiff herein filed suit vide O.S.No.262 of 2022 for partition and separate possession against you and others in respect of the suit schedule property on the file of Hon'ble Senior Civil Judge at Sangareddy and the said suit now stands posted on 13-08-2024 for your appearance.
Hence, you are hereby informed to appear before the Hon'ble Senior Civil Judge at Sangareddy on 13-08-2024 at 10.30 a.m., either in person or though counsel, failing which, the matter will be decided ex-parte as per law.
(By order of the Court)
(R. VENKATESHAM)
Advocate
SANGAREDDY

IN THE COURT OF HON'BLE III ADDL.JUNIOR CIVIL JUDGE-XIV ADDL METROPALITION MAGISTRATE MEDCHAL MALKAJGIRI DISTRICT AT: KUKATPALLY
O.S.NO: 158 OF 2024
BETWEEN:
Smt.NARLA LAKSHMI DEVI, AND OTHER'S
...PLAINTIFF'S
THETAHASILDERKUKATPALLY
...DEFENDATES
TO
ALL CONCERNED
NOTICE
Please take notice the named above plaintiff above suit for declaration to declare the plaintiff as legal heirs here of late Narla Dattatrayulu Reddy was passed away on 10-05-2021 and matter is posted for publication of any claims or objection from any concerned. Hence, if any person is/are having any claims or objections they any be appear before this hon'ble court on **11-6-2024 at 10:30 AM,** either in person are though on advocate duly instructed by you, with all relevant evidences. Failing which the matter will be decided on merits in ex-parte.
//By order of the court//
K.HARI BABU
ADVOCATE
4-32-41/130/58/A, Opp: Oldage Home, Sai Nagar (W). Near Alwyn Colony, Kukatpaly Post, Hyd-72
Cell No.9948108151

IN THE COURT OF THE HON'BLE CHAIRMAN MACT CUM CHIEF JUDGE: CITY CIVIL COURT, AT: HYDERABAD
MVOP.NO.100 OF 2024
Between:
Godukonda Yadamma.
...Petitioner
And
GGG Mounika and another
...Respondents
To,
1.GGGMounikaW/o.G.Lakshmaiah Occ:Owner of Splender bike bearing no TS-07-JA-1780,R/o. H.No.7-1-70/F,Biramalguda,Saroor Nagar,Hyderabad ...R1
Please take Notice that the above named Petitioner filed above O P against you and other for Compensation, Praying that the Hon'ble court for grant of compensation in favor of the petitioner. The Hon'ble Court posted the above case on **28-8-2024 .at 10.30 am** for your appearance either in person or through an advocate, failing which the case will be heard and decided on merits in your absence.
(BY ORDER OF COURT)
M/s.M.Srinivas,
Advocate
Flat.203, R.K.Residency,
Medipally,Uppal,Hyderabad.

IN THE COURT OF THE HON'BLE CHAIRMAN MACT CUM II ND ADDI CHIEFF JUDGE: CITY CIVIL COURT AT: HYDERABAD
MVOP.NO.2355 OF 2023
Between:
T.Venkata Mahalaxmi and another
...Petitioner
And
Sri Ramadas Motors Transport Ltd Rep by Its R.Raghuveer.and another ....Respondents
To,
1.Damodara Rao Duvva,S/o.Raja Rao,Occ:Driver of Crime Vehicle ,R/o.H.No.1-4-2/2,Flat No.9,SRL Colony Road No.1,Kothapet, Uppal,Medchal Malkajgiri, Hyderabad. ...R3
Please take Notice that the above named Petitioner filed above O P against you and other for Compensation, Praying that the Hon'ble court for grant of compensation in favor of the petitioner. The Hon'ble Court posted the above case on **22-8-2024 .at 10.30 am** for your appearance either in person or through an advocate, failing which the case will be heard and decided on merits in your absence.
(BY ORDER OF COURT)
M/s.Ravi Krishna ,
Advocate
Malakpet,Hyderabad

IN THE HON'BLE COURT OF THE II ADDL JUNIOR CIVIL JUDGE, AT: MALKAJGIRI
O.S.No.462 OF 2020
Between:
State Bank of India, SME Cherlapally, Udai Square, Plot 3A/3B, EC Nagar X Road, Hyderabad.Rep.by its Manager Sri V.L.N.Srinivasa Murthy S/o V.V.NagabhushanaRao
...Plaintiff
And
Mudigonda Haridas
...Defendant
To,
Mudigonda Haridas S/o Sanjeeva Aged about 28yrs, Occ: Pvt. Employee Flat No.302, Sharvani Heights, Talkie Town Street, OPP KVR Hights, FCI Colony, Miyapur, Hyderabad-49
Please take notice that as you are evading taking notices sent by the Hon'ble Court, notice to you in this daily has been ordered by the Hon'ble Court and you are hereby directed to appear either in person or through duly instructed Advocate **at 10-30 AM on 05-08-2024** in the above mentioned Court or else the matter will be determined on the basis of the available material without any further notice to you as ordered by the Court.
SMT.RAPAKA ARUNA,
Advocate
11-78, Flat No.203, Sri Sai Manssion, Pragathinagar, Gaddiannaram, Hyd-500 000.

IN THE COURT OF HON'BLE II ADDL. JUNIOR CIVIL JUDGE CUM X M.M, RANGAREDDY DISTRICT:: AT KUKATPALLY
O.S. No. 944 OF 2023
BETWEEN:
Rajitha @Koduganti Rajitha and others ..... Plaintiffs
And
Koduganti Padmavathi and others ..... Defendants
To,
All Concerned (Defendant No.3)
Take Notice that the Plaintiffs have filed the above O.S to declare them as legal heirs of the deceased Koduganti Sri Phani Ravi Kumar and rightful owners of the suit schedule property and the case stands posted to 07-08-2024. if any person or persons have any objections or claims in respect of the below scheduled property, they may appear before the above said court on 07-08-2024 at 10:30 AM either in person or through an advocate, failing which the matter will be decided basing on the documents available on record.
SCHEDULE OF THE PROPERTY
All that Semi-Finished Flat No: G-10, Ground Floor, Block-I of Radha Madhav Nilayam having a plinth area of 614 sq.feet including common areas& balcony areas etc along with undivided share of the land to the extent of 27.5 Sq.yards in and out of the 4235 Sq.yards in Survey Nos 6/ ఆ,ఇ,ఆ,ఈ,ఉ, of Block No.1, Miyapur old village, Serilingampally, Rangareddy District and bounded by:
NORTH : Open to Sky & Flat No. G-11
SOUTH : Corridor&Duck
EAST : Corridor
WEST : Flat No. G-9
//By Order//
Hon'ble II Addl. Junior Civil Judge Cum X M.M, Ranga Reddy District Kukatpally
M/s. Vemula Surender Rao, (TS/2073/2008) &
A. Naresh Lal, Advocates
H.No: 3-10-20/98, R.T,C colony, Ramanthapur, Hyderabad-500 013, Ph. No: 9246567975
COUNSEL FOR PLAINTIFFS

TO WHOMSOEVER IT MAY CONCERN
PUBLICATION

It is hereby informed that the Hon'ble XII Addl.District & Sessions Judge cum XII Addl.MS), L.B.Nagar has posted the case in Crl. Appeal No.854/2019 on 03-07-2024 for the appearance of defacto complainant ie., Subhas Kapoor, S/o. Bankat Prasad shall appear before the court **on 05-08-2024 at about 10.00 Am.,** personally or through your Advocate. Otherwise the matter will be decided in your absence.
E. VENU NATH
ADVOCATE
86-3-714, Chital Beli istabad,
Hyderabad Ph: 90055 57983.

BEFORE THE HON'BLE TELANGANA STATE CONSUMER DISPUTES REDRESSAL COMMISSION: AT: HYDERABAD
F.A.No108 of 2024
Against
C.C.No.16of 2023
(On the file of the District Commission I-Hyderabad)
BETWEEN:
National Insurance Company Limited,Bangalore Regional Office, ...Appellant/Opposite Party No.3
AND
Miss.ShravaniGanta&Others
...Respondents/Complainant/Ops
To
United Health Care (Parekh), Insurance TPA Private Limited, CFG3+CJ5, Durga Nagar Road,Durga Nagar Colony, Somajiguda, Hyd ,Khairatabad, Hyd-500 082.
Sir/Madam,
Take notice that, the appellant herein filed the above the case. The Hon'ble State Consumer Disputes RedressalCommission while allowing an Application for substituted service directed Appellant to go for paper publication as the personal notice served on you was returned unserved with an endorsement "left", vide orders dt.03.06.2024 and posted the appeal to 30.07.2024. You are therefore directed to appear either in person or through your Counsel duly instructed **on 30.07.2024 at 10.30 a.m.** before the Hon'ble StateConsumer Disputes Redressal commission at Khairata bad, Hyderabad, failing which the appeal will be heard and decided on merits as per the material available on record.
(BY ORDER OF THE HON'BLE STATE COMMISSION)
T M H SUDHAKAR
COUNSEL FOR THE APPELLANT
G-906, 9th Floor, Jalvayu Towers, Lower Tank Bund, Hyderabad.

IN THE HON'BLE PRINCIPAL DISTRICT JUDGE: VIKARABAD DISTRICT, AT: VIKARABAD
O.S.NO.17 OF 2023
Between:
Mir Mazaharuddin and Others
...Plaintiffs
AND
Hira Multi Constructions Ventures Pvt. Ltd. and Others ...Defendants
To:
1.Mrs.Deepti Gali,W/o.Mr.Pratyush Mulukulta, Aged about 39 yrs, Occ: Business, R/o.Flat No.905, Polaris B Block, Meenakshi Sky Lounge, Hitex Kaman, Khanamet, Kondapur, Hyderabad.
(Defendant No.23)
2.Mr.Kavukuntla Srikanth, S/o. Suresh Kumar Kavukuntla, Aged about 34yrs, Occ: Business, R/o. H.No. 4-2-230, Mothibagh Colony, Vikarabad. (Defendant No.38)
3.Mr.Vangapalli Laxman Rao, S/o. Late Vangapalli Anjaiah, Aged about 46yrs, Occ: Business, Resident of Plot No.26/3, Karthik Enclave, Sikh Village, Beside Delhi Public School, Tirumalgiri, Secunderabad – 500009.
(Defendant No.49)
4.Mrs.Patel Jayasree, W/o.Patel Ravishanker, Aged about 46yrs, Occ: Business, Resident of #1-12 2/11/JBK/401 Janapriya Appt Linc, Near SBH Bank, Miyapur, Tirumalagiri, Hyderabad, T.S – 500049.
PUBLIC NOTICE
Please take notice that the captioned case has been filed against you the above-mentioned defendants i.e., 1)Mrs.Deepti Gali, W/o. Mr.Pratyush Mulukulta, 2)Mr.Kavukuntla Srikanth, S/o.Suresh Kumar Kavukuntla, 3)Mr.Vangapalli Laxman Rao, S/o.Late Vangapalli Anjaiah, 4)Mrs.Patel Jayasree, W/o. Patel Ravishanker and others for cancellation of AGPA No.2820 /2007 dated 02.05.2007 & Rectification Deed No.6473/2015 dated 27.10.2015 and to further declare various documents as null and void and not binding on the Plaintiffs vide OS No.17/2023 since same are vitiated by fraud and to grant the relief of perpetual injunction restraining the Defendants from interfering or alienating the Suit Schedule Properties i.e. land admeasuring a total extent of Ac.24 – 27 Guntas at various survey numbers in Manneguda Paiga Village, Manneguda Sarfacus Village, Yenkepally Village all situated in Pudur Mandal, Vikarabad District, TS (Popularly Known as Vooty Golf County). Hence, the said suit stands posted on **01.08.2024** for your appearance either in person or through pleader **at 10:30 am** before the Honourable Principal District Judge, Vikarabad District at Vikarabad. Kindly take note that in the event of your non-appearance on the said date, the matter will be decided in your absence and as per law.
(By Order of the Hon'ble Principal District Judge: Vikarabad District: At Vikarabad)
M SAI CHANDRA HAAS
M.S.C.H ADVOCATES & ASSOCIATES
Flat No.1B, 1 st Floor, RK Residency, Opp Delta Seacon BuildingRoad No 11, Banjara Hills, Hyderabad, TG-500034.

IN THE COURT OF THE MACT CUM Ist ADDL DIST JUDGE AT SURYAPET
OP.No. 37 OF 2024
Between:
బుక్క నాగలక్ష్మి మరియు ఇతరలు
.....పిటీషనర్లు
మరియు
బంకూరు సురేంద్ర నాయుడు మరియు ఇతరులు .....రెస్పాండెంట్స్
టుR1
బంకూరు సురేంద్ర నాయుడు తండ్రి: గోపాల స్వామి, వృత్తి: డ్రైవర్, ప్లాట్ నెం: G.1 లేక్ వ్యూ కాలని I.N.T.U ఎదరుగా, ప్రగతినగర్, నిజాంపేట, హైదరావాద్.
టుR2
తమ్మన శ్రీనివాస్ తండ్రి: మోహన్‌రావు, R/o H.No. 4-4-39, శ్రీ సాయి నగర్, బొడుపల్లి, కుత్‌బుల్లాపూర్, హైదరాబాద్.
పైన తెలిపిన పిటీషనరు పై గౌరవనీయ కోర్టులో సెక్షను 166 యం.వి. యాక్టు 1988 మరియు రూల్స్ 455 ఆంధ్రప్రదేశ్ యం.వి. యాక్టు రూల్స్ 1989 ప్రకారం ప్రమాద నష్ట పరిహారం గురించి కేసు వేయడమైనది. పై కేసులో మీలోని 1,2వ వారికి కోర్టు ద్వారా, పోస్టు ద్వారా పంపిన నోటీసు ముట్టక తిరిగి వచ్చినది. పై కేసు మీ హాజరు నిమిత్తం ది. 02-08-2024 న కలదు. కావునా మీరు ఆరోజున పై కోర్టుయందు స్వయంగా గాని లేదా న్యాయవాది ద్వారా గాని ఉదయం 10:30 గం॥లకు హాజరు కాగలరు. లేనిచో పై కేసు మీ పరోక్షంలో తీర్పుచెప్పబడును.
//కోర్టు వారి అనుమతితో//
గోంద్రాల అశోక్
అడ్వకేట్
సూర్యాపేట
సెల్: 9490569341

IN THE COURT OF THE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL (PRINCIPAL DISTRICT JUDGE) AT HANAMKONDA
O.P. NO. 21 OF 2023
Between;-
Allam Nikhil ...Petitioner
AND
Mohammed Arbaz & others
...Respondents
NOTICE
TO,
1. M/S Mody Auto India Pvt., Ltd., P.No.8, Sy.No.102/3/B, Nagole Village, Uppal Mandal, LB Nagar, Hyderabad. (Respondent No.2)
Please take notice that the above O.P., filed by the petitioner against you and others for grant of compensation on account of death of the deceased in Motor vehicle Accident and the said case is posted on 20-08-2024 for your appearance. Therefore, you are hereby ordered to appear before the court on the above said date at 10-30 A.M., either in person or through an Advocate, Filing which the matter will be decided expert.
// By Order of the Court //
RADARAPU SRINIVAS, Advocate
Hanamkonda, Cell : 9885568822

IN THE COURT OF THE MOTOR VEHICLE ACCIDENT CLAIMS TRIBUNAL (I) ADDIL. DISTRICT JUDGE), HANAMKONDA
I.A.NO. 415 OF 2022
IN
M.V.O.P.NO.746 OF 2019
Between
The United India Insurance Company, Ltd,
Rep by Divisional Manager, Warangal
....Petitioner/ Respondent no 2
And
Pottu Pramod Kumar & others
..... Respondents
N O T I C E
TO
Ravula Srisailam , S/o Beerapa, Plot No. 2 , Srinivasa Colony, Hayath nagar, Hyderabad, Telangana
Sir,
The Petitioner/ Respondent no 2. in the above Motor accident case seeks to implead you as Respondent no.4 in the case. As such Notice sent to you through the court returned undelivered. Hence you are required to appear before the above court on 07-08-2024 at 10.30 A.M. either personally or through an advocate, and give your submissions, failing which the matter will be decided in your absence.
// BY THE ORDER OF THE COURT//
T.C.SUJATHA
H.NO. 25-5-64, Near Somidi,
Kazipet, Hanumakonda
Cell : 9866449544

IN THE COURT OF THE MOTOR VEHICLE ACCIDENT CLAIMS TRIBUNAL (I) ADDIL. DISTRICT JUDGE), HANAMKONDA
I.A.NO. 413 OF 2022
IN
M.V.O.P.NO. 743 OF 2019
Between
The United India Insurance Company Ltd,
Rep by Divisional Manager, Warangal
....Petitioner/ Respondent no 2
And
Pottu Pramod Kumar & others
..... Respondents
N O T I C E
TO
Ravula Srisailam , S/o Beerapa, Plot No.2 , Srinivasa Colony, Hayath nagar, Hyderabad, Telangana.
Sir,
The Petitioner/ Respondent no 2. in the above Motor accident case seeks to implead you as Respondent no.4 in the case. As such Notice sent to you through the court returned undelivered. Hence you are required to appear before the above court on 07-08-2024 at 10.30 A.M. either personally or through an advocate, and give your submissions, failing which the matter will be decided in your absence.
// BY THE ORDER OF THE COURT//
T.C.SUJATHA
H.NO. 25-5-64, Near Somidi,
Kazipet, Hanumakonda
Cell : 9866449544

సివిల్ ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్ల కోసం న్యాక్‌లో ప్రత్యేక శిక్షణ

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైటెక్స్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(న్యాక్) ఆధ్వర్యంలో సివిల్ ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్ల కోసం త్వరలో ప్రత్యేక శిక్షణను ప్రారంభిస్తున్నామని శుక్రవారం న్యాక్ డైరెక్టర్ శాంతి శ్రీ తెలిపారు. ఈ సందర్భంగా వివరాలను వెల్లడించారు. న్యాక్ ఆధ్వర్యంలో జనరల్ కేటగిరీ, ఎస్సీ, బీసీ-సీ అభ్యర్థులకు బీ.ఇ., బీ.టెక్, సివిల్ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ల కోసం మూడు నెలల (ప్లేస్‌మెంట్ లింక్డ్ పేమెంట్ ఫినిషింగ్ స్కూల్ ప్రోగ్రామ్) శిక్షణా కార్యక్రమాన్ని ఈ నెల 22న ప్రారంభించనున్నట్టు తెలిపారు. ఎస్సీ, బీసీ-సీ అభ్యర్థులకు ఎస్సీ కార్పొరేషన్ సహకారంతో ఉచితంగా శిక్షణతోపాటు వారికి భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి 100శాతం ప్లేస్‌మెంట్‌ను కల్పిస్తామన్నారు. ఈ శిక్షణలో చేరటానికి ఆసక్తిగల అభ్యర్థులు నేరుగా కానీ లేదా 9505631765 ఫోన్ నెంబర్‌లోగానీ సంప్రదించాలని కోరారు.

లష్కర్ బోనాల వేడుకలకు రండి

- కేసీఆర్‌కు ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ ఆహ్వానం

నవతెలంగాణ-ఓయూ



ఈ నెల 21న జరిగే సికింద్రాబాద్ బోనాలు వేడుకల్లో పాల్గొనాలని బీ.ఆర్.ఎస్. అధినేత, తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను సికింద్రాబాద్ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ ఆహ్వానించారు. శుక్రవారం ఎర్రవల్లి లోని వ్యవసాయ క్షేత్రంలో కేసీఆర్‌ను ఆయన కలిసి ఆహ్వానించారు. చాలా సంవత్సరాలుగా సికింద్రాబాద్ బోనాలు వేడుకల్లో పాల్గొని మోండా మార్కెట్‌లోని పద్మారావు నివాసంలో విందుకు కేసీఆర్ హాజరు కావడం రివాజుగా వస్తోంది. పద్మారావు గౌడ్‌తో పాటు ఆయన కుమారులు, సీనియర్ నేత సుంకు.రాంచందర్ పాల్గొన్నారు.



చీఫ్ సిటీ ప్లానర్‌కు ఎమ్మెల్యే ఫిర్యాదు

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

బోరబండ, రహమత్ నగర్, ఎర్రగడ్డ డివిజన్లలో స్లం ఏరియాలలో, నిరుపేదలు పట్టాలు ఉండి 50 గజాలలో ఇల్లు నిర్మిస్తుంటే జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమంగా నోటీసులు ఇస్తూ వేధింపులకు గురి చేస్తున్నారని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం చీఫ్ సిటీ ప్లానర్ రాజేంద్ర నాయక్ ను కలిసి అలాంటి అధికారులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. విచారించి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యేకు చీఫ్ సిటీ ప్లానర్ హామీ ఇచ్చారు.



ఇద్దరు దొంగలు అరెస్ట్

నవతెలంగాణ-ఓయూ

రాత్రిళ్లు దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని ఓయూ పోలీసులు అరెస్టు చేశారు. ఓయూ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ రాజేందర్ కేసు వివరాలను వెల్లడించారు. హబ్సిగూడ రవీంద్రనగర్‌లో నివాసముండే వనితారెడ్డి ఇంట్లో బి. సులోచన పనిలో చేరింది. ఈ మేరకు ఆ ఇంటిలోనే ఒక గదిని సులోచనకు కేటాయించారు. ఆ గదిలోని అల్మారాలో ఆమె తన బట్టలు, నగదు, బంగారంతో పాటు తన వస్తువులను జాగ్రత్త చేసుకుంది. గత నెల 26న ఉదయం 5:30 గంటలకు ఇంట్లో పనికోసం వనితారెడ్డి ఇంట్లోకి సులోచన వెళ్లింది. తిరిగి వచ్చిన సులోచన తన గది తలుపు తెరిచి ఉండడంతో పాటు సామాన్లు చెల్లాచెదురుగా పడి ఉండడం గమనించింది. అల్మారాలోని 4.5 తులాల బంగారం, 40 తులాల వెండి, రూ.20 వేల నగదు కనిపించకపోవడంతో ఆమె వెంటనే తన యజమానికి సమాచారం అందించింది. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేసింది.ఈ మేరకు విచారణ జరిపిన పోలీసులు విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు తార్నాక చౌరస్తాలో గురువారం ఉదయం పొటేల్ రమేశ్ అలియాస్ పటేల్, యూసుఫ్ బీలను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఒక ద్విచక్రవాహనం, నాలుగున్నర తులాల బంగారం, 45 తులాల వెండిని స్వాధీనం చేసుకున్నారు. రమేష్ పై 2013 నుంచి ఇప్పటి వరకు 34 చోరీ కేసులు పెండింగ్ ఉన్నాయి. కార్యక్రమంలో ఎస్ఐ రవి, క్రైమ్ పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.



త్వరలో జాబ్ క్యాలండర్

- చనగాని దయాకర్

నవతెలంగాణ-ఓయూ

త్వరలో జాబ్ క్యాలండర్‌తో ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ చేస్తుందని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ అన్నారు. శుక్రవారం సాయంత్రం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట సీఎం రేవంత్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. డీఎస్సీ, గ్రూప్ పరీక్ష మధ్య వ్యవధి కావాలన్న విద్యార్థుల కోరికే మేరకు గ్రూప్ 2 పరీక్షను ప్రభుత్వం వాయిదా వేసిందన్నారు. కోరారు. డీఎస్సీ 11 వేల పోస్టులు భర్తీ చేస్తుందన్నారు. నిరుద్యోగులను బీఆర్ ఎస్ పార్టీ విచ్చినం చేయాలని కుట్ర చేసినా వారు నమ్మలేదన్నారు. ఓయూ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు, మెడ శ్రీను, వినయ్, ఓయూ జాక్ రాజేష్ , సురేష్ ,విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు వైద్య పరీక్షలు

నవతెలంగాణ-కంటోన్మెంట్

బోయినపల్లి ప్రభుత్వ ప్రాథమిక. ఉన్నత బాలుర పాఠశాల్లో శుక్రవారం అక్షయ్ ఆకతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వినికిడి పరీక్షలు నిర్వహించారు. కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ ముఖ్య అతిథిగా హాజరై వైద్య పరీక్షల కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. పేద విద్యార్థులకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ఇతర ఫౌండేషన్‌లు కూడా ముందుకు రావాలని కోరారు. అక్షయ్ ఆకతి ఫౌండేషన్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని ప్రతాప్ ఫౌండేషన్ ప్రతినిధులను అభినందించారు . ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్ఎం. చాముండేశ్వరి, ప్రైమరీ పాఠశాల హెచ్ఎం ప్రేమలత, ఉపాధ్యాయులు షెడ్రేక్, ఆరతి, ఫిరోజ్ బేగం, అనిత, రయీశ బేగం, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆంపిల్ లాజిక్ సంస్థ వార్షికోత్సవం



నవతెలంగాణ-బంజారా హిల్స్

ఆంపిల్ లాజిక్ సంస్థ 15వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం నగరంలోని ఓ ప్రయివేటు హాల్‌లో వేడుకగా జరిగాయి. సంస్థ ఉద్యోగులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉద్యోగినులు నిర్వహించిన ర్యాంప్ వాక్ అదరహో అనిపించింది. సంస్థ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన పలు క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ సాధించిన ఉద్యోగులకు వారు జ్ఞాపికలు అందజేశారు. అనంతరం ఉత్తమ ఉద్యోగులను సన్మానిం చారు. సంస్థ సీఈఓ మన్నె వెంకన్న చౌదరి మాట్లాడుతూ తమ సంస్థ ఉద్యోగుల సహకారంతో దినదినాభివద్ధి చెందుతుందని తెలిపారు. లైఫ్ సైన్సెస్ కెమికల్ మ్యాన్ ఫ్యాక్చరింగ్ కంపెనీలకు తాము సాఫ్ట్‌వేర్ సహాయం చేస్తుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థకు చెందిన 200 మందికి పైగా ఉద్యోగులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో పరిశుభ్రత పాటించాలి

- భవన మరమ్మతులు, మెయింటెనెన్స్ సరిగ్గా ఉండాలి
- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



నవతెలంగాణ-సిటీబ్యూరో

వర్షాకాలంలో సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల్లోని విద్యార్థులకు డెంగ్యూ, చికెన్ గున్యా, విష జ్వరాలు లాంటి వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వసతి గృహలలో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనార్టీ వసతి గృహల అధికారులు, గురుకులాల ప్రిన్సిపాల్స్‌తో సమీక్ష సమావేశం నిర్వహించారు. వసతి గృహాలు, గురుకులాల్లో పరిశుభ్రత, కిచెన్ నిర్వహణ, కుక్ బాధ్యతలు, మెనూ ప్రకారం ఆహారం సదుపాయాలు, జ్వరం కేసులపై నిఘా, మేజర్ లేదా మైనర్ రిపేర్లు, పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, ఇతర మెటీరియల్ పంపిణీ తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల్లోని విద్యార్థుల కెరీర్ నిర్మించడంలో రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన విద్య, మెరుగైన వసతిని అందిస్తుందన్నారు. వసతి, గురుకులాల్లోని విద్యార్థులు అనారోగ్యం బారిన పడకుండా అధికారులు తగు చర్యలు చేపట్టాలని, వారు అనారోగ్యం బారిన పడకుండా చెత్త, చెదారం లేకుండా నీటి నిల్వ లేకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. కిచెన్ నిర్వహణలో కుక్ భాద్యత, పాత్ర చాలా కీలకమన్నారు. వంట మనిషి స్వీయ పరిశుభ్రత పాటించాలని, వంట చేసేటప్పుడు చేతి తొడుగులు, హెడ్ క్యాప్ వాడాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. జ్వర పీడితులను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. అంటు వ్యాధులు వ్యాప్తి చెందకుండా మెడికల్ క్యాంప్స్ నిర్వహించాలన్నారు. హాస్టల్స్, గురుకులాల్లో మేజర్, మైనర్ మరమత్తులు చేపట్టాలన్నారు. యూనిఫామ్స్, పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయాలన్నారు. గత సంవత్సరం పదవ తరగతి ఫలితాలపై సమీక్షించారు. కులాంతర వివాహాలు చేసుకున్న రెండు జంటలకు 2,50,000 విలువ గల ఫిక్స్ డిపాజిట్ బాండ్స్ చొప్పున పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖ అధికారులు పెరుక యాదయ్య, కోటజీ, ఆశన్నా, ఇలియాజ్ అహ్మద్, వసతి గృహల సంక్షేమ అధికారులు, గురుకులాల ప్రిన్సిపల్స్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణీలు పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకోవాలి : జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

గర్భిణీలు రక్తహీనత బారిన పడకుండా పోషక విలువలు ఉన్న ఆహారం, ఆకుకూరలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శుక్రవారం సికింద్రాబాద్ పాన్‌బజార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ అకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ప్రసూతి గది, ఆపరేషన్ థియేటర్, ఫిమేల్ వార్డ్, డ్రగ్స్ స్టోర్, ఆరోగ్యశ్రీ కేంద్రం పరిశీలించారు. ఆస్పత్రిలో చికిత్స కోసం వచ్చిన రోగులతో.. వైద్య సేవలు సక్రమంగా అందుతున్నాయా అని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రక్తహీనత రాకుండా గర్భిణీలు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని వారికి సూచించారు. ఎన్‌సీడీ పోర్టల్ ఏ విధంగా జనరేట్ చేస్తూ మందులు ఇండెంట్ చేస్తున్నారని ఆన్‌లైన్‌లో పరిశీలించారు. గర్భిణీ వేరే ప్రాంతానికి వెళ్లినట్టయితే ఏ విధంగా ఫాలోఅప్ చేస్తున్నారు.. వారికి ఏ విధంగా వైద్య సేవలు అందుతున్నాయనే విషయంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రక్తహీనత రాకుండా ఆకుకూరలు, పల్లి పట్టీలు, ఖర్జూరాలు తినాలని, ఐరన్ మాత్రలు వేసుకోవాలని సూచించారు. గర్భిణులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే పుట్టబోయి బిడ్డ ఎదుగుదల బాగుంటుందన్నారు. ప్రతి నెలా ఆస్పత్రిలో చెక్ అప్ చేసుకోవాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆస్పత్రి పరిసరాలను పరిశీలించి నియోజకవర్గాల వారీగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేపట్టవలసిన సాధారణ మరమ్మత్తుల వివరాలను సమర్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకట్, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎస్పీహెచ్‌వో డాక్టర్ జయశ్రీ, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.



బోనాలకు 1500 మంది పోలీసులతో భద్రత

- నార్త్‌జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్

నవతెలంగాణ-బేగంపేట్

21,22 తేదీలలో జరిగే సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి జాతరకు అన్ని రకాల భద్రతా ఏర్పాట్లు చేసినట్టు నార్త్ జోన్ డీసీపీ సాధన రష్మి పెరుమాళ్ తెలిపారు. జాతరలో భద్రత కోసం 1500 మంది పోలీసులు, వంద సీసీ కెమెరాలతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. బోనాల జాతర ఏర్పాట్లపై శుక్రవారం సికింద్రాబాద్ నార్త్‌జోన్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల కోసం ఆరు క్యూలైన్లు ఏర్పాటు చేశామని, బోనాలు తీసుకొచ్చే మహిళలకు, వీఐపీలకు ప్రత్యేక క్యూలైన్స్ ,సాధారణ భక్తులకు ఇబ్బంది లేకుండా జనరల్ క్యూ లైన్స్ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. శివసత్తులకు మధ్యాహ్నం ఒంటి గంట నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు సమయం ఇచ్చామని, సీనియర్ సిటీజన్స్‌కు వికలాంగులకు అవుసరాన్ని బట్టి ప్రత్యేక వాహనదం ద్వారా తీసుకొచ్చి దర్శనం చేయించనున్నట్టు తెలిపారు. ట్రాఫిక్ డీసీపీ రాహుల్ మాట్లా డుతూ ఆలయానికి వచ్చే భక్తుల వాహనా కోసం ప్రత్యేకంగా 9 చోట్ల పార్కింగ్ ప్లేస్ లు ఏర్పాటు చేశామన్నారు. వీఐపీ వాహనలు మినహ మిగత వాహనాలు రాణిగంజ్ మార్గంలో అనుమతించబోమన్నారు. జాతర సందర్భంగా రెండు రోజుల పాటు రాణిగంజ్ ,ప్యాట్నీ



మార్గంలో ట్రాఫిక్ అంక్షలు విధించామన్నారు. ఈ మర్గంలో వాహనాలను అనుమతి లేదన్నారు. జాతరలో షీ టీమ్స్ ఏర్పాటు చేశామని, పిక్ పాకెటింగ్ జరుగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

మహంకాళి ఆలయానికి పోటెత్తిన భక్తులు...

ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి ఆలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. అయితే జాతర ప్రారంభానికి రెండు రోజుల ముందు నుంచే పోలీసులు ఆలయ పరిసరాల్లో ఆంక్షలు విధించడంతో దర్శనానికి వచ్చిన భక్తులు ఇబ్బందులకు గురయ్యారు.భక్తులను క్యూలైన్ల నుంచి త్వరితగతిన దర్శనానికి పంపించడంలో పోలీసులు విఫలమయ్యారని భక్తులు ఆరోపించారు. తాము చిన్న పల్లలతో వచ్చి గంటల కొద్దివేచి ఉన్నా అటు ఆలయ నిర్వాహకులు,ఇటు పోలీసులు ఎవరూ పట్టించుకోలేదని భక్తులు వాపోయారు. రెండు రోజుల ముందే ఇలా ఉంటే ఆదివారం జాతర పరిస్థితి ఏంటని భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మున్నాళ్ల ముచ్చటే...

నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయం ఏ గ్రౌండ్‌లో ఇటీవలే ఖేలో ఇండియా నిధులతో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్‌లోకి వాన నీరు రాకుండా ఓయూ బిల్డింగ్ డివిజన్ ఆధ్వర్యంలో స్టెప్స్ నిర్మాణం చేసిన విషయం తెలిసిందే. అయితే ఇటీవలే కురిసిన వర్షాలకు మొత్తం స్టెప్స్ కింద, పక్కన పోసిన మట్టి (మొరం), కొట్టుకు పోవడం గమనార్హం. సుమారు రూ. 9 లక్షల వ్యయం తో నిర్మాణం చేసిన ఈ స్టెప్స్ కింద ఇలా మట్టి కొట్టుకుపోవడం పై అటు గ్రౌండ్‌కు వాకింగ్‌కు వెళ్లే విద్యార్థులు, వాకర్స్ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇలా నాసిరకం అయిన పనులు చేసిన అధికారులు, సదరు గుత్తేదారుని పై చర్యలు చేపట్టాలని విద్యార్థులు కోరుతున్నారు.

- ఓయూ గ్రౌండ్‌లో కొట్టుకు పోయిన మట్టి..



మట్టి పోయింది అంతే.. బిల్డింగ్ డివిజన్ డీఈ శ్రీనివాస్

ఈ విషయంలో ఓయూ బిల్డింగ్ డివిజన్ డీఈ శ్రీనివాస్‌ను వివరణ కోరగా వర్షాపు నీటికి మట్టి కాస్త కొట్టుకు పోయింది.. అంతే అని కొట్టిపారేశారు.

నారాయణమ్మలో ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ విజయవంతం



నవతెలంగాణ-బంజారా హిల్స్

హైదరాబాద్‌లోని ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ (ఈఈఈ) బేసిక్ సైన్సెస్ (బీఎస్) డిపార్ట్‌మెంట్ ఆఫ్ కమ్యూనికేషన్స్ సైబర్ ఫిజికల్ ఇంజినీరింగ్‌పై నిర్వహించిన 7వ అంతర్జాతీయ కాన్ఫరెన్స్ విజయవంతమైంది. ఈ ప్రారంభోత్సవాన్ని జి నారాయణమ్మ కళాశాల సగర్వంగా ప్రకటించింది. శుక్రవారం షేక్‌పేటలోని కాలేజీ ఆవరణలో ఏర్పాటు చేసిన కమ్యూనికేషన్స్ సైబర్ ఫిజికల్ ఇంజినీరింగ్‌పై ప్రతిష్టాత్మకమైన ఈ కాన్ఫరెన్స్‌కు డాక్టర్ వై.ఎస్, సైన్స్ అండ్ టెక్నాలజీ కమ్యూనికేషన్ సంస్థకు ఆరు దశాబ్దాలుగా సేవనందిస్తున్న సైంటిస్ట్ పద్మశ్రీ అవార్డు గ్రహీత ఇస్రో మాజీ సైంటిఫిక్ సెక్రటరీ రాజన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.సమకాలీన సవాళ్లను పరిష్కరించడంలో పురోగతిని నడిపించడంలో ఇంటర్ డిసిప్లినరీ పరిశోధన ఆవిష్కరణల ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు. అతని అంతర్దృ ష్టులు అనుభవాలు ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుండి విద్యార్థులు,అధ్యాపకులు పరిశోధకులతో సహా హాజరైన వారికి కమ్యూనికేషన్స్ సైబర్ ఫిజికల్ ఇంజినీరింగ్‌లో తాజా పరిణామాలపై చర్చించడానికి ఆలోచనలను మార్పిడి చేసుకోవడానికి అకాడెమియా పరిశ్రమల నుంచి నిపుణులు, పరిశోధకులు అభ్యాసకులను ఒకచోట చేర్చడం ద్వారా ఈ సాంకేతిక సెషన్‌లు ఇంటరాక్టివ్ వర్క్‌షాప్‌లు జ్ఞానాన్ని పంచుకోవడం మరి ఒకరి సహకారం కోసం ఒక వేదికను ఏర్పాటు చేసే విధానంలో భాగస్వాములవ్వడం గొప్ప విషయమని తెలిపారు.

(ఐఎస్‌టీఐ),ఇంటర్నేషనల్ యూనివర్శిటీలో విశిష్ట ప్రొఫెసర్ అయిన డాక్టర్ మాలతీ బటుమలై మా ప్రధాన వక్తగా ఉండటం కూడా తమకు విశేషమని, ఫోటోనిక్స్‌లో నైపుణ్యం కలిగిన డా. బటుమలయ్, మలయా విశ్వవిద్యాలయం నుండి ఫోటోనిక్స్‌లో (పీహెచ్‌డీ) టెలికమ్యూనికేషన్‌లో మాస్టర్స్ పట్టా పొందారు.అలాగే యూనివర్సిటీ టున్ హుస్సేన్ ఓన్ నుంచి కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీని పొందారు. ఇంజినీరింగ్ టెక్నాలజీ రంగానికి ఆమె అందించిన విశేష కృషి 63 జర్నల్ పబ్లికేషన్స్, 32 కాన్ఫరెన్స్ ప్రెజెంటేషన్‌లు బహుళ అవాంర్డల అద్భుతమైన రికార్డులో స్పష్టంగా కనిపిస్తుంది. ఫైబర్ ఆప్టిక్స్ సెన్సార్ టెక్నాలజీలలో డాక్టర్ మాలతి పరిశోధన, ఐఎస్‌టీఐలో ఆమె నాయకత్వ పాత్రలు వృత్తిపరమైన సంస్థలు సమాజసేవలో ఆమె చురుకైన ప్రమేయంతో కలిపి, ఇంజినీరింగ్ పరిశోధన విద్యను అభివృద్ధి చేయడంలో ఆమెను ఆదర్శప్రాయమైన వ్యక్తిగా గుర్తింపు పొందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జి నారాయణమ్మ కాలేజీకి చెందిన వివిధ విభాగాల ఉపాధ్యాయ బృందం విద్యార్థుల బృందం సిబ్బంది పాల్గొన్నారు.

చేనేతకారుల శ్రమ వెలకట్టలేనిది

- నటి రాశి

నవతెలంగాణ-బంజారాహిల్స్

చేనేతకారుల శ్రమ వెలకట్టలేనిదని ప్రముఖ సినీ నటి రాశీ అన్నారు. బెంగాల్ హండ్లూమ్ ఆర్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సిల్క్ ఆఫ్ ఇండియా హ్యాండ్లూమ్ ఎక్స్‌పో 2024ను శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్య నిగమాగమంలో ఆర్గనైజర్ సోమనాథ్, అభిజిత్‌తో కలిసి ఆమె లాంచనంగా ప్రారంభించి ప్రసంగించారు.ఈ ఎగ్జిబిషన్ లాంచ్‌లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. మన దేశానికి వస్త్ర ఉత్పత్తిలో సుదీర్ఘమైన విశిష్టమైన చరిత్ర ఉందని, మన సాంస్కృతిక ఫాబ్రిక్‌లో చేనేత నేత ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉందని తెలిపారు. మన కళాకారులు నేసిన ప్రతి దారం సంప్రదాయం, నైపుణ్యం అంకితభావాన్ని చెబుతుందని, తరతరాలుగా ఈ పురాతన పద్ధతులను భద్రపరిచిన మన హస్తకళాకారుల శాశ్వత వారసత్వానికి ఇది నిదర్శనం అని ఆమె చెప్పారు. నిర్వాహకులు సోమనాథ్ మాట్లాడుతూ.. సిల్క్ ఆఫ్ ఇండియా ప్రాంతం అంతటా 50కి పైగా మాస్టర్ వీవర్ల నుండి చేతితో నేసిన వస్త్రాలు, సాంప్రదాయ



చేతిపనుల అసాధారణ ప్రదర్శనతో సందర్శకులను అబ్బురపరిచేలా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. చీరలు, స్కార్ఫ్‌లు, బట్టలు,గృహ వస్త్రాలు అనేక రకాల చేనేత ఉత్పత్తులను అన్వేషించి ఇవన్నీ సాంప్రదాయ పద్ధతులను ఉపయోగించి నైపుణ్యం కలిగిన నేత కార్మికులు రూపొందించారని చెప్పారు. ఈ నెల 25 వరకు ఎగ్జిబిషన్ కొనసాగుతుందన్నారు. ప్రతిభావంతులైన నేత కార్మికులను ప్రోత్సహించడానికి మద్దతు ఇవ్వడానికి ఉద్దేశించిన సిల్క్ ఆఫ్ ఇండియా హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు.

ప్రయివేటీకరణ బిల్లు పెడితే ఉద్యమం తప్పదు

- అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం జాతీయ కార్యదర్శి రాంబాబు

నవతెలంగాణ-బంజారాహిల్స్

బ్యాంకుల ప్రయివేటీకరణ బిల్లు పెడితే దేశవ్యాప్త ఉద్యమం తప్పదని అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం (ఏఐబీఇఏ) జాతీయ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు హెచ్చరించారు. బ్యాంకుల జాతీయకరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఉదయం 6 గంటలకు ఆంధ్రప్రదేశ్ తెలంగాణ బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య (ఏపీటీబీఈఎఫ్) ఆధ్వర్యంలో సచివాలయం యూనియన్ బ్యాంకు శాఖ నుంచి నెక్లెస్ రోడ్ ఇందిరాగాంధీ విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహించారు. ఇందిరా గాంధీ విగ్రహం వద్ద వారికి ఏఐబీఇఏ, ఏపీటీబీ ఈఎఫ్ నేతలు నివాళి అర్పించారు. అనంతరం బ్యాంకుల ప్రయివేటీకరణ బిల్లును పార్లమెంట్ ప్రవేశపెడితే దేశవ్యాప్త ఉద్యమం తప్పదని ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ బ్యాంకులను బీజేపీ ప్రభుత్వం ప్రయివేటీకరణ చేసేందుకు కుట్రలు పన్నడం దుర్మార్గమన్నారు. దేశ ప్రగతి, ఆర్థికాభివద్ధి, ప్రజా ప్రయోజనాల కోసం బ్యాంకులను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో 26 ప్రభుత్వ రంగ బ్యాంకులు ఉండగా ప్రస్తుతం అవి 12కు తగ్గడం విచారకరమన్నారు. దేశ ప్రజల మధ్య ఉన్న ఆర్థిక అసమానతలను తొలగించడంలో ప్రభుత్వ




రంగ బ్యాంకులు గణనీయమైన పాత్రను పోషిస్తున్నాయని తెలిపారు. గతంలో కేవలం లక్ష కోట్ల రూపాయల రుణాలను అందించిన ప్రభుత్వ రంగ బ్యాంకులు ప్రస్తుతం దాదాపు రూ.25 లక్షల కోట్ల రుణ సదుపాయాన్ని కల్పించి ప్రజల ఆర్థిక అవసరాలను తీరుస్తుండడం గర్వకారణమన్నారు. లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ప్రజలు బీజేపీని తక్కువ స్థానాల్లో గెలిపించినప్పటికీ ప్రధాని మోడీ ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రయివేటీకరించేందుకు ప్రయత్నాలు చేస్తుండం గర్హనీయమన్నారు. ప్రస్తుతం ఉన్న ప్రయివేటు బ్యాంకులను కూడా జాతీయం చేసి ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. ఏపీటీబీఈఎఫ్ అధ్యక్షులు టి. రవీంద్రనాథ్ మాట్లాడుతూ బ్యాంకుల జాతీయకరణ చేసిన రోజు దేశ ఆర్థిక చరిత్రలో ముఖ్యమైన రోజని పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్యానంతరం బ్యాంకుల జాతీయకరణ వల్ల అనేక మంది చిన్న వ్యాపారులకు ఆర్థిక ఊతం లభించి వారి జీవితాల్లో మార్పు వచ్చిందన్నారు. ప్రస్తుతం దేశంలో కుప్పలు తెప్పలుగా వెలుస్తున్న ప్రయివేటు, కార్పొరేట్ బ్యాంకులు ప్రజలను మోసం చేస్తూ వారి డబ్బును లూటీ చేస్తున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఎపీటీబీఈఎఫ్ సంయుక్త ప్రధాన కార్యదర్శి పి.వి. కృష్ణ రావు, ఉప ప్రధాన కార్యదర్శి సమద్ ఖాన్, బ్యాంక్స్ రిటైరీస్ అసోసియేషన్ అధ్యక్షులు లక్ష్మణ్ రావు, వివిధ బ్యాంకులకు చెందిన వందల మంది ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



ప్రొ.కోదండరాంకు పార్ట్ టైమ్ ప్రొఫెసర్లు వినతిపత్రం

నవతెలంగాణ-ఓయూ

ప్రొఫెసర్ కోదండరాం, మాజీ ఐఏఎస్ ఆకునూరు మురళి, ప్రొ. హరగోపాల్‌లతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చల సందర్భంగా శుక్రవారం ప్రొఫెసర్ కోదండరాంను తార్నా కలోని వారి నివాసంలో పార్ట్ టైమ్ ప్రొఫెసర్లు కలిసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న పార్ట్ టైం టీచర్లందరినీ అసిస్టెంట్ ప్రొఫెసర్ కాంట్రాక్టుగా అప్‌గ్రేడ్ చేసే విషయాన్ని సీఎంతో సమావేశంలో మాట్లాడవలసిందిగా కోరారు. అందుకు కోదండరాం స్పందిస్తూ సమావేశంలో ఈ అంశాన్ని తప్పని సరిగా చర్చిస్తామని హామీ ఇచ్చారని పార్ట్ టైం టీచర్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆల్ యూనివ ర్సిటీస్ పార్ట్ టైం టీచర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సోమేశ్వర్ బోనకుర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆరుట్ల జానకి రెడ్డి, ఓయూ పార్ట్ టైం టీచర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ యుగేందర్, గౌరవ అధ్యక్షులు డాక్టర్ జూలు నాగేశ్వర్, ప్రతినిధులు డాక్టర్ జీవన్, డాక్టర్ వినయ్, డాక్టర్ కర్ణాకర్ పాల్గొన్నారు.



బాధ్యత మరిచారు

పిల్లలను చూసుకునే బాధ్యత తల్లిదండ్రులకు ఉన్నప్పుడు ఆ తల్లిదండ్రులను చూసుకునే బాధ్యత పిల్లలకు లేదా? పిల్లలు చిన్నగా ఉన్నప్పుడు వారి ఆలనా పాలనా చూడాలి. విద్యాబుద్ధులు నేర్పించాలి. వారు జీవితంలో నిలదొక్కుకునేలా చూడాలి. ఇలా పిల్లల జీవితాలలో జరిగే అన్నీ విషయాల్లో తల్లిదండ్రులు గొప్ప పాత్ర పోషిస్తారు. అలాంటి తల్లిదండ్రుల వయసైపోయిన తర్వాత వారిని చూసుకోవడం పిల్లల బాధ్యత. కానీ ఆ బాధ్యతను మర్చిపోయి వాళ్లను రోడ్డున పడేస్తున్నారు. అలాంటి ఓ సమస్యే ఈ వారం ఐద్వా అదాలత్‌లో...

శాంతమ్మకు 62 ఏండ్లు. ఆమె భర్త శంకరయ్యకు 70 ఏండ్లు ఉంటాయి. ఇద్దరూ కలిసి ఐద్వా లీగల్‌సెల్‌కు వచ్చారు. వాళ్లను చూసి మేము 'సమస్య మీ అమ్మాయిదా? లేకపోతే మీ అబ్బాయిదా?' అని అడిగితే 'పిల్లల సమస్యలు మాత్రమే వింటారా? మా సమస్యలు వినరా, పరిష్కరించరా..?' అంటూ తన బాధ మొత్తం చెప్పుకుంటూ వచ్చింది శాంతమ్మ.

శంకరయ్యకు ఆమె రెండో భార్య. మొదటి భార్యకు ఓ కొడుకు, ముగ్గురు కూతుళ్ళు ఉన్నారు. వాళ్లు చిన్నగా ఉన్నప్పుడు మొదటి భార్య చనిపోతే శాంతమ్మను పెండ్లి చేసుకున్నాడు. అమెకు పిల్లలు లేరు. మొదటి భార్య పిల్లలనే తన పిల్లలుగా చూసుకుంది. వారిని పెంచి పెద్ద చేసింది. విద్యాబుద్దులు నేర్పించింది. అందరికీ పెండ్లి చేసింది. కొడుకు పెండ్లి తర్వాత అత్తా కోడలికి పడటం లేదు. శాంతమ్మకు ఇంట్లో మనశ్శాంతి లేకుండా పోయింది. కొడుకుతో వేరే కాపురం పెట్టించి ఇద్దరూ ఆ ఇంట్లోనే ఉండాలనుకున్నారు. కానీ అది కుదరలేదు. దాంతో వీరిద్దరే చిన్న ఇల్లు కిరాయికి తీసుకుని ఏదో పని చేసుకుంటూ బతుకుతున్నారు.

అయితే శాంతమ్మకు తల్లి తరపున కొంత పొలం వచ్చింది. దాన్ని అమ్మి పిల్లల చదువుకు, పెళ్లిళ్ళకు, ఖర్చు చేసింది. మిగిలిన 10 లక్షల్లో కొంత బంగారం చేయించుకుంది. కొడుకు ఇల్లు కట్టుకుంటానంటే అతనికి మూడు లక్షలిచ్చింది.

> **శాంతమ్మ, శంకరయ్యల వయసు పెరుగుతున్నకొద్దీ వంట్లో శక్తి తగ్గిపోతోంది. శంకరయ్యకు ఆరోగ్యం బాగోక కొడుకు దగ్గరకు వెళదామంటే శాంతమ్మ ఒప్పకోలేదు. దాంతో వంశీ అత్తామామలను తన ఇంటికి తీసుకువెళ్ళాడు. కానీ అక్కడ కూడా ఉండలేక పోయారు.**

మరో ఆరు లక్షలు ఇద్దరి పేరుతో బ్యాంకులో పెట్టాలనుకున్నారు. కానీ వారి రెండో అల్లుడు వంశీ 'బ్యాంకులో వేస్తే మీకు ఎంత వడ్డీ వస్తుందో అంత డబ్బు మీకునేనిస్తాను. నాకిప్పుడు డబ్బు అవసరం. వేరెవరికో వడ్డీ కట్టడం ఎందుకు? ఆ వడ్డీ మీకే ఇస్తాను' అన్నాడు. దాంతో వంశీకి ఆ ఆరు లక్షలు ఇచ్చారు. అతను ప్రతి నెల రూ॥ 12000/- శాంతమ్మ అకౌంట్లో వేస్తానన్నాడు. కొడుకు ఇల్లు కట్టించుకోవడానికి డబ్బులు సరిపోవడం లేదంటే వంశీ పది లక్షలు సహాయం చేశాడు. అందులో ఎనిమిది లక్షలు తిరిగి ఇచ్చేశాడు. ఇంకా రెండు లక్షలు ఇవ్వాలి. శాంతమ్మకు వంశీ బంగారు గాజులు, పుస్తెల తాడు చేయించి ఇచ్చాడు. మొత్తం కలిపి ఆరు తులాలు ఉంటుంది.

ఇంత వరకు బాగానే ఉన్నా శాంతమ్మ, శంకరయ్యల వయసు పెరుగుతున్నకొద్దీ వంట్లో శక్తి తగ్గిపోతోంది. శంకరయ్యకు ఆరోగ్యం బాగోక కొడుకు దగ్గరకు వెళదామంటే శాంతమ్మ ఒప్పుకోలేదు. దాంతో వంశీ అత్తామామలను తన ఇంటికి తీసుకువెళ్ళాడు. కానీ అక్కడ కూడా ఉండలేక పోయారు. 'నువ్వు మా అమ్మవు కావు. మేము మా నాన్నను మాత్రమే చూసుకుంటాం' అని కూతురు శంకరయ్యను మాత్రమే తనతో పెట్టుకుంది. ఇప్పుడు తన పరిస్థితి ఏంటో శాంతమ్మకు అర్థం కాలేదు. దిగులుతో మంచం పట్టింది. శాంతమ్మ చెల్లి భర్త వచ్చి తన ఇంటికి తీసుకు వెళ్లాడు. ఆమె జీవితం మొత్తం శంకరయ్య కుటుంబానికే ధారపోసింది. చివరి దశలో ఇలా ఒంటరిగా మిగిలిపోయింది. వంశీ దగ్గరున్న డబ్బు అడిగితే దానికి పంచాయితీ పెట్టారు. పెద్ద గొడవ అయ్యింది. తర్వాత శంకరయ్య కూడా శాంతమ్మ దగ్గరకు వచ్చేశాడు. ప్రస్తుతం బయటకు వెళ్ళి పని చేసే ఓపిక వారిలో లేదు. దాంతో శంకరయ్య వెళ్ళి వంశీని డబ్బులు అడిగితే 'నా దగ్గర లేవు. ఉన్నప్పుడు ఇస్తాను' అన్నాడు. దాంతో చేసేది లేక ఇంటికి తిరిగొచ్చాడు.

ఐద్వా అదాలత్
సెల్: 9490098024

డబ్బులు ఇవ్వడం లేదని వంశీపై పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టారు. వంశీవచ్చి 'వాళ్ల నాకు ఎలాంటి డబ్బులు ఇవ్వలేదు. ఇచ్చినట్టు ఏమైనా రుజువుంటే చూపించండి ఇస్తాను' అన్నాడు. కానీ వీరి దగ్గర ఎలాంటి ఆధారాలు లేవు. కాబట్టి పోలీసులు కూడా ఏమీ చేయలేక పోయారు. దాంతో లాయర్ దగ్గరకు వెళ్లారు. అక్కడ కూడా ఎలాంటి న్యాయం జరగలేదు. శాంతమ్మ, శంకరయ్యల పరిస్థితి అసలేం బాగోలేదు. దాంతో వంశీ లక్ష రూపాయలు మాత్రమే ఇస్తానన్నాడు. దానికి శాంతమ్మ ఒప్పుకోలేదు. మళ్లీ వాళ్ల కమ్యూనిటీలో పంచాయితీ పెట్టారు. అయినా ఎలాంటి ఉపయోగం లేకపోయే సరికి ఐద్వా లీగల్ సెల్‌కు వచ్చి వంశీ నుండి డబ్బులు ఇప్పించమని కోరారు.

> **ఆమె జీవితం మొత్తం శంకరయ్య కుటుంబానికే ధారపోసింది. చివరి దశలో ఇలా ఒంటరిగా మిగిలిపోయింది. వంశీ దగ్గరున్న డబ్బు అడిగితే దానికి పంచాయితీ పెట్టారు. పెద్ద గొడవ అయ్యింది. తర్వాత శంకరయ్య కూడా శాంతమ్మ దగ్గరకు వచ్చేశాడు. ప్రస్తుతం బయటకు వెళ్ళి పని చేసే ఓపిక వారిలో లేదు.**

మేము వంశీకి ఫోన్ చేసి ఐద్వా ఆఫీస్‌కు పిలిపించాము. అతను మొదట 'నాకు డబ్బులు ఇచ్చినట్టు వారి దగ్గర ఎలాంటి ఆధారాలు లేవు. అలాంటప్పుడు డబ్బులు నేనెందుకు ఇవ్వాలి. పైగా అవి మా మామయ్య డబ్బులు. అలాంటప్పుడు శాంతమ్మకు ఎందుకివ్వాలి? మా మామయ్యకే ఇస్తా. డబ్బులు ఆమె చేతికిస్తే డబ్బు తీసుకొని వెళ్లిపోతుంది. ఇక మా మామయ్య పరిస్థితి ఏంటీ? నా పరిస్థితి బాగోలేక మూడు నెలలు వడ్డీ ఇవ్వక పోతే ఇంత గొడవ చేస్తారా? పోలీస్ స్టేషన్‌లో, పంచాయితీలో నా పరువు పోయింది. ఇప్పుడు నేను డబ్బులు ఇస్తా. మరి నా పరువు తిరిగి వస్తుందా? అలాంటప్పుడు నేనెందుకు ఇవ్వాలి? శాంతమ్మకు నేను ఆరు తులాల బంగారం ఇచ్చాను. దానికి డబ్బులు కూడా తీసుకోలేదు. తులం 60 వేలు అనుకున్నా మూడు లక్షల 60వేల బంగారం ఇచ్చాను. వారి దగ్గర తీసుకున్న డబ్బులకు వడ్డీతో కలిపి నెలకు పది వేలు అదనంగా ఇచ్చాను. లెక్క చూసుకుంటే వాళ్ళే నాకు తిరిగి ఇవ్వాలి' అన్నాడు.

అంతా విన్న మేము 'ఆ డబ్బులు శంకరయ్యవి కావు, శాంతమ్మ పొలం అమ్మితే వచ్చిన డబ్బులు. కాబట్టి మీరు తిరిగి ఇవ్వాల్సిందే' అని చెప్పాం. దానికి మొదట అతను ఒప్పుకోలేదు. 'వాళ్లకు అండ లేదనుకొని మీ ఇష్టం వచ్చినట్టు చేస్తున్నారు. ఈ వయసులో ఇబ్బంది పెడుతున్నారు. అయినా వాళ్ళేమీ మీ అందరిపై ఆధారపడి లేరు. వాళ్ల డబ్బు ఇచ్చేస్తే వాళ్ల బతుకు వాళ్లు బతుకుతారు. లేదంటే పరిస్థితి మరోలా వుంటుంది' అని గట్టిగా హెచ్చరించాము. దాంతో 'ఇప్పుడు అంత డబ్బు నా దగ్గర లేదు. కొంచెం కొంచెం ఇస్తాను' అన్నాడు.

అన్నట్టుగానే రెండు దఫాలుగా నాలుగు లక్షల చొప్పున తిరిగిచ్చాడు. వాటిని శాంతమ్మ, శంకరయ్యల పేరు మీద పోస్టాఫీసులో వేసి ప్రతి నెలా వడ్డీ వారి ఖాతాలోకి వచ్చేలా చేశాం. అలాగే కొడుకుతో మాట్లాడి ప్రతి నెల కొంత డబ్బులు ఇచ్చేలా చేశాము. ఇప్పుడు వారిద్దరూ చాలా సంతోషంగా వున్నారు. తల్లిదం డ్రులను చూసుకోవడం పిల్లలు తమ బాధ్యత అని గుర్తించాలి. లేదంటే మలివయసులో వారి పరిస్థితి చాలా అధ్వాన్నంగా మారుతుంది.

- వై వరలక్ష్మి
9948794051

ఈ తప్పులు చేయొద్దు..

గర్భిణీలు తీసుకునే ఆహారం మొదలు, జీవన విధానం వరకు అన్నింటిలో మార్పు వచ్చే సమయం ఇదే. అందుకే ఆ సమయంలోఎలాంటి ఆహారం తీసుకోవాలి, ఎలాంటి వాటికి దూరంగా ఉండాలో ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.



- వీలైనంత వరకు ఇంటి భోజనాన్ని తీసుకోవాలి. ఒకవేళ బయటి ఫుడ్ తినాలనిపిస్తే. పరిశుభ్రత, ఆహార భద్రతకు ప్రాధాన్యతనిచ్చే రెస్టారెంట్లకు మాత్రమే వెళ్లాలి.
- గర్భిణీలు వీలైనంత వరకు వేడి వేడి ఆహారాన్ని తీసుకోవడానికి ప్రయత్నించాలి.
- సీ ఫుడ్ తీనే సమయంలో కాస్త జాగ్రత్తగా వుండాలి. మంచిగా వండారా లేదా అనేది పరిశీలించుకోవాలి. లేదంటే ప్రమాదకరమైన బాక్టీరియా చేరే అవకాశాలుంటాయి. ఫుడ్ స్టోర్‌లు లేదా బఫేల నుండి ముందస్తుగా ప్యాక్ చేసిన సలాడ్‌లు, ఆహార పదార్థాలను తీసుకోకుండా ఉంటేనే మంచిది.
- అన్నింటికంటే ముఖ్యంగా భోజనం చేసే ముందు చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. లేదంటే 60శాతం ఆల్కహాల్‌తో తయారుచేసిన హ్యాండ్ శానిటైజర్‌ను ఉపయోగించాలి.
- స్ట్రీట్ ఫుడ్‌ను పూర్తిగా అవయిడ్ చేయాలి. పానీపూరీ, కట్‌లెట్, ఫాస్ట్ ఫుడ్ సెంటర్స్‌లో చేసే ఆహార పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలి.
- ఇక రాత్రి మిగిలిపోయిన ఆహారాన్ని తినకపోవడం మంచిది. మరీ ముఖ్యంగా వాటిని సరిగ్గా నిల్వచేయకుండా మళ్లీ వేడి చేసి తినడం అత్యంత ప్రమాదకరం.

పార్లమెంటు ముందుకు ఆరు కీలక బిల్లులు

(మొదటిపేజీ తరువాయి)

చేసింది. ప్రతిపాదిత చట్టం విపత్తు నిర్వహణ రంగంలో పని చేస్తున్న వివిధ సంస్థల పాత్రల్లో మరింత స్పష్టత, కలయికను తీసుకురావడమే లక్ష్యంగా పెట్టుకుందని లోక్‌సభ బులెటిన్ తెలిపింది.భారతీయ వాయుయన్ విధేయక్ (బీవీవీ)-2024 పౌర విమానయాన రంగంలో వ్యాపారాన్ని సులభతరం చేయడానికి అనుమతించే నిబంధనలను అందించడానికి 1934 ఎయిర్‌క్రాఫ్ట్ చట్టం స్థానంలో కొత్త బిల్లును తీసుకొస్తుంది. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడం, ఆమోదించడం కోసం ఆరు బిల్లులను జాబితా చేసింది. స్వాతంత్ర్యానికి పూర్వపు చట్టం, కాఫీ ప్రమోషన్, అభివృద్ధి బిల్లు, రబ్బరు ప్రమోషన్, అభివృద్ధి బిల్లు, బాయిలర్ల బిల్లును తీసుకురానున్నారు.లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పార్లమెంటరీ ఎజెండాను నిర్ణయించే బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ)ని కూడా ఏర్పాటు చేస్తారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అధ్యక్షతన ఉన్న కమిటీలో సుదీప్ బందోపాధ్యాయ (టీఎంసీ), పీపీ చౌదరి (బీజేపీ), లావు శ్రీకృష్ణ దేవరాయలు (టీడీపీ), నిషికాంత్ దూబే (బీజేపీ), గౌరవ్ గొగోయ్ (కాంగ్రెస్), సంజయ్ జైస్వాల్ (బీజేపీ), దిలేశ్వర్ కమైత్ (జేడీయూ), భర్తృహరి మహతాబ్ (బీజేపీ), దయానిధి మారన్ (డీఎంకే), బైజయంత్ పాండా (బీజేపీ), అరవింద్ సావంత్ (శివసేన-యూబీటీ), కొడికున్నిల్ సురేష్ (కాంగ్రెస్), అనురాగ్ ఠాకూర్ (బీజేపీ), లాల్జీ వర్మ (ఎస్పీ) సభ్యులుగా ఉన్నారు.

పాలస్తీనాకు సంఘీభావం తెలిపితే కేసులా?

(మొదటిపేజీ తరువాయి)

చేశారని పొలిట్‌బ్యూరో పేర్కొంది. కేసులు నమోదైన ఈ రాష్ట్రాల్లో చాలావరకు బీజేపీ దాని మిత్రపక్షాల పాలనలో వున్నవి లేదా కేంద్ర ప్రభుత్వ ప్రత్యక్ష పాలనలో వున్నవే. ఒకవైపు పాలస్తీనా దేశానికి మద్దతునిస్తున్నామని కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం చెప్పుకుంటోంది. మరోవైపు పాలస్తీనాకు సంఘీభావం చెప్పడాన్ని నేరంగా చూపుతూ ఇలా కేసులు నమోదు చేయడంతో వారి నిజ స్వరూపం బట్టబయలైందని పొలిట్‌బ్యూరో విమర్శించింది. భారతీయులు పాలస్తీనాకు మద్దతునివ్వడాన్ని బీజేపీ సహించలేకపోతోందని పేర్కొంది. ఈ కేసులను తక్షణమే ఉపసంహరించాలని, పాలస్తీనాకు మద్దతు తెలిపిన కారణంగా అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేసింది. కేంద్ర ప్రభుత్వం పాలస్తీనాకు నిర్ద్వంద్వంగా సంఘీభావాన్ని తెలియచేయాలని కోరింది. ఆక్రమించిన పాలస్తీనా భూభాగాలన్నింటి నుంచి వైదొలగి, 1967 ముందు నాటి సరిహద్దులతో, తూర్పు జెరూసలేం రాజధానిగా ప్రత్యేక దేశంగా పాలస్తీనాకు స్వయంప్రతిపత్తిని పునరుద్ధరించాల్సిందిగా ఇజ్రాయిల్‌ను కోరాలని డిమాండ్ చేసింది.

ఫలించిన అంగన్‌వాడీల పోరాటం..

(మొదటిపేజీ తరువాయి)

బయటకు రాకుంటే రోడ్డుపై బైటాయించాలని అంగన్‌వాడీలు భావించారు.

పట్టువీడని అంగన్‌వాడీలు..!

అధికారులే బయటకు వచ్చి సమాధానం చెప్పాలని పట్టుబట్టగా వెస్ట్‌జోన్ డీసీపీ విజయకుమార్ చొరవతో ఐసీడీఎస్ డైరెక్టర్ కాంతివెస్లీ, ఇతర అధికారులు ధర్నా వద్దకు వచ్చారు. 20 డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని యూనియన్ రాష్ట్ర అధ్యక్షప్రధాన కార్యదర్శులు కె.సునీత, జయలక్ష్మి, మంగ, ఇతర రాష్ట్ర నాయకులు సంబంధిత అధికారులకు అందజేశారు. అనంతరం ఈ అంశాలపై డైరెక్టర్ అంగన్‌వాడీలను ఉద్దేశించి మాట్లాడారు. కొన్ని అంశాల్లో స్పష్టత రాకపోవడంతో.. అంతవరకు ధర్నా విరమించేది లేదని అంగన్వాడీలు భీష్మించుకూర్చున్నారు. దాంతో అధికారులు అంగన్‌వాడీ యూనియన్ ప్రతినిధులతో 2వ దఫా చర్చలు జరిపారు. జీవో నెం.10ని రద్దు చేస్తామని, కొత్త జీవోలో రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ.2 లక్షలు, హెల్పర్లకు రూ.లక్ష ఇస్తామని, వీఆర్ఎస్ వర్తింపజేస్తామని చెప్పారు. ఎలాంటి షరతులూ లేకుండా పెన్షన్ చెల్లిస్తామని, ఈ సౌకర్యాలన్నీ జులై ఒకటి నుంచి రిటైర్మెంట్ అవుతున్న వారందరికీ వర్తింపజేస్తామని, హెల్పర్లకు పాత పద్ధతిలోనే ప్రమోషన్ ఇస్తామని అన్నారు. 24న ప్రారంభమయ్యే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో వేతనాల పెంపు, గత సమ్మె హామీలు, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసే విధంగా చూడాలని అంగన్‌వాడీలు కోరగా.. ఈ అంశాలన్నింటిపైనా సానుకూలంగా ప్రభుత్వానికి ఫైల్ పెడతామని డైరెక్టర్ తెలియజేశారు. డిపార్టుమెంట్ పరిధిలో ఉన్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నామని, త్వరలో ఇతర సమస్యలు పరిష్కరిస్తామని హామీనిచ్చారు.అనంతరం జయలక్ష్మి మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు పోరాటాలు చేశామని, ఎమ్మెల్యేలు ఇంటి ఎదుట ధర్నాలు, రిలే నిరాహార దీక్షలు, సెంటర్లు బంద్ పెట్టి.. ధర్నాకు వెళ్తే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదిరించినా.. భయపడకుండా వచ్చి పోరాటాన్ని విజయవంతం చేసిన అందరికీ సీఐటీయూ తరపున అభినందనలు తెలియజేశారు. పర్మినెంట్ కోసం, కనీసం వేతనం కోసం పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర కోశాధికారి పి.మంగ, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ డి.సునీత, జి.పద్మ, ఈ.వెంకటమ్మ, స్వర్ణ, ఎం.పద్మ, శారద, జి.కవిత, రాష్ట్ర నాయకులు భానుమతి, రాజమణి, రాజేశ్వరి, సంపూర్ణ, స్నేహబిందు, సమ్మక్క, రమ, బాబాయ్, అన్నపూర్ణ, శశికళ, శోభ, నర్సమ్మ, భారతి, రాజ్యలక్ష్మి, దేవగంగు, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులకు జలకళ

(మొదటిపేజీ తరువాయి)

చింతూరు మండలాల్లో అనేక ఏజెన్సీ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ముఖ్యంగా అశ్వారావు పేట మండలంలోని నాలుగు గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో జనజీవనం స్తంభించిపోయింది. వరదల ధాటికి వందల ఎకరాల్లోని పంటలు కొట్టుకుపోయాయి. ముంపు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 214 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కారేపల్లిలో 29.08 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా అత్యల్పంగా నేలకొండపల్లిలో 1.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. వేంసూరు మండల పరిధిలోని కందుకూరు వాగు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో దుద్దపూడి -కందుకూరు గ్రామాల మధ్య రాకపోకలు నిలిపివేశారు. పెనుబల్లి మండలంలోని మధ్యతరహా జలాశయమైన లంకాసాగర్ ప్రాజెక్టులోకి 3500 క్యూసెక్కులు నీరు చేరడంతో ప్రస్తుత నీటిమట్టం 15.10 అడుగులకు చేరింది. ఈ ప్రాజెక్ట్ మొత్తం నీటి సామర్థ్యం 16 అడుగులు. ప్రాజెక్టు ఎగువన కురుసున్న వర్షాలతో మండాలపాడు, లంకపల్లి వాగుల గుండా భారీగా నీరు చేరుతోంది. దాంతో శుక్రవారం రాత్రికి నిండుకుండలా జలాశయం పూర్తి స్థాయిలో 16 అడుగులకు చేరుకొని అలుగు పారుతుందని అధికారులు అంటున్నారు. అశ్వారావుపేటలో అత్యధికంగా 156.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. పాల్వంచలోని కిన్నెరసాని ప్రాజెక్టు ఒక గేట్ ఎత్తి 5000 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు.

25కిపైగా గ్రామాలకు స్తంభించిన రాకపోకలు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మంథని నియోజకవర్గం మహాముత్తారంలోని పెద్దవాగు ఉప్పొంగడంతో 12 గ్రామాలకు రవాణా స్తంభించింది. కాటారం మండలంలో పోతులవాయి, దామెరకుంట, దంతలపల్లిలో పెద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దామరకుంట-గుండ్రాత్‌పల్లి గ్రామాల మధ్యనున్న అలుగు వాగులో వరద ప్రవాహానికి ఓ మినీ వాహనం కొట్టుకుపోగా డ్రైవర్ చాకచక్యంతో సురక్షితంగా బయటపడ్డాడు. గణపురం మండలంలోని వెల్తుర్లపల్లి కొండాపురం మధ్యలో ఉన్న మోరంచవాగు ఉప్పొంగడంతో దాదాపు 15 గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి దూరమయ్యారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఉన్న ఓపెన్ కాస్ట్ గనుల్లోకి నీరు చేరడంతో ఉత్పత్తి నిలిచిపోయింది. మహదేవపూర్ మండలంలోని సెంటర్‌పల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో అన్నారం-సెంటర్‌పెల్లి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. మహదేవ్‌పూర్ మండలం బొమ్మాపూరు శివారు కోతకు గురైన మందిరం చెరువు కట్ట, బొమ్మపూర్ ఎస్సీ కాలనీలోని దూదేకుల ఓర్రె, ప్రాథమిక పాఠశాల, గ్రామపంచాయతీ భవనం, పెద్దంపేట వాగు వరద ఉధృతిని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పరిశీలించారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట గ్రామంలోని నక్కవాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణం మధ్యలోనే ఉండటంతో తాత్కాలికంగా వేసిన మట్టిరోడ్డు వరద ఉధృతికి కొట్టుకుపోయింది. దాంతో హన్మాజీపేటతోపాటు పరిసర గ్రామాల ప్రజల రాకపోకలు నిలిచి పోయాయి. అధికార యంత్రాంగం బ్రిడ్జి నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా అందుబాటులోకి తీసుకు రావాలని గ్రామస్తులు కోరుతున్నారు. మంచిర్యాల జిల్లాలోని వేమనపల్లి మండలంలో గాలి వానకు నీల్వాయి -మల్లంపేట రహదారిలో భారీ వృక్షాలు నేలకొరగడంతో అటుగా వెళ్లే ప్రయాణికులకు అంతరాయం ఏర్పడింది. నీల్వాయి ఎస్ఐ శ్యామ్ రోడ్డుపై పడి ఉన్న చెట్లను జేసీబీ సహాయంతో తొలగించారు. ఆసిఫాబాద్ జిల్లా దహెగాం, పెంచికల్‌పేట్, వాంకిడి మండలంలో భారీ వర్షం కురిసింది. అందెవెల్లి పెద్దవాగుపై నిర్మించిన తాత్కాలిక అప్రోచ్ రోడ్డు వరద నీటికి కొట్టుకు పోయింది.

శ్రీశైలం ప్రాజెక్టును తాకిన వరద

శ్రీశైలం రిజర్వాయర్‌లోకి శుక్రవారం 14 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరిందని అధికారులు తెలిపారు. శ్రీశైలం జలాశయం పూర్తి స్దాయి నీటిమట్టం 885 అడుగులు, కాగా ప్రస్తుతం 806.80 అడుగులుగా ఉంది. కర్నాటక, మహారాష్ట్ర ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలతో క్రమంగా కృష్ణా నదికి నీటిమట్టం పెరుగుతోంది. వరి పంటకు అదును దాటి పోతుందని ఆందోళన చెందుతున్న రైతులకు శ్రీశైలం ప్రాజెక్టులోకి వరద నీరు రావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే గుడిపల్లి, జొన్నలబొగుడ, ఎల్లూరు రిజర్వాయర్లను నీటితో నింపుతుండగా మరో రెండు రోజుల్లో కాల్వలకు నీటిని వదిలే అవకాశాలు ఉన్నాయని అధికారులు తెలిపారు. దాంతో శుక్రవారం శ్రీశైలం ప్రాజెక్టు నుంచి 11,298 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేశారు. శ్రీశైలం ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ 7,898 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు.

నాగార్జున సాగర్ నుంచి తాగునీటికి నీటి విడుదల

నాగార్జునసాగర్ పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 505.10 అడుగులుగా ఉంది. మొత్తం నీటి నిల్వ సామర్థ్యం 312.50 టీఎంసీలు ఉండగా ప్రస్తుతం 123.50 టీఎంసీలుగా ఉంది. నాగార్జున సాగర్ జలాశయానికి ఎలాంటి ఇన్ ఫ్లో లేదు. జలాశయం నుంచి హైదరాబాద్‌కు తాగు నీటి అవసరాల కోసం ఎస్ఎల్బీసీ ద్వారా 800 క్యూసెక్కుల నీరు, కుడి కాలువకు 5,700 క్యూసెక్కుల నీరు సాగర్ ఎడమ కాల్వకు 500 క్యూసెక్కుల నీరు విడుదల కొనసాగుతోంది. మొత్తం 7 వేల క్యూసెక్కుల నీటిని కుడి, ఎడమ కాలువ, ఎస్ఎల్బీసీ ద్వారా తాగునీటి అవసరాల కోసం విడుదల చేస్తున్నారు.

26.8 అడుగులకు చేరిన గోదావరి

ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న భారీ వరదతో భద్రాచలం వద్ద గోదావరి క్రమక్రమంగా పెరుగుతోంది. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు 25.3 అడుగులకు చేరిన గోదావరి సాయంత్రం ఆరు గంటలకు 26.8 అడుగులకు చేరుకుంది. శనివారం ఉదయం వరకు మరింత పెరిగి 29 అడుగుల వరకు చేరుకునే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. భద్రాచలం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుండటంతో యాత్రికులు స్నానాల కోసం నదిలోకి దిగొద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. మరో రెండ్రోజులపాటు భారీ వర్షాలు ఉన్న నేపథ్యంలో అవసరమైన మేరకే ప్రజలు బయటకు రావాలని కాలువలు, వాగులు దాటే ప్రయత్నాలు చేయొద్దని హెచ్చరించారు. ఆంధ్రా తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో ఆర్డీవో దామోదర్ రావు ప్రత్యేకంగా పర్యటించి ముంపుపై స్థానిక అధికారులకు పలు సూచనలు చేశారు.

భద్రాద్రి జిల్లా చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టు వరద ఉధృతి పెరుగుతోంది. ఎగువన చత్తీస్‌గఢ్‌లో కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టుకు 60,297 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దాంతో శుక్రవారం 24 గేట్లు ఎత్తి 59వేల క్యూసెక్కుల నీటిని దిగువన గోదావరికి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో క్రమేపీ వరద ఉధృతి పెరుగుతున్నట్టు ప్రాజెక్టు ఏఈ ఉపేందర్ తెలిపారు.

ఎస్సారెస్పీకి 17 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాక

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరదనీరు వచ్చి చేరుతోంది. వర్షాకాలం సీజన్ ప్రారంభమైన తర్వాత తొలిసారి గురు, శుక్రవారాల్లో పెద్దమొత్తంలో వరద నీరు వచ్చి చేరడం గమనార్హం. గురువారం రాత్రి 25 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగగా, శుక్రవారం ఉదయం 6 గంటల సమయంలో 20 వేలు, మధ్యాహ్నం మూడు గంటల సమయంలో 17 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతున్నట్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 1091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1065 అడుగుల(16.824 టీఎంసీల) నీరు నిల్వ ఉంది. గతేడాది ఇదే సమయానికి 1071.60 అడుగుల(26.112 టీఎంసీల) నీరు నిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు. ఎస్సారెస్పీకి వరదనీరు వచ్చి చేరుతుండటంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గనుల్లో ప్రమాదాలు..

(మొదటిపేజీ తరువాయి)

లేదు. కార్మికులు, సూపర్ వైజర్లకు, కిందిస్థాయి సిబ్బందికి రక్షణ చర్యలపై సంస్థ అవగాహన కల్పించాల్సి ఉన్నా ఆ దిశగా కృషి జరగడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. తక్కువ మందితో ఎక్కువ పని చేయిస్తుండటం కూడా ప్రమాదాలకు దారితీస్తోంది.

రక్షణ చర్యలు పాటించలేదు
సింగరేణి డైరెక్టర్ ఎన్‌వీకే శ్రీనివాస్

ఓసీపీ-2 గని ప్రమాదానికి కారణమైన ఘటనలో మట్టిని ఏటవాలుగా పోసి ఉంటే ప్రమాదం జరిగి ఉండేది కాదు. పైపుల మరమ్మతుల సమయంలో మట్టిని నిట్టనిలువుగా పోశారు. వర్షాలకు ఆ మట్టి తడిసి బురదమయంగా మారడంతో కార్మికులపై పడి ప్రమాద తీవ్రత పెరిగింది. ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ చేపట్టి బాధ్యులపై చర్య తీసుకుంటాం. మృతుల కుటుంబాలకు సంస్థ అండగా ఉంటుంది.

త్వరలో సెమీ రెసిడెన్షియల్ స్కూళ్లు

(మొదటిపేజీ తరువాయి)

సిద్ధం చేయాలని కోరారు. వాటిలో ఇప్పుడున్న సిబ్బందికి అదనంగా విద్యా బోధన కోసం ప్రత్యేకంగా ఒక టీచర్‌ను నియమించేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు.

సెమీ రెసిడెన్షియల్స్‌కు రవాణా సదుపాయం

మూడో తరగతి వరకు అంగన్‌వాడీ ప్లే స్కూళ్లలో బోధన తర్వాత విద్యార్థులు నాలుగో తరగతి నుంచి సెమీ రెసిడెన్షియల్ స్కూళ్లలో చదువుకునేలా ప్రణాళికలు ఉండాలని అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. అలాగే ఆయా గ్రామాల నుంచి విద్యార్థులు సెమీ రెసిడెన్షియల్ స్కూళ్లకు వెళ్లి వచ్చేందుకు ప్రభుత్వమే రవాణా సదుపాయం కల్పించేలా చూడాలని సూచించారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థను పటిష్టం చేసే దిశగా ప్లే స్కూల్, సెమీ రెసిడెన్షియల్ స్కూల్ విధానాలకు సంబంధించిన ప్రణాళికలు సిద్ధం చేయడానికంటే ముందే విద్యావేత్తల అభిప్రాయాలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వారి సూచనలను బట్టి ముందుగా ఒకట్రెండు మండలాల్లో పైలట్ ప్రాజెక్టు అమలు చేసేలా ప్రణాళికలుండాలని చెప్పారు. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. దశలవారీగా వాటిని బలోపేతం చేసేందుకు కార్యాచరణను సిద్ధం చేస్తామని వివరించారు. పదేండ్లుగా విశ్వవిద్యాలయాల్లో నియామకాల ప్రక్రియ లేదంటూ విద్యావేత్తలు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. విశ్వవిద్యాలయాలకు డెవలప్‌మెంట్ గ్రాంట్లు కేటాయించాలని కోరారు. దీనిపై సీఎం స్పందిస్తూ విద్యా, వ్యవసాయ రంగాల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. త్వరలో విద్యా వ్యవసాయ కమిషన్లను ఏర్పాటు చేయబోతున్నామని వివరించారు. విద్యా కమిషన్ ద్వారా విద్యారంగ సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

సీఎస్ఆర్ నిధులపై దృష్టి

ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు, సౌకర్యాల పెంపు కోసం ప్రభుత్వ నిధులతోపాటు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్ఆర్) నిధులపైనా దృష్టి సారించాలని అధికారులకు సీఎం సూచించారు. వాటితోపాటు విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు కె కేశవరావు, ప్రొఫెసర్లు హరగోపాల్, కోదండరామ్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి తదితరులు పాల్గొన్నారు.

బిల్కిస్ బానో కేసులో..

న్యూఢిల్లీ : బిల్కిస్ బానో కేసులో 11 మంది దోషుల్లో ఇద్దరు దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం తిరస్కరించింది. ఈ పిటీషన్‌ను విచారణకు స్వీకరించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. తమ క్షమాభిక్షను రద్దు చేస్తూ జనవరి 8 ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఈ పిటీషన్ వేశారు. ఈ పిటిషన్‌ను 'పూర్తిగా దోషపూరితంగా' జస్టిస్ సంజీవ్ ఖన్నా, జసిస్ట్ సంజయ్ కుమార్ ధర్మాసనం విమర్శించింది. సుప్రీంకోర్టు యొక్క మరొక ధర్మాసనం ఇచ్చిన తీర్పుపై ఎలా పిటిషన్ వేస్తారని ప్రశ్నించింది. 'అసలు ఈ పిటిషన్ ఎంటి? దీనిన్ని ఎలా విచారణ చేస్తారు. ఇది పూర్తిగా దోషపూరితం. ఆర్టికల్ 32 పిటీషన్ ఎలా ఫైల్ చేస్తారు? మరోక బెంచ్ ఇచ్చిన తీర్పుపై విచారణ చేయడానికి మేం ఇక్కడ కూర్చోలేదు' అని ధర్మాసనం తీవ్రంగా పేర్కొంది.



రైతుల సూచనల మేరకే 'భరోసా'

అభిప్రాయాలను క్రోడీకరించి విధాన నిర్ణయం తీసుకుంటాం

- త్వరలో పంటల బీమా పథకానికి రూపకల్పన
- కౌలు రైతులకు సాయంపై క్షేత్రస్థాయి పరిశీలన

ఆయిల్ పామ్ సాగులో రాష్ట్రం నంబర్ వన్‌గా నిలవాలి : వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

- రైతు రుణమాఫీ బృహత్తర కార్యక్రమం : మంత్రి శ్రీధర్‌బాబు
- రైతుభరోసాపై రైతుల అభిప్రాయాలను సేకరించిన మంత్రివర్గ ఉపసంఘం
- పెద్దపల్లి జిల్లా కొలనూర్‌లో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

"రాష్ట్రంలోని రైతులందరి సూచనలు, అభిప్రాయాలను క్రోడీకరించి రైతు భరోసాపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. ప్రభుత్వ నిర్వహణకు ఆర్థికపరమైన ఎన్నో అవరోధాలున్నా.. రైతు సంక్షేమానికే అత్యంత ప్రాధాన్యత ఇస్తాం. త్వరలోనే పంటబీమా పథకానికి సైతం రూపకల్పన చేస్తాం. మ్యానిఫెస్టోలో పెట్టిన విధంగానే కౌలు రైతులకు రైతుభరోసా ఎలా ఇవ్వాలన్న దానిపై క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటాం' అని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు స్పష్టం చేశారు. రైతుభరోసా పథకం అమలుపై రైతుల నుంచి అభిప్రాయాల సేకరణకు కరీంనగర్ జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డు వీ కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు పాల్గొన్నారు. ఐదుగురు మంత్రులు సహా ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ విప్ హాజరయ్యారు. జిల్లా ఇన్‌చార్జిగా ఉన్న నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో కొందరు రైతుల నుంచి నేరుగా అభిప్రాయాలు తెలుసుకున్నారు. సమావేశానికి హాజరైన వారందరికీ పత్రాలు ఇచ్చి సూచనలు, సలహాలు, అభిప్రాయాలు సేకరించారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడారు.

రైతు భరోసాను పకడ్బందీగా అమలు చేస్తామని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా, ఎంత కష్టమొచ్చినా తమ ప్రభుత్వం రైతులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. పంటల బీమా పథకం కూడా అమలు చేసేందుకు రూపకల్పన చేస్తున్నామని, ప్రభుత్వమే ప్రీమియాన్ని చెల్లించి అమలు చేస్తుందని తెలిపారు. రైతులు ఒక్క రూపాయి కట్టాల్సిన అవసరం లేదన్నారు. ఆయిల్ పామ్ సాగులో తెలంగాణ నంబర్ వన్‌గా నిలవాలని ఆకాంక్షించారు. ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు గడించొచ్చని, ఇతర పంటలు అంతర పంటగా సాగు చేసుకోవచ్చని అన్నారు. 100 లక్షల మెట్రిక్ టన్నుల అవసరాలకుగాను 3.9 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి మాత్రమే అవుతున్నదని తెలిపారు. ఇంకా 97 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తికి ఆయిల్ పామ్ సాగు చేయాల్సి ఉందని వివరించారు.

ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ఆరు నూరైనా రుణమాఫీ అమలు అమలు చేస్తామని చెప్పి నెరవేరుస్తున్నామని అన్నారు. రాష్ట్ర ఖజానాలో ఎంత ఇబ్బంది ఉన్నా వరంగల్ సభలో రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు తమ ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీ చేస్తోందని తెలిపారు. సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 18న ఒక్కరోజే 11 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.7వేల కోట్ల రుణమాఫీ నిధులు జమ చేశామని తెలిపారు. పదేండ్లలో గత సర్కారు రూ.25 వేల కోట్ల రుణమాఫీ చేస్తే, తమ ప్రభుత్వం ఏడు నెలల్లోనే రూ.31 వేల కోట్ల రుణమాఫీ చేస్తోందని వివరించారు.

రైతు భరోసాపై ప్రతిపక్షాల గ్లోబల్ ప్రచారాన్ని రైతులు నమ్మొద్దని రెవెన్యూ, హౌసింగ్, పౌరసరఫరాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గత పాలకులు నాలుగు గోడల మధ్య కూర్చొని విధానమైన నిర్ణయాలు తీసుకునే వారన్నారు. తమ ప్రభుత్వం అలా కాకుండా రైతుల అభిప్రాయాలను, సూచనలను తీసుకొని రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తుందని చెప్పారు. నిజమైన రైతులకు పెట్టుబడి సాయం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఐటీ దాఖలు చేసే రైతులకు కూడా రైతు భరోసా అందిస్తామని, దీనిపై ఎలాంటి అపోహలూ పెట్టుకోవద్దని స్పష్టం చేశారు. రైతుల ఆకాంక్షల కనుగుణంగా రైతు భరోసా పథకం అమలు చేస్తామని రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రైతులు, రైతు సంఘాల నాయకులు, మేధావులు, రాజకీయ పార్టీల నాయకులు అందరి సూచనలు తీసుకుంటామన్నారు. అంతకు ముందు పెద్దపల్లి జిల్లా కొలనూర్‌లో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని మంత్రులు ప్రారంభించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో చొక్కారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు.

ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాసు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ప్రభుత్వ సలహాదారు హర్కర్ వేణుగోపాల్, మానకొండూర్, పెద్దపెల్లి, రామగుండం ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, చింతకుంట విజయ రమణారావు, మక్కాన్ సింగ్ ఠాకూర్, సూడా చైర్మెన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కరీంనగర్ ఉమ్మడి జిల్లా కలెక్టర్లు పమేలా సత్పతి, సందీప్ కుమార్ ఝా, సత్య ప్రసాద్, కోయ శ్రీహర్ష, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, కరీంనగర్ జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, ప్రజా ప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పారిస్‌కు 117!

- టీమ్ ఇండియా జంబో టీమ్ సిద్ధం
- సంఖ్య తగ్గినా.. బలంగా పతక వేట
- పారిస్ 2024 ఒలింపిక్స్



నవతెలంగాణ క్రీడావిభాగం

పారిస్ ఒలింపిక్స్‌కు రంగం సిద్ధమైంది. మరో వారం రోజుల్లో విశ్వ క్రీడా సంరంభం షురూ కానుంది. కరోనా మహమ్మారి కారణంగా 2020 టోక్యో ఒలింపిక్స్ ఓ ఏడాది ఆలస్యమైంది. 2021లో టోక్యో ఒలింపిక్స్ నిర్వహించగా.. మూడేండ్లలోనే మరోసారి విశ్వ క్రీడలు మన ముందుకు వచ్చాయి. 2020 టోక్యో ఒలింపిక్స్‌కు భారత్ జంబో బృందాన్ని పంపించింది. 121 మంది అథ్లెట్లతో కూడిన భారత క్రీడా బృందం టోక్యోలో పతక వేట సాగించింది. పారిస్‌లో మన జట్టు సంఖ్య కాస్త తగ్గినా.. పతక వేటలో టీమ్ ఇండియా బలం మాత్రం గణనీయంగా మెరుగైంది. టోక్యో ఒలింపిక్స్‌లో పతకాలతో చిరస్మరణీయ జ్ఞాపకాలను అందించిన పతక విజేతలు ఈసారి పారిస్‌లో మెరవటం లేదు!. మహిళల హాకీ జట్టు, మేరీ కోమ్‌లు పారిస్‌లో ఆడటం లేదు. లాంగ్‌జంపర్ శ్రీశంకర్ మురళీ, ఫెన్సర్ భవాని దేవిలు పలు కారణాలతో 2024 మెగా ఈవెంట్‌కు దూరమయ్యారు. వెటరన్ క్రీడా కారులు పారిస్‌లో పతక వేట సాగించనున్నారు. 42 ఏండ్ల వయసులో శరత్ కమల్, 43 ఏండ్ల వయసులో రోహన్ బోపన్న సింగిల్స్ విభాగంలో పతక వేట చేయనున్నారు. పారిస్ ఒలింపిక్స్ ఆరంభ వేడుకల్లో భారత బృందానికి శరత్ కమల్ పతాకధారిగా వ్యవహరించనున్నాడు. షూటింగ్‌లో భారత్ రికార్డు స్థాయిలో అథ్లెట్లను బరిలోకి నిలిపింది. పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ నుంచి 21 మంది షూటర్లు పోటీపడుతున్నారు.

తెలుగు తేజం ఇషా సింగ్ సైతం ఒలింపిక్స్‌లో పోటీపడుతుంది. ఇక పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ నుంచి ఏకంగా 72 మంది అథ్లెట్లు అరంగేట్రం చేయనున్నారు. 61 శాతం మంది భారత క్రీడాకారులు తొలిసారి ఒలింపిక్స్‌లో ఆడనున్నారు. ఇందులో రెండు సార్లు ప్రపంచ చాంపియన్ బాక్సర్ నిఖత్ జరీన్ సైతం ఉన్నారు. టోక్యో ఒలింపిక్స్‌లో పతకాలు సాధించిన నీరజ్ చోప్రా, మీరాబాయి చాను, పి.వి సింధు, లవ్లీనా బొర్గొహైన్ సహా మెన్స్ హాకీ జట్టు పారిస్‌లో పతకం నిలుపుకునేందుకు బరిలోకి దిగుతున్నారు. టోక్యో ఒలింపిక్స్‌లో భారత్ ఏడు పతకాలు సాధించింది.

రెజ్లింగ్‌లో రవి దహియ, బజరంగ్ పూనియాలు పతకాలు సాధించారు. పారిస్ ఒలింపిక్స్‌కు రవి దహియ, బజరంగ్ పూనియాలు దూరమ య్యారు. పారిస్ ఒలింపిక్స్‌లో పోటీపడుతున్న భారత క్రీడాకారుల్లో 47 మంది మహిళా అథ్లెట్లే కావటం విశేషం. ఒలింపిక్స్‌లో భారత్ సాధించిన చివరి 15 పతకాల్లో ఏకంగా ఏడు మెడల్స్ మహిళా క్రీడాకారులు సాధించటం గమనార్హం.

అమ్మాయిలు అలవోకగా..

- పాకిస్థాన్‌పై ఏకపక్ష విజయం
- మహిళల ఆసియా కప్ 2024



దంబుల్లా (శ్రీలంక) : భారత మహిళల జట్టు మొదలెట్టింది. మహిళల ఆసియా కప్‌ను ఘనంగా ఆరంభించింది. ఆసియా కప్ గ్రూప్ దశలో పొరుగు దేశం పాకిస్థాన్‌పై ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. దీప్తి శర్మ (3/20) మాయజాలంతో పాకిస్థాన్‌ను పడగొట్టింది. భారత బౌలర్లు రేణుక సింగ్(2/14), పూజ వస్త్రాకర్ (2/31), శ్రేయాంక పాటిల్ (2/14) సైతం బంతితో మెరవటంతో తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ 19.2 ఓవర్లలో 108 పరుగులకు కుప్పకూలింది. పాకిస్థాన్ బ్యాటర్లలో సిద్ర ఆమిన్ (25), టుబా హసన్ (22), ఫాతిమా సనా (22 నాటౌట్)లు రాణించారు. స్వల్ప లక్ష్యాన్ని టీమ్ ఇండియా అమ్మాయిలు అలవోకగా ఛేదించారు. షెఫాలీ వర్మ (40, 29 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్), స్మృతీ మంధాన (45, 31 బంతుల్లో 9 ఫోర్లు) ధనాధన్ ఇన్నింగ్స్‌లతో కదం తొక్కారు. మరో 35 బంతులు మిగిలి ఉండగానే భారత్ 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. స్పిన్నర్ దీప్తి శర్మ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచింది.

సెయిలర్ గోవర్థన్‌కు స్వర్ణం!

15వ మాన్‌సూన్ రెగట్టా చాంపియన్‌షిప్



హైదరాబాద్: మాన్‌సూన్ రెగట్టా చాంపియన్‌షిప్ 15వ ఎడిషన్‌లో తెలంగాణ సెయిలర్లు గోవర్దన్ పల్లార బంగారు పతకం ఖాయం చేసుకున్నాడు. పోటీల్లో తొలి రోజు నుంచి సత్తా చాటుతున్న గోవర్దన్ శుక్రవారం సైతం ముందంజలో నిలిచాడు. అండర్ 16 ఆప్టిమిస్ట్ ఫ్లీట్ విభాగంలో మరో రేసు మిగిలి ఉండగానే స్వర్ణం, మాన్‌సూన్ రెగట్టా ట్రోఫీని ఖాయం చేసుకున్నాడు. తొమ్మిది పాయింట్ల స్పష్టమైన ఆధిక్యంలో ఉన్న గోవర్థన్ శనివారం జరిగే చివరి రేసులోనూ విజయం సాధిస్తే ఎస్‌హెచ్ బాబు స్మారక ట్రోఫీని సైతం సొంతం చేసుకుంటాడు!. దీక్షిత రెండో స్థానంతో రజతం లాంఛనం చేసుకోగా.. రిజ్వాన్ మహ్మద్ (తెలంగాణ) నాల్గో స్థానంలో కొనసాగుతున్నాడు. మైసూర్ సెయిలర్ ఆకాశ్ తంగై మూడో స్థానంలో నిలిచాడు.

దీపావళికి మెకానిక్ రాకీ



విశ్వక్‌సేన్

హీరో విశ్వక్ సేన్ తన రాబోయే చిత్రం 'మెకానిక్ రాకీ'గా అలరించబోతున్నారు. నూతన దర్శకుడు రవితేజ ముళ్లపూడి దీనికి దర్శకత్వం వహిస్తున్నారు. ఎస్‌ఆర్‌టీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రామ్ తాళ్లూరి ఈచిత్రాన్ని హై బడ్జెట్‌తో, భారీ కాన్వాస్‌పై నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో విశ్వక్ సేన్ సరసన మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తోంది.

ఈ చిత్రాన్ని అక్టోబర్ 31న దీపావళి సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేస్తున్నట్లు మేకర్స్ అఫీషియల్‌గా అనౌన్స్ చేశారు. గురువారం రాబోతున్న ఈ సినిమాకు లాంగ్ వీకెండ్ అడ్వాంటేజ్ వుంటుంది. రిలీజ్ డేట్ పోస్టర్‌లో విశ్వక్ సేన్ గన్, రెంచ్‌ను పట్టుకుని బ్యాడ్ యాస్ అవతార్‌లో కనిపించారు. మెకానిక్‌గా తన క్యారెక్టర్‌ని ప్రజెంట్ చేస్తూ, పోస్టర్‌లో ఓల్డ్ కార్స్ కూడా ఉన్నాయి.

'విశ్వక్‌సేన్ ఇప్పటివరకు నటించిన చిత్రాలతో పోలిస్తే ఈ సినిమా చాలా వైవిధ్యంగా ఉంటుంది. అలాగే ఆయన పాత్ర తీరు తెన్నులు సైతం ప్రేక్షకుల్ని సర్‌ప్రైజ్ చేస్తాయి. ఈ సినిమా ఆయన కెరీర్‌లో ఓ మైల్‌స్టోన్‌గా నిలిచిపోతుంది' అని చిత్ర యూనిట్ తెలిపింది. కామెడీ, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ చిత్రానికి సంగీతం: జేక్స్ బిజోయ్, డీవోపీ: మనోజ్ కటసాని, ప్రొడక్షన్ డిజైనర్: క్రాంతి ప్రియం, ఎడిటర్: అన్వర్ అలీ, ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు: సత్యం రాజేష్, విద్యాసాగర్ జె, కాస్ట్యూమ్ డిజైనర్: కళ్యాణి, ప్రీతమ్ జుకల్కర్.

నవచిత్రం

డార్లింగ్‌కి వస్తున్న రెస్పాన్స్ సూపర్



అశ్విన్ రామ్, నభా నటేష్, ప్రియదర్శి

ప్రియదర్శి, నభా నటేష్ లీడ్ రోల్స్‌లో నటించిన క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'డార్లింగ్'. అశ్విన్ రామ్ దర్శకత్వం వహించారు. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై కె.నిరంజన్ రెడ్డి, శ్రీమతి చైతన్య నిర్మించిన ఈ చిత్రం శుక్రవారం ప్రపంచ వ్యాప్తంగా విడుదలై అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి అద్భుతమైన రెస్పాన్స్‌ని రాబట్టుకుంది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ ఏర్పాటు చేసిన సక్సెస్‌మీట్‌లో హీరో ప్రియదర్శి మాట్లాడుతూ,'నిన్న శ్రీరాములు థియేటర్, ట్రిపుల్ ఏ లో ప్రీమియర్స్ హౌస్ ఫుల్ షోస్ చూసిన తర్వాత చాలా మంచిగా అనిపించింది. క్రౌడ్ రెస్పాన్స్ అదిరిపోయింది. కామెడీ, ఎమోషన్స్‌కి అద్భుతంగా కనెక్ట్ అవుతున్నారు. సినిమా చూసిన మా అమ్మ క్లాప్స్ కొట్టడం చాలా ఆనందంగా అనిపించింది. మహిళా ప్రేక్షకులు చాలా బాగా కనెక్ట్ అయ్యారు. సినిమా చూసి చాలా హ్యాపీగా ఫీలయ్యారు. అందరి నుంచి చాలా అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది' అని తెలిపారు. "ఇదొక క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. ఎక్కువమంది ఫ్యామిలీ ఆడియెన్స్, అమ్మాయిలు సినిమాని, దర్శితో నా కెమిస్ట్రీని చాలా ఇష్టపడుతున్నారు' అని హీరోయిన్ నభా నటేష్ చెప్పారు.

డైరెక్టర్ అశ్విన్ రామ్ మాట్లాడుతూ,'మేము ఊహించినట్లే ఆడియెన్స్‌కి ఈ సినిమా అద్భుతంగా రీచ్ అయ్యింది. ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియోన్స్ బాగా ఇష్టపడుతున్నారు. రానున్న రోజుల్లో మరింతగా ఫ్యామిలీ, మహిళా ప్రేక్షకులు మా 'డార్లింగ్'ని ఇష్టపడతారని ఆశిస్తున్నాం' అని అన్నారు.

ఆద్యంతం నవ్వించే ఆయ్..




జీఏ2 పిక్చర్స్ బ్యానర్‌పై రూపొందిన తాజా చిత్రం 'ఆయ్'. నార్నే నితిన్, నయన్ సారిక జంటగా నటించారు. అంజి కె.మణిపుత్ర ఈ చిత్రంతో దర్శకుడిగా బాధ్యతలను నిర్వహించారు. నిర్మాతలు బన్నీ, విద్యా కొప్పినీడి నిర్మించారు. శుక్రవారం ఈ చిత్రం నుంచి థీమ్ సాంగ్‌ను విడుదల చేశారు.

ఈ సందర్భంగా అల్లు అరవింద్ మాట్లాడుతూ, "కథ చాలా సరదాగా ఉంది. ఈస్ట్ గోదావరిలో వర్షంలో తీశాం. వర్షం కోసమే కోటిపైగా ఖర్చు పెట్టారు. రషెస్ చూశాను. సినిమా చూస్తే మనం నిజంగానే ఆ ఊర్లోకి వెళ్లి వర్షంలో తడుస్తున్నట్టుగా అనిపిస్తుంది. ఈ కథ ఓకే అయిన తరువాత ఎన్టీఆర్‌కి ఫోన్ చేశాం. 'ఫస్ట్ డే వరకు మనం పుష్ చేస్తాం.. ఆ తరువాత సినిమా బాగుంటేనే ఆడుతుంది.. ఎవరి కష్టం వారిదే.. సినిమా కథ బాగుందని అంటున్నారు.. చేసేయండి' అని ఎన్టీఆర్ అన్నారు. నితిన్ ఈ చిత్రంలో ఎంతో ఈజ్‌తో నటించాడు' అని అన్నారు.

'ఈ సినిమా చూస్తే కచ్చితంగా నవ్వి నవ్వి బుగ్గలు నొప్పి పెడతాయి. ఆ గ్యారెంటీ మేం ఇస్తున్నాం' అని నిర్మాత బన్నీ వాస్ చెప్పారు. దర్శకుడు అంజి కె.మణిపుత్ర మాట్లాడుతూ, 'ఇప్పటి వరకు గోదావరి ప్రాంతాన్ని బేస్ చేసుకుని వచ్చిన చిత్రాలన్నింటిల్లోకెల్లా ది బెస్ట్ చిత్రం అవుతుంది. నితిన్ నార్నే ఎంతో సహజంగా నటించారు. అంకిత్, కసిరాజు అద్భుతంగా నటించారు. అజయ్ మంచి పాటలు ఇచ్చారు. బన్నీ వాస్ లేకపోతే ఈ చిత్రం లేదు' అని తెలిపారు.

ఏజెంట్ జాన్ స్నో..



రాజేంద్రప్రసాద్

హీరో నితిన్ నటిస్తున్న యూనిక్ యాక్షన్, హీస్ట్ కామెడీ ఎంటర్‌టైనర్ 'రాబిన్‌హుడ్'.

శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి వెంకీ కుడుముల దర్శకుడు. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుపుకుంటోంది. ఈ చిత్రంలో రాజేంద్ర ప్రసాద్ కీలక పాత్ర పోషిస్తున్నారు.

శుక్రవారం రాజేంద్ర ప్రసాద్ బర్త్ డే సందర్భంగా ఆయనకు బర్త్ డే విషెస్ అందిస్తూ 'రాబిన్‌హుడ్'లో ఆయన ఫస్ట్ లుక్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. ఏజెంట్ జాన్ స్నో అకా జనార్థన్ సున్నిపెంటగా ఆయన క్యారెక్టర్‌ని పరిచయం చేశారు. ఏజెంట్ గెటప్‌లో ఆయన కనిపించడం చాలా ఆసక్తికరంగా ఉంది. ఇందులో ఆయన క్యారెక్టర్ చాలా క్రూసియల్ అండ్ ఎంటర్‌టైనింగ్‌గా ఉండనుందని ఈ పోస్టర్ చెప్పకనే చెప్పింది. మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని అత్యున్నత స్థాయి ప్రొడక్షన్, టెక్నికల్ వ్యాల్యూస్‌తో భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది.

నవీన్ యెర్నేని, వై రవిశంకర్ ఈ చిత్రానికి నిర్మాతలు. క్రిస్మస్ సందర్భంగా ఈ సినిమా డిసెంబర్ 20న విడుదల కానుంది. ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: వెంకీ కుడుముల, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, సిఈవో: చెర్రీ, సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్, డీవోపీ: సాయి శ్రీరామ్, ఆర్ట్ డైరెక్టర్: రామ్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: హరి తుమ్మల, లైన్ ప్రొడ్యూసర్: కిరణ్ బళ్లపల్లి.

ఆపరేషన్ రావణ్ రిలీజ్‌కి రెడీ



రక్షిత్ అట్లూరి

రక్షిత్ అట్లూరి హీరోగా రాధికా శరత్ కుమార్ ముఖ్య పాత్రలో నటిస్తున్న కొత్త సినిమా 'ఆపరేషన్ రావణ్'. ఈ చిత్రాన్ని ధ్యాన్ అట్లూరి నిర్మాణంలో న్యూ ఏజ్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా దర్శకుడు వెంకట సత్య తెలుగు, తమిళ బాషల్లో రూపొందిస్తున్నారు. సంగీర్తన విపిన్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమా వారం రోజుల ముందుగా ఈ నెల 26వ తేదీన ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది.

ఇటీవల రిలీజ్ చేసిన ఈ చిత్ర ట్రైలర్‌కు మంచి రెస్పాన్స్ వస్తోంది. సస్పెన్స్ థ్రిల్లర్ ఎలిమెంట్స్‌తో ట్రైలర్ ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటోంది.

ఈ సినిమాలో రాధికా శరత్ కుమార్, చరణ్ రాజ్, తమిళ నటుడు విద్యా సాగర్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా విజయంపై మూవీ టీమ్ కాన్ఫిడెంట్‌గా ఉంది.

కాంచి, రాకెట్ రాఘవ, రఘు కుంచె, కెఎ పాల్ రాము, టీవీ5 మూర్తి, కార్తీక్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: శరవణ వాసుదేవన్, డైలాగ్స్: లక్ష్మీ లోహిత్ పూజారి, ఎడిటర్: సత్య గిడ్డుటూరి, ఆర్ట్: నాని.టి, ఫైట్స్: స్టంట్ జాషువా, కోరియోగ్రఫీ: జేడీ, ఛాయాగ్రహణం: నాని చమిడిశెట్టి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: శ్రీపాల్ చొళ్లేటి, రచన-దర్శకత్వం: వెంకట సత్య.

అద్భుతమైన మెలోడీగా సారా సారా..

'మెరిసే మెరిసే' చిత్రంతో పవన్ కుమార్ కొత్తూరి దర్శకుడిగా విజయాన్ని అందుకున్నారు. ఇప్పుడు ఈ దర్శకుడు హీరోగా తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు. 'యావరేజ్ స్టూడెంట్ నాని' అనే చిత్రంతో హీరోగా, దర్శకుడిగా, నిర్మాతగానూ పవన్ కుమార్ ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. శ్రీ నీలకంఠ మహదేవ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఎల్‌ఎల్‌పి బ్యానర్‌పై పవన్ కుమార్ కొత్తూరి ఈ చిత్రాన్ని నిర్మించారు.

ప్రస్తుతం ఉన్న కూల్ వెదర్‌కు తగ్గట్టుగా, మనసుకు హత్తుకునేలా, హాయినిచ్చేలా సాగే ఓ మెలోడీ పాటను మేకర్స్ రిలీజ్ చేశారు. 'సారా సారా..' అంటూ సాగే ఈ పాటను శివకృష్ణచారి ఎర్రోజు రచించగా, పద్మలత, అనుదీప్ దేవ్ ఆలపించారు. కార్తిక్ బి కొడకండ్ల ఇచ్చిన బాణీ ఎంతో వినసొంపుగా ఉంది. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రంలో స్నేహా మాలవ్య, సాహిబా భాసిన్, వివియా సంత్ హీరోయిన్లుగా నటించారు.



పవన్‌కుమార్, స్నేహ మాలవ్య

సింగరో సింగ..

శ్రీవిష్ణు, హసిత్ గోలీ కాంబినేషన్‌లో వచ్చిన ఫస్ట్ మూవీ 'రాజ రాజ చోర'తో బ్లాక్‌బస్టర్ హిట్ ఇచ్చారు. సైడ్- స్ప్లిట్టింగ్ ఎంటర్టైనర్ 'శ్వాగ్' కోసం ఈ కాంబినేషన్ మరోమారు పని చేస్తోంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

వివేక్ సాగర్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందించారు. మేకర్స్ ఫస్ట్ సింగిల్ 'సింగరో సింగ'ను విడుదల చేయడం ద్వారా మ్యూజిక్ ఫెస్ట్‌ని ప్రారంభించారు. సోషల్ మీడియా సెన్సేషన్ అయిన సింగరేణి అకా సింగగా శ్రీ విష్ణు పాత్రను పరిచయం చేశారు.



శ్రీ విష్ణు

వివేక్ సాగర్ ఎక్స్‌ట్రార్డినరీ కంపోజిషన్, నిక్లేష్ సుంకోజీ ఆకట్టుకునే లిరిక్స్, బాబా సెహగల్, వైకోమ్ విజయలక్ష్మి ఎనర్జిటిక్ వోకల్స్ పాటని ఇన్‌స్టంట్‌గా నచ్చేలా చేస్తుంది. ఈ పాటలో శ్రీవిష్ణు డిఫరెంట్ ఎక్స్‌ప్రెషన్స్ ఎంటర్ టైనింగ్‌గా ఉన్నాయి. ఇందులో విజువల్స్ అలరిస్తున్నాయి. హీరో పాత్రను పరిచయం చేయడంలో దర్శకుడు హసిత్ గోలీ క్రియేటివ్ ఐడియాని ఈ పాట అద్భుతంగా చూపిస్తుంది.

వింజమర వంశంలో క్వీన్ రుక్మిణి దేవిగా రీతూ వర్మ నటిస్తున్నారు. వేదరామన్ శంకరన్ డీవోపీ కాగా, విప్లవ్ నైషధం ఎడిటర్. జీఎం శేఖర్ ఆర్ట్ డిపార్ట్‌మెంట్‌ను నిర్వహిస్తుండగా, నందు మాస్టర్ స్టంట్స్‌ను పర్యవేక్షిస్తున్నారు. వివేక్ కూచిభొట్ల సహ నిర్మాత.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.



25 వరకు రాయల మృతికి సంతాపసభలు

- సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

నవతెలంగాణ-ఖమ్మం

సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ కేంద్ర కంట్రోల్ కమిషన్ చైర్మెన్ రాయల చంద్రశేఖర్ ఆకాల మృతికి రాష్ట్ర వ్యాప్తంగా ఆయా జిల్లాల్లో ఈనెల 19 నుంచి 25 వరకు సంతాప సభలు నిర్వహించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మంలో ఈనెల 28న రాయల సంస్మరణ సభ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సంస్మరణ సభకు ఆలిండియా లీడర్ ప్రదీప్ సింగ్ ఠాకూర్ హాజరవుతారని చెప్పారు. రాయల ఆవేశానికి గురై ఆత్మహత్యకు పాల్పడి, రాజకీయ చరిత్రకు నష్టం కలిగిందన్నారు. కమ్యూనిస్టులెవరూ అలాంటి చావులు కోరుకోరన్నారు. ఐదు దశాబ్దాల రాయల ఉద్యమ జీవితం గొప్పదని కొనియాడారు. ఆదివాసీలు అణచివేతపై, ప్రజా సమస్యలపై ఎన్నో పోరాటాలు చేసి నిర్బంధాలు, జైలు జీవితాన్ని చిరునవ్వుతో ఎదుర్కొన్న రాయల.. ఆత్మహత్యకు పాల్పడటం బాధాకరమన్నారు. లక్ష రుణమాఫీ కొందరి రైతుల ఖాతాలో జమ కాలేదని, వాటిని రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించాలన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ వాయిదాలు లేకుండా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కౌలు రైతుల పంట రుణాలను రద్దు చేయాలని రాష్ట్రప్రభుత్వాన్ని కోరారు. అలాగే, కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన సంక్షేమ పథకాలను అమలు చేయాలని తెలిపారు. ప్రజా సమస్యలపై ఆగస్టు 1న మండల తహసీల్దార్ కార్యాలయాల ఎదుట, 8న జిల్లా కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆగస్టు 21న నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఆపార్టీ నాయకులు గోకినేపల్లి వెంకటేశ్వర్లు, గుర్రం అచ్చయ్య, ఆవుల వెంకటేశ్వర్లు, ఆవుల అశోక్, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన ధరలకనుగుణంగా స్కాలర్‌షిప్ చెల్లించాలి

- సుభాష్‌నగర్ ఎస్సీ గర్ల్స్ హాస్టల్‌కు నూతన భవనాలు ఏర్పాటు చేయాలి : ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి



నవతెలంగాణ - కరీంనగర్

పెరిగిన ధరలకనుగుణంగా స్కాలర్‌షిప్ పెంచాలని, కనీసం నెలకు రూ.500 ఇవ్వాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకూ పెరిగిపోతున్నా సంక్షేమ హాస్టల్లో చదువుతున్న విద్యార్థులకు మాత్రం మెస్ చార్జీలను పెంచడం లేదని అన్నారు. ఐద్వా, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్ ఎస్సీ గర్ల్స్ హాస్టల్ హాస్టల్‌ను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ.. గర్ల్ హాస్టళ్లకు ఎంబీబీఎస్ డాక్టర్లను కేటాయించాలని కోరారు. మహిళల్లో రక్తహీనత పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సంక్షేమ హాస్టల్లో చదువుతున్న విద్యార్థినులకు నాణ్యమైన భోజనం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సుభాష్ నగర్ హాస్టల్‌కి నూతన భవనాలను నిర్మించాలని డిమాండ్ చేశారు.

వర్షం వస్తే కురిసే పరిస్థితి ఉందని తెలిపారు. వాటర్ ప్లాంట్, మరుగుదొడ్లు నిర్మించాలన్నారు. విద్యార్థుల పెండింగ్ స్టయిఫండ్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహా కార్యదర్శి అసంపల్లి వినయ్, ఐద్వా జిల్లా కార్యదర్శి నాగమణి, రోజ, అన్నపూర్ణ పాల్గొన్నారు.

అభ్యుదయ రచయిత అడిగోపుల కన్నుమూత



తిరుపతి : ఐదు దశాబ్దాలకుపైగా సాహితీ రంగంలో రాణిస్తున్న ప్రముఖ కవి అడిగోపుల వెంకటరత్నం(79) శుక్రవారం తిరుపతిలోని తన స్వగృహంలో కన్నుమూశారు. కొంతకాలంగా వృద్ధాప్య సంబంధిత సమస్యలతో ఆయన బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య పద్మజ. పిల్లలు మాధవి, శ్రీకాంత్, శాంతి ఉన్నారు. నెల్లూరు జిల్లా కొడవలూరు మండలం కొత్త వంగళ్లలో జన్మించిన ఆయన నెల్లూరు జిల్లా గండవరం ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించారు. నాగార్జున విశ్వవిద్యాలయంలో, కావలిలోని జవహర్ భారతిలో కళాశాల విద్య పూర్తి చేశారు. తిరుపతి, చెన్నై ప్రాంతంలో ఇంజనీరింగ్ చదివారు. సివిల్ ఇంజనీర్‌గా రిటైరయ్యారు. ఆయన వెలువరించిన 28 పుస్తకాల్లో 27 కవితా సంపుటాలు, ఒక కథా సంపుటి ఉన్నాయి. ప్రతి సామాజిక సందర్భాన్ని, సంక్షోభాన్ని తన కవిత్వంలో రికార్డు చేస్తూ వచ్చారు. కుందుర్తి, శ్రీశ్రీ, తానా, కరుణశ్రీ, వాసిరెడ్డి, సుంకర, సాహితీరత్న, ప్రతిభా పురస్కారాలను అందుకున్నారు. ఆయన అంత్యక్రియలు స్వగ్రామమైన కొత్త వంగళ్లలో ఆదివారం నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

నాగార్జునసాగర్ ఎడమ కాలువకు నీటి విడుదల

- పాలేరు రిజర్వాయర్ పరిధిలోని ప్రజలకు తాగునీటికి 500 క్యూసెక్కులు



నవతెలంగాణ-పెద్దవూర

ఖమ్మం జిల్లా పాలేరు రిజర్వాయర్ పరిధిలోని ఆయా గ్రామాల ప్రజలకు తాగునీటి అవసరాల కోసం నాగార్జునసాగర్ ఎడమ కాలువ నుంచి నీటిని విడుదల చేశారు. నల్లగొండ జిల్లా పెద్దవూర మండలంలోని పొట్టిచెలిమ సమీపంలోని బెట్టేలతండా వద్ద ఎడమ ఎర్తు రెగ్యులేటర్ సాగర్ ఎడమ కాలువకు శుక్ర వారం ఎన్ఎస్పీ డీఈ గోపినాథ్, ఏఈ క్రిష్ణయ్య 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. నీటి పారుదల శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 500 క్యూసెక్కుల నీటి ఒక గేటు ద్వారా విడుదల చేశారు. క్రమక్రమంగా పెంచుకుంటూ 3వేల క్యూసెకుల మేరకు నీటి విడుదల నాలుగు రోజుల పాటు కొనసాగించనున్నారు. ఎడమ కాలువకు తాగునీటి అవసరాల కోసం 1.5 టీఎంసీల మేరకు నీటిని విడుదల చేయనున్నారు. తాగునీటి అవసరాల కోసం మాత్రమే ఈ నీటిని ఉపయో గించుకోవాలని, మేజర్లకు ఎలాంటి నీటి విడుదల ఉండదని అధికారుల స్పష్టం చేశారు. నాగార్జున సాగర్ జలాశయం మొత్తం నీటి మట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం 505.10 అడుగులుగా ఉంది. మొత్తం నీటి నిల్వ సామర్థ్యం 312.50 టీఎంసీలు ఉండగా ప్రస్తుతం 123.50 టీఎంసీలుగా ఉంది. నాగార్జునసాగర్ జలాశయానికి ఎలాంటి ఇన్‌ఫ్లో లేదు జలాశయం నుంచి హైదరాబాద్‌కు తాగు నీటి అవసరాల కోసం ఎస్ఎల్బీసీ ద్వారా 800 క్యూసెక్కుల నీరు, కుడి కాలువకు 5,700 క్యూసెక్కుల నీరు, సాగర్ ఎడమ కాల్వకు 500 క్యూసెక్కుల నీరు విడుదల కొనసాగుతోంది. మొత్తం 7 వేల క్యూసెక్కుల నీరు కుడి, ఎడమ కాలువ, ఎస్ఎల్బీసీ ద్వారా విడుదల చేస్తున్నారు.

'గూడ్స్'కి గ్రీన్.. 'ప్యాసింజర్'కు రెడ్

- గిరిజనులు వినియోగించుకునే కారేపల్లి రైల్వే జంక్షన్‌పై చిన్నచూపు
- ఆదాయం తప్ప ప్రయాణికుల సౌకర్యం పట్టని రైల్వేశాఖ
- కరోనా తర్వాత రద్దయిన రైళ్లను పునరుద్ధరించని కేంద్రం
- రాష్ట్రంలో అతిచిన్న జంక్షనైనా బొగ్గు, డోలమైట్ రవాణాతో ఆదాయంలో ఫస్ట్

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలోనే గిరిజనులు ఎక్కువగా వినియోగించుకునే కారేపల్లి రైల్వే జంక్షన్‌పై కేంద్రం నిర్లక్ష్యం వహిస్తోంది. బొగ్గు, డోలమైట్ వంటి ఖనిజాలను ఇక్కడి నుంచి తరలిస్తూ రాష్ట్రంలోనే అధిక ఆదాయం ఈ జంక్షన్ నుంచి రైల్వేశాఖ గడిస్తోంది. కాబట్టి గూడ్స్ బండ్లకు పచ్చజెండా ఊపుతూ.. ప్రయాణికుల సౌకర్యార్థం నడిచే ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల విషయంలో మాత్రం రెడ్ సిగ్నల్ చూపుతోంది.



గిరిజనుల చదువు.. వైద్యానికి ఇబ్బందులు

కోవిడ్-19 సమయంలో దేశవ్యాప్తంగా రైళ్లను రద్దు చేసిన కేంద్రం.. ఆ తర్వాత అన్నింటినీ పునరుద్ధరించింది. కానీ కారేపల్లి జంక్షన్ మీదుగా వెళ్లే ప్రయాణికుల రైళ్లను మాత్రం వదిలేసింది. ఫలితంగా ఇక్కడి నుంచి నిత్యం హైదరాబాద్, విజయవాడ, వరంగల్, తిరుపతి, భద్రాచలం వంటి ప్రాంతాలకు వెళ్లే గిరిజనులకు అసౌకర్యం ఏర్పడింది. క్యాన్సర్, గుండెజబ్బులు, ఇతరత్రా వ్యాధులతో బాధపడే అనేక మంది ఇక్కడి నుంచి హైదరాబాద్ వెళ్లి వైద్య సేవలు పొందుతారు. ముఖ్యంగా గిరిజనులు హైదరాబాద్ నిమ్స్, వరంగల్ మహాత్మాగాంధీ ఆస్పత్రులకు వెళ్లి వైద్యం తీసుకుంటారు. వేలాది మంది గిరిజన విద్యార్థులు మహబూబాబాద్, డోర్నకల్, మణుగూరు, కొత్తగూడెం తదితర ప్రాంతాలకు వెళ్లి చదువుకునేవారు. రైళ్ల రద్దవడంతో విద్యార్థులు వ్యయ ప్రయాసలకు ఓర్చి ఖమ్మం, హైదరాబాద్, వరంగల్‌లో ఉంటూ చదువుకుంటున్నారు. రైలులో రూ.200తో హైదరాబాద్ వెళ్లి వచ్చే గిరిజనులు ఇప్పుడు రూ.1200కు పైగా ఖర్చు పెట్టాల్సి వస్తోంది. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే అనేకమంది నెలకు రెండు, మూడుసార్లు చెకప్ కోసం హైదరాబాద్ ఆస్పత్రులకు వెళ్లాల్సి ఉంటుంది. రైళ్లను పునరుద్ధరించకపోవడంతో అటువంటి వారి బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి.

భక్తులకూ ఇక్కట్లు..

దక్షిణ అయోధ్యగా పేరొందిన భద్రాచలం పుణ్యక్షేత్రం నుంచి ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తిరుమల తిరుపతి శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనానికి గిరిజనులు ఈ జంక్షన్ మీదుగా రైళ్లలో రాకపోకలు సాగించేవారు. గతంలో భద్రాద్రి ఎక్స్‌ప్రెస్ పేరుతో భద్రాచలం రోడ్-తిరుపతి, తిరుపతి- భద్రాచలం రోడ్ స్టేషన్ల మధ్య ప్రతిరోజూ రైళ్లు నడిచేవి. ఇప్పుడు వాటిని పునరుద్ధరించాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం ఉన్నా స్టేట్ బార్డర్ దాటితే బస్సు టిక్కెట్ భారీగా ఉంటున్న దృష్ట్యా రైళ్లను తిరిగి ఏర్పాటు చేయాలని మహిళలు కోరుతున్నారు. రైల్వేజంక్షన్ల సౌకర్యాలు, రైళ్ల పునరుద్ధరణ కోసం స్థానికులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. 'మా జంక్షన్ మా మ్యానిఫెస్టో' పేరుతో సామాజిక కార్యకర్తలు నిరసన చేపడుతున్నారు.

పేరు మార్పు మొదలు అన్నింటా నిర్లక్ష్యం...

కారేపల్లి రైల్వే జంక్షన్ పేరును సింగరేణి రైల్వే జంక్షన్‌గా మార్చాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. ఈ జంక్షన్ మీదుగా దేశంలోని వివిధ ప్రాంతాలకు బొగ్గు అధికంగా రవాణా అవుతోంది. రోజుకు 40-50 గూడ్స్ రైళ్లు ఇక్కడి నుంచి బొగ్గు రవాణా చేస్తుంటాయి. వారానికి మూడు గూడ్స్‌బండ్లలో డోలమైట్‌ను విశాఖ స్టీల్ ప్లాంట్‌కు తరలిస్తుంటారు. చుట్టూ సింగరేణి గనులు ఉండటం, బొగ్గు ఉత్పత్తి ఇక్కడి నుంచే ప్రారంభమవడం తదితర కారణాల రీత్యా జంక్షన్ పేరును కారేపల్లి బదులు సింగరేణిగా మార్చాలనే డిమాండ్ ఊపందుకుంది.

పునరుద్ధరించాల్సినవి రైళ్లు, సౌకర్యాలు ఇవే..

మణుగూరు-కాజీపేట, ఖాజీపేట-మణుగూరు మధ్య నడిచే ప్యాసింజర్ రైలును పునరుద్ధరించాలి. డోర్నకల్ జంక్షన్-భద్రాచలం రోడ్, భద్రాచలం రోడ్- డోర్నకల్ జంక్షన్, విజయవాడ జంక్షన్- భద్రాచలం రోడ్, భద్రాచలం రోడ్- విజయవాడ జంక్షన్ ప్యాసింజర్ రైళ్లను కూడా తిరిగి నడపాలి. ఇల్లెందు- కారేపల్లి జంక్షన్, కారేపల్లి జంక్షన్-ఇల్లెందు ప్యాసింజర్‌నూ పునరుద్ధరించాల్సిన అవసరం ఉంది. భద్రాచలం రోడ్డు-సికింద్రాబాద్ మధ్య ప్రతిరోజూ పగలు సమయంలో ఎక్స్‌ప్రెస్ రైలు నడపాలని స్థానికులు కోరుతున్నారు. కారేపల్లి జంక్షన్ నుంచి భద్రాచలం రోడ్ మధ్య నడిచే ప్రతి ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను భద్రాచలం రోడ్- డోర్నకల్ జంక్షన్ మధ్యలోని బేతంపూడి, తడికలపూడి, చీమలపాడు, గాంధీపురం, కారేపల్లి జంక్షన్, గేటుకారేపల్లి, పోచారం స్టేషన్లలో ఆపాలనే డిమాండ్ గిరిజనుల నుంచి వినిపిస్తోంది. కరోనా సమయంలో ఈ జంక్షన్‌లో ఉన్న రిజర్వేషన్ కౌంటర్‌ను రద్దు చేశారు. తిరిగి దానిని పునరుద్ధరించకపోవడంతో ఆన్‌లైన్ టిక్కెట్ బుకింగ్ విధానం తెలియని గిరిజనులు రూ.60 ఖర్చుపెట్టుకుని సమీప ప్రాంతాల స్టేషన్‌లకు వెళ్లి రిజర్వేషన్ చేయించుకోవాల్సి వస్తుంది. కాబట్టి రిజర్వేషన్ కౌంటర్‌తో పాటు జంక్షన్‌ను అమృత్ స్టేషన్ పథకంలో చేర్చి రెండో ప్లాట్‌ఫామ్, ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించడంతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

మా జంక్షన్ మా మ్యానిఫెస్టో అమలు చేయాలి.

ఇందుర్తి సురేందర్‌రెడ్డి, సామాజిక కార్యకర్త



కారేపల్లి జంక్షన్ పేరు మార్పు మొదలు కరోనా సమయంలో రద్దయిన అన్ని రైళ్లనూ పునరుద్ధరించాలి. ఈ జంక్షన్ నుంచి గూడ్స్‌ల ద్వారా అధిక ఆదాయం పొందుతూ.. గిరిజనులు ఎక్కువగా ప్రయాణించే ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించకపోవడం అత్యంత దారుణం. దీనిపై మా ఉద్యమాలను మరింత ముందుకు తీసుకెళ్తాం.

రైళ్ల పునరుద్ధరించేలా కృషి చేస్తాను..



కారేపల్లి జంక్షన్‌కు సంబంధించిన రైళ్లను పునరుద్ధరించేలా చూస్తాను. కొత్తగూడెంలో మొన్న విద్యార్థులు రైలు సౌకర్యం లేకపోవడంపై వినతిపత్రం ఇచ్చారు. ఆ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాను. కారేపల్లి జంక్షన్ సమస్యనూ పరిష్కరిస్తాం.

- రామసహాయం రఘురాంరెడ్డి, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు

రాష్ట్రపతి పాలన విధించండి

- రాష్ట్రంలో అదుపుతప్పిన శాంతిభద్రతలు
- అరాచకాలు, దాడులపై 24న ఢిల్లీలో ధర్నా : జగన్
- వినుకొండలో హత్యకు గురైన కార్యకర్త కుటుంబానికి పరామర్శ



అమరావతి : రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ లేదని, ఆటవిక పాలన సాగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పల్నాడు జిల్లా వినుకొండలో రెండు రోజుల క్రితం దారుణంగా హత్యకు గురైన వైసిపి కార్యకర్త షేక్ రషీద్ కుటుంబ సభ్యులను శుక్రవారం సాయంత్రం ఆయన పరామర్శించారు. అనంతరం జగన్ మీడియాతో మాట్లాడుతూ ఇష్టారాజ్యంగా హత్యలు చేస్తున్నారని, ఆస్తులు ధ్వంసం చేస్తున్నారని, పోలీసులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో పేదలు, వైసిపి కార్యకర్తలపై జరుగుతున్న దాడులకు నిరసనగా వచ్చే బుధవారం ఢిల్లీలో ధర్నా చేస్తానని ప్రకటించారు. త్వరలో ప్రధాని మోడీని, రాష్ట్రపతిని కలిసి రాష్ట్రంలో పరిస్థితులను వివరిస్తామని తెలిపారు. రాష్ట్రంలో గత 45 రోజుల కాలంలో 490 చోట్ల ప్రభుత్వ ఆస్తులు, 560 చోట్ల ప్రయివేటు ఆస్తులను ధ్వంసం చేశారని, వెయ్యికిపైగా దౌర్జన్యాలు, దాడులు జరిగాయని ఆరోపించారు. 36 హత్యలు జరిగాయని, టిడిపి నేతల వేధింపులకు 35 మంది సామాన్యులు ఆత్మహత్య చేసుకున్నారని, 300కి పైగా హత్యా ప్రయత్నాలు జరిగాయని వివరించారు. అయినా, పోలీసులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారని, నిందితులపై కాకుండా బాధితులపై కేసులు దుతున్నారని తెలిపారు. వినుకొండలో ఒక సామాన్య కార్యకర్త రషీద్‌ను అతి కిరాతకంగా నడిరోడ్డుపై ప్రజల సమక్షంలో హత్య చేస్తే ఇది వ్యక్తిగత కక్షలకు సంబంధించిన ఘటన అని పోలీసు అధికారులు, టిడిపి నాయకులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న ఘటనలను దేశ వ్యాప్తంగా అన్ని పార్టీల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ఈ నెల 24న జరిగే ధర్నాలో వైసిపికి చెందిన ప్రజా ప్రతినిధులంతా పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రపతి, ప్రధాని, హోంమంత్రి అపాయింట్‌మెంట్ కోరతామని, వారికి రాష్ట్రంలో పరిస్థితులు వివరిస్తామని చెప్పారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలపై చంద్రబాబు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ప్రజలకు మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఇంత వరకు ఏ ఒక్క పథకం అమలు చేయలేదని విమర్శించారు.

కాన్వాయ్‌లో వాహనాలకు ఆంక్షలు

జగన్ ప్రయాణిస్తున్న కాన్వాయ్‌లోకి ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులకు చెందిన వాహనాలు అనుసరించాలని ప్రయత్నించగా నరసరావుపేట వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ప్రజా ప్రతినిధులుంటేనే వాహనం అనుమతిస్తామని, వారు లేకుండా ఇతరులతో వెళ్లే వాహనాలను కాన్వాయ్‌లో అనుమతించబోమని అధికారులు పలుచోట్ల నిలిపివేశారు. దీనిపై వైసిపి నాయకులు మండిపడ్డారు.

బుల్లెట్ ప్రూఫ్ వాహనం దిగిన జగన్

రిపేర్‌లో వున్నది ఇచ్చారన్న వైసిపి... కండీషన్‌లోనే వుందన్న ప్రభుత్వం

జగన్ వినుకొండ పర్యటనకు వెళుతూ మంగళగిరి సమీపంలో ప్రభుత్వం సమకూర్చిన బుల్లెట్ ప్రూఫ్ వాహనం దిగి మరో వాహనంలోకి మారడం చర్చనీయాంశమైంది. జగన్‌కు రాష్ట్ర ప్రభుత్వం భద్రతను తగ్గించడంతోపాటు వినుకొండ వెళ్లే వరకు కాన్వాయ్ వెంట వున్న నాయకుల వాహనాలను నిలిపేయడం ఏమిటని వైసిపి శ్రేణులు ప్రశ్నించాయి. రిపేర్‌లో ఉన్న పాత బుల్లెట్ ప్రూఫ్ వాహనం ఇవ్వడంతో మార్గంలో పలుమార్లు వాహనం మొరాయించిందని, అందుకే మారారని వైసిపి శ్రేణులు చెబుతుండగా, బుల్లెట్ ప్రూఫ్ వాహనం కండీషన్‌లో లేకుంటే జగన్ కాన్వాయ్‌లో వినుకొండ వరకు ఆ వాహనం ఎలా వెళ్తుందని ప్రభుత్వ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. ఫిట్‌నెస్‌తో ఉందని కండిషన్ చూసిన తర్వాతే విఐపికి కేటాయించామని అధికారులు చెబుతున్నారు. జగన్ వెంట వచ్చిన వాహనాలు నిలిపేశారనే ప్రచారాన్ని కొట్టిపారేశారు. ర్యాలీలు, సభలకు అనుమతి లేదని, జగన్ వెళ్లే పరామర్శ కార్యక్రమానికి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకున్నామని అధికారులు తెలిపారు. నిబంధనల ప్రకారం వైఎస్ జగన్‌కు భద్రత కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

యూపీ బీజేపీలో ముసలం

- యోగి సర్కార్‌పై అఖిలేశ్ వ్యంగ్యాస్త్రాలు

లక్నో : ఉత్తరప్రదేశ్‌లో అధికార బిజెపిలో ముసలం నెలకొంది. పార్టీలో చీలికలు ఖాయమంటూ స్థానిక మీడియాలో కథనాలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వంపై మాజీ ముఖ్యమంత్రి, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. సామాజిక మాధ్యమాల్లో ఆయన చేసిన పోస్టు ఆసక్తి రేపుతోంది. 'వర్షాకాల బొనాంజా..వంద మందిని తీసుకురండి..కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేయండి' అంటూ ఆయన పోస్టు పెట్టారు. 2022 మధ్యలోనూ ఉపముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్యను ఉద్దేశించి అఖిలేశ్ దాదాపు ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. 'ముఖ్యమంత్రి కావాలన్నది కేశవ్ కల. ఆయన 100 మందిని తెస్తే ఆయనకు మా పార్టీ మద్దతిస్తుంది' అని అప్పట్లో అఖిలేష్ పోస్టు చేశారు. ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో యుపిలో బిజెపి ఘోర పరాభవాన్ని చవిచూసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో 'ఓటమికి మీరంటే మీరే కారణం' అంటూ అధికార పార్టీలో చిచ్చు రేగుతోంది.

పెద్దవాగు ఖాళీ

సామర్థ్యానికి మించి నీటి చేరికతో గండి

- మొరాయించిన గేటు
- పొలాల్లో ఇసుక మేట





నవతెలంగాణ-అశ్వారావుపేట

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. దీంతో అశ్వారావుపేటలోనే అత్యధిక వర్షపాతం నమోదైంది. ఈ క్రమంలో మండలంలోని గుమ్మడిపల్లి వద్దనున్న పెద్దవాగు ప్రాజెక్ట్‌కు గురువారం పెద్ద ఎత్తున వరద నీరొచ్చి చేరింది. ప్రాజెక్టు పూర్తి స్థాయి సామర్థ్యం 40 వేల క్యూసెక్కులు కాగా 80 వేల క్యూసెక్కులు నీరు వచ్చి చేరడంతో కట్టపై నుంచి నీరు ఉప్పొంగి మీటర్ ఎత్తున పారింది. దాంతో ప్రాజెక్టుకు ఉన్న మూడు గేట్లను ఎత్తే ప్రయత్నం చేయగా ఒక గేటు మొరాయించడంతో రెండింటినీ పూర్తిగా ఎత్తారు. నీరు మొత్తం రెండు గేట్ల నుంచి దిగువకు వెళ్లింది. గురువారం రాత్రి 7.30 గంటల సమయంలో కట్టకు పెద్ద బొంగలు పడి కొట్టుకుపోయింది. దాంతో ప్రాజెక్టు పరిధిలోని గ్రామస్తులను అప్రమత్తం చేశారు. ఈ ప్రాజెక్ట్ దిగువన ఉన్న తెలంగాణలోని రెండు, ఆంధ్రాలోని ఐదు గ్రామాల పరిధిలో వ్యవసాయ భూముల్లో ఇసుక మేటలు ఏర్పడ్డాయి. ప్రాజెక్టు నుంచి నీరు పూర్తిగా వెళ్లిపోయింది. వందల సంఖ్యలో పశువులు కొట్టుకుపోయాయి.

అధికారులు తెలిపిన ప్రకారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1980లో 16 వేల ఎకరాలకు రెండు కాలువలు ద్వారా సాగునీరు అందించేందుకు 20 అడుగుల సామర్థ్యంతో ఈ ప్రాజెక్ట్‌ను నిర్మించారు. అయితే 1989లో మొదటి సారి ఈ ప్రాజెక్టుకు ప్రమాదం ఏర్పడింది. ఇది రెండో సారి కావడం గమనార్హం. 2014లో ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు కావడంతో ఈ ప్రాజెక్ట్ రెండు రాష్ట్రాల ఉమ్మడి సొత్తుగా మారింది. దీని సాగు విస్తీర్ణం 16 వేల ఎకరాల్లో తెలంగాణలోని రెండు గ్రామాల పరిధిలో 2360 ఎకరాలుండగా, అత్యధికంగా 13,640 ఎకరాలు ఆంధ్రాలోని ఏలూరు జిల్లా వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లోని ఐదు గ్రామాల్లోకి వెళ్లింది. నాటి అరకొర నిధులు, అడపాదడపా మరమ్మతులు చేపట్టడంతో గేట్లు శిథిలమయ్యాయి. ఈ క్రమంలో గురువారం ఒక గేటు మొరాయించింది. దీనికి తోడు సిబ్బంది కొరత కారణమనీ తెలుస్తోంది. ఈ కారణంగా 40 వేల క్యూసెక్కుల నీటి సామర్థ్యం కలిగిన ఈ ప్రాజెక్ట్‌కు 80 వేల క్యూసెక్కుల వరద చేరడంతో కట్ట తెగిపోయింది.

శంషాబాద్ విమానాశ్రయంలో ప్రయాణికుల ఆందోళన



హైదరాబాద్: విండోస్‌లో ఏర్పడిన సాంకేతిక సమస్య కారణంగా పలు విమాన సర్వీసులు నిలిచిపోయాయి. దీంతో శంషాబాద్ విమానాశ్రయం నుంచి వెళ్లాల్సిన పలు విమానాలు రద్దు చేయడంతో డొమెస్టిక్ ప్రయాణికులు ఆందోళనకు దిగారు. హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన ఇండిగో విమానాలు రద్దవడంతో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ప్రయాణికులు పడిగాపులు కాస్తున్నారు. ముఖ్యంగా బెంగళూరు, ఢిల్లీ, చెన్నై, గోవా, విశాఖ, లఖ్‌నవూ, కోల్‌కతా, ముంబయి, కొచ్చి వెళ్లాల్సిన విమాన సర్వీసులు ఆగిపోవడంతో దాదాపు 10 గంటల నుంచి విమానాశ్రయంలోనే ప్రయాణికులు వేచి ఉన్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదని ఎయిర్‌లైన్ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. మరో వైపు విమానాశ్రయం ప్రయాణికులతో కిటకిటలాడుతోంది.

ఎన్ఐఐటి ఫౌండేషన్, ఏంజెల్ వన్ స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా యువతకు సాధికారత

నవతెలంగాణ - హైదరాబాద్

యువత తాము కోరుకున్న ఉద్యోగాలను కనుగొనడంలో నిరంతర సవాళ్లను ఎదుర్కొంటూనే ఉన్నారు. బిజినెస్ ప్రాసెస్ అవుట్‌సోర్సింగ్ (బిపిఓ) మరియు బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ మరియు ఇన్సూరెన్స్ (బిఎఫ్ఎస్ఐ), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) వంటి ముఖ్యమైన పరిశ్రమల పెరుగుదల ఉన్నప్పటికీ, దేశంలోని చాలా మంది తాము కోరుకున్న ఉద్యోగాలను సాధించడానికి కష్టపడుతున్నారు. ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ విడుదల చేసిన తాజా ఇండియా ఎంప్లాయ్‌మెంట్ రిపోర్ట్ 2024 వెల్లడించిన దాని ప్రకారం, ఉద్యోగార్థులు ఉద్యోగాలను కనుగొనడంలో అతిపెద్ద అవరోధాలుగా వారి విద్య, నైపుణ్యాలు లేదా అనుభవానికి సరిపోయే ఉద్యోగాలు అందుబాటులో లేకపోవడమే (35%). అదే సమయంలో, తగిన కమ్యూనికేషన్ నైపుణ్యాలు లేకపోవడాన్ని కూడా నివేదిక హైలైట్ చేసింది. 2022లో ప్రారంభించబడిన ఈ సహకార కార్యక్రమం బిఎఫ్ఎస్ఐ మరియు బిపిఓ విభాగాలపై దృష్టి సారించిన 18 మరియు 28 సంవత్సరాల మధ్య వయస్సు గల విద్యార్థులకు ఉచితంగా ఆన్‌లైన్ కోర్సులను అందిస్తుంది. ఈ కోర్సుకు పురుషులతో పోలిస్తే 58% మంది మహిళలు వీటికి నమోదు చేసుకున్నారు. అదే సమయంలో, మొత్తం అభ్యర్థులలో 71% మంది (3,474 మంది లబ్ధిదారులు) సుప్రసిద్ధ సంస్థల్లో విజయవంతంగా ప్లేస్‌మెంట్ పొందారు.

ఆదర్శ పాఠశాలలను ఆదుకోవాలి

- ప్రభుత్వానికి ఎంఎస్‌టీఎఫ్ విజ్ఞప్తి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ఆదర్శ పాఠశాలలను ఆదుకోవాలని మోడల్ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ (ఎంఎస్‌టీఎఫ్) విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి కొండయ్య శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో మోడల్ స్కూళ్ల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని ఆందోళన వ్యక్తం చేశారు. 11 ఏండ్లుగా బదిలీల్లేక ఉపాధ్యాయులు నానా ఇబ్బందులు అనుభవిస్తున్నారని తెలిపారు. వేతనాలు సకాలంలో అందక సతమతమవుతున్నామని పేర్కొన్నారు. వెయ్యి మంది ఉపాధ్యాయులకు గతనెల వేతనాలు అందలేదని వివరించారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకూ (కోర్టుకు వెళ్లిన వారిని మినహాయించి) బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించడం లేదని తెలిపారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు కింద వేతనాలు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

మోడల్ స్కూల్ టీచర్ల సమస్యలను పరిష్కరించండి

- డిప్యూటీ సీఎం భట్టికి టీఎంఎస్టీఏ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ మోడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (టీఎంఎస్టీఏ) ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను శుక్రవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూతం యాకమల్లు, సహ అధ్యక్షులు ఆంజనేయులు స్వామి, టీపీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షులు హర్షవర్ధన్‌రెడ్డి కలిసి వినతిపత్రం సమర్పించారు. 11 ఏండ్లుగా బదిలీల్లేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. తీర్పు వచ్చే విధంగా చొరవ తీసుకుని బదిలీలు చేయాలని కోరారు. ఎనిమిది జిల్లాల్లో మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు ఇంకా జీతాలు రాలేదని పేర్కొన్నారు. 010 పద్దు కింద జీతాలు ఒకటో తేదీన చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

సివిల్స్ అభ్యర్థులకు ఉచిత హాస్టల్ వసతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సివిల్స్ కోచింగ్ తీసుకునే అభ్యర్థులకు ఉచిత హాస్టల్ వసతి కల్పిస్తున్నట్టు రిఫ్లెక్షన్ ఐఏఎస్ అకాడమి ప్రకటించింది. ఇందుకు సంబంధించి శుక్రవారం హైదరాబాద్‌లో మాజీ ఐఏఎస్ అధికారి జయప్రకాశ్ నారాయణ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఏటా యూపీఎస్సీ నిర్వహించే సివిల్స్ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఉచిత హాస్టల్ వసతి కల్పిస్తున్నామని రిఫ్లెక్షన్ ఐఏఎస్ అకాడమి ఫౌండర్, చీఫ్ మెంటార్ జి.వివేకానంద, డైరెక్టర్ రమణ తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన అభ్యర్థు లకు వసతి ఖర్చులు భారం కాకూడదనే సామాజిక బాధ్యతతో సేవలంది స్తున్నామని వివరించారు. శ్రీకాకతీయ ఎడ్యుకేషనల్ అకాడమి సహకారంతో 90 మంది అభ్యర్థులకు ఉచిత హాస్టల్ వసతి కల్పిస్తున్నామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9866074047 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

బిజినెస్

బ్యాంకింగ్‌లోకి కార్పొరేట్లను అనుమతించం

దేశానికి మరిన్ని అవసరం లేదు : ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్

ముంబయి : కార్పొరేట్లు, వ్యాపారస్తులను బ్యాంకింగ్ రంగంలోకి అనుమతించే యోచన లేదని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. శుక్రవారం ముంబయిలో ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్ నిర్వహించిన ఓ సమావేశంలో శక్తికాంత మాట్లాడుతూ.. ప్రస్తుతం బ్యాంకులను ప్రోత్సహించేందుకు వ్యాపార సంస్థలను అనుమతించే ప్రణాళిక రిజర్వ్ బ్యాంక్ వద్ద లేదన్నారు. ఈ రంగంలోకి కార్పొరేట్ సంస్థలను అనుమతించడం వల్ల వడ్డీ రిస్కులు, సంబంధిత పార్టీ లావాదేవీల్లో లోపాలు నెలకొనే అవకాశం ఉందన్నారు.



పదేండ్ల క్రితం పలు సంస్థలు బ్యాంకింగ్ లైసెన్స్‌ల కోసం దరఖాస్తులు చేసుకోగా.. ఆర్‌బీఐ అనుమతులను నిరాకరించింది. ప్రస్తుత సమయంలో కార్పొరేట్లకు బ్యాంకింగ్ లైసెన్స్‌లు ఇచ్చే ఆలోచన లేదని ఓ ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. "బ్యాంకులు ఇతర వ్యాపారాల కంటే భిన్నమైనవి. ఇప్పటివరకు ఉన్న ప్రపంచ అనుభవాల ప్రకారం.. వ్యాపార సంస్థలను అనుమతించినట్లయితే వాటి ఆసక్తులు, లావాదేవీలకు సంబంధించిన సమస్యల సంభావ్య వైరుధ్యాలను ఎదుర్కోవాల్సి వస్తుంది." అని దాస్ అన్నారు.

భారత్‌లో బ్యాంక్‌ల జాతీయీకరణకు ముందు.. 1960 చివరి దశకంలో బ్యాంకింగ్ రంగంలోని వ్యాపార సంస్థలకు అనేక అనుభవాలు ఉన్నాయన్నారు. సంబంధిత సంస్థ లావాదేవీలను పర్యవేక్షించడం లేదా నియంత్రించడం, నిరోధించడం చాలా కష్టమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అనుభవం కూడా ఇదేనన్నారు. ఇందులో ఎక్కువగా నష్టాలు ఉంటాయన్నారు. ఆర్థిక వ్యవస్థ వద్ధి చెందడానికి వనరులు అవసరం.. అయితే ఆ ఆకాంక్షలను సాధించడానికి మరిన్ని బ్యాంకులు అవసరం లేదన్నారు. భారత్‌కు కావలసింది బ్యాంకుల సంఖ్యలో విస్తరణ కాదన్నారు. దేశానికి మంచి బ్యాంకులు, ఆరోగ్యకరమైన బ్యాంకులు, సుపరిపాలన ఉన్న బ్యాంకులు అవసరమన్నారు. విత్త సంస్థలు ప్రస్తుత సాంకేతికత ద్వారా దేశ వ్యాప్తంగా పొదుపులను సమీకరించగలవని, రుణాల అవసరాలను తీర్చగలవని భావిస్తున్నామన్నారు.

మార్కెట్లకు బడ్జెట్ భయాలు

సెన్సెక్స్ 739 పాయింట్ల పతనం

రూ.8 లక్షల కోట్ల సంపద ఆవిరి


ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లలో బడ్జెట్ భయాలు నెలకొన్నాయి. వచ్చేవారం బడ్జెట్ నేపథ్యంలో పరిస్థితులు ప్రతికూలంగా ఉండొచ్చనే అంచనాల్లో ఇన్వెస్టర్లు ముందు జాగ్రత్తగా వారాంతం సెషన్‌లో భారీగా అమ్మకాలకు దిగారు. దీంతో ఒక్క పూటలోనే రూ.8 లక్షల కోట్ల సంపద ఆవిరయ్యింది. కేంద్ర ప్రభుత్వం ఈ నెల 23న బడ్జెట్ ప్రవేశపెట్టనున్న విషయం తెలిసిందే. సూచీలు శుక్రవారం ఉదయం లాభాల్లో ప్రారంభమైనప్పటికీ.. కాసేపట్లోనే క్రమంగా నష్టాల్లోకి జారుకున్నాయి.



అన్ని ప్రధాన సూచీల్లో అమ్మకాల ఒత్తిడి చోటుచేసుకోవడంతో బీఎస్‌ఈ సెన్సెక్స్ 738.81 పాయింట్లు పతనమై 80,604.65కు పడిపోయింది. ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 270 పాయింట్లు కోల్పోయి 24,530 వద్ద ముగిసింది. సెన్సెక్స్-30లో 26 సూచీలు ప్రతికూలతను ఎదుర్కొన్నాయి. ఇన్ఫోసిస్, ఐటీసీ, ఏషియన్ పెయింట్స్, హెచ్‌సీఎల్ టెక్ స్టాక్స్ మాత్రమే లాభపడ్డాయి. బీఎస్‌ఈ మార్కెట్ కాపిటలైజేషన్ రూ.454.4 లక్షల కోట్ల నుంచి రూ.446.4 లక్షల కోట్లకు తగ్గింది. మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు 2.2 శాతం చొప్పున నష్టపోయాయి. నిఫ్టీలో అన్ని రంగాలు ప్రతికూలతను ఎదుర్కొన్నాయి. లోహ సూచీ అధికంగా 4 శాతం నష్టపోగా.. రియాల్టీ 2.66 శాతం, ఆటో 2.4 శాతం చొప్పున విలువ కోల్పోయాయి.

రిలయన్స్‌కు రూ.15,138 కోట్ల లాభాలు

ముంబయి : ముకేష్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ 2024 జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో రూ.15,138కోట్ల నికరలాభాలు నమోదు చేసింది. గతేడాది ఇదే త్రైమాసికం లోని రూ.16,011కోట్ల లాభాలతో పోల్చితే 5శాతం తగ్గుదల చోటు చేసుకుంది. కాగా.. కంపెనీ రెవెన్యూ 12 శాతం పెరిగి రూ.2.36 లక్షల కోట్లకు చేరింది.



గడిచిన జూన్ త్రైమాసికంలో రిలయన్స్ జియో రెవెన్యూ 13 శాతం పెరిగి రూ.29.449 కోట్లకు చేరింది. కంపెనీ నికర లాభాలు 12 శాతం వృద్ధితో రూ.5,698 కోట్లుగా నమోదయ్యాయి. క్రితం మూడు మాసాల్లో కొత్తగా 80 లక్షల మంది వినియోగదారులు చేరారని ఆ సంస్థ తెలిపింది. ప్రతీ వినియోగదారుడి నుంచి సగటు రాబడి రూ.181.7గా నమోదయ్యింది.

ఐసీఐసీఐ లాంబార్డ్ లాభాల్లో 49 శాతం వృద్ధి

ముంబయి : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ లాభాలు 49 శాతం పెరిగి రూ.580 కోట్లకు చేరాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.390 కోట్ల లాభాలు నమోదయ్యాయి. క్రితం క్యూ1లో సంస్థ నికర ప్రీమియం వసూళ్లు 16 శాతం పెరిగి రూ.4504 కోట్లకు చేరాయి.

భూమిత్రతో సర్వేశ్వర్ ఫుడ్స్ భాగస్వామ్యం

హైదరాబాద్ : బాస్మతి, బాస్మతీయేతర బియ్యం, ఇతర ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్ వ్యాపారంలో ఉన్న సర్వేశ్వర్ ఫుడ్స్ లిమిటెడ్ కొత్తగా భూమిత్ర ఓ2సీ టెక్ ఇండియాతో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు తెలిపింది. భూమిత్రాతో పర్యావరణ సుస్థిరత, రైతుల ఆర్థిక సాధికారత పద్ధతులను ప్రోత్సహించడం ఉమ్మడి భాగస్వామ్య లక్ష్యమని తెలిపింది. ఉత్పాదకతను పెంచడం, నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి సర్వేశ్వర్ ఫుడ్స్ లిమిటెడ్‌తో అనుసంధానించబడిన 45,000 ఎకరాల విస్తీర్ణంలో పంట సాగు చేస్తున్న 17,000 పైగా రైతులకు మద్దతును అందించనున్నట్లు పేర్కొంది.

ఎబిక్స్ కోసం

ఎరయా లైఫ్‌స్పేస్ రూ.101 కోట్ల చెల్లింపు

హైదరాబాద్ : ఎబిక్స్ ఇంక్ స్వాధీనం కోసం జులై 16న రూ.101 కోట్లు చెల్లించినట్లు ఎరయా లైఫ్‌స్పేస్ వెల్లడించింది. ఈ ప్రక్రియలో ఇప్పటివరకు రూ.181 కోట్లు ముట్టజెప్పనట్లు తెలిపింది. 2024 జులై ముగింపు నాటికి 293 కోట్లు చెల్లించనున్నట్టు ఎరయా లైఫ్‌స్పేస్ స్పష్టం చేసింది. అమెరికా బ్యాంక్ దివాలా చట్టంలో భాగంగా ఎబిక్స్‌ను బిడ్డింగ్‌లో దక్కించుకుంది. జూన్30తో ముగిసిన త్రైమాసికంలో ఎరయా లైఫ్‌స్పేస్ రూ.0.95 కోట్ల లాభాలు నమోదు చేసింది.

పేటియంకు భారీ నష్టాలు

న్యూఢిల్లీ : డిజిటల్ చెల్లింపుల వేదిక పేటియం మాతృసంస్థ వన్ 97 కమ్యూనికేషన్స్ భారీ నష్టాలు చవి చూసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో సంస్థ నికర నష్టాలు రెట్టింపు పైగా పెరిగి రూ.840 కోట్లకు ఎగిశాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.338 కోట్ల నష్టాలు నమోదు చేసింది. ఇదే సమయంలో కంపెనీ రెవెన్యూ రూ.2,342 కోట్లుగా ఉండగా.. గడిచిన క్యూ1లో 36 శాతం క్షీణించి రూ.1,502 కోట్లకు తగ్గింది. తమ ఆదాయం, నిర్వహణ లాభాలు అంచనాలకు అనుగుణంగానే ఉందని కంపెనీ తెలిపింది. రెండో త్రైమాసికంలో ఇది మరింత మెరుగవుతుందని ఆశాభావం వ్యక్తం చేసింది.

వర్ల్‌పూల్ నుంచి నూతన శ్రేణి రిఫ్రిజిరేటర్లు

న్యూఢిల్లీ : వర్ల్‌పూల్ ఇండియా కొత్తగా ఐస్ మ్యాజిక్ ప్రో గ్లాస్ డోర్ రిఫ్రిజిరేటర్ శ్రేణిని విడుదల చేసినట్లు వెల్లడించింది. నివాసాల్లో మారుతున్న ఆధునికీకరణకు సమకాలీనంగా ఉండటానికి కొత్త ఉత్పత్తులను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపింది. ఇది గోల్డ్ డస్ట్, సిల్వియా, నైట్ బ్లూమ్‌లలో లభిస్తుందని పేర్కొంది. విద్యుత్ కోతల సమయంలోనూ 12 గంటల పాటు పాలను నిల్వ చేయగల సామర్థ్యం వీటికి ఉందని తెలిపింది. ఇవి 192, 207 లీటర్ల సామర్థ్యాల్లో లభిస్తాయని వెల్లడించింది.



రెండు లక్షల రుణమాఫీ ప్రక్రియ ప్రారంభించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే.. భూమి లేక, బతుకుతెరువు కోసం మరొకరి భూమిపై ఆధారపడి సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్న కౌలు రైతుల పట్ల తెలంగాణ ప్రభుత్వం వైఖరేమిటో ఇప్పటివరకు వెల్లడించలేదు. ఎన్నికల హామీలో కౌలు రైతుకూ రూ. 15 వేల పెట్టుబడిని అందిస్తామని కాంగ్రెస్ చెప్పింది. కానీ రుణమాఫీలో కౌలు రైతుల పేరును సీఎం, వ్యవసాయ శాఖ మంత్రి ఎక్కడా ప్రస్తావించలేదు. దాంతో కౌలు రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

రైతు రుణమాఫీ సరే.. కౌలు రైతుల పరిస్థితి ?

రైతు భరోసా ఎప్పుడిస్తరు..?

- ఉమ్మడి మెదక్ జిల్లాలో 50వేల మంది కౌలు రైతులు

నవతెలంగాణ -గజ్వేల్

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 22లక్షల మంది కౌలు రైతులు ఉండగా, వారు సాగుచేసుకుంటున్న భూమి 36 శాతం ఉంది. కాగా, ఉమ్మడి మెదక్ జిల్లాలో 1.50లక్షల మందికి పైగా రైతులకు రుణమాఫీ కింద రూ.811 కోట్లు మాఫీ అవుతుందని ప్రభుత్వం ప్రకటించింది. ఉమ్మడి మెదక్ జిల్లాలో వ్యవసాయ భూమి లేక కౌలుకు తీసుకొని సాగు చేస్తున్న రైతులు 50 వేల వరకు ఉన్నారు. ఇందులో సొంతంగా భూమి లేని వారు 27 వేల మంది కాగా, రెండు ఎకరాలు, ఎకరం, అరెకరం భూమి ఉండీ మరొకరి భూమిని కౌలుకు తీసుకొని సాగు చేస్తున్న వారు 23 వేల మంది వరకు ఉన్నారు. ఇందులో కొందరికి రుణమాఫీ కూడా కాని వారు ఉన్నట్టు సమాచారం. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ షెడ్యూల్‌కు ముందే వీరంతా వారి రుణాలను చెల్లించడంతో వారికి రుణమాఫీ వర్తించదని ప్రభుత్వం ప్రకటించింది.

కౌలు రైతుల పరిస్థితి అధ్వాన్నం

సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాలో కౌలు రైతుల పరిస్థితి అధ్వానంగా ఉంది. రియల్ వ్యాపారం కింద కొనుగోలు చేసిన వ్యవసాయ భూములను స్థానికంగా ఉన్న వారికి కౌలుకిచ్చి డబ్బులు తీసుకుంటున్నారు. భూమికనుగుణంగా కౌలు రకాలు ఉన్నాయి. ఇందులో నల్లరేగడి భూముల్లో పత్తి పండిస్తే ఎకరాకు రూ 15 వేలు, సాధారణ భూమి అయితే ఎకరాకు రూ 8 వేలు తీసుకుంటున్నారు. కొన్ని చోట్ల అయితే ఇదే భూమికి రూ 10 వేలు కూడా తీసుకుంటున్నారు. వరి పంటకు ఎకరాకు రూ 20 వేలు తీసుకుంటున్నారు. మొక్కజొన్న పంటకు ఎకరాకు నల్లరేగడి నేలకు రూ15 వేలు తీసుకుంటుండగా, సాధారణ భూమిలో రూ 7 వేలు తీసుకుంటున్నారు. కంది, పెసర ఇతర కూరగాయల పంటలకు సైతం మొక్కజొన్న పంట మాదిరిగా కౌలు వసూలు చేస్తున్నారు. సమయానికి పడని వర్షాలు, మద్దతు ధర లేక పంటలు అమ్ముకోలేని పరిస్థితి.. ఇలాంటి అనేక అనుకూల పరిస్థితుల్లో పెట్టుబడి సైతం రావడం లేదని కౌలు రైతులు ఆవేదన చెందుతున్నారు. గత ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం సైతం కౌలు రైతుల విషయంలో స్పందించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే రైతు భరోసా కింద కౌలు రైతులను ఆదుకుంటామని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు చెప్పింది. దాన్ని అమలుచేయాలని కౌలు రైతులు కోరుతున్నారు.

కౌలు రైతులను ఆదుకోవాలి



ప్రభుత్వం కౌలు రైతులను మరిచింది. ఎన్నికల ముందు పంటకు రూ.15 వేలు ఇస్తామని ప్రకటించింది. రుణమాఫీ చేసి చేతులు దులిపేసుకుంది. భూమి లేని వారం ఇతరుల భూములపై ఆధారపడి జీవిస్తున్నాం. రైతు భరోసా ద్వారా కౌలు రైతులను ఆదుకోవాలి.

బారు చిన్న సాయిలు,
దాతరపల్లి, గజ్వేల్ మండలం

మా ముచ్చట ఎత్తడంలేదు



ఎన్నికల ముందు కౌలు రైతులకు పెట్టుబడి అందిస్తామని చెప్పారు. భూమి ఉన్న వారికి రుణమాఫీ చేసి కౌలు రైతులను రైతు భరోసా ద్వారా ఆదుకుంటామన్నారు. ఇప్పుడు కౌలు రైతుల ముచ్చట ఎత్తడం లేదు. కౌలు రైతులను ఆదుకోవాలి. పెట్టుబడి పెట్టి కౌలు చేసుకుంటున్నాం.


- బీడ శ్రీశైలం, కౌలు రైతు
దాతరపల్లి గజ్వేల్ మండలం

హత్య కేసు డైరీ ఇవ్వండి

పోలీసులకు హైకోర్టు ఆదేశం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వనపర్తి జిల్లాలో బీఆర్‌ఎస్ నాయకుడు శ్రీధర్ రెడ్డి హత్య కేసు దర్యాప్తునకు సంబంధించిన కేసు డైరీని అందజేయాలని పోలీసులకు హైకోర్టు ఆదేశించింది. వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం లక్ష్మీపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి ప్రధాన అనుచరుడు శ్రీధర్‌రెడ్డి మేలో హత్యకు గురయ్యాడు. దీనిపై పోలీసుల దర్యాప్తు నత్తనడకగా ఉందంటూ మృతుడి తండ్రి శేఖర్‌రెడ్డి వేసిన పిటిషన్‌ను జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి విచారించారు. అధికారపార్టీ నేతల అండతోనే, స్థానిక ఎమ్మెల్యేగా ఉన్న మంత్రి జోక్యం వల్లే దర్యాప్తు వేగంగా జరగడం లేదని పిటిషనర్ తరపు లాయర్ వాదించారు. తదుపరి విచారణ జరిగే నాలుగు వారాల్లోగా కేసు డైరీ ఇవ్వాలని న్యాయమూర్తి ఆదేశించారు.



పిటిషనర్‌కు జరిమానా

రిజిస్ట్రేషన్ ఆఫీసుకు అన్ని పత్రాలతో వెళితే రిజిస్ట్రేషన్ చేయలేదంటూ తప్పుడు సమాచారంతో పిటిషన్ దాఖలు చేసిన పిటిషనర్‌కు హైకోర్టు రూ.10 వేలు జరిమానా విధించింది. ఈ మొత్తాన్ని కోర్టు మాస్టర్స్, వ్యక్తిగత కార్యదర్శుల అసోసియేషన్‌కు చెల్లించాలని చెప్పింది. డాక్యుమెంట్లు సమర్పించి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునని పిటిషనర్‌కు వెసులుబాటు కల్పించింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా గాజులరామారాం సర్వే నెం.329/4, 329/5లో మహదేవపురం రెసిడెన్షియల్ ప్రాజెక్ట్ ఫేజ్-3లో 200 చదరపు గజాల ఇంటి జాగా డాక్యుమెంట్స్ అందజేసినప్పటికీ కుత్బుల్లాపూర్ సబ్‌రిజిస్ట్రార్ తిరస్కరించారంటూ హైదరాబాద్‌కు చెందిన డి.మహేశ్వర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్ సబ్ రిజిస్ట్రార్‌ను కలవనేలేదనీ, ఎలాంటి డాక్యుమెంట్లు సమర్పించలేదనీ, ఆఖరికి రిజిస్ట్రేషన్‌కు అవసరమైన స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలను చలానా వంటివి కూడా అధికారులకు ఇవ్వలేదని ప్రభుత్వ న్యాయవాది చెప్పారు. దీంతో న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ పిటిషనర్‌కు జరిమానా విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

రిజిస్ట్రేషన్లను తిరస్కరిస్తే రాతపూర్వకంగా చెప్పాలి

రాష్ట్రంలోని అన్ని రిజిస్ట్రేషన్ ఆఫీసులకు వెళ్లేవారి వివరాలను రికార్డు చేసేందుకు వీలుగా జనరల్ డైరీ (జిడి) ఏర్పాటు చేయాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రవణ్‌కుమార్ తీర్పు చెప్పారు. జీడీలో రిజిస్ట్రేషన్‌కు వచ్చే వాళ్ల వివరాలు, తేదీ, టైం వంటి వివరాలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని తెలిపారు. అలా రాసిన తర్వాత, రిజిస్ట్రేషన్ చేసేందుకు సబ్ రిజిస్ట్రార్ నిరాకరించారనే పేరుతో కేసులు దాఖలైతే ఆ విధంగా జరగలేదని సబ్ రిజిస్ట్రార్లు అనేందుకు ఆస్కారం ఉండబోదన్నారు. కోర్టు వివాదం పరిష్కారమైన తర్వాత కూడా రిజిస్ట్రేషన్‌ను తిరస్కరించడాన్ని సవాల్ చేస్తూ రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్‌కు చెందిన అనంత రామేశ్వరిదేవి, ఇతరులు వేసిన పిటిషన్లపై ఈ తీర్పును వెలువరించారు. చట్ట ప్రకారం వారంలోగా రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేయాలన్నారు. లేకపోతే రిజిస్ట్రేషన్‌ను తిరస్కరిస్తే ఆ మేరకు లిఖితపూర్వకంగా తెలియజేయాలని తీర్పులో పేర్కొన్నారు.

త్వరలో మానవ హక్కుల కమిషన్

స్టేట్ హ్యూమన్ రైట్స్ కమిషన్‌కు చైర్మెన్, సభ్యులను రెండు నెలల్లోగా నియమిస్తామని ప్రభుత్వం హైకోర్టుకు హామీ ఇచ్చింది. కమిషన్ చైర్మెన్, మెంబర్స్‌ను భర్తీ చేయకపోడాన్ని అద్నాన్ మహమ్మద్ హైకోర్టులో సవాల్ చేస్తూ పిల్ వేశారు. చీఫ్ జస్టిస్ ఆలోక్ అరాధే ఆధ్వర్యంలోని బెంచ్ విచారించింది. ప్రభుత్వ హామీని నమోదు చేసుకుని.. విచారణను రెండు నెలలకు వాయిదా వేసింది.

రోడ్డు నిర్మాణంపై వివరణ ఇవ్వండి

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ కమ్మగూడ ఎంపీపీఎస్ పాఠశాల స్థలంలో రోడ్డు నిర్మాణంపై వివరణ ఇవ్వాలని ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు ఇచ్చింది. కౌంటర్ వేయాలని రెవెన్యూ ముఖ్య కార్యదర్శి, పంచాయతీరాజ్ ముఖ్యకార్యదర్శి, పాఠశాల విద్య కమిషనర్ ఇతరులను ఆదేశించింది. పాఠశాల మధ్య నుంచి తమకు రహదారికి జాగా ఉందంటూ కమ్మగూడకు చెందిన న్యూ సుభాష్‌నగర్ వేల్ఫేర్ అసోసియేషన్ రోడ్డు నిర్మాణం చేశారంటూ ప్రధానోపాధ్యాయుడు బి.దాసు రాసిన లేఖను హైకోర్టు పిల్‌గా తీసుకుంది. శుక్రవారం చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ బెంచ్ విచారించింది. ప్రతివాదులకు నోటీసులు ఇచ్చి విచారణను వాయిదా వేసింది.

ప్రపంచ సమనం

విద్యార్థుల నిరసనలలో అనేకమంది మృతి

ధాకా : బంగ్లాదేశ్‌లో జులై ప్రారంభం నుంచి ఉధృతమైన విద్యార్థుల నిరసనలు హింసాత్మకంగా మారిన తర్వాత దాదాపు 40 మంది మరణించారు. వందలాది మంది గాయపడ్డారు. ప్రభుత్వ రంగ ఉద్యోగాల కోసం రిక్రూట్‌మెంట్ సిస్టమ్‌లో సంస్కరణలు తీసుకురావాలని నిరసనకారులు డిమాండ్ చేస్తున్నారు. సోమవారం నాడు దేశ రాజధానిలోని ధాకా యూనివర్సిటీలో అనేక మంది నిరసనకారులు పోలీసులు, ప్రభుత్వ అనుకూల కార్యకర్తలతో ఘర్షణకు దిగడంతో ఉద్రిక్తతలు పెరిగాయి. ప్రభుత్వం బుధవారం అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ విశ్వవిద్యాలయాలను నిరవధికంగా మూసివేసింది. అల్లర్లను నియంత్రించే పోలీసులను, పారామిలటరీ బలగాలను యూనివర్సిటీ క్యాంపస్‌లకు పంపింది. గురువారం, వేలాది మంది నిరసనకారులు రాష్ట్ర ప్రసార బీటీవీ కార్యాలయాన్ని ముట్టడించి భవనానికి నిప్పు పెట్టారు.



శాంతి కోసం పిలుపునిచ్చేందుకు బంగ్లాదేశ్ ప్రధాని షేక్‌హసీనా ఒకరోజు ముందుగానే నెట్‌వర్క్‌లో కనిపించారు. ఈ ఏడాది ప్రారంభంలో హసీనా ఐదవసారి తిరిగి ఎన్నికైన తర్వాత నిరసనలు తీవ్రస్థాయిలో జరుగుతున్నాయి. ఘర్షణల్లో మృతుల సంఖ్య అస్పష్టంగా ఉంది. 39 మంది మరణించినట్టు ధృవీకరించారని పోలీసు వర్గాలను ఉటంకిస్తూ అనడోలు శుక్రవారం రాసింది. ఏఎఫ్‌పీ, అల్ జజీరా మృతుల సంఖ్య 32 అని రిపోర్ట్ చేయగా, గురువారం జరిగిన ఘర్షణల్లో 13 మంది మరణించారని రాయిటర్స్ తెలిపింది. ఈ వారం ప్రారంభంలో ఆరుగురు మరణించారు. బంగ్లాదేశ్ వార్తాపత్రిక డైలీ ప్రోథోమ్ అలో ప్రకారం, ఈ సంఘటనలలో దాదాపు 27 మంది మరణించారు. 1,500 మందికి పైగా గాయపడ్డారు.

శుక్రవారం రాజధానిలోని పలు ప్రాంతాల్లో నిరసనకారులకు, పోలీసులకు మధ్య తాజా ఘర్షణలు చోటుచేసుకున్నాయని బంగ్లాదేశ్ పత్రిక డైలీ రాసింది. పోలీసులు స్టన్ గ్రెనేడ్లు, టియర్ గ్యాస్, రబ్బరు బుల్లెట్లు ప్రయోగించారని చెబుతున్నారు. ఇతర ప్రధాన బంగ్లాదేశ్ వార్తాపత్రికల వెబ్‌సైట్‌లు అందుబాటులో లేవు లేదా గురువారం నుంచి అప్‌డేట్ కాలేదు. శుక్రవారం ఉదయం టెలివిజన్ న్యూస్ ఛానల్స్ ప్రసారాలను నిలిపివేశాయి. టెలీకమ్యూనికేషన్లకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దేశవ్యాప్తంగా తన మొబైల్ ఇంటర్నెట్ నెట్‌వర్క్‌ను మూసివేయాలని ప్రభుత్వం ఆదేశించింది. జూనియర్ టెలికమ్యూనికేషన్ మంత్రి జునైద్ అహ్మద్ పాలక్, "పౌరుల భద్రతను కాపాడటం" అవసరమని ఏఎఫ్ పీ కి చెప్పాడు.

1971లో పాకిస్తాన్ నుంచి బంగ్లాదేశ్ స్వాతంత్ర్య పోరాటంలో పోరాడిన యోధుల వారసులకు ప్రభుత్వ ఉద్యోగాలు పొందేందుకు ప్రభుత్వం ఇస్తున్న ప్రత్యేక కోటాను రద్దు చేయాలని నిరసనకారులు డిమాండ్ చేస్తున్నారు. అందుకు బదులుగా వారు మెరిట్ ఆధారిత విధానంలో రిక్రూట్‌మెంట్‌ను డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం 30 శాతం ప్రభుత్వ ఉద్యోగాలు సమర యోధుల కుటుంబాలకు రిజర్వ్ చేయబడ్డాయి. కోటా విధానం 2018లో రద్దు చేయబడింది. అయితే ఈ ఏడాది జూన్‌లో హైకోర్టు దానిని పునరుద్ధరించింది. దీని తొలగింపు రాజ్యాంగ విరుద్ధమని తీర్పునిచ్చింది. జులై 10న, సుప్రీంకోర్టు కోటాలను సస్పెండ్ చేసింది. అక్కడ కేసు పెండింగ్‌లో ఉంది. సుప్రీం కోర్టుపై విశ్వాసం ఉంచాలని హసీనా ప్రదర్శనకారులను కోరారు.

ఈ వ్యవస్థ వివక్షతో కూడుకున్నదని, స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహించిన అధికార అవామీ లీగ్ పార్టీ మిత్రపక్షాలకు ఇది అనుకూలంగా ఉందని కార్యకర్తలు పేర్కొన్నారు. హసీనా స్వాతంత్ర్య ఉద్యమ నాయకుడు, 'దేశ పిత' అయిన షేక్ ముజిబుర్ రెహమాన్ కుమార్తె. అతను 1975లో అతని కుటుంబ సభ్యులతో సహా ఆర్మీ అధికారుల బృందంచే హత్య చేయబడ్డాడు.

చారానా కోడికి..బారానా మసాలా..

రైతు రుణమాఫీపై కేటీఆర్ ట్వీట్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన రైతు రుణమాఫీ 'చారనా కోడికి, బారానా మసాలా' అన్నట్టు ఉందంటూ బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కల్వకుంట్ల తారకరామారావు ఎద్దేవా చేశారు. ఈమేరకు శుక్రవారం ఆయన ట్వీట్ చేశారు. 'ఊరించి, ఊరించి ఏడునెలలు ఏమార్చి చేసిన రుణమాఫీ తీరు చూస్తే పై సామెత గుర్తు కొస్తుంది. రుణమాఫీ అయిన రైతుల కన్నా కంటతడి పెట్టిన రైతుకుటుంబాలే ఎక్కువ. ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాలు ఆ పథకానికి మరణ శాసనాలైనవి. అన్ని విధాలా అర్హత ఉన్నా ఎందుకు రుణమాఫీ కాలేదో చెప్పెటోడు లేడు. రైతులు గోడు చెప్పుకుందామంటే వినేటోడు లేడు. అర్హులైన లబ్దిదారులు రుణమాఫీ కాకపోవడంతో అంతులేని ఆందోళనలో ఉంటే ఎందుకీ సంబరాలు? నలభై లక్షల మందిలో మెజార్టీ రైతులకు నిరాశే మిగిల్చినందుకా? ముప్పై లక్షల మందిని మోసం చేసినందుకా? రెండు సీజన్లు అయినా రైతు భరోసా ఇంకా షురూ చెయ్యలే. జూన్‌లో వేయాల్సిన రైతు భరోసా..జులై వచ్చినా రైతుల ఖాతాలో వెయ్యలే. కౌలు రైతులకు ఇస్తానన్న రూ.15 వేలు ఇయ్యనే ఇయ్యలే. రైతు కూలీలకు రూ.12 వేల హామీ ఇంకా అమలు చెయ్యలే. కాంగ్రెస్ సర్కారు తీరు అటెన్షన్ డైవర్షన్... ఇప్పుడేమో ఫండ్స్ డైవర్షన్' అంటూ కేటీఆర్ ఎద్దేవా చేశారు.

సాగుకు స్వర్ణయుగం...లక్షకోట్ల సంక్షేమం

బీఆర్‌ఎస్ పాలనపై హరీశ్‌రావు ట్వీట్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

నాటి బీఆర్‌ఎస్ పాలన సాగుకు స్వర్ణయుగం...లక్షకోట్ల సంక్షేమమంటూ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ట్వీట్ చేశారు. 'తొమ్మిదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో 69 లక్షల రైతులకు రైతు బంధు రూ. 72,972 కోట్లు. లక్షా 11 వేల మందికి రైతు బీమా రూ. 6,488 కోట్లు. రైతురుణమాఫీ కోసం రెండు దఫాల్లో రూ. 29,144.61 కోట్లు. ఇతర రైతు సంక్షేమ పథకాల కింద రూ.11.401 కోట్లు. కేవలం ఈ పథకాల ద్వారానే రైతుకు అందిన ఆర్థిక సాయం రూ. 1,20,005 కోట్లు. దేశ చరిత్రలో ఇది ఆల్ టైం రికార్డ్' అని పేర్కొన్నారు.



'ఉపాధి'లో వ్యవసాయ పనులకు ప్రాధాన్యమివ్వండి

- వనమహోత్సవంలో పండ్ల మొక్కలకే తొలి ప్రాధాన్యం
- వర్షాకాలంలో అప్రమత్తంగా వ్యవహరించండి
- జిల్లా అధికారులు గ్రామాల్లో పర్యటించాలి
- విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు
- డీఆర్డీఓ, డీపీఓల వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి సీతక్క

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో వ్యవసాయ అనుబంధ పనులకు అధిక ప్రాధాన్యత నివ్వాలని డీఆర్డీఓ, డీపీఓలను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ(సీతక్క) ఆదేశించారు. పది గ్రామాలను ఓ క్లస్టరుగా ఏర్పాటు చేసుకుని పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధుల పదవీకాలం ముగిసిన దృష్ట్యా వర్షాకాలంలో అధికారులు అప్రమత్తంగా ఉండి పనులు చేయాలనీ, సీజనల్ వ్యాధుల కట్టడికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా అధికారులు గ్రామాల్లో నిత్యం పర్యటించాలని అల్టిమేటం జారీ చేశారు. విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వనమహోత్సవంలో పండ్ల మొక్కల పంపిణీకి తొలి ప్రాధాన్యం ఇవ్వాలనీ, ఇంటికో పండ్ల మొక్కను పంచాలని సూచించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి డీఆర్డీఓ, డీపీఓలతో ఆ శాఖ కార్యదర్శి డీఎస్ లోకేశ్ కుమార్‌తో కలిసి మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలనీ, డెంగ్యూ, మలేరియా వంటి రోగాలకు కారణమయ్యే దోమల నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఇంటింటికీ తిరిగి ఫీవర్ సర్వేలు చేపట్టి రోగనిర్ధారణ కోసం టెస్టుల కిట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. గ్రామాల్లో పచ్చదనం, స్వచ్ఛదనం పెంచి గ్రామాలను అందంగా, ఆరోగ్యంగా తీర్చిదిద్దేందుకు వారం పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. గ్రామాల్లో గుంతలను పూడ్చి వర్షపు నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమల నివారణ కోసం గ్రామాల్లో ప్రతి సాయంత్రం విధిగా ఫాగింగ్ చేయించాలన్నారు. ఈ నెలాఖరు లోపు గ్రామాల్లో మార్పు కనిపించేలా జిల్లా అధికారులు కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. గ్రామాల్లో మార్పు కనిపించకపోతే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్లు, అటవీ అధికారులతో చర్చించి అడవుల్లోని ఖాళీ ప్రాంతాల్లో పండ్ల మొక్కలను నాటి గిరిజనులకు హక్కులు కల్పించాలన్నారు. ఊర్లల్లో కోతుల బెడద నివారించేందుకు పండ్ల మొక్కలు నాటాలని సూచించారు.